వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
VEEKSHANAM, TELUGU MONTHLY
సంపుటి : 16 సంచిక : 8 హైదరాబాద్ 205 ఆగస్ట్ 2018 పేజీలు : 68 రు. 25

- కౌలురైతులకు హక్కులు లేవా?
- కృష్ణా నదీ జలాలు - పాలమూరు వాటా
- చంద్రబాబు పాలనలో పౌరహక్కులు
- యుజిసి రద్దు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం
- కశ్మీర్ లోయలో కేంద్ర బలగాల హింస
- ఆదివాసి పోరాటాలలో కొత్త అల
- మెక్సికోలో పాలనాధికార మార్పు

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	అబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ	హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్	9705055738
వెంకటేశ్వర బుక్ స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్	040-66131071
పస్ట్ లక్ష్మీ పాన్ షాప్	విద్యానగర్ సిగ్నల్స్	9848672831
సుధాకర్ బుక్ స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక	9949337605
వెంకటేశ్వర బుక్ స్టాల్	రామ్‌నగర్ గుండు	9502964995
భవాని బుక్ స్టాల్	శివం రోడ్	9849836996
శ్రీభవాని బుక్ స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర)	9640712555
ఓరియన్ బుక్ స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర)	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా)	8977995537
రెడ్డి బుక్‌స్టాల్	అశోక్‌నగర్, హైదరాబాద్	
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమాండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహిదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలెబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీలక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
లక్ష్మణ్	చిక్కడపల్లి, హైదరాబాద్	93910 12051
మల్లిఖార్జున్ బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
బాల్‌రెడ్డి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	98660 18829
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
మహాలక్ష్మి బుక్‌స్టాల్	సిటీ బస్‌స్టాండ్, హన్మకొండ చౌరస్తా, వరంగల్	99893 30297
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్ స్టాల్, కూల్ డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్ స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్ స్టాల్	శివాలయం వీధి, ప్రొద్దటూరు	81210 02112
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్ సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091

205 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఆగస్టు 2018
సంపుటి : 16
సంచిక : 8

❖ పాఠకుల వీక్షణం 4
❖ సంపాదకీయం ◆ ప్రశ్నలను ఎదుర్కోలేని అబద్ధం, అహంకారం, దౌర్జన్యం 5
❖ సంపాదకీయ వ్యాఖ్యలు ◆ అవినీతి అనే మాటే చెరిపేస్తే మంచిది! ◆ ప్రత్యేక హోదా గురించి మరొకసారి 6
◆ నెతన్యాహు యూదు జాత్యహంకారానికి రాజ్యాంగ హోదా – ఎ. నరసింహారెడ్డి 7
❖ ప్రాంతీయం – కౌలు రైతుల మీద పాలకుల కుతర్కాలు – ఇప్ప వీరారెడ్డి 9
❖ " – ముఖ్యమంత్రి – కౌలు రైతులు – నలమాస క్రిష్ణ 11
❖ " – తెలంగాణొస్తే ఏమొచ్చింది? – ఎన్. వేణుగోపాల్ 13
❖ " – మొక్కులు సరే! ప్రజా ఆకాంక్షల మాటేమిటి? – బైరెడ్డి సతీష్ 16
❖ " – కృష్ణా నదీ జలాలు – పాలమూరు వాటా – ఎం. రాఘవాచారి 18
❖ దేశీయం – యుజిసి రద్దు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం – డా. ఎ. పున్నయ్య 23
❖ ప్రాంతీయం – నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో పౌర హక్కులు – క్రాంతి చైతన్య 26
❖ " – ఆంధ్రప్రదేశ్‌లో విద్యా పరిరక్షణ ఉద్యమం-2 – రమేష్ పట్నాయక్ 30
❖ దేశీయం – ఆదివాసి పోరాటాలలో కొత్త అల – అర్వింణి రాజేంద్రబాబు 34
❖ ప్రాంతీయం – జన్మనివ్వడం కూడా చావు లాంటిదే – డా. గద్దం లక్ష్మణ్ 37
❖ దేశీయం – దేశ ప్రజలపై కాషాయ దాడులు – షేక్ కరిముల్లా 39
❖ " – కశ్మీర్‌లో కల్లోలానికి అంతం లేదా? – ఎ. నర్సింహారెడ్డి 41
❖ " – కశ్మీర్ లోయలో కేంద్ర బలగాల హింస – పిచ్చుక శ్రీనివాస్ 45
❖ " – సుప్రీంకోర్టు పనితీరులో కేంద్ర ప్రభుత్వ జోక్యం – చిమ్మె జాన్ బర్నబాస్ 48
❖ అంతర్జాతీయం – మెక్సికోలో పాలనాధికార మార్పు – సంతోష్ 50
❖ కార్ల్ మార్క్స్ (1818-1883) ద్విశత జయంతి – సరుకుగా మారింది శ్రమ శక్తేగాని శ్రమ కాదు – కె.జి. రాంచందర్ 52
❖ దేశీయం – బస్తర్‌లో భూ సంబంధాలు – 4 – విశ్వం 55
❖ పుస్తక పరిచయం – మన్యంలో ఆకుపచ్చ సూర్యోదయం – ఎం. రత్నమాల 61
❖ ఈనేల – వై. రామచంద్రం 63
❖ ఇరుగు-పొరుగు – వై. రామచంద్రం 64
❖ భూగోళం – సి. రాజశేఖర్ 65
❖ అసహజ మరణాలు – ఎస్. వెంకటేష్ 66

‘వీక్షణం’లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. ‘వీక్షణం’ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

‘వీక్షణం’ పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌పై ‘VEEKSHANAM’ అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2018 జూలై నెలలో వచ్చిన విరాళాలు - వకుళాభరణం రామకృష్ణ, హైదరాబాద్ - రు. 2,500; శ్రేయోభిలాషులు, హైదరాబాద్ - రు. 7,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం జూలై సంచికలో అచ్చయిన 'నవ్యాంధ్రలో పండని నాపచేను ఉత్తరాంధ్ర' వ్యాసం బాగుంది. మరికొంత సమాచారం ఉంటే బాగుండేది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉత్తరాంధ్ర జనాభా 93,38,177. అందులో దళితులు 8,32,878. ఆదివాసులు 10,20,174. రెండు ఉత్తరాంధ్రేతర సామాజిక వర్గాల గుప్పిట్లో ఉత్తరాంధ్ర బందీ అయింది. కార్పొరేట్ విద్యా సంస్థలు వాళ్లవే. అందులో ఉత్తరాంధ్ర విద్యార్థులు 5 శాతమే. మిగిలిన వారు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల వారే. ఫార్మా పరిశ్రమలు వాళ్లవే. రోగాలు ఇక్కడి వారికి. శ్రీకాకుళం ఉద్దానంలో కిడ్నీ రోగ బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. విజయనగరం జిల్లా బలిజిపేట మండలంలో వందల సంఖ్యలో ఫైలేరియా(బూదకాళ్లు) బాధితులు, విశాఖ ఏజెన్సీలో రోగాలతో ప్రతి ఏటా సుమారు 1600 మంది చనిపోతున్నారు. అందులో 70 మంది దళితులు, కూలీలే. ఉత్తరాంధ్ర రోగాల ఆంధ్ర దోపిడీకి గురవుతూనే ఉంది.

– తుంపాల శ్రీరామమూర్తి
గాజువాక, విశాఖపట్నం

వీక్షణం మే సంచికలో డా. నళిని గారు రాసిన మార్క్సిజం విశ్వజనీన సత్యం వ్యాసం బాగుంది. అయితే ఇందులోని రెండు అంశాలపై నా అభిప్రాయాలను పంచుకుంటాను. నళిని గారు కొన్ని విప్లవాలు శాంతియుతంగా జరిగాయని రాశారు. విప్లవమంటే ఒక వర్గాన్ని మరొక వర్గం హింసాయుతంగా అధికారం నుండి కూలదోయడమని చరిత్ర చెపుతుంది. ఇది సాధారణాంశం. దీని నిర్దిష్టతలో కొన్ని సందర్భాలు భిన్నంగా ఉండవచ్చు. బానిస తిరుగుబాట్లు ఫ్యూడల్ వ్యవస్థకు, ఫ్యూడల్ వ్యతిరేక తిరుగుబాట్లు పెట్టుబడిదారీ వ్యవస్థకు దారితీశాయి. ఈ మార్పు కోసం ఎంత మంది బానిసలు, రైతులు, కార్మికులు తమ రక్తం ధారపోశారో లెక్కలేదు. అయితే ఈ తిరుగుబాట్లు అన్ని అంతిమంగా దోపిడీ వర్గాలకే ఉపయోగపడ్డాయి. వారినే అధికారంలోకి తెచ్చాయి. కొన్ని చోట్ల మాత్రమే ఒక దోపిడీ వర్గం నుండి మరొక దోపిడీ వర్గానికి అధికారం హింస జరగకుండా బదలాయించబడ్డది. అంతే కాని పాత దోపిడీ వర్గం కంటే కొత్త దోపిడీ వర్గం విప్లవకరంగా ఉంటూ వచ్చింది. అయితే ఈ విప్లవకర మార్పు విప్లవ హింస ద్వారానే సాధ్యమైంది. ఇవ్వాళ శాంతి గురించి మాట్లాడుతున్న పెట్టుబడిదారులు హింసాత్మకంగానే భూస్వామ్య రాచరికాలను కూలదోశారు. నేడు కార్మిక వర్గం అదే చేయ పూనుకుంటే తప్పంటున్నారు. కాబట్టి హింస గురించి దోపిడీ వర్గాల ప్రచారం కొంగజపం లాంటిదే. దానిలో ఎలాంటి వాస్తవం లేదు. అదే విధంగా 1917 బోల్షివిక్ విప్లవం శాంతియుతంగా వచ్చిందన్నారు. రష్యాలో భూస్వామ్య రాచరికానికి ప్రతినిధి అయిన జార్ చక్రవర్తి కాని తరువాత బూర్జువాల ప్రతినిధులుగా ఏర్పడ్డ మంత్రి వర్గం కాని ఇచ్ఛాపూర్వకంగా అధికారాన్ని వదులుకోలేదు. ప్రజలపై అంతులేని హింసను ప్రయోగించారు. ప్రజలు విప్లవ హింస ద్వారానే వీరిని ఓడించారు. అధికారం నుండి కూలదోశారు. ఇదంతా బోల్షివిక్ పార్టీ చరిత్రలో రికార్డయింది. కాబట్టి 1917 విప్లవం శాంతియుతంగా జరిగిందనడం అవాస్తవం. దోపిడీ వర్గం నుండి దోపిడీకి గురవుతున్న వర్గం అధికారాన్ని హస్తగతం చేసుకోవడం హింసాత్మకంగానే సాధ్యం అని తరువాత చైనా, ఆసియా విప్లవాలు వెల్లడి చేశాయి.

– సాయన్న
హైదరాబాద్

ఎక్కడో మధ్యధరా సముద్ర ప్రాంతంలో టర్కీ, జోర్డాన్, ఇరాన్, లెబనాన్ దేశాల సరిహద్దులుగా సిరియా దేశంలో బాంబుల వర్షం కురిపిస్తుంటే – ఎవ్వరు? అమెరికన్ సామ్రాజ్యవాదులు, రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదులు మతోన్మాద సిరియా ప్రభుత్వ పాలకవర్గ దళాలు, ప్రభుత్వ పాలక వర్గ దళాలకు వ్యతిరేకంగా ఇంకో రకం మతోన్మాదులు మరి కొందరు సిరియా ప్రజల మీద, స్త్రీల మీద, ముక్కుపచ్చలారని పసిపిల్లల మీద బాంబుల వర్షం కురిపిస్తుంటే – ఎందుకు?

సిరియాలోని సహజ వనరులు భూపొరల్లో నిక్షిప్తమై ఉన్న ఆయిల్ కోసం, గ్యాస్ కోసం అదేనండి నూనె చమురు కోసమేనండి ఈ నరహంతక ముఠాల బాంబు విన్యాసాలు మరినీకెందుకు?

తెలియకపోతే పోనివ్వండి. తెలిసి కూడా ఈ బాంబుల దాడిలో చిన్నారుల కాళ్లు, చేతులు తెగి రక్తం కారుతుంటే తల్లుల్ని కోల్పోయిన పాల బుగ్గల పసి పిల్లలు పాలకోసం రోదిస్తుంటే ఈ దృశ్యాలను చూసి కూడా స్పందించకుంటే నీవెందుకు, నీ జన్మెందుకు, నీ జీవితమెందుకు వృథా కదా.

– పి. పోలేశ్వరరావు
తెనాలి, గుంటూరు

మార్క్సిజం పిడివాదం కాదు – కార్యాచరణకు మార్గదర్శి. చైనా పరిణామాల అధ్యయనం సందర్భంగా గుర్తుచేసుకోవలసిన సూత్రం ఇది. వీక్షణం జూన్ 2018 సంచికలో కార్ల్ మార్క్స్ ద్విశత జయంతి సందర్భంగా ప్రచురించిన వ్యాసాలు బాగున్నాయి. చైనా పరిణామాలు–శాస్త్రీయ అధ్యయనం శీర్షికతో ప్రచురించిన వ్యాసం మార్క్సిజాన్ని ఎలా అన్వయించాలి అన్న చర్చకు దోహదం చేసింది. రష్యాలో సోషలిస్టు నిర్మాణం నుంచి గుణపాఠాలు తీసుకొని, లెనిన్–స్టాలిన్‌ల భావనలను వెనుకబడిన చైనాదేశ నిర్మాణంలో మావో అన్వయించిన తీరుని, ఆ సందర్భంలో సరకు–విలువల గురించిన సిద్ధాంతాలను చక్కగా ఎత్తిచూపారు. మార్క్సిజం పిడివాదం కాదు, కార్యాచరణకు మార్గదర్శి అన్న లెనిన్ సూత్రీకరణను బలపరిచేదిగా ఉంది. రష్యా, చైనాల్లో మార్క్సిజం విఫలమైందన్న వాదనలని శాస్త్రీయంగా అర్థంచేసుకోడానికి తోడ్పడేదిగా ఉంది. మార్క్సిజాన్ని మార్పులేని వేదవాక్కుగా చిత్రించి, ఆ ప్రాతిపదికన అంతా అంధకారమే అనుకునేవారిని ఆలోచింప చేసేదిగా ఉంది.

సంపాదకీయం పై విమర్శ రూపంలో వచ్చిన ఈ చర్చా వ్యాసాన్ని ప్రచురించడం మెచ్చుకోదగిన విషయం. కాగా జూలై సంచికలో రాజకుమార్‌గారు తమ లేఖలో – వీక్షణంకు విచక్షణ లేదా? అని ప్రశ్నించారు; ఇది వీక్షణమేనా అని అనుమానం వస్తున్నది అని వ్యాఖ్యానించారు. అయితే, సంపాదకులకు ఆయా అభిప్రాయాలతో ఏకీభావం ఉండనవసరంలేదు .... భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదకవర్గం భావిస్తోంది అన్న విధాన ప్రకటనకు తగినరీతిలో – విచక్షణతోనే – ఈ వ్యాసాన్ని ప్రచురించారు; మావో ఆలోచనా విధానం పేరిట ప్రబలిన అశాస్త్రీయ భావనలను ప్రశ్నించేదిగా, ఆలోచింపచేసేదిగా ఉంది.

కళ్లముందర కనబడే విషయాలను చూడనట్టు నటిస్తూ రాసిన వ్యాసాలు వేయవచ్చునా? అని ప్రశ్నించారు. తూర్పు యూరపులాగే, రష్యాలాగే చైనాకూడా పతనమై, అక్కడిలాగే కమ్యూనిస్టు పార్టీని రద్దుచేస్తారని నేటి గ్లోబలైజేషన్ దశలో చాలా మంది అభిప్రాయపడ్డారు. కానీ గత 20–25 ఏళ్ల అనుభవాలని చూస్తే

(మిగతా 62వ పేజీలో...)

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

ప్రశ్నలను ఎదుర్కోలేని అబద్ధం, అహంకారం, దౌర్జన్యం

వీక్షణం

ప్రధాని నరేంద్ర మోడీ వ్యక్తిగతంగానూ, సంఘ పరివార్ పాలకులు మొత్తంగానూ ఎదుర్కొంటున్న అసంఖ్యాక ప్రశ్నలకు జవాబు చెప్పలేని, ప్రజలను ఒప్పించలేని స్థితిలో వారి అబద్ధాలు, అహంకార ప్రకటనలు, దౌర్జన్యాలు మితి మీరుతున్నాయి. ఎన్నికల సంవత్సరంలో ప్రవేశించడంతో, నిర్ణీత సమయానికైతే తొమ్మిది నెలల్లో, ముందస్తు అయితే ఇంకా ముందుగానే సాధారణ ఎన్నికలు రానుండగా పాలకవర్గ ముఠాల వైరుధ్యాలు నానాటికీ ఎక్కువగా బైటపడుతున్నాయి. అందరూ ఒకే తానులో ముక్కలే అయినప్పటికీ, ఎన్నికల సందర్భంలో ప్రజలను మోసగించడానికి అన్ని ప్రతిపక్షాలూ అధికార పక్షం మీద విమర్శల జోరు పెంచుతున్నాయి. ఆ విమర్శలలో భాగంగా ప్రజల నిజమైన సమస్యలలో కొన్నిటిని కూడ ప్రస్తావిస్తున్నాయి. అందరూ దొంగలే అయిన ఈ రాజకీయ నాటకంలో దొంగల మధ్య వివాదాలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు దొంగల గురించి ప్రజలకు తెలియవలసిన నిజాలెన్నిటినో వెల్లడి చేస్తున్నాయి. మరొకవైపు ఇలా తమ గురించి నిజాలు అంతకంతకూ ఎక్కువగా బైట పడుతున్న కొద్దీ అధికారంలో ఉన్నవారికి మళ్లీ అధికారం వస్తుందో లేదోననే అనుమానం పెరుగుతున్నది. ఆ ఆందోళన పెరిగిన కొద్దీ అసహనం పెరుగుతున్నది. ఇక వారి ప్రధాన ఆయుధాలైన అబద్ధాన్నీ, అహంకారాన్నీ, దౌర్జన్యాన్నీ మరింత ఎక్కువగా వాడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వడం విషయంలో కేంద్ర ప్రభుత్వం వెనుకడుగు వేసిందని తెలుగు దేశం పార్టీ సభ్యులు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం మీద పార్లమెంటులో రసవత్తరమైన చర్చ జరిగింది. మామూలు లెక్కలు చూసినా ఆ అవిశ్వాస తీర్మానం నెగ్గదని, తప్పనిసరిగా ప్రభుత్వ పక్షమే గెలుస్తుందని అందరికీ తెలుసు. కాని నాలుగు సంవత్సరాల ఎన్‌డిఎ పాలన మీద విమర్శనాస్త్రాలు సంధించడానికి, రానున్న ఎన్నికలకు రంగస్థలం సిద్ధం చేసుకోవడానికి ఒక పెద్ద అవకాశం దొరుకుతుందని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తో సహా ఇతర ప్రతిపక్షాలన్నీ భావించాయి. నిన్నటిదాకా మిత్రులుగా ఉన్న తెలుగుదేశం పార్టీయే తన పాలన మీద అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు, ఆ తీర్మానం మీద చర్చలో ప్రతిపక్షాల మీద విరుచుకు పడడానికి అవకాశం దొరుకుతుందని అధికార పక్షం భావించింది. అటైనా ఇటైనా ప్రజలు లేరు, ప్రజా ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం లేదు. ఒకరి మీద ఒకరు ఆరోపణలు గుప్పించుకుంటున్నప్పుడు అప్పటి అవసరం కొరకు ప్రజలు, అభివృద్ధి వంటి మాటలు వేస్తే చాలు.

ప్రతిపక్ష కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన ప్రసంగంలో మోడీ పాలన మీద గుప్పించిన విమర్శల్లో కొన్ని అవసరమైనవే, ముఖ్యమైనవే గాని ఆ విమర్శలు చేసే అర్హత కాంగ్రెస్‌కు ఉన్నదా అనేది ప్రశ్న. మోడీ దేశానికి కాపలాదారునని చెప్పుకుంటాడు గాని నిజానికి దేశాన్ని దోచుకుంటున్నవారి వాటాదారు అని రాహుల్ గాంధీ చేసిన విమర్శ పూర్తిగా నిజమే. ఆయన చూపినట్టుగా రాఫేల్ యుద్ధ విమానాల కొనుగోలులో, జిఎస్‌టి నుంచి చమురును మినహాయించడంలో, బ్యాంకు రుణాల మాఫీలలో మోడీ అంబానీలకు, కార్పొరేట్లకు సహాయం చేశాడనేది నిర్వివాదాంశమే. అయితే కాంగ్రెస్ పాలకులు కూడ కార్పొరేట్లకు అటువంటి సహాయాలెన్నో చేసిన చరిత్ర ఉంది. మోడీ పాలనలో ముస్లింల మీద, మహిళల మీద, దళితుల మీద జరుగుతున్న దాడులను కూడ రాహుల్ గాంధీ మాటవరుసకు ప్రస్తావించాడు. కాని అంత తీవ్రమైన విమర్శలు చేసిన మరుక్షణమే అదే మోడీ దగ్గరికి వెళ్లి కౌగిలించుకోవడం పిల్లచేష్టగా కొందరు పొరబడుతున్నారు గాని, ఎన్ని ప్రణయ కలహాలు వచ్చినా తాము ఒక్క తానులోని ముక్కలమేనని తెలివితక్కువగా చెప్పడం అది.

ఈ విమర్శలకు, ఇతరుల ప్రసంగాల్లో ప్రస్తావించిన విమర్శలకు నరేంద్ర మోడీ ఇచ్చిన జవాబులో ఆయనలోని సంఘ్ పరివార్ కార్యకర్త పూర్తిగా బైటికి వచ్చాడు. సంఘ్ పరివార్ ఇచ్చే శిక్షణలోనే చరిత్ర పేరుతో అబద్ధాలు, ఆత్మవిశ్వాసం పేరుతో అహంకారం, ఆత్మరక్షణ పేరుతో దౌర్జన్యం అనివార్య భాగాలుగా ఉంటాయి. నాలుగు దశాబ్దాలకు పైగా కఠోరమైన సంఘీగా ఉన్న మోడీ ఈ మూడు లక్షణాలనూ తన జవాబులో రంగరించాడు. భారత రాజకీయాల గురించి, ప్రస్తావనకు వచ్చిన రాఫేల్ ఒప్పందం గురించి, జిఎస్‌టి గురించి, బ్యాంకు రుణాల మాఫీ గురించి, కాంగ్రెస్ చరిత్ర గురించి అబద్ధాలు వల్లించాడు. తన తప్పులూ దుర్మార్గాలూ బహిరంగంగా చర్చకు వచ్చిన ఉక్రోషంలో అహంకార ప్రకటనలెన్నో చేశాడు. సంఘ్ కార్యకర్తలకు అలవాటయిన భౌతిక దాడులకు పార్లమెంటరీ సంప్రదాయాల్లో ఇంకా అవకాశం లేదు గనుక ఆ పనికి దిగలేదు గాని నాలుగేళ్లుగా దేశంలో పెట్రేగిపోతున్న ఆ దౌర్జన్యాలు ఈ చర్చకు అటూ ఇటూగా జరుగుతూనే ఉన్నాయి. ఏకీభవించని వారందరి పీక నొక్కే ఫాసిస్టు చర్యలు మోడీ జవాబుతో పాటే కలిసి సాగుతూనే ఉన్నాయి. ఈ పార్లమెంటు చర్చ జరగడానికి రెండు రోజుల ముందే జార్ఖండ్‌లోని పాకూర్‌లో భారతీయ జనతా యువ మోర్చా, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వంటి సంఘ్ పరివార్ సంస్థలు ఆర్యసమాజ నాయకుడు, సామాజిక కార్యకర్త, ఎనభై సంవత్సరాల వృద్ధుడు స్వామి అగ్నివేశ్ మీద దాడి చేసి, కింద పడవేసి, పగిడీ లాగేసి, కొట్టి, తన్ని తమ ప్రతాపం చూపుకున్నారు. 'హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నందుకు' అది శిక్ష అని ప్రకటించారు. మరొకవైపు, గౌరీ లంకేశ్‌ను చంపిన హిందుత్వ హంతక ముఠా చంపవలసిన వారి జాబితా తయారు చేసుకుందని, అందులో మొదటి పేరు సుప్రసిద్ధ నాటక కర్త, రచయిత గిరీష్‌కర్నాడ్‌దని, ఆయన దొరకక పోవడంతో రెండో పేరైన గౌరీ లంకేశ్‌ను చంపారని ఈ చర్చ జరిగిన రెండు రోజుల తర్వాత బైటపడింది.

ఈ అబద్ధాల, అహంకారాల, దౌర్జన్యాల, హంతక భావజాలాల వ్యాప్తిని, ప్రభావాన్ని, అధికారాన్ని ఎంత శక్తిమంతంగా ప్రతిఘటించగలమనేదే ఇవాళ్టి సవాల్. ఈ సవాల్‌ను ప్రగతిశీల శక్తులు సక్రమంగా స్వీకరించలేకపోతే హిట్లర్ నాటి జర్మనీ భారతదేశంలో పునరావృతమవుతుంది. హిట్లర్ పునరాగమనం భారత సమాజంలో ఇప్పటికే ప్రారంభమైంది. దాన్ని మధ్యదారిలో అడ్డుకోగలమా, జర్మన్ ప్రజలు అనుభవించిన దారుణ మారణకాండలను, బీభత్సాన్ని పునర్జీవిస్తామా అనేది ఇవాళ ఎవరికి వాళ్లం జవాబు చెప్పుకోవలసిన ప్రశ్న. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

అవినీతి అనే మాటే చెరిపేస్తే మంచిది!

తెలంగాణ ఏలిక తీరే వేరు. ఆయనకు బుర్రలో ఏది తోస్తే అది అనడమే, చేయడమే తప్పు, తాను ఒక రాజ్యాంగం పునాదిగా, చట్టం ఆధారంగా నడిచే ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధిగా ఎన్నికై ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నడుపుతున్న నాయకుడినని ఆయన అనుకోరు. మన సామాజిక జీవితంలోని ఒక కీలకమైన అంశం మీద ఆయన ప్రతిస్పందన ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నది. మొన్నటికి మొన్న నీటి పారుదల శాఖలో ఒక ఉన్నతాధికారి మీద అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ ఆయన ఆస్తుల మీద దాడి చేసి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని కేసు పెట్టింది. అరెస్టు చేసింది. తర్వాత కొద్ది రోజులకు జరిగిన నీటి పారుదల శాఖ సమీక్షా సమావేశంలో ఈ కేసు ప్రస్తావనకు వచ్చింది. ఎవరో గిట్టని వారి ఫిర్యాదు మీద ఈ దాడులు జరిగాయని, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులు గనుక, వారసత్వపు ఆస్తి వచ్చింది గనుక వారికి ఆస్తి ఎక్కువగానే ఉంది గాని అది అవినీతి సొమ్ము కాదని ఆయనను సమర్థించేవారు ఏలికకు చెప్పారు. ఇంకేముంది, 'అవినీతి నిరోధక శాఖ చేసిన పని తప్పు. ఆదాయానికి మించిన ఆస్తుల గురించి ఫిర్యాదు వస్తే నోటీసు ఇచ్చి, జవాబు తీసుకుని, శాస్త్రీయంగా పరిశోధించి, కేసు పెట్టాలి గాని దాడి చేయగూడదు, దాడి చేసినా అరెస్టు చేయగూడదు, అవినీతి నిరోధక శాఖ తన పద్ధతులను మార్చుకోవాల'ని ముఖ్యమంత్రి అన్నారు. అవినీతి జరగడానికి అతి ఎక్కువ అవకాశాలు ఉన్న శాఖ నీటి పారుదల శాఖ అని అందరికీ తెలుసు. చీఫ్ ఇంజనీర్ స్థాయిలో ఉన్న అధికారి చేతిలో వందల కోట్ల రూపాయల పనులు అప్పగించే అధికారం ఉంటుందనీ, అందులో పది శాతం, పదిహేను శాతం లెక్క ప్రకారమే ముడుపులుగా, లంచంగా వెనక్కి తిరిగివస్తుందనీ ఆ శాఖలో ఎవరినడిగినా చెపుతారు. ఇంతగా అవినీతి జరుగుతున్నదని అందరికీ తెలిసిన చోట అమాయకత్వం నటించి, నేరుగా లంచం తీసుకుంటున్నప్పుడు దొరకలేదు గనుక కేసు పెట్టగూడదనడం, ఆదాయాన్ని మించిన ఆస్తులుంటే అవినీతిగా లెక్కించగూడదనడం పరోక్షంగా లంచగొండి తనాన్ని ప్రోత్సహించడమే. యథా రాజా తథా ప్రజా అన్నట్టు పైనే అవినీతి జరుగుతున్నప్పుడు కింది అవినీతిని పట్టుకోవడం ఎందుకు అని చాలమంది చాలకాలంగా సాధారణ తర్కం చేస్తూనే ఉన్నారు. మన పాలకులు కూడ ఆ తర్కానికే చేరారేమో తెలియదు. అవినీతిని అరికట్టడానికి, కనీసం తగ్గించడానికి ఏయే మార్గాలు, ఎంత కఠినమైన చట్టాలు, చర్యలు చేపడితే బాగుంటుందని చర్చలు జరుగుతున్నవేళ అసలు అవినీతిని పట్టుకోగూడదని, అవినీతిపరుల నిర్వచనాన్ని ఇంకా కుదించి దొరికితేనే దొంగలుగా గుర్తించాలనీ, ఆస్తి రూపంలో నిదర్శనాలున్నా దొంగలుగా గుర్తించగూడదనీ అనడం ప్రత్యక్ష అవినీతిని నిరుత్సాహపరచి పరోక్ష అవినీతిని ప్రోత్సహిస్తుంది. ఎట్లాగూ ముఖ్యమంత్రి అధికార భవనంలో, అధికారిక సింహాసనంలో మొట్టమొదటగా గజం మిథ్య, పలాయనం మిథ్య అని ప్రవచించిన మతాధిపతి కూచున్న చరిత్ర ఉంది గనుక అవినీతి మిథ్య, ఆస్తి మిథ్య అని సిద్ధాంత ప్రవచనం చేస్తే బాగుంటుంది. అవినీతి నిరోధక శాఖ పనితీరును సమీక్షించి, మార్చడం కాదు, అసలు అవినీతి నిరోధక శాఖను రద్దుచేసి, తెలుగు భాషనుంచి అవినీతి అనే మాటనే చెరిపేస్తే బంగారు తెలంగాణ ఇంకా వేగంగా సాకారమవుతుంది. అవినీతి రహిత తెలంగాణ నెలకొల్పడమంటే అవినీతి అనే మాటను భాషనుంచి తీసేయడమే గదా... వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

ప్రత్యేక హోదా గురించి మరొకసారి


రాష్ట్ర విభజన వల్ల విభజిత ఆంధ్రప్రదేశ్‌కు నష్టం జరిగిందనీ, ఆ నష్టాన్ని పూరించడానికి తగిన సహాయం అందిస్తానని వాగ్దానం చేసిన కేంద్ర ప్రభుత్వం తన మాటకు కట్టుబడలేదనీ తెలుగుదేశం పార్టీ కేంద్ర ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. లోకసభలో తెలుగుదేశం సభ్యులు చాల తీవ్రంగా తమ వాదనలు వినిపించారు. కేంద్ర ప్రభుత్వం ఆ వాదనలకు సరైన జవాబులు చెప్పలేకపోయింది. అయితే ఈ తీర్మానం, చర్చ కూడ రెండు వైపులా అవకాశవాద రాజకీయాల చిహ్నంగానే జరిగాయి గాని ఆంధ్రప్రదేశ్‌కు, అంటే రాజకీయ నాయకత్వానికి కాదు, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఉన్న సమస్యల గురించి, ఆ సమస్యల పరిష్కారం గురించి వాస్తవాలు చర్చించలేదు. విభజనకు ముందరి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిన హైదరాబాద్-కేంద్రక అభివృద్ధి నమూనా వల్ల మొత్తం రాష్ట్రంలో విద్యా, ఉద్యోగావకాశాల వనరులన్నీ హైదరాబాద్‌లోనే పోగుపడిన మాట, రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రజల విద్యా, ఉద్యోగావకాశాలలో కొరత ఏర్పడిన మాట నిజమే. కాని విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ పాలకవర్గాలు విభజనే వద్దనే మూర్ఖపు వైఖరి తీసుకున్నాయి గాని, అది అనివార్యమైనప్పుడు అక్కడి ప్రజలు కోల్పోయిన అవకాశాలను సాధించడం కొరకు ఏయే డిమాండ్లు పెట్టాలనే ప్రశ్నపై కేంద్రీకరించలేదు. విభజన తప్పకపోతే తమకు ఏమి కావాలో కేంద్ర ప్రభుత్వాన్ని అడిగి, వాటికి చట్టబద్ధ హామీలు సాధించే బదులు సమైక్య ఉద్యమం పేరుతో సమయం వృథా చేశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుగా, పునర్వ్యవస్థీకరణ చట్టం మీద చర్చ మొదలయ్యాక, హడావుడిలో ప్రత్యేక హోదా గడ్డిపోచ పట్టుకున్నారు. నిజానికి అప్పటికి ప్రత్యేక హోదా చరిత్ర ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చే అవకాశమే లేదు. అది వచ్చినా ప్రజలకు ఒరగబోయేది ఏమీ ఉండేది కాదు. కాని ప్రజలను మోసగించడానికి అన్ని రాజకీయ పక్షాలూ ఆ మాటనే పట్టుకున్నాయి. రెండేళ్లు గడిచిన తర్వాత, ప్రత్యేక హోదా కాదు, అందుకు సమానమైన ప్యాకేజీ ఇస్తాము అని కేంద్ర ప్రభుత్వం తనలో భాగమైన తెలుగుదేశం పార్టీని ఒప్పించింది. మళ్లీ ఈ మాయలో మరొక రెండు సంవత్సరాలు గడిచాయి. ఇప్పుడు అదీ రాదు, ఇదీ రాదు అని తేలిపోయినాక ప్రణయ కలహం మొదలయింది. నిజానికి అదైనా, ఇదైనా ప్రజలకు ఒరిగేదేమీ లేదు. వాటి వల్ల రాజకీయ నాయకత్వానికి, కాంట్రాక్టర్లకు మేలు జరుగుతుంది గాని ప్రజలకు దక్కేది తక్కువ. దాని బదులు, ప్రజలు కోల్పోయిన విద్యావకాశాలు పూరించడానికి జాతీయ స్థాయి విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఉద్యోగావకాశాలు పూరించడానికి కేంద్ర స్థాయి పారిశ్రామిక సంస్థలు, పరిశ్రమల ఏర్పాటు, మౌలిక సౌకర్యాల కల్పన వంటి స్పష్టమైన, నిర్దిష్టమైన డిమాండ్లు పెడితే ఉపయోగకరంగా ఉండేది. అలా వచ్చే విద్యా, పారిశ్రామిక సంస్థలను, మౌలిక సౌకర్యాలను కూడ మళ్లీ రాజధానిలో, లేదా తమ ఆశ్రితుల నియోజకవర్గాలలో కేంద్రీకరించి అవిభక్త ఆంధ్రప్రదేశ్ లో చేసిన పొరపాటే చేయకుండా, వికేంద్రీకరిస్తామని ప్రకటించి ఉంటే ప్రజల మద్దతు కూడ హెచ్చు స్థాయిలో ఉండేది. ఏది ఏమైనా మన రాజకీయాలు ప్రజా అవసరాల కోసం లేవని, రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం, అహంకారాల కోసం మాత్రమే ఉన్నాయని ఈ ఉదంతం మరొకసారి చూపుతున్నది. వీ


నెతన్యాహు యూదు జాత్యహంకారానికి రాజ్యాంగ హోదా

- ఎ. నరసింహారెడ్డి


ఇజ్రాయిలీ పార్లమెంట్ జూలై 19న ఆమోదించిన వివాదాస్పద 'నేషన్-స్టేట్' చట్టం అత్యంత ప్రమాదకరమైనది. ఈ చట్టం 62-55 ఓట్లతో ఆమోదం పొందింది. ప్రాథమికమైన సమానత్వ హక్కును బాహాటంగా కాలరాస్తున్నది. మానవ హక్కులకు, మైనార్టీల హక్కులకు సంబంధించిన అంతర్జాతీయ చట్టాలను, న్యాయ నియమాలను నిర్లజ్జగా తుంగలో తొక్కుతున్నది. చర్చ సందర్భంగా అరబ్ జాయింట్ లిస్ట్ చీఫ్ ఆయ్‌మాన్ ఓదె నిరసనగా నల్ల జెండాను ప్రదర్శించారు. నెతన్యాహు చర్యను అధ్యక్షుడు రివ్లెన్ ఆక్షేపించారు. ఇది దేశ ప్రతిష్టను దిగజార్చేదిగా, శత్రువుకు ఒక ఆయుధం సమకూర్చేదిగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఇంతవరకు ఇజ్రాయిల్ చేసిన చట్టాల్లోకెల్లా అత్యంత అమానుషమైన చట్టమిది. 20 శాతానికి పైగా ఉన్న యూదుయేతర జాతి నిర్మూలనకు, ముఖ్యంగా పాలస్తీనియన్ల నిర్మూలనకు ప్రాతిపదిక కానుంది. యూదు రాజ్యంలో యూదులే ప్రథములని, యూదుయేతరులంతా ద్వితీయశ్రేణి పౌరులుగానే ఉండాలని చెప్పే ఈ వివక్షాపూరిత చట్టంపై అంతర్జాతీయ సమాజం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తున్నది. సొంత గడ్డపై పాలస్తీనీయులను శరణార్థులుగా మార్చిన నెతన్యాహు మరింత చెలరేగేందుకు ఈ మౌనం దోహద పడుతుంది. గ్రేటర్ ఐక్య జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా ప్రకటించడమే కాక, హిబ్రూను జాతీయ భాషగా గుర్తిస్తూ, జాతీయ గీతం, చిహ్నాలు, పతాకాలను కొత్తగా రూపొందించడం వంటి యూదు జాత్యహంకార చర్యలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

పాలస్తీనా భూభాగంలో 1948 మే 18న ఇజ్రాయిల్ రాజ్యం ఏర్పడింది. 1948లో ఇజ్రాయిల్ పాలస్తీనాలోని అరబ్బు ప్రాంతాలపై దాడి చేసి కొన్ని ప్రాంతాలను కబళించినప్పుడు జెరూసలేంను స్వతంత్ర అంతర్జాతీయ నగరంగా ఐరాస తీర్మానించింది. 1949లో అరబ్బులకు, ఇజ్రాయిల్‌కు మధ్య జరిగిన యుద్ధంలో జెరూసలేంలోని పశ్చిమ ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకోగా, తూర్పు ప్రాంతం జోర్డాన్ ఆధీనంలో ఉంది. 1967 యుద్ధం తరువాత వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలేంను జోర్డాన్ నుంచి ఇజ్రాయిల్ స్వాధీనం చేసుకుంది. ఇటీవలనే జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తున్నట్లు అమెరికా ప్రకటించడమే కాక తన రాయబార కార్యాలయాన్ని కూడా అక్కడికి తరలించడంతో మళ్లీ పాత వివాదం మరింత తీవ్ర రూపంలో ముందు కొచ్చింది. భవిష్యత్‌లో అమెరికా భౌగోళికాధిపత్య రాజకీయ, ఆర్థిక, సైనిక వ్యూహాలకు పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ కొత్త తరహాలో కీలక పాత్ర వహించే ప్రమాదముంది. అవినీతి కుంభకోణాల్లో పీకల్లోతున కూరుకుపోయిన నెతన్యాహు ప్రభుత్వం నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని జాతి ఉన్మాదాన్ని రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నది. అవినీతి కేసులో నెతన్యాహు భార్య షారా ప్రస్తుతం విచారణ ఎదుర్కొంటుండడం, ఆర్థికంగా ఇజ్రాయిల్ సంక్షోభంలో చిక్కుకోవడంతో నెతన్యాహు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. జాతి ఉన్మాదాన్ని రెచ్చగొట్టడమే దీనికి పరిష్కారమనుకున్నారు. కానీ, స్వయం నిర్ణయాధికార హక్కు యూదులకు మాత్రమే ఉంటుందని చెప్పడం ఈ చట్టం ఉద్దేశం. నెతన్యాహు నీతిబాహ్య విధానాలను అంతర్జాతీయ సమాజం నిర్ద్వంద్వంగా ఖండించాలి. వీ





❖ **ఆదివాసీల 'మారంమాయి' మహామానవి - మహాశ్వేతాదేవి -** సంపాదకత్వం: అనిశెట్టి రజిత - రుద్రమ ప్రచురణలు - 252 పేజీలు, 1/8 డెమీ, రు. 300, ప్రతులకు: అనిశెట్టి రజిత, ఇం.నెం. 1-1-226/1/2/1, ప్రశాంత్‌నగర్ కాలనీ, ఫేజ్-3, తేజస్వి హైస్కూల్ వెనుక, కాజీపేట-506 004; సెల్: 9849482462




❖ **సమన్వయ -** సాహిత్య వ్యాసాలు - డా. ఎస్. రఘు - మనస్వి ప్రచురణలు - 168 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: మనస్వి ప్రచురణలు, డా. జె. నీరజ, ఇం.నెం. 3-10-33, గోఖలే నగర్, రామంతపూర్, హైదరాబాద్ - 500 013;
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



❖ **అక్షర బాణాలు -** కవిత్వం - రాధాపుత్ర రాజశేఖర్ - రాధ ప్రచురణలు - 128 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: రాజశేఖర్, 11-7-492, సంతోష్‌నగర్, గోదావరిఖని, పెద్దపల్లి జిల్లా;
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **వ్యాస శోభిత** - డా. కందాళ శోభారాణి - శోధన ప్రచురణలు - 108 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: అలుగోజు సుధాకర్, టీచర్ (రిటైర్డ్), 23-11-2404/ఎ, దేశాయిపేట రోడ్, వరంగల్ - 506 002; నవచేతన పబ్లిషింగ్ హౌస్ బ్రాంచ్‌లలో




❖ **భూమి పుట్టిన రోజు** - కవితా సంపుటి - ఆకెళ్ల రవిప్రకాష్ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి - 104 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: అనల్ప బుక్ కంపెనీ, గ్రౌండ్ ఫ్లోర్, జికెస్ ప్రశాంతి నిలయం, జికె కాలనీ మెయిన్ రోడ్, నేరెడ్‌మెంట్ క్రాస్ రోడ్డు దగ్గర, సికింద్రాబాద్ - 500 094. ఫోన్: 70938 00678; Email: analpabooks@gmail.com



❖ **అణచివేతకు అనేక రూపాలు** - కవిత్వం - మునిమడుగుల రాజారావు - పాలపిట్ట బుక్స్ - 52 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: మునిమడుగుల రాజారావు, ఇం.నెం. 7-2-83/49 2బి4, ఇందిరానగర్, నిర్మల్ (పోస్ట్) - 504 106




❖ **యువకళాకారుని ఆత్మగీతం** - జేమ్స్ జాయిస్ - అనువాదం: చింతపట్ల సుదర్శన్ - పాలపిట్ట బుక్స్ - 203 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: చింతపట్ల సుదర్శన్, 1-5-168, న్యూ మారుతీనగర్, హైదరాబాద్ - 500 060



❖ **మట్టి అరుగు** - కథలు - బుర్రా లక్ష్మీనారాయణ - పాలపిట్ట బుక్స్ - 160 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: బుర్ర లక్ష్మీనారాయణ, 2-2-647-235-18-ఎ, జమ్ జమ్ మస్జీద్ ఎదురుగా, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్ - 500 013



❖ **గోరింటాకు** - ఉర్దూ కథలకు తెలుగు అనువాదం - అమ్జద్ - పాలపిట్ట బుక్స్ - 112 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: మొహమ్మద్ అమ్జద్ అలీ, ఇం.నెం. 11-3-209, రోడ్ నెం. 7, శ్రీ వెంకటేశ్వర కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035




❖ **బీసీ కులాలు సంచార జాతులు** - జూలూరు గౌరీశంకర్ - అడుగు జాడలు పబ్లికేషన్స్ - 240 పేజీలు, 1/8 డెమీ, రు. 175, ప్రతులకు: అడుగు జాడలు పబ్లికేషన్స్, ఎం.ఎస్.కె. టవర్స్, ఫోర్త్ ఫ్లోర్, ఫ్లాట్ నెం. 410, రోడ్ నెం. 11, హిమాయత్ నగర్, హైదరాబాద్; అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలలో



❖ **వేకువ పిట్ట** - కవితా సంపుటి - చల్లపల్లి స్వరూపరాణి - భీమ్ భూమి ప్రచురణ - 92 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: చల్లపల్లి స్వరూపరాణి, ఫ్లాట్ నెం. 4ఎ, అనుమోలు ఎన్‌క్లేవ్, రామచంద్రనగర్, విజయవాడ - 520 008. ఫోన్: 9440362433; Email: challapalliswaroopa2012@gmail.com




❖ **పెన్న ముచ్చట్లు** - డా. కాళిదాసు పురుషోత్తం - పల్లవి పబ్లికేషన్స్ - 238 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: శ్రీమతి కె. సత్యవతి, 16-4-279, కస్తూరిదేవి నగర్, నెల్లూరు-524 001. ఆం.ప్ర; మణి బుక్‌స్టాల్; నవోదయ బుక్ హౌస్




❖ **భూమి దుఃఖం -** ఉపరితల గనుల వ్యతిరేక కవిత్వం - సంపాదకులు: నల్లెల్ల రాజయ్య - వరంగల్ రచయితల సంఘం - 64 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: నల్లెల్ల రాజయ్య, ఇం.నెం. 7-1-384/6, పద్మాక్షి కాలనీ, హన్మకొండ, వరంగల్ - 506 001.



❖ **మిణుగురు పూలు** - గర్జనపల్లి పిల్లల కవిత్వం - సంపాదకులు: నాగిళ్ల రమేశ్ - 36 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు: నాగిళ్ల రమేశ్, జెడ్‌పిఎచ్ఎస్ గర్జనపల్లి, వీర్లపల్లి మం., రాజన్న సిరిసిల్ల - 505305



❖ **విహారి కథలు** - నవచేతన పబ్లిషింగ్ హౌస్ - 192 పేజీలు, 1/8 డెమీ, రు. 140



❖ **నక్షత్ర వైభవం** - జమ్మి కోనేటిరావు - నవచేతన పబ్లిషింగ్ హౌస్ - 78 పేజీలు, 1/8 డెమీ, రు. 60, పై రెండు పుస్తక ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎస్.ఐ (పోస్ట్), హైదరాబాద్ - 500 068.
ఫోన్: 24224453/54;
Email: navachethanaph@gmail.com

కౌలు రైతుల మీద పాలకుల కుతర్కాలు

***తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు పథకం రైతు అర్థాన్నే మార్చి భూ యజమానులకే ఆ పథకాన్ని అమలు చేస్తోందని, ప్రభుత్వం దృష్టిలో కౌలురైతులు రైతులు కాకుండా పోయారని అంటున్నారు* ఇప్ప వీరారెడ్డి**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు నోటి వెంట ఇంతకు ముందెన్నడూ రానటువంటి అవగాహనా రాహిత్యపు – అత్యల్ప విషయ పరిజ్ఞానంతో (మరో మాటలో చెప్పాలంటే తప్పుడు విషయ పరిజ్ఞానంతో) కూడిన మాటలు ప్రగతి భవన్‌లో 'రైతుబంధు' పథకంపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో బయటపడ్డాయి.

వ్యవసాయంలో రైతులకు పెట్టుబడి సాయం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని తమకూ వర్తింపచేయాలని కౌలు రైతులు కోరిన కోరిక ఆయనకు అర్థరహితమైనదిగా అన్యాయమైనదిగా అనిపించిందట! కౌలు రైతులు కోరిన ఈ కోరికను భూ యాజమాన్యపు హక్కులు కలిగి ఉండి స్వంతంగా వ్యవసాయం చేయకుండా తమ భూముల్ని ఇతరులకు కౌలుకిస్తున్న రైతులను ఇబ్బంది పెట్టే డిమాండ్‌గా తేలుస్తుండు! పైగా 'సమాజంలో చాలా మంది తమ స్వంత ఇండ్లు – భవంతులు హోటళ్లు, వాహనాలు తదితర ఆస్తులను కొంత నిర్ణీత కాలం కోసం 'కిరాయి' తీసుకుని ఇతరులకు అద్దెకిస్తున్నారు. అంత మాత్రానా అద్దెకు తీసుకున్న వాళ్లు ఆ ఆస్థులకు యజమానులైపోతారా?' అంటూ 'కౌలు' (దోపిడీ) సిద్ధాంతాన్ని వల్లిస్తున్నాడు. (మోకాలుకు బోడిగుండుకు ముడిపెట్టడమంటే ఇదేమరి.) ఆర్థికంగా భారంగా మారిన సాగుకు పెట్టుబడి సాయాన్ని అందించే 'రైతుబంధు'ను తమకూ వర్తింపచేయాలని అంటున్న కౌలు రౌతులు ముఖ్యమంత్రి కండ్లకు ఎలా కనబడుతున్నారు?

'స్వంతాస్తి హక్కులు' కలిగి ఉన్న భూ యాజమానుల భూముల్ని 'కౌలు' పేరుతో ఆక్రమించి తామే ఆ భూములకు యజమానులైపోయే ఆక్రమణ దారుల్లా కనిపిస్తున్నారా? దున్నేవానికే భూమి కావాలనే విప్లవకారుల్లా కనబడుతున్నారా? ఎందుకంత భయం? తాను భయపడడమే కాదు కౌలుకిచ్చే భూ యజమానులను కూడా భయపెడు తున్నాడు. అందుకేనేమో లేని రాని ప్రమాదమేదో ముంచుకొస్తుందని ముందుగానే తానే గుర్తించినట్లు కౌలుదారులకు కౌలుదార్లుగా గుర్తింపునిచ్చే ఆధారాలు, అవకాశాలు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకం నుండి, 'పహాని నకలు' నుండి కౌలుదారు పేరు నమోదు కావలసిన 'అనుభవదారు' కాలంను తొలగించివేశాడు. బ్యాంకుల నుండి రుణం పొందడానికి అర్హతనిచ్చే రుణ గుర్తింపు కార్డును రద్దుచేశాడు. ఇదంతా పక్కాగ ఒక ప్రణాళికా బద్ధంగా కొనసాగించాడు. ఈ కుట్రల అమలుకు ప్రతిరూపంగా వచ్చిన కార్యక్రమమే భూ రికార్డుల ప్రక్షాళన. వీటిలో ఈ కుట్రపూరిత వ్యూహం బయటపడకుండా కేవలం అక్కడక్కడ రైతుల ఎక్కువ తక్కువ భూ విస్తీర్ణాల లెక్కలను సరిచేసి కొత్తపాస్ పుస్తకాలను చేతికిచ్చాడు. భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టిందే ఇందుకు. భూ రికార్డుల ప్రక్షాళన ద్వారా రైతాంగానికి జరిగిన మేలేమో కాని, అంచనా వేయలేని, కనిపించని నష్టం మాత్రం కౌలు రైతాంగానికి జరిగిపోయింది! ఒక్క దెబ్బతో కౌలు రైతుల హక్కులన్నీ భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమంతో తుడిచిపెట్టుకుపోయినాయి. కౌలు రైతు ప్రభుత్వం అందించే 'రైతుబంధు' పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని పొందినంత మాత్రాన తాను కౌలుకు చేస్తున్న భూములకు పట్టా (హక్కు) దారుగా రికార్డులకెక్కుతాడా? ఈ కారణంతోనే కౌలు దార్లకు 'రైతుబంధు' ద్వారా ఒనగూరే ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం తిరస్కరిస్తుందా?

అసలు 'రైతుబంధు' పథక లక్ష్యాన్ని గురించి ప్రభుత్వం చెప్పిందొకటి, అమలు చేస్తున్న విధానానికి లక్ష్యం మరొకటి. వ్యవసాయం చేస్తున్న రైతుకు రోజు రోజుకు పెరిగిపోతున్న పెట్టుబడుల ఖర్చు కారణంగా గిట్టుబాటు కాని సేద్యానికి 'పెట్టుబడి' సాయాన్ని అందించడమే ఈ పథక లక్ష్యంగా ప్రారంభంలో ప్రభుత్వం ప్రకటించుకున్నది. ఇప్పుడేమో స్వంత భూములపై యజమాన్యపు హక్కులు కలిగి ఉన్నవాళ్లకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని చెబుతూ అసలు లక్ష్యాన్ని మార్చి పథకం అమలుకు వక్రభాష్యం చెబుతున్నది! స్వయంగా సాగుచేయకున్నా భూమిపై యజమాన్యపు హక్కును మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని 'రైతుబంధు' కింద పెట్టుబడి సాయం పేరుతో కొంత డబ్బును ఉత్త పుణ్యానికే అందిచడం అన్నది 'పట్టాదార్ల'పై ప్రభుత్వానికి గల ఆశ్రిత పక్షపాత ధోరణికి నిదర్శనం. సాగు కార్యక్రమాన్ని స్వయంగా నిర్వహిస్తున్నా, భూమిపై యజమాన్యపు హక్కులేని కారణంగా పెట్టుబడి సాయానికి కౌలు రైతులు అర్హులు కారంటున్న ప్రభుత్వం, సాగును స్వయంగా నిర్వహించకున్నా యజమాన్యపు హక్కులు కలిగి ఉన్న 'పటేదార్ల'నే నిజమైన అర్హులుగా ప్రకటిస్తుంది! ఎంత అన్యాయం? నిజంగా సాగుచేసే వాళ్లకే కష్ట – నష్టాలు. సాగు చేయని వాళ్లకు సాగు కష్ట – నష్టాలతో సంబంధమే ఉండదు.

వాళ్లకు పెట్టుబడి సాయమే అవసరం లేదు. తమవి కాని భూముల్లో సాగును స్వయంగా చేస్తూ సాగు కష్ట – నష్టాలను చవిచూస్తున్న 'కౌలుదార్ల'కు పెట్టుబడి సాయం నిజంగా అవసరం. అలాంటప్పుడు 'రైతుబంధు' పథకం కౌలు రైతుల కోసం కాదని అనడం ఈ ప్రభుత్వానిది పచ్చి ఫ్యూడల్ దృక్పథంగా చెప్పొచ్చు.

ఈ వాదననట్లా ఉంచితే, భూమిపై 'స్వంత హక్కు' (యజమాన్యపు హక్కు) కలిగిన వారెవరైనా ముఖ్యమంత్రి గారి అర్థంలో రైతులేనట! పై పైన ఆలోచిస్తే ఇందులో తప్పేమి లేనట్లు అనిపిస్తుంది. కాని అది కరెక్ట్ కాదు. భూమిపై స్వంతాస్తి హక్కు ఉన్నవాళ్లెవరైనా ఆ భూమికి యజమాని మాత్రమే కాగలడు. కానీ రైతు కాలేడు. (ఇది కూడా తప్పే. భూమికి యజమానులెవరూ ఉండరు. భూమిపై స్వంతాస్తి హక్కులుండవు. ఇదిక్కడ

వివరించలేం) కౌలు రైతుకు 'స్వంతాస్తి హక్కు' లేనంత మాత్రాన భూ యజమాని కాడేమో కాని, రైతు కాకుండా పోడు. రైతు అనే హోదాకు శ్రమతోనే సంబంధం కాని, యజమాన్యపు హక్కుతో సంబంధం ఉండదు. భూమిపై యజమాన్యపు హక్కు కలిగి శ్రమతో సంబంధం ఉన్నవాళ్లను రైతంటే రైట్ (కరెక్ట్) కాని, శ్రమతో సంబంధం కలిగి భూమిపై యజమాన్యపు హక్కు లేనంత మాత్రాన రైతు కాదంటే మాత్రం తప్పు. ఇప్పుడు చెప్పండి ముఖ్యమంత్రిగారు. ఎవరు రైతులు? ఎవరికి పెట్టుబడి సాయాన్నివ్వాలి? శ్రమతో సంబంధం ఉన్నవాళ్లకా? శ్రమకు దూరంగా ఉండి కేవలం 'ఆస్తి హక్కు' మాత్రమే కలిగిన భూ యజమానులకా? కౌలు రైతుకు తర్క జ్ఞానం లేనంత మాత్రాన ఎట్లబడితే అట్ల మాట్లాడడం ముఖ్యమంత్రి స్థాయికి తగనిది.

ఇట్లా పట్టాదార్లకు మాత్రమే రైతుబంధు ద్వారా ఆర్థిక సాయాన్ని అందించే తన ప్రభుత్వ విధానాన్ని వితండ వాదంతో సమర్థించుకుంటున్న ముఖ్యమంత్రి, మరొకపక్క కౌలు రైతుకు ఈ పథకాన్ని వర్తింప చేయకపోవడాన్ని కూడా సమర్థించుకోవడానికి, ఆ అపవాదు నుండి తప్పించుకోవడానికి, అర్థం పర్థం లేని డొంక తిరుగుడు అసంబద్ధ వాదనలు చేస్తున్నాడు. పట్టాదారులు తమ భూమిని ఒక్కో పంట కాలానికి ఒక్కొక్కరికి కొన్నిసార్లు ఒకరి కంటే ఎక్కువ మందికి కౌలుకిస్తారని, భూ యజమానులెవ్వరూ కౌలు రైతుతో లిఖితపూర్వక ఒప్పందం చేసుకోరని, అలాంటప్పుడు కౌలు రైతులను గుర్తించడం ఎట్లా సాధ్యమని, ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కడా లేని ఈ కౌలు రైతుకు ఏ ప్రాతిపదికన సాయం అందించాలి? అని కూడా ప్రశ్నలను సంధిస్తున్నాడు. నిజం చెప్పాలంటే దూర దృష్టితో ఒక ప్రణాళికా బద్ధంగానే కౌలు రైతులపై కక్షగట్టిన ఈ ప్రభుత్వం, కౌలు రైతును గుర్తించే ఆధారాలను – అవకాశాలను, అన్నింటిని రికార్డుల నుండి (పాసు పుస్తకం, 'పహణీ నఖల్' నుండి కౌలు రైతు పేరు నమోదు చేయవలసిన 'అనుభవదారు' ఖాలాన్ని తొలగించడం, రుణ అర్హత (ఎల్ఇసి) కార్డుల రద్దు) తొలగించిన తర్వాత ఈ మాటలు మాట్లాడుతున్న ప్రభుత్వానిది జానా తనమో, తెంపరి తనమో కాకుండా మరేం అవుతుంది? ఇంకో అడుగు ముందుకేసిన ముఖ్యమంత్రి 'భూమిపై ఎలాంటి హక్కు పత్రాలు లేని కౌలు దార్లకు ప్రభుత్వ ఖజానా నుండి డబ్బు పంచితే తప్పవుతుందని నీతులు వల్లిస్తున్నాడు. ఎంత నీతిమంతుడు? తమకున్న సాగుయోగ్యం కాని భూములకు తమ కుటుంబ సభ్యులను, ఆ భూములకు సరిపడా వాళ్లు సరిపోకపోతే తమ బంధువులను – మిత్రులను భినామి యజమానులుగా చేసి, వాళ్లంతా వ్యవసాయ శ్రమంటే ఏమిటో తెలియకుండా పట్టణాల్లో వ్యాపార – వాణిజ్య – ఉన్నతోద్యోగాలు చేసుకుంటూ విలాసవంతమైన జీవితాలను గడుపుతుంటే, ప్రభుత్వ ఖజానా నుండి 'రైతుబంధు' సాయం కింద వాళ్లకు లక్షలాది రూపాయలను పంచిపెట్టడం (దోచిపెట్టడం) ఏ విధంగా ఒప్పవుతుందో ముఖ్యమంత్రే చెప్పాలి?

'రైతుబంధు' పథకం అన్నది భూమిపై 'స్వంతాస్థి' హక్కులు కలిగిన భూ యజమానుల కోసం (ముఖ్యమంత్రిగారి దృష్టిలో వాళ్లే రైతులు, శ్రమచేయకున్నా!) తీసుకొచ్చిందే కాని, కౌలు రైతుల కోసం కాదట! ఎంత అసంబద్ధ వాదన? మరి కౌలు రైతులు చేస్తున్నది వ్యవసాయం అనబడదా? దానికి పెట్టుబడి అవసరం లేదా? వాళ్లు పండిస్తున్న పంటలు సమాజం కోసం కాదా? వాళ్ల కుటుంబాల కోసమేనా? ఇవేవి కానప్పుడు వాళ్లేమైనా నిషేధిత పంట (గంజాయి) ల సాగుదార్లా? ప్రభుత్వం ఏ కారణంగా వాళ్లకు పెట్టుబడి సాయాన్ని నిరాకరించింది? కౌలు రైతులు అడుగుతున్న ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

అసలు కౌలు రైతులకు 'రైతుబంధు' పథకం ద్వారా పెట్టుబడి సాయం తప్పని సరిగా అందించవలసిన పరిస్థితులను – కారణాలను కూడా పరిగణంలోకి తీసుకోవాలి. గత రెండున్నర దశాబ్దాలుగా దేశంలో రైతుల ఆత్మహత్యలు గరిష్ఠ స్థాయిలో కొనసాగిన – కొనసాగుతున్న ప్రాంతాల్లో మహారాష్ట్రలోని లాతూర్, విదర్భ తర్వాత తెలంగాణ రాష్ట్రం రెండవ స్థానంలో ఉంది. అందులో అధిక శాతం కౌలు రైతులేనని అనేక మంది సామాజిక వేత్తల అధ్యయనాల్లో వెల్లడైంది. సాగులో అధిక సంఖ్యలో ఈ సెక్షన్ రైతులే ఆత్మహత్యలు చేసుకోవడానికి గల ప్రధాన కారణాల్లో వీళ్లు ఇతరుల భూమిని కౌలుకు తీసుకోవడమే. అట్లా కౌలుకు తీసుకుంటున్న నేపథ్యానికి కూడా వీళ్లకు భూమి లేకపోవడం, ఉన్నా చాలినంతగా (ఎకరం, ఎకరంన్నర లోపు) లేకపోవడం. వర్షాధారంగా మాత్రమే పంటలు పండే ఆ భూముల్లో అత్యధిక పెట్టుబడులు అవసరమయ్యే పత్తి పంటను విత్తుకోవడం, వ్యాపారులు కొనుగోలు దార్ల మోసానికి పెట్టుబడులు మునిగి పీకల దాకా అప్పుల పాలవ్వడం కౌలు రైతుకు దుర్భరంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ పెట్టుబడి సాయం కౌలు రైతుకు కొంతైనా మేలు చేస్తుందని తప్పక భావించవలసి వస్తుంది.

రాష్ట్రం ఏర్పడిన కొత్తలో ముఖ్యమంత్రి భూమిలేని నిరుపేద వాళ్లందరికీ మూడెకరాల సాగు యోగ్యమైన భూమిని పంపిణీ చేసి, పట్టాదారు పాసు పుస్తకం ద్వారా వారికి యజమాన్యపు హక్కులు కల్పిస్తానని హామీ ఇచ్చి ఉన్నాడు. హామీ ఇచ్చి నాలుగేళ్లు దాటింది. ఇచ్చిన హామీ అటకెక్కింది. కౌలు రైతులు స్వంత భూమికి యజమానులు కాకపోతే మానె. చేస్తున్న భూమికి 'కౌలు రైతు'గా గుర్తించ నిరాకరించి రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని కూడా దూరం చేస్తున్న మన ముఖ్యమంత్రిని భూస్వామ్య సమాజానికి ప్రతినిధిగా ప్రకటించక తప్పదు. మరో నాలుగు మాసాల్లో రెండవ విడత పెట్టుబడి సాయం అందే సమయానికైనా కౌలు రైతులందరూ ఐక్యంగా పోరాడితే తప్ప లాభం లేదు.

(రచయిత తెలంగాణ రైతాంగ సమితి స్థాపక సభ్యులు) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.*

ముఖ్యమంత్రి - కౌలు రైతులు

తెలంగాణ ప్రభుత్వం రైతుకు పెట్టుబడి కింద ఇస్తున్న సహాయం నిజంగా భూమిని సాగుచేస్తున్న కౌలు రైతులకు కాకుండా వ్యవసాయంలో పాల్గొనని భూస్వాములకే లాభం చేకూర్చేలా ఉందని అంటున్నారు **నలమాస క్రిష్ణ**

"ఇల్లు కిరాయికి ఇస్తే కిరాయిదారు ఇంటి యజమాని అవుతాడా? భూమి కౌలుకు చేస్తే ప్రభుత్వ పెట్టుబడి పొందడానికి కౌలురైతు అర్హుడైతాడా?" అని స్వయాన తెలంగాణ ముఖ్యమంత్రి పేద రైతులను ప్రశ్నిస్తున్నాడు. కరుడుగట్టిన అగ్రకుల భూస్వామిలా ముఖ్యమంత్రే మాట్లాడితే అర్థం ఏమిటి?

తెలంగాణ ముఖ్యమంత్రికి తెలివి బాగుందని, అన్ని రంగాలలో సమగ్ర నైపుణ్యం గల బహుముఖ ప్రజ్ఞాశాలి, విజ్ఞాన సర్వస్వం అని ఆయన భజన బృందంలోని మేధావులు పదే పదే గొప్పలు చెపుతుంటారు. చెప్పుతున్న మేధావుల పట్ల వారికుండే పూర్వ చరిత్ర వల్లనో లేక వారిపట్ల ఉండే గౌరవం వల్లనో ఇది నిజమని నమ్మేవారు చాలా మంది ఉన్నారు. రాజకీయ నాయకులకు విషయ పరిజ్ఞానంతో పాటు ఆకట్టుకునే శక్తి లేకుండా దోపిడీ వర్గానికి నాయకత్వం వహించడం సాధ్యం కాదు. కనుక అటువంటి ప్రతిభావంతులైన సమ్మోహన శక్తిగల వారికే ప్రాధాన్యతను ఇచ్చి దోపిడీ దారులంతా కలిసి నాయకులుగా నిలబెట్టుకుంటారు.

అసలు విషయం ఏమిటంటే అన్నీ తెలిసిన కెసిఆర్‌కు కౌలు రైతుల సమస్య ఎందుకు తెలియదు? ఈ సందర్భంలో రైతుబంధు పథకం కౌలు రైతులకు వర్తించదని తెలియజెప్పడం కెసిఆర్ ఉద్దేశం. కానీ మాటల వెనుక ఉన్న మర్మం మాత్రం ప్రమాదకరమైనది. ఆయన అజ్ఞానాన్ని, దోపిడీ వర్గ స్వభావాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. కెసిఆర్ ప్రకటన తర్వాత రైతుబంధు పథకం కౌలు రైతులకు కూడా వర్తింపజేస్తామని పై పై మాటలు మాట్లాడిన తెరాస పార్టీకి చెందిన చోటా, మోటా నాయకులు నోర్లు మూశారు. ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకుంటుందని ఎంతో కొంత సాయం అవుతుందని కొండంత ఆశతో ఎదురుచూసిన కౌలు రైతులకు నిరాశే మిగిలింది. వ్యవసాయ పెట్టుబడి కౌలు రైతులకు సహాయం చేయడం, చేయకపోవడం టిఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టం కాదు. అది ప్రజల కష్టార్జితంతో వచ్చిన డబ్బు. కెసిఆర్ సొంతం కాదు. పెట్టుబడి సాయం చేయాలంటే మొదలు కౌలు రైతుల దగ్గరనే ప్రారంభించవలసింది. వీరు భూమిని నమ్ముకొని కాయకష్టం చేస్తూ ఎన్నో ప్రతికూలతల మధ్య జీవితాలు వెళ్లదీస్తున్నారు. కౌలు డబ్బులు చెల్లించి, పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి చివరికి అప్పుల కుప్ప పెరిగి ఉరికొయ్యకు వెళాడుతున్నది అత్యధికంగా కౌలు రైతులే. స్వతంత్ర అధ్యయనాలు, ప్రభుత్వ రిపోర్ట్‌లను పరిశీలిస్తే ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలలో 80 శాతం పైగా కౌలు వ్యవసాయం ద్వారా అప్పులపాలైన కుటుంబాలే.

వ్యవసాయంలో ఏర్పడ్డ నష్టాలు, చదువులకు, పిల్లల పెళ్లిల్లకు, ఆరోగ్యానికి అయిన ఖర్చుల భారంతో ఉన్న కాస్త భూములమ్ముకొని అదే గ్రామంలో వ్యవసాయం చేస్తున్నారు. ప్రకృతితో, ఊరుతో, మనుషులతో ఉన్న సంబంధ బాంధవ్యాలను తెంచుకొని పట్టణాలకు వలసపోయి బతకలేక ఉన్న ఊరిలోనే కౌలు వ్యవసాయం చేస్తున్నారు. వలసపోకుండా ఉపాధి దొరుకుతుంది. ఆత్మగౌరవంతో ఉన్న ఊళ్లో బతకొచ్చనే ఆశతో వ్యవసాయం చేయడం వల్ల ఎన్నిసార్లు నష్టాలు వచ్చినా మళ్లీ మళ్లీ అదే భూమిని నమ్ముకొని చివరికి అర్ధాంతరంగా ఆ మట్టిలోనే కౌలు రైతులు కలిసిపోతున్నారు. కూలీ, నాలి చేసుకొని బతకడం కన్న సొంత వ్యవసాయం చేయడం ద్వారా నలుగురిలో గౌరవం ఉంటుందని, కాస్త మిగులుతే కుటుంబం బాగుపడుతుందని చిన్న కోరికతో ఇంటిల్లాదులు ఆరుగాలం కష్టపడుతున్నారు. కానీ వారి అనుభవంలో అన్ని రకాల చేదు ఫలితాలే వస్తున్నాయి. చివరికి పాలకులు కూడా బహిరంగంగా వెక్కిరిస్తున్నారు.

కౌలు రైతుల సమస్య ఈనాటిది కాదు. అయినప్పటికీ ఈ సమస్య మూలాలు సరిగ్గా అర్థం చేసుకున్న వారు కౌలు రైతుల సమస్యను "మనిషిగా" అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. కౌలు రైతులంటే వారు పుట్టుకతోనే ప్రత్యేక వర్గంగా ఉన్న సమూహం కాదు. భూమిపై కొందరు పరాన్నబుక్కులకు గల గుత్తాధిపత్యం వలన ఏర్పడిన భూమిలేని పీడిత రైతులు. అందువలనే "1955లో తెలంగాణ కౌల్దారి రక్షణ చట్టం" వచ్చింది. మహోత్తరమైన పోరాట ఫలితంగా వచ్చిన ఈ చట్టం ఏమాత్రం అమలు కాకుండా భూస్వామ్య వర్గాలు అడ్డుకోగలిగాయి. చివరిగా "భూ అధీకృత సాగుదారుల చట్టం 2011" వచ్చింది. ఈ చట్టం కేవలం కౌలు సాగుదారులకు రుణ సౌకర్యం, పంట భీమాకు అర్హతనిస్తుంది తప్ప భూ యజమాన్యపు హక్కులు ఏ రకంగా సంక్రమించవు. ఈ చట్టం ద్వారా గుర్తింపు కార్డులను ప్రతి సంవత్సరం రెవెన్యూ శాఖ గ్రామ సభలు (ఫిబ్రవరి నుండి మే చివరి వారం మధ్య) నిర్వహించి అర్హులను నిర్ణయించి "కౌలు రైతు గుర్తింపు కార్డు" మంజూరు చేస్తుంది. కార్డు అందని రైతు అప్పీల్ కూడా చేసుకొని తిరిగి కార్డు పొందవచ్చు. ఈ చట్టం ద్వారా ఓ మేరకైన మేలు జరుగుతుందని కూడా ఆశించలేని విధంగా తెలంగాణ ప్రభుత్వ పనితీరు ఉంది. గ్రామ సమావేశాలు లేవు. గుర్తింపు కార్డులు ఇవ్వడమనే బాధ్యతను విస్మరించారు. వరి పొలానికి 33 శాతం, మెట్టకు 25 శాతం మించి కౌలు ఉండరాదనే నిబంధన ఉంది. కానీ ఉల్లంఘించబడుతున్నా సరే ప్రభుత్వాధికారులు పట్టించు కోవడం లేదు.

తెలంగాణలో 13 శాతం కౌలు రైతులు ఉన్నారని నీతి ఆయోగ్ నివేదిక చెప్పింది. స్వతంత్ర అధ్యయనాల ప్రకారం 15 లక్షల దాకా కౌలు రైతులుంటారని ఒక అంచనా. వీరిలో (2018 సంవత్సరం) కౌలురైతు గుర్తింపు కార్డులు లక్ష మంది రైతులకు కూడా ఇవ్వలేదు. స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రే కౌలు రైతుల పట్ల ఇంత హేళనగా మాట్లాడుతుంటే మరి పాలనా యంత్రాంగంకు భిన్నంగా ఎలా ఉంటుంది.

దాదాపు 40 శాతం వ్యవసాయ భూములు భిన్న మార్గాల ద్వారా ఆదాయం పొందుతున్న వారి యజమాన్యంలో ఉన్నాయి. వీరు ఆ భూములపై బ్యాంకు రుణాలు, ఇతర సబ్సిడీలు పొందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో సంబంధం లేకుండా కౌలు ముందుగానే తీసుకుంటారు. అటువంటి వారి సంపాదనకు ప్రభుత్వం ఇంకా ఆర్థిక సహాయం అందించాలా? లేక కౌలు రైతులకు అందించాలా?

కౌలు ఒప్పందం చేసుకుంటే, రెవెన్యూ రికార్డులకు ఎక్కితే తమ భూములపై కౌలుదారులకు యజమాన్య హక్కు దక్కుతుందనే భయంతో భూ యజమానులు కౌలురైతు గుర్తింపు కార్డు రావద్దని (2011 భూ అధీకృత సాగుదారుల చట్టం, లేదా రుణ అర్హత కార్డు ప్రకారం కార్డుల కోసం అప్పీల్ చేయమని రెవెన్యూ శాఖ అడగాలి. విఆర్ఓ, ఎంఆర్ఓ గ్రామ సభలో కౌలు రైతుల విషయం పై నిర్ధారణ జరిగాక వారికి వెంటనే గుర్తింపు కార్డు పొందడానికి అర్హత ఉంటుంది. రుణం పొందడానికి, పంట భీమాకు వీరికి అర్హత ఉంటుంది. భూ యజమాన్యం పొందడానికి ఈ కార్డు ఏ విధంగా ఉపయోగపడదు. భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు లేవు) కోరుకుంటారు. ప్రభుత్వ అధికారులకు చట్టాన్ని గురించి భూ యజమానులకు వివరించే తీరికలేదు. ఫలితంగా అర్హులైన రైతులకు పంట రుణాలు, పంట భీమా మొదలైనవి రావడం లేదు. కనీసం పెట్టుబడి సాయం వస్తుందన్న నమ్మకాన్ని కూడా నయా నిజాం పాలన దెబ్బతీసింది. పైగా కౌలు రైతులు రైతులెలా అవుతారని మూర్ఖపు ప్రశ్నలేస్తున్నాడు ముఖ్యమంత్రి.

తరతరాలుగా భూమిని నమ్ముకొని కాయకష్టం చేస్తున్న శ్రమజీవులకు భూమిపై యజమాన్యపు హక్కు ఎందుకు లభించలేదో పాలక వర్గాలు జవాబు చెప్పడం లేదు. అహో తెలంగాణ వెలిగిపోతుందని వ్యాసాలు రాస్తూ.. ఉపన్యాసాలు ఇస్తున్న కిరాయి మేధావులకు కూడా ఇదీ ఎక్కడా కనిపించడం లేదు, వినిపించడం లేదు. చొక్కా మలగకుండా, చెమట చుక్క చిందించకుండా పరాన్న బుక్కుల్లా జీవించే సోమరిపోతులు ఇంగిత జ్ఞానం కూడా లేకుండా కార్లల్లో వచ్చి రైతుబంధు చెక్కులు తీసుకు పోయారు. మొదటి విడత పంపిణీ జరిగిన 6,000 వేల కోట్లలో 3,000 వేల కోట్లు కౌలు రైతలకు, పేద రైతులకు దక్కాల్సిన ప్రజాధనం అక్రమంగా భూమికి సంబంధం లేని వారికి అందినాయి. సచిన్ టెండూల్కర్, అమితాబ్ బచ్చన్, చిరంజీవి లాంటి ఎందరికో శంషాబాద్ పక్కన భూములున్నాయి. సిగ్గు వల్లనో మరే కారణం వల్లనో కానీ వారు చెక్కులు తీసుకున్నట్టు గానీ, సామాజిక బాధ్యతగా ఆ డబ్బు తిరిగి ఇచ్చినట్టు గానీ కనిపించలేదు.

ఆత్మహత్యలు చేసుకుంటూ తల్లడిల్లుతున్న రైతాంగం కన్నీరు తూడువడానికి ఎరువులు, విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని దశాబ్దాలుగా రైతు సంఘాలు పోరాటం చేస్తున్నాయి. ఆ పోరాటాల ప్రతిఫలంగానే 'పెట్టుబడి సాయం' అనేది ముందుకొచ్చింది. ఇదేదో ప్రపంచంలో అత్యద్భుతమైన విధానం టిఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిందనే వాదన అర్థరహితం. వివిధ రూపాలలో ఇలాంటి ప్రోత్సాహకర, మద్దతునిచ్చే పథకాలు మరికొన్ని రాష్ట్రాల్లో అమలౌతున్నాయి. ఆత్మహత్య చేసుకుని కునారిల్లుతున్న రైతు కుటుంబం గోస చూపించి తెగబలిసిన భూస్వాములకు సహాయం చేసే టిఆర్ఎస్ విధానం కన్న దుర్మార్గం మరోటి ఉండదు. కౌలు రైతులుగా మూడవ వంతు రైతాంగం ఉండడానికి కారణం భూమి లేకపోవడమే. భూ సంస్కరణలు అమలు చేయకపోవడం, సమగ్ర భూ సంస్కరణ చట్టాన్ని రూపొందించి పేద రైతాంగానికి న్యాయం చేయాలనే చిత్తశుద్ధి లేకపోవడం. వారి సమస్యకు గల సామాజిక ఆర్థిక కోణాలను మూలాలకు వెళ్లి పరిశీలించి, పరిష్కరించాల్సి ఉంది. కౌలు రైతులు దిక్కులేనివారు, హక్కులేని వారు కాదు. వారే భూమిపై నిజమైన హక్కుదారులు. కష్టం చేయకుండా భూమిపై హక్కు కావాలనే వారు పరాన్నబుక్కులు. భూములు హక్కుదారులకు దక్కాలనే పోరాటాలు ఇంకా రావాలి.

(రచయిత తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షులు) వీ

తెలంగాణొస్తే ఏమొచ్చింది?

***కళ్లు మిరుమిట్లు కొలిపే అబద్ధాలలో, ప్రభుత్వానుకూల ప్రచారాలలో కనబడకుండా పోతున్న నాలుగు సంవత్సరాల తెలంగాణ పాలన లోపాలను బేరీజు వేస్తున్నారు* ఎన్. వేణుగోపాల్**

'తెలంగాణొస్తే ఏమొచ్చిందా, చూడండి' అని తెలంగాణ ప్రభుత్వ సమర్థకులు సోషల్ మీడియాలో మాటిమాటికీ కాలు దువ్వుతున్నారు. సంక్షేమ పథకాల గురించి ఊదర కొడుతున్నారు. నిండిన చెరువులు, మత్తడి దూకుతున్న చెరువులు, కనుచూపు మేర విస్తరించిన పంట పొలాలు, చిరునవ్వుల ముఖాలు ఫొటోలు ప్రదర్శిస్తున్నారు. అయితే ఎంత కర్కోటక పాలనలోనైనా ఏవో కొన్ని సంక్షేమ పథకాలు ఉంటాయి, ఇటువంటి ప్రదర్శన వస్తువులు, ఫొటోలు దొరుకుతాయి. అడాల్ఫ్ హిట్లర్, మీర్ ఉస్మానలీ ఖాన్, ఇందిరా గాంధీల పాలనల దాకా కూడ పోనక్కరలేదు. దోపిడీకి, అన్యాయానికి, హామీల ఉల్లంఘనకు చిహ్నంగా చూసే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడ, తెలంగాణ ప్రాంతం నుంచి కూడ ఇటువంటి ప్రదర్శన వస్తువులు, ఫొటోలు దొరుకుతాయి. ఇటీవలి చంద్రబాబు నాయుడు, రాజశేఖర రెడ్డి పాలనా కాలాల్లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచార బ్రోచర్లు, కరపత్రాలు, ప్రకటనలు చూసినా అవి కనబడతాయి. కనుక అటువంటి ప్రదర్శన వస్తువులతో, ఫొటోలతో తేల్చదగిన సమస్య కాదిది.

ఆంధ్రప్రదేశ్‌లో అమలయిన పాలక విధానాల వల్ల తెలంగాణ సమాజం నష్టపోయిందని, తెలంగాణ సమాజానికి న్యాయబద్ధంగా దక్కవలసిన హక్కులేవీ దక్కకుండా పోయాయనీ, కనీసం పెద్దమనుషుల ఒప్పందంలో లిఖిత పూర్వకంగా చేసిన వాగ్దానాలు కూడ నెరవేరలేదనీ, తమ భాషా సంస్కృతులు అవమానానికి గురయ్యాయనీ, అందువల్ల న్యాయబద్ధ పాలన, బాధ్యతాయుత ప్రభుత్వం, స్వాభిమానం వంటి విలువలు నిలబడాలంటే స్వపరిపాలన కావాలనీ, ప్రత్యేక రాష్ట్రం కావాలనీ తెలంగాణ ప్రజలు కోరుకున్నారు, ఉద్యమించారు. ఇది విస్తృత ప్రజా ఉద్యమంగా మారుతున్నదని గుర్తించాక అనేక పాలకవర్గ పార్టీలూ సంస్థలూ కూడ ఈ ఉద్యమంలో భాగం పంచుకున్నాయి. చివరికి వివిధ పాలకవర్గ ముఠాల బేరసారాలలో భాగంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇవ్వడానికి ఆమోదం కుదిరింది. ప్రజలు ఏ ఆకాంక్షలతో పోరాడారో ఆ తెలంగాణ, ప్రజలు కోరుకున్న తెలంగాణ కాక ఒక పాలకవర్గ ముఠా అధికారంలో తెలంగాణ వచ్చింది. అందువల్ల ఆ పాలకవర్గ ముఠా తనకు తాను పెట్టుకున్న ఎజెండా మాత్రమే అమలవుతున్నది గాని, ఉద్యమ క్రమంలో ప్రజలు కోరుకున్న ఎజెండా కాదు. అంతవరకూ తెలంగాణకు అన్యాయం చేసిన, మోసగించిన, అవమానించిన పాలకవర్గ ముఠాల ప్రయోజనాలకు ఎటువంటి దెబ్బ తగలకుండానే తెలంగాణ పాలన నాలుగు సంవత్సరాలు ముగించుకున్నది. తెలంగాణ ప్రజలు ఉద్యమకాలంలో వ్యక్తీకరించిన ఆకాంక్షలు తీరకపోవడం మాత్రమే కాదు, కొన్ని రంగాలలో ఆంధ్రప్రదేశ్ పాలన కన్న, అంతకు ముందరి సైనిక పాలన కన్న, నిజాం పాలన కన్న దిగజారిన పాలన సాగుతున్నది.

అందువల్ల తెలంగాణొస్తే ఏమొచ్చింది అని బేరీజు వేయడానికి కావలసింది ఎంపిక చేసిన ఆకర్షణీయమైన ఫొటోలు, ప్రభుత్వ ప్రచార ప్రకటనలు, భజన పరుల యాత్రాకథనాలు కావు. ఆ బేరీజు సక్రమంగా ఉండాలంటే, నాలుగైదు వస్తుగత ప్రమాణాలున్నాయి. 1. అట్టడుగు ప్రజా జీవన ప్రమాణాలలో గత పాలనా సమయాలలో కన్న ఏ మార్పులు వచ్చాయి, అవి ఎంత ప్రగతిశీలమైనవి? 2. ఐక్య రాజ్య సమితి, ప్రణాళికా సంఘంతో సహా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ప్రతిపాదించిన మానవాభివృద్ధి సూచికలలో తెలంగాణ ఏర్పడక ముందు ఎక్కడ ఉండేది, ప్రస్తుతం ఎన్ని మెట్లు ఎక్కింది, అసలు మెట్లు ఎక్కే దిశలో ఉందా, కిందికి దిగిపోయే దిశలో ఉందా? 3. ప్రత్యేక తెలంగాణ కావాలని ప్రజలు కోరుకోవడంలో, పోరాడడంలో తెలంగాణ వస్తే ఏమి వస్తుందని, జరుగుతుందని ఆశించారు? 4. ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించిన విభిన్న శక్తులు తెలంగాణ వస్తే ఏమి వస్తుందని ప్రజలకు వాగ్దానాలు చేశాయి? ప్రత్యేకించి ప్రస్తుతం అధికారంలో ఉన్న రాజకీయ పక్షం ఏ వాగ్దానాలు చేసింది? నాలుగేళ్ల పాలనలో అవి అమలు చేసిందా లేదా? తెలంగాణ వస్తే ఏమొచ్చింది అనే చర్చ ఈ ప్రమాణాల ఆధారంగా జరిగినప్పుడే ఆ చర్చ అర్థవంతంగా ఉంటుంది. ఆ చర్చకు విశ్వసనీయత ఉంటుంది. అటువంటి చర్చ ఎన్నెన్నో ప్రజా జీవన అంశాలను స్పృశించవలసి ఉంటుంది గనుక విస్తృతంగా, సుదీర్ఘంగా సాగక తప్పదు. కాని ఒక పత్రికా వ్యాసపు స్థల పరిమితుల దృష్ట్యా ఇక్కడ ప్రధానమైన అంశాలను స్థూలంగా మాత్రమే చర్చిద్దాం.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రజా ఉద్యమానికి కీలకమైన భూమిక నీళ్లు, నిధులు, నియామకాలు అని జయశంకర్ సూత్రీకరించారు. ఈ మూడు అంశాల్లోనూ ఉమ్మడి రాష్ట్రంలో విస్తీర్ణం రీత్యానైనా, జనాభా రీత్యానైనా తెలంగాణకు దక్కవలసిన వాటా దక్కలేదని, మరీ ముఖ్యంగా నదీజలాలలో పరీవాహక ప్రాంతం డెబ్బై, ఎనభై శాతం ఉన్నప్పటికీ ఇరవై శాతం కన్న తక్కువ వాటా మాత్రమే దొరికిందని, నిధుల్లో, నియామకాల్లో కూడ తీవ్రమైన అన్యాయాలు జరిగాయని తెలంగాణ ఉద్యమంలో అగ్ర నాయకుల నుంచి అట్టడుగు కార్యకర్తల దాకా ప్రతి ఒక్కరూ గణాంకాలు వల్లించేవారు. మొత్తం తెలంగాణ సమాజానికే ఆ అంకెలు పట్టుబడ్డాయి. అంటే తెలంగాణ రాగానే ఈ మూడు అంశాలలో పాత అన్యాయాలను సరిదిద్దే పని, కొత్తగా న్యాయం చేసే పని ముమ్మరంగా జరుగుతుందని తెలంగాణ ప్రజలు ఆశించారు.

ఈ మూడు అంశాలలో నీళ్ల విషయంలో ఆ సెంటిమెంటును వాడుకుని ఏదో జరుగుతున్నట్టు హడావుడి చేస్తూ వాస్తవంగా కాంట్రాక్టర్ల కోసం, రాజకీయ ముడుపుల కోసం పనులు జరుగుతున్నాయి గాని

అక్కడ కూడ నిజంగా ఉద్యమ ఆకాంక్షలు నెరవేరుతున్న జాడ తక్కువ. తెలంగాణ నైసర్గిక పరిస్థితికి అనువైన చెరువుల పునరుద్ధరణ ప్రారంభించారు. కాని, అది ఎక్కడికక్కడ స్థానికంగా జరిగేదీ, బడా కాంట్రాక్టర్లకు కాక, స్థానిక, చిన్న కాంట్రాక్టర్లకు మాత్రమే అవకాశం ఇచ్చేదీ కనుక కావచ్చు దాన్ని మధ్యలోనే ఆపివేశారు, లేదా మందకొడిగా నడుపుతున్నారు. ఇక అంతకుముందే రూపకల్పన జరిగి, ఉమ్మడి రాష్ట్రంలో నత్తనడక నడిచిన భారీ ప్రాజెక్టులను రిడిజైన్ పేరుతో మళ్లీ చేపట్టారు, త్వరితగతినే పనులు నడుపుతున్నారు. కాని రిడిజైన్ లో భాగంగా పాత ప్రాజెక్టులకు పది, ఇరవై శాతం మార్పులు చేసి వ్యయం మాత్రం వందశాతం పెంచారు. ఒక్క ఉదాహరణ చెప్పాలంటే ఈ ప్రభుత్వం రాకముందు రు. 38,000 కోట్ల వ్యయంతో రూపొందిన ప్రాజెక్టును, ఎక్కువలో ఎక్కువ 20 శాతం రిడిజైన్ చేసి, వ్యయం మాత్రం రెట్టింపు కన్న ఎక్కువ రు. 81,000 కోట్లు చేశారు. అంటే జలయజ్ఞం పేరుతో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ధనయజ్ఞపు రెండో రాకడ ప్రస్తుతం కొనసాగుతున్నది. లార్సెన్ అండ్ టూబ్రో, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్స్, నవయుగ ఇంజనీరింగ్, గాయత్రి ప్రాజెక్ట్స్ వంటి ఉద్యమ క్రమంలో ఆంధ్రా కాంట్రాక్టర్ల కంపెనీలుగా ఆరోపణలు ఎదుర్కొన్న కంపెనీలే, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులు నిర్మించి, తెలంగాణ వనరులను కొల్లగొట్టిన కంపెనీలే ప్రస్తుత పనులు కూడ చేస్తున్నాయి. రెట్టింపుగా పెంచిన ప్రాజెక్టు వ్యయాలలో కొంత ఈ కాంట్రాక్టర్లకు పంచడానికి, కొంత ముడుపులుగా వెనక్కు రాబట్టడానికి అధికారపక్షం చేసిన ప్రయత్నమే తప్ప ఈ ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం తెలంగాణ ఉద్యమపు కోరిక అయిన న్యాయంగా దక్కవలసిన నీళ్లు రాబట్టడం కాదు. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయిన తర్వాత ఎంతో కొంత నీళ్లు వస్తాయేమో గాని, ఈ ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం మాత్రం కాంట్రాక్టర్లకు దోచి పెట్టడమే. ఉద్యమ కాలమంతా ఆంధ్ర, రాయలసీమ కాంట్రాక్టర్ల అక్రమాలను ప్రశ్నించిన తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు, తెరాసను సమర్థించే మేధావులు ఇప్పుడు ప్లేటు ఫిరాయించి ఆ కాంట్రాక్టర్లు నాణ్యంగా సమర్థంగా పని చేస్తారని, దేశమంతా వారే పనులు చేస్తున్నారని, వారికి కాంట్రాక్టులు ఇవ్వడం తప్ప గత్యంతరం లేదని అంటున్నారు! అంటే, తెలంగాణొస్తే ఏమొచ్చిందంటే నిన్న దోపిడీదారు అయిన కాంట్రాక్టర్ ఇవాళ నమ్మకమైన మిత్రుడు అయ్యాడన్న మాట.

ఇక నిధుల విషయంలో పాత అభివృద్ధి నమూనానే కొనసాగుతున్నది గనుక లక్ష కోట్ల, లక్షన్నర కోట్ల బడ్జెట్ అని ఎన్ని గొప్పలు చెప్పుకున్నా, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు తమ నిధులలో వాటాను ఎలా కోల్పోయారో ఇప్పుడూ అదే రకంగా కోల్పోక తప్పడం లేదు. ఇన్ని లక్షల కోట్లు వ్యయం చేస్తున్నట్టు చూపినా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచే, ఉద్యోగకల్పన చేసే ఒక్క పరిశ్రమ రాలేదు. పాత ప్రభుత్వ రంగ సంస్థల పునరుద్ధరణ గాని, కొత్త ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు గాని జరగలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు ప్రగల్భాలలాగనే ఐటి రంగం పెరుగుతున్నదని ప్రగల్భాలు వినిపిస్తున్నాయి. తెలంగాణ కోసమే అనే బుకాయింపులతో ప్రకటిస్తున్న పథకాలకు విపరీతంగా అప్పులు తెస్తూ ఆ అప్పులు, వడ్డీలు చెల్లించే భారమంతా ప్రజల మీద వేస్తున్నారు. రు. 60,000 కోట్ల అప్పుతో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్రాన్ని నాలుగో సంవత్సరం తిరిగేసరికల్లా దాదాపు రెండు లక్షల కోట్ల రుణ భారం ఉన్న రాష్ట్రంగా మార్చిన ఘనత తెరాస ప్రభుత్వానిదే. ప్రజాధనంతో వోట్లు రాబట్టుకునే అతి తెలివి ఎత్తుగడలతో సంక్షేమ పథకాలు ప్రకటించడం, వాటి మీద దుబారా వ్యయం చేయడం తప్ప, సంక్షేమ నిధులు అవసరం లేని విధంగా, వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి వ్యూహం అసలు తెలంగాణ పాలకుల ఊహలోనే లేదు. ఇటువంటి పాత అభివృద్ధి నమూనా యథాతథంగా కొనసాగుతుండగా, తెలంగాణొస్తే ఏమొచ్చిందంటే మితిమీరిన అప్పు మాత్రం వచ్చింది. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలలో ఒకటి ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అనుసరించిన చంద్రబాబు పాలనా విధానాల మీద తీవ్రమైన వ్యతిరేకత. కాని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగు సంవత్సరాలలో గతంలో కన్న ఎక్కువగా ప్రపంచ బ్యాంకు ఆదేశాల మీద, అంతర్జాతీయ ద్రవ్య, ఆర్థిక సంస్థల ఆదేశాల మీద, బహుళ జాతి సంస్థల ఆదేశాల మీద నడుస్తున్నది. నడవడం మాత్రమే కాదు, అదే గొప్పగా చెప్పుకుంటున్నది.

నియామకాలలో తెలంగాణొస్తే ఏమొచ్చిందో ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పన్నెండు లక్షల మంది ప్రభుత్వోద్యోగులు ఉన్నారని, అందులో విస్తీర్ణం దృష్ట్యానైనా, జనాభా దృష్ట్యానైనా తెలంగాణ బిడ్డలు కనీసం ఐదు లక్షల మంది ఉండవలసిందని, కాని రెండున్నర లక్షలకు మించి లేరని జయశంకర్ దగ్గర ప్రారంభించి ఇవాళ అధికారంలో ఉన్నవారి దాకా ప్రతి ఒక్కరూ ఉద్యమ కాలమంతా అన్న మాట. అంటే రాష్ట్రం విడిపోతే తెలంగాణ బిడ్డలకు రెండున్నర లక్షల మందికి ప్రభుత్వోద్యోగాలు వస్తాయని ఆశ ఉండేది. ఈ అంకెను మూడు లక్షల దాకా కూడ పెంచిన ఉద్యోగ సంఘాల నాయకులు ఇప్పుడు అధికారంలోనే ఉన్నారు. మరి తెలంగాణ వస్తే ఏమొచ్చింది? తెలంగాణ వచ్చాక ఐదు నెలలకు శాసనసభా వేదిక మీదనే ముఖ్యమంత్రి ఒక లక్షా ఏడువేల ఉద్యోగాలున్నాయని, అవి రెండు సంవత్సరాల్లో భర్తీ చేస్తామని అన్నారు. నాలుగు సంవత్సరాలయింది ఆ అంకెలో మూడో వంతు భర్తీ చేయడం కూడ ఇంకా జరగలేదు. ఈ నాలుగు సంవత్సరాల్లో పదవీ విరమణ పొందిన వారి సంఖ్యకు సరిపోయినంత మంది కూడ భర్తీ కాలేదు. ఈ మధ్యలో కొత్తగా జిల్లాల విభజన వల్ల తలెత్తిన కొత్త ఉద్యోగాల సంఖ్యకు సరిపోయినంత మంది కూడ భర్తీ కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్రభుత్వ శాఖ, కార్యాలయం తీసుకున్నా ఉండవలసిన, అవసరమైన ఉద్యోగుల సంఖ్యలో సగమో, ముప్పావో కన్న ఎక్కువ లేరు. బహుశా పోలీసు శాఖ ఒక్కటే దీనికి మినహాయింపు కావచ్చు. అసంతృప్తి పెరుగుతున్న ప్రజల్ని అదుపులో పెట్టడానికి పోలీసు బలగాలు కావాలి గనుక ఆ శాఖ ఒక్కటి మినహా మిగిలిన ఏ రంగంలోనూ నియామకాల్లో ఆశాజనకమైన స్థితి లేదు. అంటే మొత్తం మీద తెలంగాణొస్తే ఏమొచ్చిందంటే పాత నిరుద్యోగం తగ్గలేదు, కొత్త నిరుద్యోగం వచ్చింది.

ఇక ప్రభుత్వ పాలన గురించి తెలంగాణొస్తే ఏమొచ్చిందో చెప్పుకోవలసిన విచిత్రమైన సంగతులెన్నో ఉన్నాయి. ఇక్కడ ప్రభుత్వ పాలన అనే మాటను వర్గ దృక్పథం నుంచి కూడ అర్థం చేసుకోనక్కర లేదు. ప్రజాస్వామిక రాజ్యాంగం అమలయ్యే చోట, ముఖ్యంగా భారతదేశంలో దశాబ్దాల తరబడి సాగిన సాధారణ పాలనా సూత్రాలు, పద్ధతులు కొన్ని ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కూడ ఆ పద్ధతుల్లో కొన్ని ఉల్లంఘనకు గురవుతున్నాయనీ, అవి తప్పనిసరిగా పాటించవలసిన

రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ, ప్రజాస్వామిక పద్ధతులనీ తెలంగాణ ఉద్యమంలో భాగంగా కోరుకున్నాం. కాని ఈ నాలుగు సంవత్సరాలలో అవేవీ పాటించకపోవడమే తెలంగాణొస్తే ఏమొచ్చింది అన్న ప్రశ్నకు జవాబు. ఒక పార్టీ టికెట్ మీద గెలిచి శాసనసభ్యులుగా ఉంటూ, ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే అధికార పక్షంలో చేరి, మంత్రులు కూడ అయిన అనైతిక ప్రవర్తనకు తెలంగాణ నాంది పలికింది. పార్టీ ఫిరాయింపుల నిరోధ చట్టాన్ని కూడ తుంగలో తొక్కిన ఈ వ్యవహారం మీద చర్య తీసుకోకుండా మూడు నాలుగేళ్లు నానబెట్టిన చట్టబద్ధ పాలన అమలవుతున్న రాష్ట్రమిది.

రాష్ట్ర పాలన ఒక ముఖ్యమంత్రి నాయకత్వంలోని మంత్రివర్గ ఆధ్వర్యంలో జరగడం, జరిగిన అన్ని నిర్ణయాల మీద, అమలవుతున్న అన్ని విధానాల మీద ఆ మంత్రి వర్గానికి ఉమ్మడి బాధ్యత ఉండడం దేశంలో ఏడు దశాబ్దాలుగా అమలవుతున్న రాజ్యాంగబద్ధ పద్ధతి. కాని తెలంగాణొస్తే ఏమొచ్చిందంటే, ఉమ్మడి బాధ్యత ఉన్న మంత్రివర్గమనేది లేని, మంత్రుల స్వరమే వినిపించని, ముఖ్యమంత్రే అన్నీ నడిపే, ముఖ్యమంత్రి కొడుకే అన్ని శాఖలకూ మంత్రిగా ఉండే పద్ధతి అమలవుతున్నది. మంత్రివర్గ శాఖల మార్పులు మంత్రివర్గంలో చర్చించి, గవర్నర్ కు తెలియజేసి అప్పుడు బహిరంగంగా ప్రకటించడం పాత పద్ధతి. ఇప్పుడు రాజుగారు తలచుకున్న వెంటనే, మిగిలిన పద్ధతులేమీ లేకుండా బహిరంగ సభలో ప్రకటించడం తెలంగాణొస్తే వచ్చిన మార్పు. ఒక మంత్రికి సంబంధించిన శాఖ పనితీరు మీద ఆ మంత్రి అధ్యక్షతన సమీక్షా సమావేశాలు జరగడం పాత పద్ధతి. ఒక కీలకమైన శాఖ సమీక్షా సమావేశాన్ని ఆ మంత్రిని లోపలికి రానివ్వకుండా ముఖ్యమంత్రే నిర్వహించిన కొత్త పద్ధతి తెలంగాణొస్తే వచ్చిన మార్పు. ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలనీ, ప్రతి ప్రభుత్వ ఉత్తర్వును అచ్చు వేసి గాని, ఇటీవలి కాలంలో అయితే వెబ్ సైట్ మీద పెట్టి గాని ప్రజలకు అందుబాటులో ఉంచాలనేది పాత పద్ధతి. ఇష్టం వచ్చిన జివోలను మాత్రమే బహిరంగంగా పెడతాం, మిగిలినవి దాచి పెడతాం, వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించే ప్రాజెక్టుల నివేదికలు కూడ బహిరంగ పరచం, రాజు మనసులో ఏది తోస్తే అదే శాసనం, అది ప్రజలకు తెలియజెప్పనక్కర లేదు, మా ఇష్టారాజ్యంగా పాలిస్తాం అనేది తెలంగాణొచ్చినాక రూపొందిన పద్ధతి. చెప్పిన మాటకు కట్టుబడడమో, కట్టుబడకపోవడమో పాత పద్ధతి, ఒక మాట చెప్పి మరొక పని చేయడం తెలంగాణొచ్చినాక వచ్చిన పద్ధతి. నిజాలు దాచడం, అర్ధసత్యాలు చెప్పడం పాత పద్ధతి, ధైర్యంగా, దూకుడుగా అబద్ధాలు చెప్పడం కొత్త పద్ధతి.

తెలంగాణ ఉద్యమకారులను కూడ నరికి చంపిన నరహంతకుడు, మాఫియా సామ్రాజ్యాధిపతి నయీంను హతమార్చినప్పుడు వందల కోట్ల రూపాయలు, వేల కోట్ల రూపాయల ఆస్తి పత్రాలు దొరికాయనేది బహిరంగ రహస్యమైనా అవేవీ బహిరంగం కాలేదు. అప్పటికి ఇరవై సంవత్సరాలుగా నయీంతో కలిసి నేర సామ్రాజ్యాన్ని నడిపిన రాజకీయ నాయకులు ఇంకా నిర్ణయాధికారంలో కొనసాగుతూనే ఉన్నారు. మిలాఖత్తయిన రాజకీయ నాయకులు, బడా పోలీసు అధికారులందరి పేర్లే బైటికి రాలేదు, పేర్లు బైటికి వచ్చిన చోటా అధికారులకు ఏడాది తిరగకుండానే పునర్నియామకాలు, పదోన్నతులు కూడ జరిగాయి. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణొస్తే ప్రభుత్వ పాలనలో ఏమొచ్చిందంటే, ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన పాతికో పరకో శాతం ప్రజాస్వామిక, చట్టబద్ధ, పద్ధతి ప్రకారం సాగిన పాలన స్థానంలో రాజరికపు ఇష్టారాజ్యపు పాలన వచ్చింది.

తెలంగాణొస్తే ఏమొచ్చింది అనే ప్రశ్నకు పౌరహక్కుల స్థితి గురించి జవాబు చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ స్థితి కొనసాగుతున్నదనో, ఇంకా దిగజారిందనో జవాబు చెప్పవలసి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్ర పాలనలో తెలంగాణ ప్రజానీకం తమ పౌర హక్కులను ఎన్నడూ సంపూర్ణంగా అనుభవించలేదు. 1968–69 నుంచి ఆ స్థితి మరింత దిగజారింది. అందువల్లనే తెలంగాణ ప్రజానీకం మిగిలిన ఏ కారణం కోసం కాకపోయినా పౌరహక్కుల కోసం, ఊపిరి పీల్చుకునే స్వేచ్ఛ కోసం, వాక్సభాస్వాతంత్ర్యాల కోసం ఆ పాలన పోవాలనుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఇంకేమి వచ్చినా రాకపోయినా ప్రాథమిక, పౌర, ప్రజాస్వామిక హక్కులు నిలబడతాయనుకున్నారు. ఆ ఆకాంక్షకు ప్రతిస్పందించిన తెలంగాణ రాష్ట్ర సమితి కూడ ఆ వాగ్దానం ఇచ్చింది. పౌరహక్కుల సంఘం ఏర్పాటు చేసిన ఒక సభలో పాల్గొంటూ, తమ లక్ష్యం 'ఎన్ కౌంటర్లు లేని తెలంగాణ' అనీ, తానే పౌరహక్కుల సంఘం అధ్యక్షుడుగా ఉంటాననీ స్వయంగా కె చంద్రశేఖర రావు అన్నారు. కాని తెలంగాణొస్తే ఏమొచ్చిందంటే ఉమ్మడి రాష్ట్రం కన్న ఘోరమైన పోలీసు రాజ్యం వచ్చింది. రాష్ట్రంలో ఎన్ కౌంటర్ హత్యలు ఆగలేదు సరిగదా, మరింత బూటకమైన, దుర్మార్గమైన ఎన్ కౌంటర్ హత్యలు జరిగాయి, వ్యానులో చేతులకు గొలుసులు కట్టేసి ఉన్న, కోర్టు విచారణలో ఉన్న ఖైదీలను కాల్చి చంపి వారు తుపాకి గురి పెడితే ఎదురుకాల్పులు జరిపామని చెప్పుకునేంత పచ్చి అబద్ధాలకోరు ప్రభుత్వం వచ్చింది. సరిహద్దు ఇవతల పట్టుకుని అవతలికి తీసుకువెళ్లి చంపిన ఘటనలు, తెలంగాణ పోలీసులే ఇతర రాష్ట్రాల లోకి వెళ్లి చంపిన ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామికంగా నిరసన తెలిపే ధర్నా చౌక్ ను రద్దు చేశారు. రాష్ట్రంలో ఎన్నో సభలు, సమావేశాల మీద దాడి చేసి, జరగకుండా చేశారు. హాలు యజమానులను బెదిరించి సమావేశాలకు జరిగిన బుకింగ్ ను రద్దు చేయించారు. చివరికి సంస్మరణ సభలను, స్త్రీల మీద అత్యాచారాల వంటి అంశాల మీద సదస్సులను కూడ జరపనివ్వని ఆంక్షల రాజ్యం అమలవుతున్నది. ఏ విధానానికైనా, ప్రభుత్వ కార్యక్రమానికైనా నిరసన తెలపడం ప్రతిపక్షాల, ప్రజల హక్కు కాగా, ఉమ్మడి రాష్ట్రంలో కూడ ఆ హక్కును ప్రకటించుకునే స్థితి ఉండగా, ప్రస్తుతం మాత్రం నిరసన తెలపబోతున్నారని గాలి సోకితే చాలు, చిన్నపాటి ప్రకటన వచ్చినా చాలు ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు, నిరసన స్థలం చుట్టూ బారికేడ్లు జరుగుతున్నాయి. మంత్రులు, శాసనసభ్యులు, తెలంగాణ ఉద్యమ నాయకులుగా ఉండి ప్రస్తుతం అధికారంలో ఉన్నవారితో సహా వందలాది మంది తమ ఫోన్లు, సమాచార వ్యవస్థలు పోలీసు నిఘాలో ఉన్నాయని భయపడుతున్నారంటే, తెలంగాణొస్తే ఏమొచ్చిందంటే నిరంకుశ రాజ్యం వచ్చిందన్నమాట. ఏడో నిజాం పాలనలో ప్రారంభమైన గష్తీ నిషాన్ 53 పాలన ఎనిమిదో నిజాం పాలనలో యథతథంగా కొనసాగుతున్నదన్నమాట.

కెజి టు పిజి అని, దళితులకు ముఖ్యమంత్రిత్వం అని, దళితులకు మూడెకరాల భూమి అని ఊరించి, వాగ్దానం చేసి వాగ్దాన భంగం చేయడం, అక్షరాస్యతా శాతంలో అట్టడుగున ఉన్న తెలంగాణ స్థితిని మెరుగు పరచడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయకపోవడం, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామనే పేరుతో ఐదు శాతం కన్న తక్కువ

మొక్కులు సరే! ప్రజా ఆకాంక్షల మాటేమిటి?

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకుండా, మొక్కులు, యాగాలు, హోమాల పేరుతో పాలకులు అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారని అంటున్నారు **బైరెడ్డి సతీష్**

వ్యక్తులకు విశ్వాసాలు ఉండడం అత్యంత సహజమైనది. వ్యవస్థకు విశ్వాసాలు ఉండవు. రాజ్యానికి దాని ప్రధాన అంగమైన ప్రభుత్వ వ్యవస్థను నిర్వహించే వారికి వ్యక్తిగత విశ్వాసాలు ఉండవచ్చు గాని వాటిని పాలనా వ్యవస్థకు ఆపాదించడం, అంతర్భాగం చేయాలనుకోవడం అక్షేపనీయమైనది. వ్యవస్థలు స్థిరంగా ఉంటాయి, వ్యక్తులు వారి పాత్రలు నిరంతరం మారుతూ ఉంటాయి. వ్యవస్థను భిన్నంగా దర్శించేవారు పాలనా పాత్రల్లోకి వచ్చి వెళుతూ ఉంటారు. అందునా భిన్న విశ్వాసాలు, సాంస్కృతిక ఆచరణలు కలిగిన సమాజంలో ఇవి మరింత సున్నితంగాను, సంక్లిష్టంగాను మారుతాయి. పాలనా పగ్గాలు చేపట్టి రాజకీయ నాయకత్వాన్ని అందించే వ్యక్తులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి.

చారిత్రకంగా ఈ స్థితి అనివార్యం అవడంవల్ల పాశ్చాత్య, యూరప్ దేశాల్లో రాజ్యాధికార వ్యవస్థ నుండి సూత్రబద్ధంగానైనా చర్చిని వేరుచేసి పాలనను నిర్వహించే ఆనవాయితీని ఏర్పర్చారు. మతం, అనేక మత సంబంధ విశ్వాసాలు బలమైన దోపిడీ సాధనంగా మారిపోవడంతో రాజ్యాధికార వ్యవస్థలో దాని పాత్రను రూపంలో వేరు చేసినట్టే కనిపించినా అది అత్యంత ప్రభావవంతంగా ప్రభు వర్గాలకు, పెత్తందారీ శ్రేణులకు ప్రజలను ఏమార్చేందుకు ఉపయోగపడుతూనే ఉంది. ఈ స్థితి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ బలమైన పునాదులతో కాలానుగుణంగా రూపం మార్చుకొంటూ కొనసాగుతుంది.

ప్రాకృతిక పరిణామ క్రమాన్ని శాస్త్రీయంగా అవగాహన చేసుకోలేని కాలంలో మొదలైన అనేకానేక విశ్వాసాలు కాలక్రమంలో సడలిపోవాలే కాని విజ్ఞాన శాస్త్రంతో సమాంతరంగా బలపడుతూ సైన్స్ కంటే బలమైన ప్రభావ శీలంగా ఉంటూ వస్తున్నాయి. ప్రజల మనోభావాలను కాపాడే పేరిట పాలక వర్గాలు వారి ప్రయోజనార్థం మరింతగా పెంచిపోషిస్తూ వాటిని బలోపేతం చేస్తున్నాయి. ఒక్కో దేశంలో ఒక్కో రూపంలో ఇవి కొనసాగుతున్నాయి. ఇవి ఎంతగా వికృత రూపం తీసుకున్నాయంటే మనిషి మనుగడ ప్రమాదంలో పడినా పరవాలేదు కానీ మతం చెక్కుచెదరకూడదనే స్థాయికి వెళ్లింది.

పాలకులు మతాన్ని అడ్డుపెట్టుకొని చిందించిన రక్తంతో చరిత్రంతా నిండిపోయింది. భారత దేశంలో అయితే మసీదును ధ్వంసం చేసి గుడికట్టకపోతే దేశం పురోగమించదని మరీ సామూహిక హత్యాకాండకు పాల్పడి రాజ్య పీఠాల మీద కూర్చున్నారు. ఇవ్వాళ ఆ వారసత్వమే మూకస్వామ్యాన్ని పోషిస్తూ 'పవిత్ర' జీవాల పేరిట మనుషుల్ని నడి వీధుల్లో నరికివేస్తున్నారు. సామాజికంగా భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఈ దేశ భిన్నత్వాన్ని గుర్తించకుండా ఇతర విశ్వాసాలను గౌరవించకుండా, ప్రజాస్వామిక విలువలపట్ల ఏ మాత్రం నమ్మకం లేకుండా మత రాజ్యంగా మార్చివేసే బలవంతపు ప్రయత్నమే ఇది.

ఈ దేశంలో పార్టీలన్నీ లౌకిక వాదాన్ని వల్లెవేస్తూనే ఓట్ల

విద్యార్థులకు ఏదో చేసినట్టు భ్రమలు కల్పిస్తూ, తొంబై ఐదు శాతం విద్యార్థులను గాలికి వదలడం, ఉద్యమ కాలమంతా శ్రీచైతన్య, నారాయణ వంటి కోస్తాంధ్ర, కార్పొరేట్ విద్యా వ్యాపార సంస్థలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించి, ఇప్పుడు వారితోనే అంటకాగుతుండడం, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల గొంతు నులుముతూ ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టం తేవడం వంటి అనేక అంశాలలో ఏ అంశంలో చూసినా తెలంగాణొస్తే ఏమొచ్చింది అంటే మరింత నిరాశాజనకమైన జవాబే ఇచ్చే స్థితి కొనసాగుతున్నది. మద్యపానాన్ని ప్రోత్సహించడం, ఆబ్కారి శాఖకు టార్గెట్లు విధించి మరీ తాగబోయించడం, అత్యున్నత నిర్ణయాధికారం ఉన్నవారి దగ్గరి నుంచి అట్టడుగు ప్రభుత్వోద్యోగి దాకా పెరిగిపోయిన భయంకరమైన అవినీతి, దళితులపై అత్యాచారాలు, భూ అక్రమాలు వంటి ఏ రంగం తీసుకున్నా తెలంగాణొస్తే ఏమొచ్చింది అంటే గర్వపడే, సంతోషపడే పరిస్థితి అయితే లేదు.

ఇటువంటి స్థితే, లేదా ఇంతకన్న కాస్త మెరుగైన స్థితే ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఒకటి కాకపోతే ఒకటైనా పత్రికలు, ప్రచార సాధనాలు తెలంగాణ ఘోష వినిపించడానికి, తెలంగాణ ఘోషకు చోటు ఇవ్వడానికి ప్రయత్నించేవి. తెలంగాణొస్తే ఏమొచ్చిందంటే తెలంగాణ ఘోష పెరిగింది గాని దానికి చోటు దొరకని పరిస్థితి వచ్చింది. తెలంగాణ ఆలోచనలను దారి మళ్లించిన రామోజీ రావు తెలంగాణకు ప్రథమ శత్రువు అని జయశంకర్ అనగా, ఇవాళ ఆ రామోజీ రావు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారు అయిపోయాడు. అన్ని పత్రికలూ, ప్రచార సాధనాలూ తెలంగాణ ప్రభుత్వానికి, అధికార పక్షానికి భయానికో, ప్రకటనల ప్రలోభానికో భజన చేయక తప్పని స్థితి వచ్చింది. ప్రభుత్వం ఎంతెంత ఘోరమైన అబద్ధాలెన్నిటిని ప్రచారం చేసినా ప్రశ్న లేకుండా కళ్లకద్దుకుని అచ్చువేసే, ప్రచారం చేసే ప్రచార సాధనాలు తయారయ్యాయి. ప్రజలకు నిజాలు తెలియని స్థితి తలెత్తింది. నాలుగు దశాబ్దాల ప్రజా ఆకాంక్షకూ ఉద్యమానికీ పర్యవసానమైన రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలలోనే ఇంత దారుణమైన దుస్థితి తలెత్తినప్పుడు, దీన్ని అర్థం చేసుకోవడం, వీలైన అన్ని మార్గాలలో, సాధనాలతో ప్రజలకు వివరించడం, ప్రజా ఆకాంక్షల సాఫల్యం కోసం మరొకసారి ఉద్యమించవలసిన అవసరానికి ప్రజలను సంసిద్ధం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత.

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

మాయాజాలంలో పడి ఆచరణలో మత చాందసాన్నే ప్రదర్శిస్తున్నాయి. లౌకిక వాదాన్ని ఈ సమాజ మనుగడకు, సామరస్యానికి అవసరమైన పనిముట్టుగా కంటే తమ ప్రయోజనాలకు అనుగుణంగానే అవి ప్రయోగిస్తున్నాయి. రూపంలో, తీవ్రతలో మాత్రమే తేడా కనిపిస్తుంది తప్ప సారంలో అధికారంలో ఉన్న ఏ పార్టీ లౌకిక స్ఫూర్తిని కనీస మాత్రంగానైనా అవలంబించడం లేదు.

కొందరు బాహాటంగా ఏ మత విశ్వాసాల్ని తమ భావజాలంగా చాటుకోకుండా ప్రజల మనోభావాల పేరుతో చాందసాన్ని మరింత పెంచేలా వ్యవహరించడమే కాకుండా తమ పైత్యాన్ని ప్రజలపై రుద్దే ప్రయత్నం తీవ్రంగానే చేస్తున్నారు. ప్రజల సొమ్ముతో వ్యక్తిగత మొక్కుల్ని తీర్చుకునే పనిలో పడడమే కాకుండా మొక్కుల్ని చెల్లించుకుంటేనే ఆకాంక్షలు నెరవేరుతాయని పాలకులుగా తాము చేయాల్సిన, నెరవేర్చాల్సిన కర్తవ్యం నుండి తప్పుకోవడమే కాకుండా ప్రజల్ని తప్పుదోవపట్టిస్తున్నారు.

ప్రజల పట్ల రాజ్య కర్తవ్యాల్ని, ప్రజలు కొట్లాడి సాధించుకోవాల్సిన వాటిని సాగిలపడి ఎదురుచూసేలా చేస్తున్నారు. సమస్త సమస్యలకు మూలం తమ చుట్టూ ఉన్న భౌతిక, సామాజిక వ్యవస్థలో ఉందన్న వాస్తవం నుండి ప్రజల దృష్టిని మరల్చి అవి మారెవరో ఏవో చెల్లించుకుంటేనే నెరవేరుతాయనే భావనను బలపడేటట్లుగా వ్యవహరిస్తూ, ప్రజల పోరాట శక్తిని, ప్రశ్నించే తత్వాన్ని నిర్వీర్యపరిచేలా, ప్రాధేయపడేలా, ప్రదక్షణలు చేసేలా ప్రజల్ని మారుస్తున్నారు.

దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రికీ లేనంతగా తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు గారికి దైవ విశ్వాసాలు, యజ్ఞయాగాల, బ్రాహ్మణత్వం మీద ఉన్నంత అపార నమ్మకం మరే ముఖ్యమంత్రికి లేవేమో! అలా ఉండడం ఆయనకు వ్యక్తిగతంగా ఉండే హక్కు దానిని కాదనే హక్కు మరెవరికీ లేదు. చిక్కల్లా వ్యక్తిగత విశ్వాసాన్ని పాలనా సంబంధ అంశంగా మార్చడంలోనే ఉంది. ఏ సందర్భంలోనో వ్యక్తిగత స్థాయిలో మొక్కుకున్న మొక్కుల్ని చెల్లించుకునే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆయనకు ఉన్నాయి గానీ ప్రజల సొమ్ముతో వ్యక్తిగత మొక్కుల్ని చెల్లించే సాంప్రదాయం దేశంలో ఎక్కడా లేకపోగా అదేదో ముఖ్యమంత్రి పదవికే విశ్వాసాలుంటాయనేలా వ్యవహరించడం విడ్డూరమే! దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా వ్యక్తిగతంగా మొక్కుకున్న దానికి మొక్కు చెల్లింపునకు వ్యక్తిగత ఖాతాలోనుంచైనా ఖర్చును భరించిన సందర్భాలున్నాయేమో లేదా ఆయన ప్రాతినిధ్యం వహించే పార్టీనుంచైనా సొమ్మును మొక్కుల రూపంలో తీర్చుకున్నారేమో కానీ ఏకంగా పది కోట్ల రూపాయలను కేటాయిస్తూ జి.ఓ. వెలువరించడమనేది దేశంలోనే భహుశా ప్రథమం అయివుంటది. దేశ రాజ్యాంగ పీఠికలో చెప్పబడిన మౌలికాంశమైన లౌకిక తత్వానికి ఈ వ్యవహార శైలి పూర్తిగా విరుద్ధమైనది. ఏ వ్యక్తి తన వ్యక్తిగత విశ్వాసాన్ని పదవికో, రాజ్యాంగ బాధ్యతకో ఆపాదించి ప్రజల సొమ్మును ఇష్టానుసారంగా ఖర్చు చేయడం దుబారా, దుర్వినియోగం మాత్రమే కాకుండా అక్రమము, రాజ్యాంగ విరుద్ధము కూడా.

ముఖ్యమంత్రి అధికార నివాసానికి వాస్తు దోషాలున్నాయని ఉన్న కట్టడాన్ని కూల్చివేసి మరో నిర్మాణం చేపట్టినా, అధికారిక కార్యాలయమైన సచివాలయానికి వాస్తు భయంతో రాకపోవడం రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాయడమే. రాజ్యాంగంలో పొందుపరచబడిన 51ఎ (హెచ్) ఆర్టికల్ ననుసరించి ప్రతి పౌరునికి శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చాలి కానీ పాలకులు తామే వ్యక్తిగతంగా గుడ్డి నమ్మకాల ఊబిలో కొట్టుమిట్టాడడమే కాకుండా పదవికీ ఆపాదించడం ప్రమాదకరం.

తెలంగాణ ఉద్యమ సందర్భంలో రాష్ట్రం సిద్ధిస్తే బంగారు ఆభరణాలు సమర్పిస్తానని మొక్కుకున్నానని ముఖ్యమంత్రి గారు ఇప్పుడు కోట్ల రూపాయల ప్రజల సొమ్మును స్వర్ణ కిరీటాలు, బంగారు మీసాలు, ముక్కుపుడకల సమర్పన పేరుతో అదేదో వ్యక్తిగత, కుటుంబ టూర్‌లకు వెళ్లినట్టు ప్రత్యేక విమానాల్లో తీర్థయాత్రలు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చీరాగానే ఆయుత ఛండీ మహాయాగం పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఇది అధికారిక యజ్ఞం కాదని పైకి చెప్పినప్పటికీ అధికార యంత్రాంగమంతా దగ్గరుండీ ఈ తతంగాన్ని జరిపించింది. అలా అది కూడా అధికార యంత్రాంగాన్ని రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దుర్వినియోగ పర్చారు. భద్రకాళి దేవాలయంలో 3.5 కోట్ల విలువచేసే బంగారు కిరీటం, తిరుపతి వేంకటేశ్వరునికి 14.12 బరువు తూగే ఆభరణం, 4.9 కేజీల హారం, 12.5 గ్రాముల ముక్కుపుడక మొత్తం 5.40 కోట్లు వెచ్చించారు. అన్ని చోట్ల కలిపి 10 కోట్ల రూపాయల విలువైన స్వర్ణాభరణాలు సమర్పించి రాష్ట్రం సల్లగుండాలని మొక్కుకున్నానని 'సమర్పిస్తే' గాని ప్రజలు సల్లగుండరని చెప్పకనే చెపుతున్నారు.

ఎవరన్నా ఈ వ్యవహారాన్ని లౌకిక విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శిస్తే వారంతా 'సన్నాసు'లని తిట్ల దండకం అందుకుంటున్నారు ముఖ్యమంత్రి గారు. ప్రజల త్యాగాలు, పోరాటాలకంటే అమ్మవార్ల, అయ్యవార్ల అనుగ్రహంవల్లనే తెలంగాణ వచ్చిందని ప్రచారం చేస్తూ వాస్తవ చరిత్రను వక్రీకరించి, ప్రజాపోరాటాన్ని పలుచన చేసే ప్రయత్నం చేస్తున్నాడు.

పుష్కరాలకు పుష్కలంగా డబ్బులుంటాయి గానీ వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంటుకు, స్కాలర్‌షిప్‌లకు ఏండ్లకు ఏండ్లు ఎదురుచూడాలె. అసలు మొత్తంగా మత సంబంధ పండుగలు, ఉత్సవాలకు ప్రభుత్వం ఎటువంటి ప్రజా సొమ్మును వినియోగించరాదు. ప్రజలు వారి వారి వ్యక్తిగత విశ్వాసాలకు తగినట్టుగా వ్యవహరించగలిగే సామాజిక వాతావరణాన్ని మాత్రమే కల్పించాలి తప్ప తన వ్యక్తిగత నమ్మకాలు, మూఢ నమ్మకాలను పాలనా సంబంధ అంశంగా మార్చే అధికారం ఏ పాలకుడికి లేదు. ఇలా చేసుకుంటూ పోతే పాలకులకు వ్యక్తిగతంగా ప్రీతి పాత్రమైన వాటికే ప్రజల సొమ్మును వెచ్చించాల్సి ఉంటుంది.

ఇవన్నీ ప్రజల 'మనోభావాల'ను ఓట్ల రూపంలోకి మార్చుకునే ఎత్తుగడయే కాకుండా ప్రజల ఇక్కట్లకు పరిష్కారం చూపే కర్తవ్యాన్ని విస్మరించి ప్రజలను విధి వాదంలోకి విసిరేసి దోపిడీని నిరంతరాయంగా కొనసాగించే తాత్విక దుర్మార్గం మాత్రమే. పరిణామ క్రమంలో ప్రజల్లో పేరుకుని పోయిన అనేక అంధ విశ్వాసాలకు, అనాగరిక ఆచారాలకు ప్రత్యామ్నాయంగా సృజనాత్మకమైన, విజ్ఞాన దాయకమైన పరిష్కారాలను అందించాల్సిందిపోయి వారిని మరింత చీకట్లోకి నెట్టివేసి వ్యవస్థ యథాతథ స్థితిని స్థిరపరిచే ప్రయత్నం బహుజన శ్రమ జీవులను మరింత దోచుకునేందుకే తప్ప మరేమి కాదు. ప్రజా ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చాలే కాని వ్యక్తిగత మొక్కుల్ని తీర్చుకోవడం ప్రజా ఉద్యమ లక్ష్యాన్ని నెరవేర్చుతున్నట్లు కాదు. మనోభావాల మేలిముసుగేసి దోపిడీ, అణిచివేతను కొనసాగించే రాజ్య దుర్మార్గాన్ని ఎదురించేది ప్రగతిశీల ఉద్యమాలే తప్ప ఈ పార్టీలేవి ప్రత్యామ్నాయాలు కాలేవు. వీ

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు)

కృష్ణా నదీ జలాలు - పాలమూరు వాటా

***మహబూబ్‌నగర్‌లో చేపడుతున్న సాగునీటి పథకాలు ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా పాలకుల ఇష్టానుసారం నిర్మిస్తున్నారని, ప్రజలు పోరాడి సాధించుకున్న సాగునీటి పథకాల్ని కాపాడుకోవాలని అంటున్నారు* ఎం. రాఘవాచారి**

తెలంగాణ రాష్ట్రంలో ఆదిలాబాద్ తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కువ నదులున్నాయి. ఆదిలాబాద్ గోదావరి తీరాన, మహబూబ్‌నగర్ కృష్ణా తీరాన సాగునీటికి కటకట పడుతున్నాయి. తాగునీరూ దినగండంగానే ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణానది భీమా, తుంగభద్ర నదులను అనేక వాగులు, వంకలను కలుపుకొంటూ దాదాపు 300 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. తెలంగాణ జిల్లాలలో అత్యంత పెద్ద జిల్లా, సాగుయోగ్యమైన భూములలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పెద్ద జిల్లా ఎందుకు సాగు, తాగునీటి కటకట అనుభవిస్తున్నది? నదులుండి, నదులలో నీరు పారుతుండి ఈ కటకట ఎందుకు? తరాలుగా మహబూబ్‌నగర్ ప్రజలు పాలకులతో తలపడుతూనే ఉన్నారు. ప్రశ్నలు మారలేదు, ఫలితాలు మారలేదు. పూటకోమాటతో వికృత సమాధానాలు ప్రజల ముందుకు వస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా, రాష్ట్ర విభజన జరిగి కొత్త రాష్ట్రం – కొత్త ప్రభుత్వం ఏర్పడినా ప్రజల పట్ల కన్‌సర్న్‌లో మార్పు రాలేదు. అయితే మనుపటికన్నా ఎక్కువగా మహబూబ్‌నగర్‌లో ఏదో అద్భుతం జరుగుతోందని ప్రభుత్వ ప్రేరేపిత చర్చ జరుగుతోంది. వాస్తవాలను మరుగుపరిచే, భ్రమలు రేకెత్తించే చర్చ జరుగుతోంది. పైస్థాయి జోక్యంతో పత్రికలు, టివి ఛానళ్లు పూర్తి స్థాయిలోను, స్థానిక మీడియా పాక్షికంగాను ప్రభుత్వానికి, అధికార పార్టీకి వంత పాడుతున్నాయి. వాస్తవం పాలెంతో, భ్రమ ఎంతో, అసత్యమెంతో కొంత లోతుగానే చూడాల్సి ఉంటుంది.

మహబూబ్‌నగర్ జిల్లాలో (1) ఆర్‌డిఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీం) (2) జూరాల (3) కోయల్ సాగర్ (4) భీమా (5) నెట్టెంపాడు (6) కల్వకుర్తి పథకాలున్నాయి. ఆర్‌డిఎస్, జూరాల కాలువలతో గ్రావిటీ పద్ధతిలో నీరందే పథకాలు కాగా, తక్కినవి ఎత్తిపోతల పథకాలు. మహబూబ్‌నగర్ భౌగోళిక స్వరూపం సహజంగా పడమర నుండి తూర్పువైపు వాలి ఉండడమే కాక ఉత్తరం నుండి దక్షిణానికి వాయవ్యం నుండి ఆగ్నేయానికి వాలి ఉంది. జిల్లాలో షాద్‌నగర్ అత్యంత ఎత్తయిన ప్రాంతం కాగా, తూర్పున నల్లమల అడవులలో అమ్రాబాద్ – అప్పర్‌ప్లాట్ ప్రాంతం ఎత్తైంది. మూసీ నది నుండి దక్షిణానికి ప్రయానిస్తూ వస్తే దుందుభి, కోయిల్‌సాగర్, ఊకశెట్టివాగు, కృష్ణ, తుంగభద్ర మొదలైన వ్యాలీల మధ్య విస్తారమైన సాగుయోగ్యమైన భూములు ఎడారిలోకి మారుతూ మనకు కనిపిస్తాయి. కాకరవాణి ప్రాజెక్టు నుండి కాగ్నా పడమరకు ప్రయాణిస్తూ భీమా నదిలో కలుస్తుంది. భీమా నది ఉత్తరం నుండి దక్షిణానికి ప్రవహిస్తూ కృష్ణ మండలంలో తంగిడి గ్రామం దగ్గర కృష్ణా నదిలో కలుస్తుంది. భీమా నదిని కలుపుకొని కృష్ణానది కృష్ణ గ్రామంలో మహబూబ్‌నగర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. కృష్ణానదికి కుడివైపు నుండి తుంగభద్ర కలిసి ప్రవహిస్తూ వచ్చి బీచుపల్లి, నిజాంకొండ దాటిన తర్వాత అలంపురం దగ్గరలో కూడెల్లి గ్రామ సమీపాన కృష్టానదిలో కలుస్తుంది. కృష్ణా, తుంగభద్ర నదుల నడిమి ప్రాంతాన్ని నడిగడ్డ అని, దో–ఆబ్ అని ప్రజలు పిలుచుకుంటారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నానాటికీ తీవ్రమవుతున్న వర్షాభావ పరిస్థితుల్ని, మొత్తంగా పర్యావరణ పరిస్థితుల్ని పరిశీలిస్తున్న నిపుణులు ఇక్కడ నేలలు ఎడారీకరణ చెందుతున్నాయని, ఇది వర్షచ్ఛాయా ప్రాంతమని ప్రత్యేక పథకాలు, చర్యలు అవసరమని ప్రకటిస్తున్నారు. ఇవేవీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదు. ఇది కొనసాగుతున్న చరిత్ర. కేంద్ర పర్యావరణ పరిరక్షణ సంస్థ 2015లో కూడా ఇదే విషయం చెబుతూ ఒక నివేదిక ఇచ్చింది. ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి జిల్లా ప్రజలు, రైతాంగం నిరంతరం జరిపిన ఆందోళనలు, చేసిన త్యాగాలే పైన ప్రస్తావించిన సాగునీటి పథకాలను సాధించుకున్నాయి. ఒక్కొక్క పథకం సాధించుకోవడానికి ఈ మూడు దశాబ్దాలుగా జరిగిన కృషిని ఒక్కొక్క పుస్తకమే రాయవలసి ఉంటుంది.

రాజోలిబండ మళ్లింపు పథకం జిల్లాలో మొదటి పథకం. 1940లలో ఏర్పడిన కరువు పరిస్థితులు, పొరుగున కె.సి. కాలువ అనుభవాలు, నడిగడ్డ రైతాంగం గద్వాలకు పన్నులు కట్టలేని దీనస్థితి హైదరాబాద్, మైసూరు రాజ్యాల మధ్య తుంగభద్ర నది నీటి వినియోగ ఒప్పందాలకు కారణమైనాయి. 1947 జూలైలో లెవీ చెల్లించలేక వాయిదా వేయమని కోరిన రైతాంగంపై గద్వాల సంస్థానం కాల్పులు జరిపి 5 మందిని పొట్టన పెట్టుకున్నది. దాదాపు నాలుగు వందల మందిమీద కేసులు నమోదు చేసి గుల్బర్గ జైలుకు పంపింది. బెయిళ్లు రాకుండా చూసింది. వట్టికోట ఆళ్వారుస్వామి బృందం ఈ పరిస్థితిపై నిజ నిర్ధారణ చేసింది. ఈ పరిణామాలలోనే రాజోలిబండ మళ్లింపు పథకం నిర్మాణ పనులు మొదలైనాయి. పథకం పూర్తయ్యే నాటికి గద్వాల సంస్థానం పోయింది. హైదరాబాద్ దేశ ప్రతిపత్తి పోయింది. హైదరాబాద్ రాష్ట్రం పోయింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడడంతో హైదరాబాద్ రాజ్యంలో ప్రతిపాదనకు వచ్చిన అప్పర్‌కృష్ణ, భీమా ప్రాజెక్టుల ప్రతిపాదనలు మురిగిపోయాయి. తుంగభద్ర కాలువ కూడా రాయచూరు హద్దులలో ఆగిపోయింది. దీనితో ఒక్క నడిగడ్డ ప్రాంతమే కాక, మొత్తం మహబూబ్‌నగర్ జిల్లా వర్షాభావ ప్రాంతంగానే కాక, సాగునీటి పథకాలకు 'అభావ' ప్రాంతంగా, వదిలేసిన ప్రాంతంగా మిగిలిపోయింది. హైదరాబాద్ నుండి కర్ణాటకలో కలిపిన ప్రాంతాలకి ప్రత్యేక రక్షణలున్నాయి. కానీ మైసూరు నుండి లేక కర్ణాటక నుండి ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ప్రాంతాలకు ఏ రక్షణలు లేకుండా పోయాయి. ఇది ఎంతదాక పోయిందంటే పాలకులు ఆర్‌డిఎస్‌ను ధ్వంసం చేశారు. 87 వేల 500 ఎకరాలకు అందవలసిన నీరు 20 వేల ఎకరాలకు కూడా అందడం లేదు. కట్ట పూడిపోయింది. కాలువ శిథిలమైంది. కె.సి. కాలువకు నీరు మలిపే సుంకేశులను అన్ని ప్రభుత్వాలు తలకెత్తుకుని నూతనంగా నిర్మించాయి. ఆర్‌డిఎస్ విషయంలో అనేక కమిటీలు వేస్తూ పోయాయి. నిర్వహణను దెబ్బతీశాయి. కర్ణాటక, ఆంధ్ర (రాయలసీమ), తెలంగాణ (మహబూబ్‌నగర్) రైతాంగం మధ్య తీవ్ర వివాదంగా

మార్చాయి. హింసకు, దాడికి పాల్పడి జిల్లా రైతాంగం సాగు పరిస్థితుల నుంచి పారిపోయే పరిస్థితులు కల్పించాయి. సమస్యను సవ్యంగా, న్యాయంగా పరిష్కరించలేక, కనీసం న్యాయమేమిటో చర్చ కూడా చేయకుండా జూరాల నుండి ఆర్‌డిఎస్ లింక్ కాలువలను ప్రతిపాదించి నిర్మించాయి. కానీ నీళ్లిచ్చిందే లేదు. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఈ ధ్వంస రచనలో పోటీ పడ్డాయి. జిల్లాలో ఇప్పుడు అధికార, విపక్షాలలోని ఆరితేరిన నేతలు ఈ పనిలోనే తలమునకలయ్యారు. నాలుగేండ్ల అధికార కాలం గడిచిన తర్వాత తొలి తెలంగాణ ప్రభుత్వం 15.9 టిఎంసిల ఆర్‌డిఎస్ నీటి వాటాలో 6 టిఎంసిల నీరు పారించడానికి తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం చేపట్టింది. కానీ పొరుగు రాష్ట్రంతో మాట్లాడి జస్టిస్ ఆర్‌డిఎస్ బచావత్ ఉత్తర్వుల అమలు సాధించి తెలంగాణ సరిహద్దు దగ్గర లెక్క ప్రకారమే 700 క్యూ సెక్కుల నీరు కాలువలోకి రాగలిగే వ్యవస్థను ఏర్పరచి ఉంటే, ఆర్‌డిఎస్‌ను ఆధునీకరించి ఉంటే ఆర్‌డిఎస్ యథాతథంగా జిల్లా రైతాంగానికి దక్కి ఉండేది కదా? ఈ పని చేయలేదని, కనీసం పట్టించుకోలేదని మేం ఆరోపిస్తున్నాం.

జూరాల ప్రాజెక్టుదీ ప్రత్యేకమైన చరిత్రే. జస్టిస్ బచావత్ ప్రాజెక్టుల వారీగా నీళ్లు పంచుతూ పోయారు. మహబూబ్‌నగర్‌లో ఆర్‌డిఎస్ తప్ప, చిన్నపాటి కోయిల్ సాగర్ తప్ప ఆనాటికి మరో ప్రాజెక్టు లేదు. అప్పర్‌కృష్ణ, భీమా చేపట్టకపోవడాన్ని పరిశీలించిన బచావత్ జూరాల పేరున 17.84 టిఎంసి నీరు కేటాయించారు. అదేమి లెక్కో తెలియదు. మిగిలిన నీరు సర్దుబాటు చేశారేమో. సూటిగా చెప్పాలంటే జిల్లా నేతలు ఆనాడు కృష్ణ నీటిలో న్యాయమైన వాటా కేటాయింపులు కావాలని కోరలేదు. చాలా పరిమితంగా సాగ పుల్లారెడ్డి జూరాల కోసం ప్రయత్నం చేశారు. 1969 ఏప్రిల్ 10న ప్రారంభమైన బచావత్ ట్రిబ్యునల్ తొలి తీర్పు 1973 డిసెంబర్ 24న విడుదల చేసింది. తుది తీర్పు 1976లో విడుదలైంది. అయినా 1981 జనవరి దాకా జూరాల ప్రాజెక్టు పనులు ప్రారంభించలేదు. సాంకేతిక జ్ఞానం అరకొరగా అందుబాటులో ఉండిన 1850లలో సర్ ఆర్థర్ కాటన్ నేతృత్వంలో ధవళేశ్వరం బ్యారేజి అయిదేండ్లలో పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరిచ్చారు. ఆ తర్వాత వంద ముప్పై ఏండ్లకు చేపట్టిన జూరాలను పూర్తిచేయడానికి కేవలం 1 లక్ష రెండు వేల ఎకరాలకు నీరిచ్చే ప్రాజెక్టు నిర్మాణానికి రెండు దశాబ్దాల కాలం తీసుకున్నారు. 17.84 టిఎంసిలకు గాను 9.6 టిఎంసిల నీరు నిలిపే ప్రాజెక్టు కట్టారు. డిస్ట్రిబ్యూటరీల వంటి ప్రధాన కాలువలు తవ్వారు. ఎడమ కాలువ దారిలో గోపల్‌దిన్నె రిజర్వాయర్ స్థాయి పెంచమని పోరాడి పోరాడి అలసి, విసిగి ధర్మారెడ్డి అనే ఇంజనీర్ తెలంగాణ ఉద్యమంలో చేరాడు. కాలికి బలపం కట్టుకుని తిరిగాడు. మరణించాడు. తెలంగాణ రాష్ట్రం వచ్చి నాలుగేండ్లు అయింది. అందరికందరూ గోపల్‌దిన్నె రిజర్వాయర్ మరిచిపోయారు. ఆర్‌డిఎస్ లింక్ కాలువ మరిచిపోయారు.

జూరాల కుడి ఎడమ కాలువల కింద చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు అనుభవిస్తున్న ఆందోళన నేతలకు చేరడమే లేదు. తుంగభద్ర మీద సుంకేశులను భారీగా నిర్మించి నదిని కాపాడడానికి వదిలిన 32వ గేటు కింది కొద్దిపాటి ఖాళీని కాంక్రీటుతో మూసేయడంతో అక్కడ తుంగభద్ర ఆగిపోయింది. ఆర్‌డిఎస్ అంతకు ముందే ఆగిపోయింది. జూరాల కుడి కాలువ ఆర్‌డిఎస్ లింకు దాకా రాకుండానే ఆగిపోతున్నది. ఈ అన్నింటివల్ల అక్కడ తాగునీటికే ప్రజలు తీవ్రంగా అలమటిస్తున్నారు. ఒక పరిష్కారంగా గత ప్రభుత్వాలే అలంపూర్ నియోజక వర్గంలో చేపట్టిన 3 చిన్న చిన్న ఎత్తిపోతల పథకాలు కాంట్రాక్టర్లకు, కమీషన్లకు అందివచ్చాయి కాని, అవి తెలంగాణ రాష్ట్రంలోను ప్రారంభానికి నోచుకోలేదు. రైతాంగం అవి దిష్టి బొమ్మల్లా ఉన్నాయంటున్నారు. అంతమాత్రమే కాక, తన కంపెనీలకోసమే బొగ్గు రైళ్లు ఏర్పాటు చేయించుకున్న టి.జి. శ్రీనివాస్ తన కంపెనీల నుంచి నదిలోకి, గాలిలోకి వదులుతున్న కాలుష్యం తమకు ప్రాణాంతకంగా పరిణమించిందని, కంపెనీ కాలుష్యానికి వ్యతిరేకంగా గ్రామాలలో వచ్చే కదలికలను టి.జి. శ్రీనివాస్ తన దళారీలతో నియంత్రిస్తున్నాడని అంటున్నారు. తెలంగాణ సాధించుకుంటే కాలుష్యం పీడ వదులుతుందని, కాలువ నీరు అందుతుందని అనుకున్నాం. రాలేదు. కాలుష్యం పెరిగిపోయింది. గాలిలో దుమ్ము, బొగ్గుపొడి కలిసిరావడం సహజం అని, పదకొండు నెలలు ఓపికపడితే వచ్చే తొలి వరదలకే నీటి కాలుష్యం కొట్టుకుపోతుందని ఆయన వెటకారం చేస్తున్నాడని అంటున్నారు. కాలువ నీరు రాకడ ఏమో కాని, కాలుష్యంతో ప్రాణాలు పోతున్నాయని, తమ ప్రాణాలకు లెక్కలేదని వాపోతున్నారు. ఇక మేం ఏమీ చేయలేం అన్నారు. ప్రజల ఆవేదన మాకు ప్రత్యక్ష అనుభవం.

నడిగడ్డలో కృష్ణా తీరాన ఒక ముఖ్యమైన ఎత్తిపోతల పథకం నెట్టెంపాడు. ఈ పథకంతో 22 టిఎంసిల వరద జలం లిఫ్టు చేయాలి. ఒక టిఎంసి పదివేల చొప్పున రెండు లక్షల 20 వేల ఎకరాల మెట్ట పంటలకు నీరివ్వాలన్నది లక్ష్యం. దీనికి స్టేజ్ 1లో ధరూర్ మండలంలోని గుడ్డెందొడ్డి గ్రామం దగ్గర, స్టేజ్ 2లో ర్యాలంపాడు గ్రామం దగ్గర ఎత్తిపోతల వ్యవస్థలున్నాయి. మొదటి స్టేజ్‌లో 120 రోజులు, రెండవ స్టేజ్‌లో 155 రోజులు ఎత్తి పోస్తేనే 22 టిఎంసిల నీరు తీసుకోవడం సాధ్యం. ఈ పథకంలో ముచ్చోనిపల్లి, తాటికుంట, నాగర్‌దొడ్డి రిజర్వాయర్లు దాదాపు 2013 నాటికే పూర్తయినాయి. కాలువలు డిస్ట్రిబ్యూటరీలు ఇతర నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. రైతులు బోర్లతో, మోటార్లతో, పైపు లైన్లతో నీరు పారించుకుంటున్నారు. ప్రభుత్వం నీటి పారుదలను కాలువల ద్వారా నిర్వహించడం లేదు. నెట్టెంపాడుకు సమాంతరంగా గట్టు మండలంలోని ఎత్తైన భూముల కోసం గట్టు హై లెవల్ కాలువ చేపట్టాలని చాలా కాలంగా కోరుతున్నాం. పనులిప్పుడు మొదలు కాబోతున్నాయి. ఈ పథకంలో అసలు సమస్య ఏమిటంటే జూరాలలో ఎక్కువ రోజులు నీరుండదు. కనుక వరద రోజుల్లో 35 రోజుల్లో నీరు తీసుకునే విధంగా ఈ పథకాన్ని అభివృద్ధి పరచాలి. గట్టు హైలెవల్ రిజర్వాయర్ నిర్మాణం చేసి నడిగడ్డకు సాగునీటి కొరత తీర్చాలి. ఈ నాలుగేండ్లలో ప్రభుత్వం ఒక్కసారి కూడా అవసరమైన సమీక్ష చేయలేదు. ప్లానింగ్ చేయలేదు.

కృష్ణా నదికి ఎడమ వైపున జూరాల నుండి చేపట్టిన మరొక ముఖ్యమైన ఎత్తిపోతల పథకం భీమా. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జస్టిస్ బచావత్ చేసిన నీటి కేటాయింపులు రాష్ట్రంలో తీవ్ర జల వివాదాలకు తెరతీశాయి. ఈ పరిస్థితులను నియంత్రించడానికి, కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడానికి రాజారావు కమిటీ వేశారు. ఈ కమిటీ రిపోర్టు మేరకు భీమా పేరున 20 టిఎంసిల నికర జలాలు సర్దుబాటు చేశారు. భీమా ప్రాజెక్టు నిర్మాణమై ఉంటే పూర్వ నారాయణపేట డివిజన్ ప్రాంతమంతా సాగునీరంది ఉండేది. నష్టం జరిగిందని పాలకులు దయతలిచారు. ఎవరూ అడగక పోయినా 'స్థానిక నేతలు' అంతర్గతంగా సర్దుబాట్లు చేసుకుని భీమాను ఫేజ్ 1, ఫేజ్ 2 పేరున రెండు భాగాలు చేశారు. ఫేజ్ 1 మఖ్తల్‌కి, ఫేజ్ 2 వనపర్తి ప్రాంతానికి. ఫేజ్ 2 దాదాపు జూరాల ఎడమ కాలువ వెంట కొల్లాపూర్ నియోజకవర్గం లోపలిదాకా 95 వేల ఎకరాలకు నీరివ్వాలని, అందుకు 9 టిఎంసిల నీరు తీసుకోవాలని, ఫేజ్ 1 మఖ్తల్ ప్రాంతంలో 11 టిఎంసిలతో లక్ష పదివేల ఎకరాలకు

నీరివ్వాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం, ఈ విభజన నారాయణపేట ప్రాంతానికి చాలా నష్టం చేశాయి. ఈ పథకంలో కూడా ఫేజ్ 1లో 100 రోజులు, ఫేజ్ 2లో 90 రోజులు పంపులు పనిచేయాలి. ఇవి నికర జలాలే అయినప్పటికీ 100 రోజులు పంపులు పనిచేయడానికి జూరాలలో అంతనీరుండదు. ఉన్న 5 లేక 6 టిఎంసిల నీరు జూరాల కాలువ కింది భూములకే చాలదు. కిందటేడాది ఫేజ్ 1లోని సంగంబండ రిజర్వాయర్‌లోకి పెద్దవాగు పారి చేరిన నీటిని జూరాలలోకి వదిలేసి జూరాల కాలువకింది భూములకో, తాగునీటికో ఉపయోగించారు. ఈ రెండు ఫేజ్‌లలోను పొలాలకు నీరు పారించగలిగిన నిర్వహణ వ్యవస్థలేవీ పూర్తి కాలేదు. భీమా ఫేజ్ 1లో స్టేజ్ 1 పంచదేవ్‌పాడు దగ్గర, స్టేజ్ 2 ఖానాపూర్ దగ్గర, ఫేజ్ 2లో స్టేజ్ 1 తిరుమలాయపల్లి దగ్గర. స్టేజ్ 2 కొత్తకోట దగ్గర ఉన్నాయి.

జస్టిస్ బచావత్ 1973లోనే కోయిల్ సాగర్‌కు నీరు కేటాయించారు. ఈ ఎత్తిపోతల పథకంలో స్టేజ్ 1 నాగిరెడ్డిపల్లి దగ్గర, స్టేజ్ 2 మరికల్ దగ్గర ఉన్నాయి. 4.5 టిఎంసిల నీటిని ఇక్కడ ఏర్పరచిన పంపులు రెండూ పనిచేస్తే 90 రోజులలో, ఒక్కటే పనిచేస్తే 170 రోజులలో లిఫ్టు చేస్తాయి. 45 వేల ఎకరాల ఆరుతడి పంటలకు నీరిస్తారు. అయితే అన్ని రోజులు నీరు అందడమే పెద్ద సమస్య.

ఆర్‌డిఎస్, జూరాల కుడి కాలువ, నెట్టెంపాడు, గట్టు హైలెవల్ రిజర్వాయర్, తుమ్మిళ్ల ఈ పథకాలు పూర్తిస్థాయిలో పూర్తయి అందుబాటులోకి వస్తే సరిగా, సమర్థవంతంగా నీరు అందించగలిగితే గద్వాల, అలంపూరు నియోజకవర్గ భూములకు నీరందుతుంది. అలాగే జూరాల ఎడమ కాలువ, భీమా ఫేజ్ 1, భీమా ఫేజ్ 2, కోయిల్ సాగర్ పథకాలు కూడా పూర్తయితే, నీటి నిర్వహణ సమర్థవంతంగా జరిగితే మఖ్తల్, దేవరకదిర నియోజకవర్గాలలో పాక్షికంగా వనపర్తి, కొల్లాపూర్ నియోజక వర్గాలలో ఒక మేరకు నీరందుతుంది. ఈ అన్ని కలిపి కూడా ఆరు నియోజకవర్గాల పరిధి దాటవు.

ఈ పథకాలతో పాటుగా శ్రీశైలం ఆధారంగా చేపట్టిన ఒక ముఖ్య పథకం కల్వకుర్తి ఎత్తిపోతల. ఈ పథకాన్ని ఆనాడు 50 వేల ఎకరాలతో చేపడతామన్నారు. అనేక ప్రతిఘటనల మీద 25 టిఎంసిల స్థాయికి 2.5 లక్షల ఎకరాలకు నీరివ్వడానికి చేపట్టారు. ఎలిమినేటి మాధవరెడ్డి పథకం లాగా కనీసం 30 టిఎంసిలతో చేపట్టవచ్చు కదా అంటే అవి ఎస్ఎల్‌బిసి నికర జలాలన్నారు. ఎస్ఎల్‌బిసి కూడా చేపడుతున్నారు కదా అంటే అప్పుడు ఎలిమినేటి మాధవరెడ్డి పథకం నీరు అదనమే కదా అంటే దేవరకొండ మునుగోడు వంటి ఫ్లోరైడ్ ప్రాంతాల నీటి అవసరాలుంటాయి అన్నారు. ఎంత వత్తిడి పెట్టినా అంతే అన్నారు. అంతటితోనే ఈ పథకం మొదలైంది. అప్పుడు కొల్లాపూర్‌కి 50 వేలు, అచ్చంపేటకి 72 వేలు, నాగర్‌కర్నూల్‌కి 83 వేలు, వనపర్తికి 7 వేలు, జడ్చర్లకి 11500, కల్వకుర్తికి 26,500 ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించారు. కాలువలు తవ్వతుంటే రైతుల నుండి పెరుగుతూ వచ్చిన వత్తిడులతో, పోరాటాలతో మొత్తం ఆయనకట్టును 3.40 లక్షల ఎకరాలకి పెంచి నియోజకవర్గాల మధ్య మరోసారి సర్దుబాట్లు చేసుకున్నాయి. ఈ సర్దుబాట్లలో అచ్చంపేట ఏకంగా 25 వేల ఎకరాల ఆయకట్టు తగ్గించారు. జడ్చర్ల 2650 ఎకరాలు తగ్గించారు. అచ్చంపేట నాయకులు అడగడం లేదని ఆ ప్రజలకు నష్టం చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత తొలి ప్రభుత్వం మరోసారి ఆయకట్టు పెంచింది. పెంచిన ఆయకట్టు వనపర్తి నియోజకవర్గంలో చేర్చారు. ఇప్పుడు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలి. ఆయకట్టు పెంచినా, తీసుకునే వరదనీటి పరిమాణం 40 టిఎంసిలకి పెంచినా నీరు ఎత్తిపోసే పంపుల వ్యవస్థ 25 టింఎంసిలకు లోబడే ఉంది. ఇతర నిర్మాణాల పరిస్థితి అదే. పంపులు అన్నీ నిర్విరామంగా పనిచేస్తే కనీసం వంద రోజులు అవసరం. 40 టిఎంసిల కోసం 180 రోజులు కావాలి. ఎత్తిన నీరు పోయడానికి ఒక్కటంటే ఒక్క రిజర్వాయర్ కూడా నిర్మించలేదు. చెల్లిపోయిన గత ప్రభుత్వాల మీద విమర్శతోనే నాలుగేండ్లు ముగిసిపోయాయి. ఒకటి కాదు రెండు కాదు 80 రిజర్వాయర్ల నిర్మాణానికి సర్వేలు జరుగుతూ ఉన్నాయట. ఎప్పటికి పనుల దశకు వస్తాయో తెలియదు.

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం చర్చ తొలినాళ్ల నుండి అప్పర్‌ప్లాట్ నీటికై ఆందోళనలున్నాయి. అచ్చంపేట నియోజకవర్గానికి నీటి వాటా తగ్గించడంలో, ఇతర చోట్లకి నీరు మళ్లించడంలో తెరాస పార్టీ, తొలి తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను మించిపోయింది. అమ్రాబాద్ ప్రాంతానికి నీటి మాట వచ్చినప్పుడల్లా అవివేకమైన ప్రతిపాదనలు ముందరపెడుతున్నారు. దారవాగు, మానువద్దవాగు పథకాల పేరిట అమలుకు నోచుకోకుండా కొనసాగుతూ వచ్చిన చర్చకు అమ్రాబాద్ ఎత్తిపోతల పథకాన్ని జోడించారు తప్పితే చిన్న పనీ చేయలేదు. పుల్జాల నుండి ఒక కిలోమీటరు కాలువ తవ్వితే కల్వకుర్తి పథకం నీళ్లతో చంద్రసాగర్ నింపి అమ్రాబాద్ ఎత్తిపోతల చిత్తశుద్ధితో చేపడితే ఆరు నెలల్లో అప్పర్‌ప్లాట్‌కు నీరివ్వవచ్చు. జనాభా తగ్గిపోతున్నదని, మంచి తాగునీరు లేదని, మరణం అంచున ఉన్నారని గుర్తించిన చెంచులను కనీస బతుకులోకి తీసుకురావచ్చు. ఈ పని చేయాలని ప్రభుత్వానికి లేదు. సాధించాలని స్థానిక పాలకులకు లేదు. అందుబాటులో ఉన్న నీటిని డిండిలోకి మరో చోటికి మలుపుతూ ఆదివాసులను వంచిస్తున్నారు. అదే వాగ్దానాన్ని మరో ఎన్నికల కోసం మిగిలించుకుంటున్నారు. ఉమ్మడి పాలనలో మనుగడ ప్రశ్నార్థకమైందని తెలంగాణ పోరాటంలో చెంచులు సాహసంగా పాల్గొన్నారని, చెంచు మహిళలు అడవి అంతా నడిచివచ్చి తమ పసిపిల్లలతో పాటు 24 గంటల చొప్పున వంతుల వారీగా కఠోర నిరసన దీక్షలు చేశారని ప్రభుత్వానికి, పాలకులకు గుర్తు చేయడం తప్పుకాదనుకుంటాను. చెంచులను ఒక పద్ధతి ప్రకారం వంచించడమే కాకుండా ఉద్యమాలు జరగకుండా ఒక నియంత్రణను ప్రయోగిస్తున్నారు.

పైన వివరించిన ఎత్తిపోతల పథకాల పనుల ప్రారంభం వెనుక సుదీర్ఘ చరిత్ర ఉంది. జిల్లా ప్రజల ఆందోళనలున్నాయి. రైతాంగ పోరాటాలున్నాయి. వలసలు, వలస మరణాలు, ఆత్మహత్యలు, ఆకలి చావులు ఒక తీవ్ర సంక్షోభం పాలకుల్ని వెంటాడింది. బావులు, బోర్లు ఎండి జిల్లా అంతటా డార్క్ ఏరియాలు, సెమీడార్క్ ఏరియాలుగా, గ్రే ఏరియాలుగా భూమిని ప్రకటించి, నిట్టనిలువునా పెద్ద పెద్ద చెట్లు ఎండిపోతుంటే, పక్షులు నేలరాలి ప్రాణాలు వదులుతుంటే పాలకులు దిక్కుతోచని స్థితికి నెట్టబడ్డారు. నల్లమల విప్లవోద్యమం రైతాంగానికి బాసటగా నిలిచింది. ఆ పోరాటాలను పాలకులు ఎన్‌కౌంటర్లతో అణచివేశారు. అయినా కరువు వ్యతిరేక, వలసల వ్యతిరేక, అసహజ మరణాల వ్యతిరేక పోరాటాలు, జల సాధన ఉద్యమాన్ని తీవ్రతరం చేశాయి. 1990 తొలి సంవత్సరాలలో అన్ని సంఘాలతో కలిసి జల సాధన సమన్వయ సమితి ఏర్పడింది. నిలదీసింది. 1995లో అధికారం చేపట్టిన నందమూరి తారక రామారావును మలిదశ తెలంగాణ ఉద్యమం చేస్తామని కృష్ణా జలాలలో న్యాయమైన వాటా సాధిస్తామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పరుచుకుంటామని హెచ్చరించింది. ఇవాళ పాలకులు పాలమూరును దురదృష్టం వెంటాడింది అంటున్నారు కానీ, ఆ దురదృష్టం పాలకులు సృష్టించింది. హామీలు, చెట్లు నాటడాలు, శంకుస్థాపనలతో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు 2005 దాకా ప్రజలతో ఆడుకున్నాయి. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం, గాలేరు – నగరి హంద్రీ–నివా పథకాలు,

పోతిరెడ్డిపాడు విస్తరణ కోసం చర్యలు చేపడుతూ అనివార్యంగా వై.ఎస్.ఆర్. ప్రభుత్వం ఈ పథకాలకు మరోసారి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించింది. జల యజ్ఞంలో భాగంగా అయిదు సంవత్సరాలలో పూర్తి చేయవలసిన ఈ పథకాలు తొమ్మిదేండ్ల తర్వాత మరికొన్ని పనులు మిగిలి తెరాస చేతికి దొరికాయి. కేంద్రీకరించి కృషి చేసి ఉంటే ఒక్క సంవత్సరంలో పూర్తి చేయగలిగిన పనులను నాలుగేండ్లయినా పూర్తి చేయడకపోవడం కూడా పాలమూరు జిల్లాను దురదృష్టం వెంటాడడమేనా? లేక గత పాలనా వారసత్వం కొనసాగడమా?

ఆంధ్ర పథకాలను 30 – 40 రోజులలో నీరు తీసుకునే విధంగా డిజైన్ చేసి మహబూబ్‌నగర్ పథకాలను 90 రోజుల నుండి 120 రోజులలో నీరు తీసుకునే విధంగా ఏ దురుద్దేశంతో డిజైన్ చేసి ఉంటారు. ఈ తప్పిదాన్ని ప్రజా సంఘాలు ప్రశ్నించినా ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఆర్‌డిఎస్ నీరు రావడమే లేదు. రానీయడం లేదు. నాలుగు ఎత్తిపోతల పథకాలలోని 12 పంపులు నిర్విరామంగా పనిచేస్తే 8615 క్యూ సెక్కుల నీరు ఒక రోజులో ఎత్తిపోయగలుగుతాయి. 12 వేల క్యూ సెక్కులు లిఫ్టుచేస్తే కానీ 1 టిఎంసి నీరు తీసుకున్నట్లవుతుంది. ఒక నిపుణుల కమిటీ వేసి ఈ పథకాల స్థాయిని, లోపాలోపాలను సరిదిద్దడానికి చేపట్టగల చర్యలపై ఒక నివేదిక రూపొందించి వరద కాలంలో 30 – 35 రోజులలో లక్ష క్యూ సెక్కులు అంతకు మించి జూరాల మీదుగా నీరు ప్రవహించే వరద రోజులు అలాగే 50 వేల క్యూ సెక్కులు ప్రవహించే వరద రోజులు 35 నుండి 50 గానే ఉంటున్నాయి. ఆ రోజులలో రోజుకు 24 వేల క్యూ సెక్కుల నీరు తీసుకునే విధానం రూపొందించాలంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వాలు ఆంధ్ర పాలకవర్గ బెడదవల్ల ఏమీ చేయలేకపోయాయి అని మాట్లాడుకున్నాం. ఇప్పుడేమయింది. తొలి తెలంగాణ ప్రభుత్వంలో, తెరాస పార్టీలో పాత నేతలు, పాత విధానాలు కొనసాగుతున్నందు వల్లనే ఇలా జరుగుతోందా అని ప్రశ్నించడం తప్పుదారి పట్టించడమే అవుతుందా? ఎవరు ప్రారంభించారు పనులు అనేది ముఖ్యం కాదని ఎవరు పూర్తి చేశారు పనులు అనేదే ముఖ్యమని భారీ నీటిపారుదల మంత్రి చెబుతున్నారు. అధికారులు చెబుతున్నారు. వాస్తవాలతో సంబంధం లేకుండా మీడియా రాతలు పెరిగిపోయాయి. ఈ ప్రచార హోరులో పనులు ఎట్లా జరుగుతున్నాయి అనే మౌలిక ప్రశ్నని మరుగున పడేస్తున్నారు.

తెలంగాణ ఉద్యమ కాలంలోను, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెరాస పార్టీ, తెలంగాణ ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్రమైన అన్యాయం చేసే రెండు ప్రతిపాదనలు ముందుకు తెచ్చింది. మేలు చేయగలిగే అంశాలుగా అప్పర్‌కృష్ణ నుండి గ్రావిటీతో నీటి సాధన, తుంగభద్ర ఎడమ కాలువను నడిగడ్డలోకి తీసుకురావడం అనే రెండు ప్రతిపాదనలు కూడా ముందుకు తెచ్చి అధికారం చేపట్టిన తరువాత వదిలేసింది. అన్యాయం చేసే రెండు ప్రతిపాదనల్లో ఒకటి జూరాల – పాకాల, రెండు డిండి ఎత్తిపోతల. ఈ రెండింటి రద్దుకోసం ప్రభుత్వంతో జిల్లా ప్రజలు తీవ్ర స్థాయిలో పోరాడవలసి వచ్చింది.

కొద్దిమంది ఇంజనీర్లు అనాలోచితంగా చేసిన జూరాల – పాకాల ప్రతిపాదనపై ఆర్. విద్యాసాగర్ రావుగారు నీళ్లు – నిజాలు వ్యాసం రాశారు. వనపర్తి సభలో కెసిఆర్ ఈ పథకాన్ని మహబూబ్‌నగర్‌కు బ్రహ్మాండంగా మేలు చేస్తుందని ప్రస్తావించారు. ఆంధ్రవాళ్లు పోతిరెడ్డిపాడుతో కృష్ణ నీరు మలిపినట్లుగా, సుంకేశులతో తుంగభద్ర నీరు మలిపినట్లు ఒక ఫ్లడ్ ఫ్లో కెనాల్‌తో జూరాల నుండి కృష్ణ నీరు తరలిస్తామన్నారు. 122 కిలోమీటర్ల టన్నెల్‌తో మిడ్ డిండి ప్రాజెక్టులోకి అంటే డిండికి దిగువన, ఎస్ఎల్‌బిసి టన్నెల్ సమీపంలోని లోయర్ డిండికి ఎగువన నిర్మించే ప్రాజెక్టులోకి తరలిస్తామన్నారు. డిండి దిగువకు పోయిన తర్వాత మహబూబ్‌నగర్‌కు ఏం ప్రయోజనమంటే జవాబులేదు. విద్యాసాగర్ రావుగారు ఇది అయ్యేది కాదన్నారు. అయితే ఎందుకు ప్రతిపాదించారంటే జవాబులేదు. అయినా ఆపినట్లే ఆపి తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సర్వే చేశారు. నిధుల దుర్వినియోగం తర్వాత ఈ పథకం దండగమారిదని అర్థమైంది. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు ఈ దండగమారి ప్రతిపాదన కాంగ్రెస్ నిర్వాకమని ప్రచారం సాగిస్తూ తమను బైటికి తెచ్చుకుంటున్నారు.

రెండో పథకం డిండి ఎత్తిపోతల. ఈ పథకాన్ని ఎస్ఎల్‌బిసి టన్నెల్ నుండి వెలువడే నీటితో ప్రతిపాదించారు. టన్నెల్ నుండి వెలువడిన నీరు మన్నెవారిపల్లి దగ్గర నిర్మించే లోయర్ డిండిలోకి చేరుతుంది. అటు నుండి మిడ్ డిండి అనబడే మరొక డిండి ప్రాజెక్టులోకి లిఫ్టు చేస్తారు. నిజానికి ఇది ప్రస్తుత డిండికి లోయర్ డిండికి మధ్యన ఉండదు. లోయర్ డిండికి సమీపంలో ఉంటుంది. జూరాల – పాకాల టన్నెల్ 122 కిలోమీర్ల దూరం తరువాత మిడ్ డిండిలోనే తెరుచుకుంటుంది. ఈ భారీ టన్నెల్ 23 వేల క్యూ సెక్కుల నీరు తరలించుకువస్తుంది. టన్నెల్ పూర్తయితే 122 కిలోమీటర్ల దూరం 15 మీటర్ల చుట్టు కొలతతో తవ్వే నీటి కాలువలు, దారి టన్నెల్స్ మట్టి మహబూబ్‌నగర్‌లో పోసి నీటిని మిడ్ డిండికి తరలిస్తాయి. ఈ మిడ్ డిండి నుండి నీటిని ప్రస్తుత డిండిలోకి లిఫ్టు చేస్తారు. ప్రస్తుత డిండి ఎత్తు, స్థాయి బాగా పెంచుతారు. జూరాల – పాకాలతో 70 టిఎంసిల, డిండి ఎత్తిపోతలతో 30 టిఎంసిల నీరు తరలించాలని చేసిన ప్రతిపాదనలను, వీటి మోసాన్ని విస్తృత ప్రచారంతో ఎదుర్కోవలసి వచ్చింది.

బ్రజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ కృష్ణ నీటిపై ఆధారపడే శాతం తగ్గించి బచావత్ ట్రిబ్యునల్ మిగులు జలాలుగా, వరద జలాలుగా భావించి దిగువ రాష్ట్రం వాడుకోవడానికి కల్పించిన వెసులుబాటును తొలగించి వరద జలాలు కూడా పంచేసింది. తొలి రిపోర్టు ప్రకారం జూరాలకు 9 టిఎంసిలు, శ్రీశైలానికి 30 టిఎంసిలు, నాగార్జున సాగర్‌కు క్యారీ ఓవర్ కింద 120 టిఎంసిలు పంచింది. గత పంపిణీ మేరకైనా కృష్ణానది నీటిలో సాగర్ ఎడమ కాలువ, ఎన్ఎల్‌బిసి, డిండి, మూసి పథకాలతో, ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతలతో తెలంగాణకు పంపిణీ జరిగి ఉన్న నీటిలో మైనర్ ఇరిగేషన్‌కు 89 టిఎంసిలు తెలంగాణ అంతటికి పోగా మిగిలిన 210 టిఎంసిలలో 170 టిఎంసిల దాకా నల్లగొండ జిల్లాకే కేటాయింపు జరిగి అనుభవంలో ఉన్నాయి. రంగారెడ్డికి వాన నీరే తప్ప, పారిస్తున్న కృష్ణనీరు లేదు. మిగిలిన 40 టిఎంసిలలో మూడు భాగాలకు మించి మహబూబ్‌నగర్ జిల్లాలో అనుభవానికి రాలేదు. ఈ వాస్తవ పరిస్థితులను పక్కకు నెట్టి, ఎగువ ప్రాంత రైతాంగానికి నష్టం చేస్తూ నీటిని దిగువకు తరలించే పథకాలు తెచ్చి ఎందుకు ఆడుకుంటున్నారో నిజాలు చెప్పే నిజాయితీ ప్రభుత్వానికి ఉందా? 12 గ్రామాలు ముంచే డిండి ఎత్తిపోతల పథకాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. డిండి ప్రాజెక్టులో మునిగి చెదిరి 70 ఏండ్ల కింద జీవం పోసుకున్న పల్లెలు మరోసారి మునిగిపోలేమని రోడ్లమీదకి రావడంతో తాత్కాలికంగా డిండి పథకం ఆగింది. అయితే ఇది మరో రూపంలో కోడెతాచులాగా పాలమూరు పథకంలో భాగమై వస్తున్నది. పాలమూరు – రంగారెడ్డి పథకపు ప్రాణం పిండేసే పథకంగా వస్తున్నది.

ఇలాంటి తప్పుడు పథకాలను, అన్యాయమైన పథకాలను ఏ దుష్ట శక్తులు ప్రభుత్వం ముందు పెడుతున్నాయో? లేక ప్రభుత్వమే ఉద్దేశ

పూర్వకంగా మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలను సాగునీటి పరంగా దెబ్బతీస్తున్నదా కారణాలు చాలా కఠినంగా కనిపిస్తున్నాయి. అమాయకంగానో, అతి తెలివితోనో నల్లగొండకు నీళ్లు వద్దా అని, ఫ్లోరైడ్ ప్రాంత దాహార్తి తీరకూడదా అని, నల్లగొండ కూడా తెలంగాణలోనే ఉంది కదా అని కొందరు వెటకారంగా మాట్లాడుతున్నారు. ఈ సమస్యను కూడా న్యాయాన్యాయ వివేచన కలిగిన విషయ పరిజ్ఞానం కలిగిన ఇంజనీర్లతో కమిటీ వేసి అధ్యయనం చేసి నిర్ణయించమని కోరుతున్నాం. తెలంగాణలో లేనిది లేక తెలంగాణలో ఒంటరిగా మిగిలింది మహబూబ్‌నగర్ జిల్లాయేనా అని అడుగుతున్నాం. పాలమూరు – రంగారెడ్డి పథకపు నీటిని మొదటి రిజర్వాయర్ నుండి నేరుగా డిండికి తరలిస్తే దారిలో దుందుభి నదిని దారి మళ్లించే ఉల్పర రిజర్వాయర్ నిర్మాణమైతే జరిగే నష్టం, పథకపు దారిలో గోకారం, ఇర్విన్ రిజర్వాయర్లతో, కాలువలతో జరిగే భూముల నష్టం, నీటి నష్టం రెండు జిల్లాల మధ్య రాజకీయ అశాంతికి దారితీస్తుందని అధికార పార్టీ జిల్లా నేతలు, మంత్రులు సంతకాలు చేసి ముఖ్యమంత్రికి రాసిన లేఖమీద తాను కూడా సంతకం చేసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నల్లగొండ కూడా తెలంగాణలో ఉన్నదని వ్యాసాలు రాస్తున్నాడు. తాను దారితప్పి రాఘవాచారి తప్పుదారి పట్టిస్తున్నాడని ఆరోపిస్తున్నాడు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మహబూబ్‌నగర్ చిలుకలతో ఇలాంటి పలుకులే పలికిస్తున్నాయి. ఈ పలుకులు వినిపిస్తుంటే పాలమూరు పథకాన్ని దిగువకు మార్చింది ఇందుకేనా అని అడగవలసి వస్తున్నది.

ఇక్కడ పాలమూరు – రంగారెడ్డి పథకాన్ని కూడా స్థూలంగా చర్చలోకి తీసుకోవాలి. ఈ ఎత్తిపోతల పథకం ప్రతిరోజు 2 టిఎంసిల నీటిని కృష్ణానది వరదెత్తినప్పుడు జూరాల నుండి తీసుకుని ఎగువ ప్రాంతంలోని 54 మండలాల రైతాంగానికి నీరివ్వాలని రిటైర్డ్ ఇంజనీర్లు ప్రతిపాదించారు. కృష్ణానది జలాల పునఃపంపిణీ చర్చలలో, ఆ ఉద్యమ నిర్మాణ ఆలోచనలలో ఈ పథకం రూపుదిద్దుకుంది. ఇది సాధించడానికి అనేక స్థాయిలలో, అనేక రూపాలలో సుదీర్ఘకాలం పోరాడవలసి వచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం వినిపించుకోలేదు, చర్చను కూడా ఊహలలోనే చిదిమేసే పనిచేసింది. రాజశేఖరరెడ్డి ప్రభుత్వానికి పోతిరెడ్డిపాడు దెబ్బతింటుందేమో శ్రీశైలానికి రాకముందే నీరు రంగారెడ్డి దాకా తరలించడం కుదరదనుకున్నారు. ప్రాణహిత – చేవెళ్ల రంగారెడ్డి దాకా వస్తుంది కదా అని దీని ముచ్చటే ఎత్తుకోలేదు. అయినా చర్చ, పోరాటాలు పెరిగి 2006లో పరిశీలనకు తీసుకుని 2009లో హామీ ఇచ్చాడు. చివరికి 2013 ఆగస్ట్ 8న కిరణ్ కుమార్‌రెడ్డి 72 జిఒతో ఈ పథకం సమగ్ర సర్వేకు నిధులు కేటాయించాడు. జూరాల వరద జలాలతో చేపట్టే ఈ పథకం పాత ఎత్తిపోతల పథకాలతో పోల్చినప్పుడు మూడు రెట్లు పెద్ద పథకం. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ ఈ మూడు జిల్లాల ఎగువ ప్రాంత రైతుల ప్రయోజనాలు దీనిలో ఉన్నాయి. అప్పట్లో పదివేల కోట్ల వ్యయం, పదిలక్షల ఎకరాల పారుదల అంచనా ఉండింది. పాలమూరులో ఏడు లక్షలు, రంగారెడ్డిలో రెండు లక్షల డెబ్బైవేలు, నల్లగొండలో 30 వేల ఎకరాలకు నీరందించాలనే లక్ష్యం ఉండింది.

ఈ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా జూరాల నుండి శ్రీశైలానికి మార్చింది. ఈ దెబ్బతో పథకం తలకిందులైంది. వరదనీటి పథకాన్ని నిలువ నీటి నెపంతో దిగువకు మార్చారు. వరద కాలంలో తొలి అడుగులో నీరు తీసుకునే లక్ష్యాన్ని దెబ్బతీశారు. దీనిని పోతిరెడ్డిపాడు నీటి తరలింపుకు పోటీ అన్నారు. కాని అలాంటి పోటీ సరైంది కాదు. ఈ పథకం పోతిరెడ్డిపాడుతో పోటీ పడలేదు. ఈ పథకంతో రోజుకు 2 టిఎంసిలు ఎత్తిపోసేలోపు పోతిరెడ్డిపాడు ద్వారా 5 నుండి 7 టిఎంసిల నీటిని ఆంధ్ర ప్రభుత్వం తరలిస్తుంది. తక్కువ వ్యయంతో పూర్తయ్యే పథకాన్ని దిగువకు దింపి వ్యయ అంచనాలు పెంచేశారు. నార్లాపూర్ 8.51, ఏదుల 6.09, వట్టెం 16.74 ఈ మూడు రిజర్వాయర్లను కల్వకుర్తి నీరందే ఆయకట్టు భూములలో నిర్మిస్తున్నారు. వీటిని కనెక్ట్ చేసే కాలువలు కూడా కల్వకుర్తి ఆయకట్టులోనివే. నీరందే ముందర మా నోళ్లలో మట్టికొట్టుడు ఎందుకు అని రైతులు అడిగే ప్రశ్నకు జవాబు లేదు.

తొలి ప్రతిపాదనలో 30 టిఎంసిలకు లోబడి ఉండిన తొలి రిజర్వాయర్‌ను ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా 70 టిఎంసిలకు పైబడి పెంచమన్నారు. ఒక్కసారే నీరు తోడిపోసుకుని ఇతర చోట్లకు పంపుకోవచ్చునన్నారు. ఇంజనీర్లు అట్లానే డిపిఆర్ సిద్ధపరిచారు. అంత భారీ ప్రాజెక్టును ప్రజలు ఊహించలేదు. నారాయణపేట ఎంఎల్ఎ ఏకంగా ఆత్మహత్య చేసుకుంటానని ప్రకటించాడు. ఏయే మతలబులు పనిచేశాయో కాని పాలమూరు పథకం దిగువకు పోయింది. ఆ ఎంఎల్ఎ తెరాసలోకి దిగిపోయాడు. ఏ ధీమాతో ప్రకటిస్తున్నారో గాని రానిస్తే, రప్పిస్తే చుట్టూ తిరిగి చివరికి అందిరాగల నీటిని మొదటనే అందిస్తామని ప్రకటిస్తున్నాడు. ప్రజలు అమాయకులనుకుంటున్నాడో ఏమో తాను తెరాసలో ఎందుకు స్థిరపడ్డాడో ప్రజలకు అర్థమైంది. ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన భారీ ప్రాజెక్టు ప్రతిపాదనను కూడా ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షులు పాత కాంగ్రెస్ ఖాతాలో వేసేశారు. కాంగ్రెస్ వాళ్లు తమ జోలె నిండుతున్నదని మురిసిపోతున్నారేమో...?

2015 జూన్ 6న ముఖ్యమంత్రి కరివెన వద్ద పాలమూరు – రంగారెడ్డి పథకానికి శంకుస్థాపన చేసినప్పటి నుండి అనేక వివాదాలు రగులుతున్నాయి. ఇదివరలో భీమా పథకాన్ని కోల్పోయినందువల్ల, విభజించినదువల్ల నష్టపోయిన నారాయణ డివిజన్ రైతాంగం జలసాధన పోరాటంలోకి దిగారు. లక్ష్మీదేవిపల్లి, ఉదండాపూర్ పనులే చేపట్టనందువల్ల, అంతారం ప్రాజెక్టు సర్వే దశలోనే ఆపినందువల్ల షాద్‌నగర్‌తో కలిసిన రంగారెడ్డి, కొడంగల్‌తో కలిసిన వికారాబాద్ జిల్లాల రైతాంగం తమ గతి ఏమిటి అంటున్నారు. కల్వకుర్తి ఆయకట్టు రైతులు మాకు అక్కరలేని పథకాన్ని మా నెత్తిన రుద్ది మా సాగుభూములు ముంచుడెందుకని నాగర్‌కర్నూల్ జిల్లా రైతులు అడుగుతున్నారు. ఈ ఈ ఆందోళన ఏదీ పట్టకుండా డిండి పథకాన్ని తెచ్చి దీనికి జోడించడంతో మనికొన్ని వేల ఎకరాలు మునిగే దుస్థితి దాపురించింది. ఇక్కడితో ఆగకుండా ప్రాణహిత చేవెళ్లను కాళేశ్వరంగా మార్చి తొలగించిన రంగారెడ్డి ఆయకట్టును దీనిలోకే చేర్చి ఈ ఆయకట్టు 12.30 లక్షల ఎకరాలకు పెంచారు. ఇంకోవైపు డిండికి రాచకొండ ఎత్తిపోతల చేర్చి ఆ పథకాన్ని 3 లక్షల 50 వేల ఎకరాల నుండి దాదాపు నాలుగున్నర లక్షల ఎకరాలకు పెంచారు. ఇంతనీరు కృష్ణాలో లేదు. లేని నీటిని ఎందుకు ప్రతిపాదిస్తున్నారు అంటే ప్రజలు సులభంగానే జవాబు చెబుతున్నారు. మరోసారి అధికారానికో కాక భారీగా పెంచిన వ్యయంలో భాగాల కోసమే అని. ఇది నిజమా కాదా అనే ప్రశ్నను కాసేపు పక్కనపెట్టి అసలు ప్రాజెక్టు పూర్తి చేయడానికే ఇదంతా చేస్తున్నారా అని అడగవలసి ఉండింది. మూడేండ్లలో 35 వేల కోట్లు వ్యయం చేసి పూర్తి చేస్తామన్న ప్రాజెక్టుకు మూడున్నర వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదు. ఎంత శాతం పనులు ముగిసినట్లు? ఇతర పనులు ఎప్పటికి ముగుస్తాయి?

ఈ పరిస్థితినంతటినీ మదింపు చేసి నార్లాపూర్ నుండి డిండికి రోజుకి అర టిఎంసి తరలించే ప్రతిపాదన మానుకోవాలని, నల్లగొండ నీటి అవసరాలు గోదావరి నీటితో తీర్చాలని, ఎస్ఎల్‌బిసి నీరు సంబంధిత కాలువలలో పారిస్తే ఎఎంఆర్ పథకం అదనంగా ఉంటుంది కనుక ఆ పథకంతో మునుగోడు, దేవరకొండ ప్రాంత అవసరాలు తీర్చవచ్చునని

యుజిసి రద్దు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌ను రద్దు చేయడం, విశ్వవిద్యాలయాల్లో రాజకీయ జోక్యం ఫెడరల్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని అంటున్నారు డా. ఎ. పున్నయ్య

మనదేశానికి స్వాతంత్ర్యం రాకముందే బ్రిటిష్ – ఇండియా ఆధ్వర్యంలో కేంద్రీయ విద్యాలయాలైన ఆలీఘర్ ముస్లీం విశ్వ విద్యాలయం, బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం, ఢిల్లీ విశ్వ విద్యాలయాల పర్యవేక్షణ కొరకు 1945లో విశ్వవిద్యాలయాల విరాళాల సంఘం (యుజిసి) ఏర్పడింది. స్వాతంత్ర్యానంతరం దీని పరిధి విస్తరించుకుంటూ భారత విశ్వ విద్యాలయాలన్నింటికి మార్గదర్శనం చేయాలని నిర్ణయించినారు. 1949లో యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతిపాదన మేరకు ఈ సంఘానికి సర్వేపల్లి రాధాకృష్ణగారిని అధ్యక్షులుగా నియమించారు. అతని ఆధ్వర్యంలో 1952లో భారత ప్రభుత్వం ఉన్నత విద్యను అందించే విద్యాలయాలకు అవసరమైన విరాళాలను అందించే ప్రతిపాదన జరిగింది. 1956 నవంబర్‌లో ఈ సంఘం బాధ్యతను మరింత వస్తృతపరిచారు. విశ్వ విద్యాలయాలకు, గుర్తింపు పొందిన కళాశాలలకు విరాళాలను సమకూరుస్తూ ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచుతూ, ప్రపంచ పోటీని తట్టుకునే విధంగా విద్యలో గుణాత్మక ప్రమాణాలను మెరుగుపరుస్తూ ఉన్నత విద్యను క్రమబద్ధీకరించే విశాల లక్ష్యాలతో విశ్వవిద్యాలయ విరాళాల కమిషన్‌ను చట్టబద్ధమైన సంస్థగా భారత పార్లమెంట్ ఆమోదించింది. ఆనాటి నుండి సంపూర్ణంగా ఉన్నత విద్యారంగ అభివృద్ధితో పాటు విస్తృతికి తీవ్రంగా ప్రయత్నిస్తుంది.

అనేక మార్పుల తర్వాత దాదాపు అయిదు దశాబ్దాల తర్వాత 1995లో యుజిసి పరిపాలన సౌకర్యం కోసం వికేంద్రీకరిస్తూ ప్రధాన కార్యాలయం ఢిల్లీతో పాటుగా కలకత్తా, బోపాల్, హైదరాబాద్, గౌహతి, బెంగళూరు, పుణేల్లో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పరచినారు.

2009లో మానవ వనరుల మంత్రిత్వ శాఖ మంత్రి కఫిల్ సిబాల్ యుజిసిని మూసివేసి ఉన్నత విద్య, పరిశోధన (ఎచ్ఇ, ఆర్) చట్టాన్ని

సూచించాము. ఇంజనీర్లు కూడా దీన్ని హర్షించారు. అయినా కుదరదు అంటే బ్రిటిష్ ట్రిబ్యునల్ నాగార్జున సాగర్‌కు 120 టిఎంసిల నీరు కేటాయించింది కనుక ఆ నీటితో సాగర్ ఆధారంగా మరో ఎత్తిపోతల పతకం చేపట్టుకోవచ్చునని సూచించాం. కొద్దిమంది ఇంజనీర్లు ప్రభుత్వానికి ఒక ప్రతిపాదనే ఇచ్చారు. ఇవేవీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల ప్రయోజనం రీత్యా పూర్వ పథకాన్ని దెబ్బతీసిన ఈ పరిస్థితులలో మధ్యే మార్గంగా పాలమూరు పథకాన్ని రెండు భాగాలుగా విభజించాలని, రెండవ భాగాన్ని కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగం చేసి 35 రోజులలో నీరు తీసుకోవాలని, దీనితో పాత మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల తూర్పు భాగానికి నీరివ్వాలని, మొదటి భాగాన్ని జూరాల నుండి సాధించుకున్న విధంగా చేపట్టి చిన్న రిజర్వాయర్లతో పూర్తి చేసి పాత మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల పడమటి భాగానికి నీరివ్వాలని డిమాండ్ చేస్తున్నాం. కృష్ణా నదిలో అందుబాటులో ఉన్న కొద్ది నీటిని కనీస భూమి ప్రాతిపదికన ప్రతి ఎకరాకు ఒక పంటకైనా అందించాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ ప్రతిపాదనను పరిశీలించకుండా ప్రభుత్వ పెద్దలు తోచింది మాట్లాడుతున్నారు. మేధావులు ప్రభుత్వాన్ని అర్థం చేసుకోవాలట. ప్రభుత్వం ప్రజలను పట్టించుకోదట. తెలంగాణ ప్రభుత్వం మేధావులంటే ప్రభుత్వానికి లోబడేవారు అని సరికొత్త అర్థం చెబుతున్నది.

మహబూబ్‌నగర్ సాగునీటి పథకాల విషయంలో పోరాడి సాధించుకున్న ప్రజలు ఏమంటున్నారో వినడానికి, పరిశీలించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఏకపక్షంగా ముఖ్యమంత్రి ఏం మాట్లాడుతున్నాడో భారీ నీటిపారుదల మంత్రి, ఇతర మంత్రులు, జిల్లా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు అదే మాట్లాడుతున్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్నామని ప్రకటించుకున్న పార్టీలు సాగునీటి ఎజెండా మీద నిలిచి పోరాడడం లేదు. అధికారానికి చేరువలో ఉన్నామని ప్రకటించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ప్రజల అసంతృప్తిని ఓట్లుగా మార్చుకో జూస్తున్నది తప్పితే నూతన తెలంగాణ రాష్ట్రంలో తమ సాగునీటి విధానమేమిటో, రైతాంగానికి ఎట్లా న్యాయం చేస్తారో ప్రకటించే నిజాయితీతోను, చిత్తశుద్ధితోను లేదు. తెలంగాణకు, మహబూబ్‌నగర్ జిల్లాకు చేయగలిగినంత నష్టం చేసిన తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో ఇక స్థానం లేదని ప్రజలు చాలా సహజంగాను, వాస్తవంగాను మాట్లాడుకుంటున్నారు.

ఈ పరిస్థితులలో ప్రజలే పూనుకుని సాధించుకున్న సాగునీటి పథకాలను కాపాడుకోవాలి. సరిదిద్దుకునే డిమాండ్లతో పోరాడాలి. జూరాల నుండి సాధించుకున్న పాలమూరు – రంగారెడ్డి పథకాన్ని అమలు చేసే దాకా పోరాడాలి. దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు సాగునీరివ్వడానికి ఎత్తిపోతల పథకాలే మార్గం కనుక శ్రీశైలం కన్నా నాగార్జున సాగర్‌లో నిలువ నీరు అధికంగా ఉంటుంది కనుక నాగార్జున సాగర్ నుండి అవసరమైన మేరకు నీరు తీసుకునే పథకం చేపట్టి డిండి పేరుతో నల్లగొండ జిల్లాలో నిర్మించిన రిజర్వాయర్లకు అనుసంధానం చేయాలి. దురుద్దేశం లేకపోతే అది కష్టమైన పనేం కాదు. ఒక విధానంగానే ఏ జిల్లా అవసరాల కోసం ఆ జిల్లాలోనే ప్రాజెక్టులు చేపట్టాలని, నిర్వాసితులకు నీటి ప్రయోజనం పొందే భూమి నుండి భూమి సేకరించి ఇవ్వాలని, నీటి పరిమితి దృష్ట్యా సాగునీటి నిర్వహణ కోసం లష్కర్ ఉద్యోగాలు సృష్టించి నిర్వాసితులకు ఇచ్చి న్యాయం చేయాలని పోరాడాలి.

పాలకులు ఫలితాలే ప్రశ్నలకు సమాధానాలు అంటున్నారు. తప్పుడు సమాధానాలకు తప్పుడు ఫలితాలుంటాయి. అసలు విషయం ఏమిటంటే తప్పుడు సమాధానాలకు మార్పులుండవు.

(రచయిత కన్వీనర్, పాలమూరు అధ్యయన వేదిక–ఉమ్మడి మహబూబ్‌నగర్) వీ

తీసుకురావాలనే ప్రయత్నం చేశారు. దీని కొనసాగింపుగా 2011లో జాతీయ ఉన్నత విద్య, పరిశోధన సంఘం (ఎన్‌సిఎచ్ఇఆర్) ఏర్పాటు చేశారు. ఈ సంఘం ఉన్నత విద్యతో పాటు పరిశోధనలో విప్లవాత్మక మార్పులను తీసుకు రానున్నదని పేర్కొన్నారు. కాని బీహార్, కేరళ, పంజాబ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుండి ప్రతికూల ప్రతిపాదనలు రావడంతో కేంద్రం వెనకడుగు వేసింది. అయితే యుజిసి చట్టంలో మార్పులు తేవాలన్న చర్చ చాలా కాలాంగా ఉంది. 2005లో నియమించిన జాతీయ విజ్ఞాన సంఘం, 2009లో యశ్‌పాల్ కమిటీలు యుజిసికి ప్రత్యామ్నాయంగా ఉన్నత విద్యకు సంబంధించిన అన్ని సంస్థలను కలిపి ఒకే నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాయి. కేంద్ర ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేయబడిన నీతి ఆయోగ్, మానవ వనరుల మంత్రిత్వ శాఖ, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, యుజిసిలను రద్దు పరిచి ఎచ్ఇఆర్ఎ (హైయర్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ రెగ్యులేషన్ ఏజెన్సీ) ని స్థాపించే ప్రయత్నం జరిగింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో కేంద్రం ఆ ప్రయత్నాన్ని విరమించింది. తిరిగి 2018 జూన్ 27న మానవ వనరుల మంత్రిత్వ శాఖ మరొక కొత్త ప్రతిపాదనతో 1956లో పార్లమెంట్ చట్టం ద్వారా ఆమోదించిన యుజిసిని రద్దు పరుస్తూ భారత ఉన్నత విద్యా కమిషన్ ఎచ్ఇసిఐ (హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా) పేరుతో కొత్త సంస్థను ఆమోదించాలని ప్రకటించింది. గ్లోబల్ మార్కెట్ పోటీకి కావలసిన విద్య, పరిశోధనల వృద్ధినే ఉన్నత విద్యా లక్ష్యంగా భారత ఉన్నత విద్యా కమిషన్ పేర్కొంది. కాని మహోన్నత భారతీయ సంస్కృతిని, ఉన్నత విద్యా లక్ష్యాన్ని కుదించింది. రూపంలో ఉన్నత విద్యారంగ సంస్కరణలైనప్పటికీ సారంలో మాత్రం సరళీకృత ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేయడం కోసమే. భారత ఉన్నత విద్యా కమిషన్ 2015 ముసాయిదా ప్రకారం అన్ని రాష్ట్రాల ఉన్నత విద్యా సంస్థలన్ని ఈ చట్టం పరిధిలోనే పనిచేయాలి. ఇది రాష్ట్రాల విద్యా చట్టాలను, స్వేచ్ఛను హరించి వేస్తుంది. ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతమే.

ఉన్నత విద్యారంగ సంస్కరణలు

విశాల భౌగోళిక విస్తీర్ణం అధిక జనాభా రీత్యా యుజిసి ఐదు దశాబ్దాల వరకు విస్తరణకే ప్రాధాన్యతనిచ్చింది. దాదాపుగా గడిచిన రెండు దశాబ్దాలుగా నాణ్యతకు సంబంధించిన సంస్కరణల వైపు మొగ్గుచూపింది. యుజిసి ఆవిర్భావంతో కేవలం ప్రభుత్వ విశ్వ విద్యాలయాలు అనుబంధ కళాశాలలు మాత్రమే లక్ష్యంగా ఉన్నాయి. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, స్వయం ప్రతిపత్తిగల విద్యాలయాలతో పాటు దూర విద్య లాంటి వ్యవస్థలు పుట్టగొడుగుల్లా ముందుకొచ్చాయి. కాని వాటి నియంత్రణ, క్రమబద్ధీకరణ లాంటి నియమాలను యుజిసి లక్ష్యాలలో పొందుపరచ లేదు. నకిలి విశ్వవిద్యాలయాలు పుట్టుకొస్తే కేవలం రు. 1000 జరిమానా విధించే విషయాన్ని 1956 యుజిసి చట్టంలో నామ మాత్రంగా ఉన్నప్పటికీ చాలా సందర్భాలలో ఆచరణలో అమలు చేయలేదు. దీనితో పాటుగా అఖిల భారత సాంకేతిక మండలి విధుల్లో కొన్ని విషయాల్లో ఒకదానిపై ఒకటి అతిక్రమణలుండే సందర్భాలున్నాయి. తదితర సమస్యల నేపథ్యంలో ఈ చట్టంలో సమగ్రమైన మార్పులు తేవాలన్న బలమైన చర్చ చాలా కాలంగా ఉంది కాని ఆచరణ జరగలేదు. ఈ క్రమంలో ఉన్నత విద్యపై నిష్ణాతులతో కూడిన అనేక కమిటీలు యుజిసిని రద్దు చేయాలని సిఫారసు చేశాయి. ప్రొ. యశ్‌పాల్ కమిటీ కూడా రద్దు చేయాలని సూచించింది. ఈ కమిటీ ప్రాతిపాదించిన వాస్తవాలు ఇలా ఉన్నాయి. జ్ఞాన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్న ఈ స్థితిలో ఉన్నత విద్యను పెద్ద ఎత్తున విస్తృతపరచాల్సిన అవసరం రీత్యా ప్రభుత్వ వనరులతో పాటు ప్రైవేట్ వనరులను నిరంతరం సేకరించాలన్నారు. గుర్తింపు కోసం అభ్యర్థించే ప్రైవేట్ సంస్థల అర్హతలను కడు సంక్లిష్ట ప్రక్రియ ఆధారంగా పరీక్షించే యుజిసి కంటే అత్యంత వేగంగా నిర్ధారించగల ఒక అత్యున్నత స్థాయి సంస్థ అవసరం అంటుందన్నారు లేదా యుజిసిలో పలు సరళీకరణ సవరణలు తేవాలన్నారు.

ఉన్నత విద్యా రంగంలోకి ప్రత్యక్ష రాజకీయాలు

ఈ ప్రతిపాదిత భారత ఉన్నత విద్యా కమిషన్ (ఎచ్ఇసిఐ) ఏర్పాటు వల్ల విద్యా రంగంపై రాజకీయ నాయకుల పెత్తనం పెరుగుతుంది. మానవ వనరుల మంత్రిత్వ శాఖ ద్వారా ఉన్నత విద్యకు నిధుల పంపిణీ జరుగుతుంది. దీనితో విద్యా కమిషన్ పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో ఉంటుంది. యుజిసి పనితీరును మెరుగు పరచకుండా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్పులు తీసుకురాకుండా సంపూర్ణంగా రద్దు పరుస్తున్న నిర్ణయం పట్ల పలు అభ్యంతరాలను వక్యం చేసినారు. ఈ చర్య ఉన్నత విద్య పెనం నుండి పొయ్యిలో పడినట్లవుతుందన్నారు. భారతీయ ఉన్నత విద్యా కమిషన్ ప్రధాన ఉద్దేశం ఉన్నత విద్యలో ప్రమాణాలు నాణ్యతను పెంచి ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించాలనే సూత్రంతో పనిచేస్తుందని బయటకు చెపుతున్నప్పటికీ కమిషన్ సభ్యుల కూర్పు నిర్మాణంను గమనిస్తే ఆచరణ సాధ్యం కాదనిపిస్తుంది.

భారత ఉన్నత విద్యా కమిషన్‌లో ఒక చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులతో పాటు అడ్వయిజరీ కౌన్సిల్ ఉంటుంది. ఈ అడ్వయిజరీ కౌన్సిల్‌కు మానవ వనరుల శాఖ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. మానవ వనరుల శాఖ కార్యదర్శితో పాటు ఇద్దరు పదవిలో ఉన్న వైస్ చాన్సలర్స్, ఒక పారిశ్రామిక వేత్త, ఇద్దరు ప్రొఫెసర్లతో పాటు సంబంధిత మంత్రిత్వ శాఖ సభ్యులుంటారు. ఈ విధంగా ప్రభుత్వం నియమించిన సంస్థగా పనిచేస్తుంది. దీనిలో విద్యా రంగానికి తగిన ప్రాతినిధ్యం లేదు. 12 మంది సభ్యులున్న ఎచ్ఇసిఐలో విద్యా వేత్తలు కేవలం నలుగురు మాత్రమే ప్రభుత్వ ఆకాంక్షలకు భిన్నంగా సభ్యులు వ్యవహరిస్తే సభ్యులను ప్రభుత్వం తొలగిస్తుంది. కాని యుజిసి సభ్యులను ప్రభుత్వం నియమించిన తర్వాత తొలగించే అధికారం లేదు. ఎచ్ఇసిఐని కేవలం అకడమిక్ విషయాలకు మాత్రమే పరిమితం చేశారు. గ్రాంటునిచ్చే అధికారాన్ని మానవ వనరుల మంత్రిత్వ శాఖకు అప్పజెప్పే స్వతంత్ర ప్రతిపత్తిగల విద్యా సంస్థల్లో రాజకీయాధిపత్యాన్ని పెంచే ప్రయత్నం జరుగుతుంది. యుజిసి మొదటగా ప్రభుత్వం నియమించిన విద్యా వేత్తలతో కూడి ఉన్నప్పటికీ అది స్వయం ప్రతిపత్తిగల సంస్థగా ఉండేది. యుజిసి నిర్దేశాలను విశ్వవిద్యాలయాలు కాని కళాశాలు కాని పాటించకపోతే నిధుల కేటాయింపులను నిలుపుదల చేసేది కాని ఎచ్ఇసిఐ సిఫార్సులను పట్టించుకోకపోతే ఆ విద్యా సంస్థను మూసివేస్తుంది. ఇంకాస్తా ముందుకు పోయి యాజమాన్యాలపైన చట్టపరమైన చర్యలు, జరిమానా గాని, జైలు శిక్షలు గాని విధించాలని ముసాయిదాలో వెల్లడించింది. పై చర్యలు విద్యా సంస్థలను ఎంత స్థాయిలో భయభ్రాంతులకు గురి చేస్తున్నాయో అర్థమౌతుంది.

ఉన్నత విద్యా రంగం దశ-దిశ

21వ శతాబ్ది నైపుణ్యాల గురించి నడుస్తున్న చర్చ వర్ధమాన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వాతావరణం అత్యంత వేగంగా మారిపోతున్న

సత్యాన్ని సూచిస్తుంది. భావితరాలు నేర్చుకోవాల్సిన సమగ్ర అంశాల గురించి మన ఆలోచనల్లో సరిదిద్దుకోవాల్సి ఉంది. మనం తెలుసు కోవాల్సిన విషయాలు, సాధించుకోవాల్సిన నైపుణ్యాలు సృజనాత్మక, నవకల్పన విమర్శనాత్మక చింతన జిజ్ఞాస, సహకారం పరస్పర సాంస్కృతిక అవగాహన పోటీపడి ప్రపంచ మేటిగా నిలబడగల సామర్థ్యాలను మన ఉన్నత విద్యలో ప్రతిబింబించాలి. దీని కొరకు మన విశ్వవిద్యాలయాలు మానవ విలువలు పెంచుకుంటూ, మార్కెట్ ప్రేరిత అంశాలకు విరుద్ధంగా జిజ్ఞాస, పరిశోధనా స్వేచ్ఛ, అంతర్గత లక్ష్యాలు మొదలైన వైజ్ఞానిక సూత్రం ప్రాతిపదికన పనిచేయాలి. సమస్య పరిష్కారానికి ఇదొక సమగ్ర దృక్పథం. ఇటువంటి దృక్పథాన్ని అలవరుచుకునేందుకు శాస్త్రీయమైన విద్య పరిశోధన ఆచరణ పద్ధతులు భావ ప్రసార నైపుణ్యాలు అవసరం. విద్య అంటే వన విద్యార్థులను కేవలం ఉద్యోగాలకు సిద్ధం చేయడం కాదు. ఒక వాస్తవ ప్రపంచ సమస్యను ఆచరణాత్మక పరిష్కారాన్ని సూచించేందుకు సాధ్యం కాని అనిశ్చిత పరిస్థితులు నెలకొని ఉన్న సందర్భాలలో జ్ఞానాన్ని ఒక పరిష్కార సాధనంగా చేసుకునేదే విద్య లక్ష్యం. ఐనప్పటికీ టీచింగ్, పరిశోధనా ప్రమాణాలకు, విద్యార్థుల సాధన అంచనాలకు, మొత్తంగా విద్యా ప్రమాణాలకు సంబంధించిన నిర్ణీత పర్యావసానాలకు ప్రమాణాలను నిర్ధారిస్తుంది. వీటి ద్వారానే విద్యార్థులను, టీచర్లను, పరిశోధనలను విద్యా సంస్థలను అంచనా వేయడం జరుగుతుంది. ఈ చర్య ఉన్నత విద్యా సంస్థలకు ఎక్కువ స్వయం ప్రతిపత్తిని కల్పిస్తున్నామన్న పేరు మీద అక్రిడిటేషన్‌ను రుద్దడమవుతుంది. ఈ మధ్య అక్రిడిటేషన్ విధానాల్లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. 4 పాయింట్ల అక్రిడిటేషన్ స్కోర్లో 3.51 దాటితే ఆ సంస్థలు ప్రభుత్వ అనుమతి లేకుండానే తమకు నచ్చిన రీతిలో కోర్సులను, ఫీజులను నిర్ధారించుకోవచ్చు. స్వతంత్రంగానే టీచర్లను నియమించుకునే స్వేచ్ఛ ఆ సంస్థలకుంది. వీటిని పారదర్శక విధానాలంటూ ఉన్నత విద్యా సంస్థలు తనిఖీ నుండి వైదొలిగినాయి. ఇది ప్రైవేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించడమే.

విశ్వవిద్యాలయాలు చర్చించాల్సిన అంశాలు

1956లో యుజిసిని పార్లమెంట్ ఆమోదించిన నాడు దేశంలో కేవలం 20 వర్సిటీలు, 500 కాలేజీలు, 2 లక్షల మంది విద్యార్థులు మాత్రమే. ఇప్పుడు 900 విశ్వవిద్యాలయాలు, 40,000 కాలేజీలు, మూడున్నర కోట్ల మందికి పైగా విద్యార్థులున్నారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయాలు కీలకంగా చర్చించాల్సిన అంశాలున్నాయి. 21వ శతాబ్ది నైపుణ్యాలను సమగ్రంగా సాధించుకోవడానికి ప్రాకృతిక ఆర్థిక, సామాజిక విజ్ఞాన శాస్త్రాలను ఏకీకృతం చేసే లక్ష్యం మన విద్యా వ్యవస్థకు ఉండాలి. కాలం చెల్లిన భావాలను, పుక్కిటి పురాణాలను, అశాస్త్రీయ పద్ధతిపై ఆధారపడి ఉన్న విద్య పరిశోధనా వ్యవస్థను సమూలంగా మార్చివేయడానికి రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి. ప్రతిపాదిస్తున్న అభివృద్ధి విధానాలను ఆచరణాత్మకంగా అమలు పరిచేందుకు యంత్రంగాల్ని సంసిద్ధులుగా తయారు చేయాలి. అధ్యయనం, పరిశోధనలను ఏకీకృతం చేసి సమగ్ర విద్యనందించే ఉన్నత విద్యా నమూనా స్ఫూర్తితో నూతన విద్యారంగాన్ని పునర్నిర్మించుకోవాలి.

భారత ఉన్నత విద్యా కమిషన్‌లో చేర్చాల్సిన అంశాలు

రాజ్యాంగంలో చెప్పబడినటువంటి సామ్యవాదం, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం వంటి లక్ష్యాల ప్రాతిపదికగా వర్ధమాన విద్యా విధానం ముందుకు పోవాలి. సమాజ చలన స్వభావంలో భాగంగా ఉంటు లౌకిక విధానమే మన విద్యా విధానంలో అంతర్లీనంగా ఉండాలి. సామ్రాజ్యవాదం ప్రపంచ వ్యాప్తంగా తన వలసలను ఏర్పరుచుకున్నప్పుడు తన వలస దేశాలన్నింటిలోను కూడా ప్రవేశపెట్టినటువంటి విద్యా విధానం. అది వలస విద్యా విధానం. అది భానిస విద్యా విధానం. అది సామ్రాజ్యవాదం ఎల్ల కాలాల కొరకు సజీవంగా ఉండాలనే ఆశయంతోటి వలస దేశాలలో ఉండేటటువంటి ప్రజల కొరకు ప్రవేశ పెట్టినటువంటిది. నేడది సరళీకృత ఆర్థిక విధానాలను ముందుకు తీసుకుపోయే రూపంలో ఉంది.

ఇవ్వాల పాలన కొనసాగిస్తున్న రాజకీయ పార్టీలు అశాస్త్రీయమై నటువంటి విధానాల ద్వారా చరిత్రకు భిన్నమైనటువంటి పద్ధతుల ద్వారా తమ అధికారాన్ని కాపాడుట కోసం విద్యను, సంస్కృతిని, కళలను ఒక మాటలో చెప్పాలంటే ఉపరితలాన్ని తమ ప్రయోజనాలకు వాడుకుంటు న్నారు. ఈనాడు రాజకీయ ఆర్థిక రంగంలో అమలవు తున్నటువంటి బూర్జువా నియంతృత్వానికి అనుకూలమైనటు వంటిదే ఈ విద్యా విధానం. నేటివరకు భారత ఉన్నత విద్యా కమిషన్ స్వభావం, స్వరూపం పట్ల 6,000కు పైగా సమీక్షలు, సలహాలు, సూచనలు వచ్చినాయి.

సంక్షిప్తంగా వాటి సారంశం మానవ వనరుల మంత్రిత్వ శాఖకు విరాళాలను ఇచ్చే బాధ్యత నుండి తప్పించాలి. అడ్వయిజరీ కౌన్సిల్ చైర్మన్‌గా మానవ వనరుల మంత్రిత్వ శాఖను ఉంచరాదు. దీని ద్వారా ప్రత్యక్ష రాజకీయాలను విద్యా రంగంలోకి చేర్చినట్లు ఉంటుందనేది చారిత్రక సత్యం. స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థకు మాత్రమే విరాళాలను ఇచ్చే బాధ్యతలను ఇవ్వాలి. దీని ద్వారా మాత్రమే పారదర్శకంగా పంపిణీ జరుగుతుంది. ఈ మేరకు కనీసంగానైనా డ్రాఫ్ట్ బిల్లులో సవరణలుంటేనే ఉన్నత విద్యా రంగం మహోన్నత ఆశయాలతో ముందుకు సాగుతుంది.

ముగింపు

వర్తమాన కాలంలో ఉన్నత విద్యను ఆర్థిక పునాదుల ఆధారంగా సమకూర్చుకున్న మౌలిక వసతులు ఆ అవసతులను ధృవీకరించిన అక్రిడిటేషన్ రేటింగ్‌తో పాటు పలుకుబడులతో ప్రాంగణ నియామకాల్లో పొందిన ప్యాకేజీలను మాత్రమే పరిగణలోకి తీసుకోరాదు. ఉన్నత విద్యా సంస్థలన్నింటిలో అన్ని సామాజిక వర్గాలకు ప్రవేశం పొందే అవకాశం కల్పించాలి.

రాజ్యాంగంలో పొందుపరిచినట్లుగా రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరిగేలా చూడాలి. పేద, మధ్యతరగతి వాళ్లు అనేక అడ్డంకుల నుండి బయట పడుతూ ఇప్పుడిప్పుడే ఉన్నత విద్యావకాశాలను అందుకుంటున్న ఈ దశలో 70 శాతం మందికైనా ఉపయోగపడేలా సంస్కరణలు ఉన్నత విద్యా రంగంలో రావాలి. అదే సామాజిక భద్రతగా మారుతుంది. దీనితో భారత ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలైన అందరికి సమాన అవకాశాలు, సమాన విద్యా అవకాశాలతోనే నెరవేరుతాయి.

విద్యా విధానం సామాజిక విలువలను నైతిక సూత్రాల స్థాపన మానవీయ కోణంగా ఉన్న సామాజిక శాస్త్రాలను కాపాడాలి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛతో, హేతుబద్ధమైన ఆలోచనలతో చైతన్యవంతులను తయారు చేసే సంస్కరణలు రావాలి.

మన విద్య మన మేధస్సు, మన కళలు, మన సమగ్రాభివృద్ధికి మూలం కావాలి. శ్రమైక జీవన సౌందర్యం మన విద్యా విధానం కావాలి. కాని రాజకీయ రంగు కారాదు!

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ యూనివర్సిటీ) వీ

నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో పౌర హక్కులు

***చంద్రబాబు పాలనలో ఎలాంటి మార్పురాలేదనీ, ఈ నాలుగేళ్ల కాలంలో ప్రజలపై ఆర్థిక భారం మోపడం, వాక్ స్వాతంత్ర్యాన్ని హరించడం, అణచివేత విధానాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయడం కొనసాగుతున్నాయని అంటున్నారు* క్రాంతి చైతన్య**

రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు స్వల్ప మెజారిటీతో అధికారంలోకి వచ్చాడు. గతంలో తాను చేసిన తప్పులు తెలుసుకున్నానని, తాను మారిన మనిషని ఓ మేరకు రాష్ట్ర ప్రజల్ని నమ్మించాడు. అంతేకాక నూతనంగా ఏర్పడిన రాష్ట్రాన్ని ముందుకు నడిపించడానికి అనుభవమున్న వ్యక్తి ముఖ్యమంత్రి అయితే బావుంటుందని, జగన్మోహన్ రెడ్డి కంటే చంద్రబాబు నాయుడు అనుభవమున్న నాయకుడని అతన్ని గెలిపించారు.

అధికార పీఠంపై కూర్చో గానే, తన పాత అభివృద్ధి నమూనానే ఆచరించడం మొదలు పెట్టాడు. చంద్రబాబు ఏమీ మారలేదని, మారాడని నమ్మి, తామే మోసపోయామని గ్రహించడానికి అతడికి ఓట్లేసి గెలిపించిన ప్రజానీకానికి ఎంతోసేపు పట్టలేదు. గతంలో తన 9 సంవత్సరాల పాలనలో ఎలాగైతే ప్రజా ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించాడో అవే పద్ధతుల్ని తిరిగి అవలంబించాడు. గతంలో తాను ముందుకు తెచ్చిన 'విజన్ 2020' అభివృద్ధి నమూనాను కాస్త ఈసారి 'విజన్ 2059' గా మార్చాడు. 2022 కల్లా రాష్ట్రాన్ని దేశంలోని మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా, 2029 కల్లా దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా, 2059 కల్లా ప్రపంచంలోనే అగ్రగామి రాష్ట్రంగా మారుస్తానని, కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రకటనలు గుప్పిస్తున్నాడు.

అభివృద్ధి సంగతేమోగాని, పౌర హక్కుల ఉల్లంఘనలో మాత్రం ప్రథమ స్థానంలో నిలుపుతాడనడంలో సందేహం లేదు. ప్రజల మౌలిక అవసరాలపై దృష్టి సారించకుండా, రాష్ట్రాన్ని సింగపూర్‌లా మారుస్తానని, ప్రపంచం తలదన్నేలా రాజధాని నగరాన్ని నిర్మిస్తానని, ఆరుగాలం మూడు పంటలు పండే 32 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణం పేరిట రైతుల నుండి బలవంతంగా లాక్కున్నాడు.

తన అభివృద్ధి నమూనా అమలులో భాగంగా, ప్రజా ఆందోళనలపై అణచివేతను వివిధ రూపాల్లో కొనసాగిస్తున్నాడు. ఎన్‌కౌంటర్లు ఆగలేదు, అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులు బనాయించడం ఆగలేదు, ఉద్యమకారులపై లాఠీలు ఝులిపిస్తూనే ఉన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై అణచివేత కొనసాగుతూనే ఉంది. సమావేశ మందిరాల్ని (మీటింగ్ హాల్స్) పోలీసులు, సమావేశం ప్రారంభం కావడానికి ముందే ఆక్రమించు కుంటున్నారు. సభల్లో మాట్లాడాల్సిన వాళ్లు గృహ నిర్బంధాలకు గురవుతున్నారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించిన వాళ్లందరూ అభివృద్ధి నిరోధకులుగా ముద్ర వేయబడుతున్నారు. దీనికి తోడు 2002లో గుజరాత్ అల్లర్ల సందర్భంగా, అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీని అరెస్టు చేయాలని డిమాండ్ చేసిన చంద్రబాబు, అధికారం కోసం అదే నరేంద్ర మోడీని ఆలింగనం చేసుకుని, ఎన్‌డిఎలో పొత్తు అధికారంలోకి రావడమే కాక, ఈ నాలుగు సంవత్సరాలు ఈ దేశంలో సంఘ్ పరివార్ శక్తులు సాగించిన అరాచకాలపై నోరు మెదపకుండా, వారితో అంటకాగి, ఇప్పుడు హఠాత్తుగా జ్ఞానోదయమైనట్టు ఎన్‌డిఎ నుండి బయటకి వచ్చాడు. ఇదే స్థూలంగా చంద్రబాబు నాలుగు సంవత్సరాల పాలన.

ఇక వివరాల్లోకి వెళితే, చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడానికి ప్రధాన కారణాలలో 'రైతుల రుణ మాఫీ హామీ' కూడా ఒకటి. ఎన్నికలపుడు వాస్తవిక సాధ్యాసాధ్యాలతో సంబంధం లేకుండా, అధికారంలోకి రాగానే రైతుల రుణాలన్నింటిని పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చాడు. అయితే అధికారంలోకి రాగానే, వాయిదాల పద్ధతి రుణ మాఫీని ప్రకటించాడు. దీని వల్ల రైతులు అటు పూర్తిగా రుణ విముక్తులు కాలేకపోయారు. దాంతో రైతాంగానికి పెద్దగా జరిగిందేమి లేదు. ఫలితంగా వ్యవసాయ జూదంలో ఓడిపోయిన రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మారుస్తానన్న చంద్రబాబు, అందుకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేదు. రెవిన్యూ లోటుతో ఏర్పడ్డ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి యంత్రాంగాన్ని సమాయత్తం చేయాల్సింది పోయి మొదటగా తన అనుచర గణం ద్వారా అమరావతి చుట్టుపక్కల వేలాది ఎకరాల భూముల్ని కొనుగోలు చేయించాడు. ఆ తరువాత నూతన రాజధాని ఏర్పాటుపై శ్రీకృష్ణ కమిషన్ ఇచ్చిన నివేదికను బుట్టదాఖలు చేస్తూ, సంవత్సరానికి మూడు పంటలు పండే 32 వేల ఎకరాల వ్యవసాయ భూమిని రాజధానికి సేకరించడం ప్రజల జీవనాహార హక్కులపై ప్రభుత్వదాడి గానే చూడాల్సి ఉంటుంది. అక్కడి రైతుల్ని బెదిరించి, భయపెట్టి భూ సమీకరణకు ఒప్పించారు.

మరో వైపు రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని ప్రచారం చేసుకోవడం చంద్రబాబుకే చెల్లింది. భూములు ఇవ్వడానికి నిరాకరించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి, పోలీసు యంత్రాంగం ద్వారా బెదిరించి, చివరకు పంటల్ని తగుల బెట్టించి రైతుల్ని లొంగదీసుకున్న చరిత్ర చంద్రబాబుది.

ఇప్పటికీ మూడు నాలుగు గ్రామాల ప్రజలు తమ భూముల్ని రాజధానికి భూసమీకరణ ద్వారా ఇవ్వడానికి నిరాకరిస్తూనే ఉన్నారు. వారిని కూడా ఎలాగైనా లొంగదీసుకోవాలని,భూసేకరణ చట్టాన్ని ప్రయోగించి వారి భూముల్ని లాక్కోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఉండవల్లి గ్రామానికి చెందిన రైతుల్ని లొంగదీసుకోవడానికి ఆ ఊరి పొలిమేరల్లో 1200 అడుగుల రోడ్డు వేయడానికి భూములు అవసరం అని భూసేకరణ ప్రక్రియ ప్రారంభించారు. ప్రపంచంలో ఎక్కడా 1200 అడుగుల రోడ్లు లేనే లేవు. అంత పెద్ద రోడ్లు అవసరమా అన్నదే మౌలిక ప్రశ్న. చంద్రబాబు నాయుడు కట్టాలనుకుంటున్న ప్రపంచస్థాయి రాజధానిలో సామాన్యులకు స్థానం ఉండనే ఉండదు. అది పూర్తికాగానే కార్పొరేట్ సామ్రాజ్యం అవుతుంది. ఇప్పటికే రైతుల నుండి సమీకరించిన భూముల్ని వందలాది ఎకరాల చొప్పున ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం మొదలయ్యింది. తద్వారా ప్రభుత్వమే పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీసింది.

చంద్రబాబు నాయుడులో ఏమాత్రం మార్పు రాలేదనడానికి సాక్షీభూతంగా, తన ప్రమాణ స్వీకారోత్సవం రోజునే నల్లమల అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో బాబురావు అనే మావోయిస్టుతో పాటు మరో ఇద్దరు మహిళల్ని కూడా చంపేశారు. మావోయిస్టు పార్టీతో సంబంధాలు తెగిపోయిన బాబురావు నల్లమలలోని గిరిజన గూడేల్లో తిరుగుతున్నాడనే పక్కా సమాచారం పోలీసులకు చాలా రోజులుగా తెలుసు. అతన్ని అరెస్టు చేయాలనుకుంటే ఎప్పుడో అరెస్టు చేసి ఉండవచ్చు. అయితే చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవం నాడే అతన్ని అతనిపాటు ఉన్న ఇద్దరు మహిళల్ని ఎన్‌కౌంటర్ పేరున చంపేశారు. వాస్తవానికి అప్పటికే మావోయిస్టు పార్టీ నల్లమల ప్రాంతాన్ని విడిచిపెట్టి ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దులకు తమ స్థావరాల్ని మార్చుకున్న సంగతి పోలీసులకు స్పష్టంగా తెలిసినప్పటికీ, నల్లమలలో మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్ని ఎంతమాత్రం సాగనియ్యను అన్న సంకేతాన్ని ఇవ్వడానికే ఆ ఎన్‌కౌంటర్ జరిగిందనేది నిర్వివాదాంశం.

చంద్రబాబు నాయుడు పాలనలో జరిగిన మరొక దారుణ సంఘటనే శేషాచలం ఎన్‌కౌంటర్. ఈ ఎన్‌కౌంటర్‌లో 20 మంది తమిళ కూలీలు ముఖ్యంగా 20 నుండి 30 సంవత్సరాలలోపు వారు ప్రాణాలు కోల్పోయారు. శేషాచలం అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం దుంగల స్మగ్లింగ్‌కు అడ్డు కట్టవేయడానికి, ఎర్రచందనం చెట్లను నరకడానికి వస్తున్న కూలీలను భయభ్రాంతులకు గురిచేయడానికి ఉద్దేశించిన ఆపరేషన్లో భాగంగా 20 మంది ప్రాణాలను బలిగొన్నారు. తామేం చేసినా చెల్లుతుందని ఎలాంటి కట్టుకథలైనా నిజమని నమ్మించ గలమనే ధీమాతో ప్రభుత్వ అండదండలతో జరిగిన హత్యాకాండ అది.

2015, ఏప్రిల్ 7న తెల్లవారు జామున పోలీసులు, ఫారెస్టు అధికారులకు దాదాపు 500 మంది ఎర్రచందనం కూలీలు తారసపడి వీరిపైకి రాళ్లు విసరగా, ఆత్మరక్షణార్థం జరిపిన కాల్పుల్లో 20 మంది చనిపోయారనే కథను అల్లారు. అయతే, 500 మందిలో మిగిలిన 480 మందికి ఒక్క తూటా గాయం కూడా కాలేదా? ఒక్కరిని కూడా ప్రాణాలతో ఎందుకు పట్టుకోలేక పోయారనే ప్రశ్నలకు సమాధానం దొరకదు. చంపబడ్డ వాళ్లలో కొంతమంది, శేషాచలం అడవుల్లో అదుపులోకి తీసుకొన్న వాళ్లు కాగా, మరికొంతమందిని, అంతకు ముందురోజు సాయంకాలం తమిళనాడు నుండి తిరుపతికి వస్తున్న బస్సులో నుండి, విచారణ పేరుతో అదుపులోకి తీసుకొన్నారు.

అందరినీ కలిపి మరుసటి రోజు తెల్లవారు జామున శ్రీవారిమెట్టుకు కేవలం 2 కిలోమీటర్ల దూరంలో మాదానా అటవీ ప్రాంతంలో కాల్చి చంపేశారు. ఈ సంఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం కావడం, కొన్ని రోజులు మనరాష్ట్రం నుండి తమిళనాడుకు బస్సులు కూడా నిలిచిపోవడం జరిగింది. పౌర హక్కుల సంఘం ఈ దారుణంపై హై కోర్టులో కేసు దాఖలు చేయడంతో, హైకోర్టు ఆదేశంతో సదరు ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నవారిపై హత్యానేరం క్రింద కేసు నమోదు చేసారు. అయితే, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఒక సంవత్సరం పాటు దర్యాప్తు పేరుతో సాగదీసి, చివరకు హంతకులందరికీ క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, సదరు దర్యాప్తు నివేదిక తప్పుడు నివేదిక అని, దాన్ని ఎటువంటి పరిస్థితుల్లో ఆమోదించకూడదని, దీనిపై పునర్ దర్యాప్తు చేయాలని పౌర హక్కుల సంఘం, మృతుల కుటుంబ సభ్యులు న్యాయస్థానాల్లో పోరాటం చేస్తూనే ఉన్నారు.

అభివృద్ధి పేరుతో దేశ సంపదను దేశీ, విదేశీ పెట్టుబడిదారులకు అవకాశాలు కల్పించడానికి అధికారంలోకి వచ్చిన అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నించాయి. ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలోని బాక్సైట్ తవకాలను వ్యతిరేకించిన చంద్రబాబు, అధికారంలోకి రాగానే ఆ ఖనిజ నిక్షేపాల్ని బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టడానికి ప్రయత్నించాడు. బాక్సైట్ తవ్వకాల వల్ల అడవి, పర్యావరణంతో పాటు తమ జీవనోపాధి దెబ్బ తింటుందని అక్కడి ఆదివాసీలు పోరాడుతున్నారు. వారికి మావోయిస్టు పార్టీ అండదండలు ఉన్నాయి. దాంతో ఎలాగైనా మావోయిస్టు పార్టీని దెబ్బ తీయాలనే కుట్రలో భాగంగా, బెజ్జంగి ఎన్‌కౌంటర్ సంఘటన జరిగింది.

ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రాంతమైన రామగూడకు సమీపంలోని బెజ్జంగి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారని, 2016 అక్టోబర్ 23 రాత్రే ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టిన పోలీసులు, 24న మావోయిస్టులు రోల్ కాల్, కాలకృత్యాలు తీర్చుకోవడంలో నిమగ్నమయిన సమయంలో ఒక్క సారిగా అన్నివైపుల నుండి కాల్పులు మొదలు పెట్టారు. ఆ కాల్పుల్లో 26 మంది చనిపోయారు. గ్రామాలలో సమీప ప్రాంతంలో చిక్కిన నలుగురిని 25న చంపారు. అలానే మరో ఇద్దరినీ 27న చంపారు. మొత్తం 32 మందిని చంపారు. వీరిలో 9 మంది సాధారణ గిరిజనులు.

ఈ సంఘటనపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. పౌర హక్కుల సంఘం చొరవతో, ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ కమిటీ అధ్వర్యంలో పై సంఘటనపై నిజ నిర్ధారణ చేసి, ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఘాతుక చర్యను వెలుగులోకి తెచ్చాయి. ఓ వైపున చంద్రబాబు ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో పదుల సంఖ్యలో పౌరుల్ని చంపుతూ (చట్టం దృష్టిలో నేరస్తులెవ్వరైనా వారిని చంపే అధికారం ప్రభుత్వానికి, పోలీసులకు లేదు) మరోవైపు పౌరహక్కుల సంఘాల నిజనిర్ధారణ బృందాల్ని అడ్డుకోజూస్తున్నారు. బెజ్జంగి ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణ వెళ్తోన్న బృందాన్ని నక్సల్ బాధితుల పేరుతో పాడేరులో అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఆ సంఘటనకు నిరసనగా విజయవాడ లో ప్రజా సంఘాలు,హక్కుల సంఘాలు ఊరేగింపు చేస్తే, పోలీసులు కూడా పోటీగా నక్సల్స్ బాధితుల పేరున ఊరేగింపు నిర్వహించారు. అలాగే కర్నూలు, కడప, గుంటూరులలో జరిగిన ధర్నాల సందర్భంగా, పోలీసులు కొంతమంది జనాలను పోగేసి పోటీ ధర్నాలు నిర్వహించారు.

గతంలో ఏనాడూ ఇలా జరగలేదు. పోటీ ధర్నాలకు వచ్చిన వాళ్లను, మీరు ఎందుకు వచ్చారు అని అడిగితే, కొంతమంది రేషన్‌కార్డులు ఇస్తామంటే వచ్చామని, మరికొంతమంది డబ్బులు, బిర్యాని ఇస్తామంటే వచ్చామని చెప్పారు. దీన్ని బట్టి, ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా, పోలీసుల ద్వారా కౌంటర్ అటాక్ చేయిస్తున్నదనే విషయం స్పష్టం అవుతున్నది. ప్రజాసంఘాలపై, హక్కుల సంఘాలపై దుష్ప్రచారాన్ని చేస్తూ, వీళ్లందరూ మావోయిస్టు సానుభూతిపరులనే ముద్ర వేయడానికి కూడా ప్రయత్నిస్తున్నది. విద్యార్థినుల సమస్యలపై కార్యక్రమాలు తీసుకోవడంలో భాగంగా పనిచేస్తున్న చైతన్య మహిళా సంఘాల నాయకుల ఫొటోలతో వాళ్లను మావోయిస్టులుగా చిత్రీకరిస్తూ పోస్టర్స్ వేయడం వెనుక పోలీసుల, ప్రభుత్వం హస్తం ఉందనేది జగమెరిగిన సత్యం. ప్రజాస్వామ్య దేశంలో కనీసం ప్రజలకు, పౌర, ప్రజా సంఘాలకు ఉన్న నిరసన తెలిపే హక్కుపై ఇలాంటి దాడులు, చర్యల ద్వారా వాటిని హరించాలను కోవడం చాలా దుర్మార్గం.

చంద్రబాబు నాయుడు ఏ చిన్న నిరసనను కూడా అనుమతించడని, నిరసనలను, భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోవడంలో తాను అందరికంటే ముందుంటానని నిరూపిస్తూ, ప్రజా ఆందోళనలపై ఉక్కుపాదం మోపాడు. నాలుగు గోడల మధ్య జరుపుకునే సభలు, సమావేశాలను కూడా పోలీసులు అనుమతి కావాలని చట్టవిరుద్ధమైన షరతులు పెడుతున్నారు. పోలీసుల అనుమతి అవసరం లేదని వాదించిన సందర్భాల్లో సభా ప్రాంగణాలనే పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, సభలకు ఎవ్వరినీ రానీయకుండా అడ్డుకుంటున్నారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో విశాఖ, తిరుపతిలలో ఏర్పాటు చేసిన సభల్ని జరుగ నివ్వకుండా ఎక్కడికక్కడ నాయకుల్ని, కార్యకర్తల్ని నిర్బంధించారు. సభలో వక్తలుగా పాల్గొనాల్సిన వాళ్లను గృహనిర్బంధంలో పెట్టారు. బయట మీటింగ్ హాళ్ల వాళ్లను బెదిరిస్తారేమోనని, తిరుపతిలో సినిమా ఆఫీసులో సమావేశాన్ని ఏర్పాటు చేసుకుంటే, మొత్తం వాళ్ల ఆఫీసును పరిసర ప్రాంతాలన్నిటినీ పోలీసులు దిగ్బంధనం చేసారు. సభలు, సమావేశాలు నిర్వహించుకునే ప్రాథమిక హక్కుపై చంద్రబాబు నాయుడు ఈ రకమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాడు.

కేవలం ఉద్యమకారుల నిరసనలనే కాక, ప్రధాన రాజకీయ స్రవంతిలోని ప్రతిపక్ష రాజకీయ పార్టీల, నాయకుల నిరసనలను కూడా చంద్రబాబు ప్రభుత్వం తీవ్రంగా అడ్డుకుంటున్నది. చివరకు ముద్రగడ పాదయాత్రను సైతం అడ్డుకొని, అతన్ని కొన్నాళ్లపాటు గృహ నిర్బంధం లోనే ఉంచారు. ప్రత్యేక హోదా కోరుతూ విశాఖలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొనడానికి వెళ్లిన ప్రతిపక్ష నాయకుండు జగన్‌ను కూడా విమానాశ్రయం నుండి నగరంలోకి అడుగుపెట్టనీయకుండా తిప్పి పంపించిన ఘనత చంద్రబాబుదే. అదే చంద్రబాబు ఇప్పుడు, ఎన్నికల సమీపిస్తుండడంతో, బిజెపితో కటీఫ్ చేసుకుని, ప్రత్యేక హోదా కోసం పోరాటాలు చేయిస్తున్నాడు. చంద్రబాబు నాయుడు హక్కులు కాలరాయడమే కాకుండా ప్రజాస్వామిక విలువల్ని (అవి బూర్జువా విలువలైనప్పటికి) నిస్సిగ్గుగా కాల రాస్తున్నాడు. ప్రతిపక్ష పార్టీలను అధికారపార్టీలో చేర్చుకొని, వారిలో కొందరికి మంత్రి పదవుల్ని కట్ట బెట్టడం ఏ ప్రజాస్వామిక విలువ?

మరి ప్రజల ఓటు హక్కుకు ఏం విలువ ఉంది? ఫిరాయింపులపై చర్య తీసుకోవాల్సిన స్పీకర్, అధికార పార్టీ వ్యక్తిగానే వ్యవహరిస్తూ, ఎలాంటి చర్యా తీసుకోకపోవడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమే. బహుశా దేశ చరిత్రలోనే మన తెలుగు రాష్ట్రాల్లో తప్ప, మరెక్కడా ఇలాంటి సంఘటన చోటు చేసుకొని ఉండదేమో.

ఎన్నికల ప్రచారంలో ప్రత్యేకించి తన విజన్ 2020 అభివృద్ధి నమూనానే, తిరిగి అధికారంలోకి రాగానే చంద్రబాబు బయటకు తీసాడు. వేలాది ఎకరాలు ప్రభుత్వం, ప్రైవేటు భూముల్ని బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టారని కాంగ్రెస్ ప్రభుత్వాల మీద గగ్గోలు పెట్టిన చంద్రబాబు, తాను కూడా కాంగ్రెస్ కేమి తీసిపోనని, అంతకంటే దుందుడుకుగా భూ బ్యాంకుల పేరిట ప్రతి జిల్లాలోను వేలాది ఎకరాల పంట భూముల్ని పారిశ్రామిక వేత్తల పరం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసాడు. ఇందుకోసం ఎంతోకొంత అడ్డంకిగా ఉన్న భూసేకరణ చట్టం 2013కు తూట్లు పొడుస్తూ, దానికి అనేక సవరణలను అసెంబ్లీలో ఆమోదించుకొని, ఆ సవరణలకు రాష్ట్రపతి ఆమోదం కూడా పొందాడు. తద్వారా భూసేకరణ చట్టం 2013 ద్వారా రైతులకు లభిస్తున్న కనీస రక్షణలు, భూసేకరణకు గ్రామ సభ ఆమోదం లాంటి సామాజిక భద్రత వంటి అంశాలకు తిలోదకాలు ఇచ్చాడు. ఇక ఇప్పుడు చంద్రబాబు తన అభివృద్ధి నమూనాకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చేసుకున్నాడు. భూ బ్యాంకుల పేరిట రైతులనుండి బలవంతంగా లాక్కొన్న భూముల్ని కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా కట్టబెడుతున్నాడు. వారికి అనేక రాయితీలను కల్పిస్తున్నాడు. వీటన్నిటి వెనుక వేల కోట్ల రూపాయలు చేతులు మారుతోన్నయనేది ఒక నిష్ఠూర సత్యం.

పోలవరం ప్రాజెక్టులో గుత్తేదారుల నుండి వచ్చే కోట్లాది రూపాయల కమిషన్ల కోసం, ప్రాజెక్టును నిర్మించాల్సిన కేంద్ర ప్రభుత్వ బాధ్యతను చంద్రబాబు తనపై వేసుకుని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పై నిందలు మోపుతున్నాడు. ప్రాజెక్టు నిధులపై వుండే శ్రద్ధ, ఆ ప్రాజెక్టువల్ల నిర్వాసితులైన ప్రజలపై లేదు. ప్రాజెక్టు పేరిట ఇప్పటికే ప్రభుత్వం 237 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించింది. అయితే ఇప్పటివరకు వారికి సరియైన పునరావాసం కల్పించలేదు. ఫలితంగా వేలాది మంది ఆదివాసీలు దుర్భర జీవితాల్ని గడుపుతున్నారు. ప్రాజెక్టు వెనుక ఛిద్రమైన జీవితాల్ని గురించి ఏ పత్రికా రాయదు. ఎంతసేపూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర నిందారోపణల పర్వమే మనకు వినిపిస్తుంది, కనిపిస్తుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై వ్యతిరేకత ఓ స్థాయిలో ఓ దశలో ముందుకు వచ్చినా, చివరకు అది పునరావాస ప్యాకేజీలకే పరిమితమయ్యింది.

అయితే శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు పై, ముంపు గ్రామాల ప్రజల నుండి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. ఈ ప్రాజెక్టు మూలంగా మొత్తం 34 గ్రామాలు పూర్తిగా మునిగిపోతాయి. అక్కడ స్థానిక ప్రజలు దీన్ని వ్యతిరేకిస్తే, ప్రభుత్వం 2 వేల మంది పోలీసుల్ని రంగంలోకి దించింది. మొత్తం గ్రామాలన్నీ పోలీసు క్యాంపులుగా తయారయ్యాయి. ఆ ఆందోళనకు స్థానిక పార్టీ నాయకత్వం వహించింది. ఫలితంగా, వారిపై 13 కేసులు పెట్టారు. ఉద్యమానికి ముందుండి నాయకత్వం వహించిన జిల్లా కమిటీ మెంబరుపై రౌడీ షీటు కూడా ఓపెన్ చేశారు.

ఆ సమస్య పై ఎవరు మాట్లాడినా కేసులో ఇరికిస్తామని పోలీసులు బెదిరించడం మొదలుపెట్టారు. ముంపు గ్రామలన్నింటిలోను 144 సెక్షన్ విధించారు. బయటి వారెవ్వరిని ఆ గ్రామాల్లోకి అనుమతించలేదు. గ్రామస్తుల్ని కూడా గుర్తింపు కార్డులు చూపితేనే గ్రామాల్లోకి అనుమతించారు. ఏ అవసరం వచ్చినా ఇతర గ్రామాల ప్రజలు పక్క గ్రామాల్లోకి వెళ్లలేని పరిస్థితి కల్పించారు. ఒకరకంగా చెప్పాలంటే పక్క గ్రామానికి వెళ్లడమంటే, పొరుగు దేశానికి వీసా తీసుకుని వెళ్లే పరిస్థితి కల్పించారు. పక్క పక్క గ్రామాలనే పొరుగు దేశాలుగా మార్చివేసారు. పునరావాసం విషయం వచ్చేసరికి సగం మంది ప్రజలకు కూడా ఈ నాటికీ పునరావాసం కల్పించలేదు.

పశ్చిమ గోదావరి జిల్లా తుందుర్రులో గోదావరి ఆక్వా ఫుడ్‌పార్క్ నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో మొదలై ప్రజా ఆందోళనలతో తాత్కాలికంగా ఆగిపోయింది. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే ప్రజా వ్యతిరేకతను కాదని, దాని నిర్మాణానికి అన్నిరకాల సహకారాన్ని అందిస్తానని ఫ్యాక్టరీ యాజమాన్యానికి భరోసా ఇచ్చాడు. ఫలితంగా క్విడ్ ప్రోకో లో భాగంగా చినబాబు గారికి వాటా ఇచ్చారని ప్రజలు అనుకుంటున్నారు. దాంతో ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగవంత మయ్యాయి. ఈ నిర్మాణానికి వ్యతిరేకంగా తుందుర్రు, 37 పరిసర గ్రామాల ప్రజలు ఉద్యమించారు. వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు వారి పోరాటాన్ని బలపరిచాయి. ప్రజా ఆందోళనపై పోలీసులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడి లాఠీఛార్జి జరపడంతో చాలా మందికి తలలు పగిలాయి, కాళ్లు చేతులు విరిగాయి. ప్రజలపై అనేక అక్రమ కేసులు మోపి జైలుకు పంపించారు. బెయిల్ కూడా రాకుండా అడ్డుకున్నారు. నెలల తరబడి ఆ గ్రామాలు పోలీసుల పహారాలోనే మగ్గేటట్లు ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది ఇంటిల్లిపాదినీ ఆడా మగా తేడా లేకుండా అక్రమ కేసుల్లో ఇరికించారు. కేవలం వృద్ధులు మాత్రమే గ్రామాల్లో ఉన్నారు. చాలామంది ప్రజా ప్రతినిధులపై కూడా కేసులు బనాయించడం జరిగింది. ఈ ఆక్వా ఫుడ్‌పార్కు వల్ల భవిష్యత్తులో తలెత్తే పర్యావరణ సమస్యలు చాలా తీవ్రంగా ఉండబోతున్నాయి.

ఈ ఆక్వాఫుడ్ పార్క్ పై చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని బట్టి చూస్తే, రేపు ప్రతిపాదిత కోస్టల్ కారిడార్ పేరుతో తీరం వెంబడి వచ్చే పరిశ్రమలతో, స్థానిక ప్రజలకు వారి మనుగడకు తీవ్ర ప్రమాదం పొంచి వుంది. తీర ప్రాంతం అంతా మరో తూత్తుకుడిగా మారుతుందనడంలో సందేహం లేదు

ప్రొ. సాయిబాబా విడుదల కోసం సభలు ఊరేగింపులు చేస్తే వాటిని భగ్నం చేస్తున్నారు. 'చలో అమలాపురం' కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. అడ్డంకుల్ని అధిగమించి అమలాపురం చేరుకున్న వారి వివరాలు సేకరించి, వారిని పోలీస్ స్టేషన్లకు పిలిపించి బెదిరిస్తున్నారు. ఒక్కముక్కలో చెప్పాలంటే, తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా, తన అభివృద్ధి నమూనాను వ్యతిరేకించే అన్నిరకాల ఉద్యమాల్ని అణచివేయడానికి చంద్రబాబు పోలీసులకు విచ్చలవిడి అధికారాల్ని ఇచ్చాడు. చంద్రబాబు అభివృద్ధి నమూనాలో ముఖ్యంగా రైతులు, రైతు కూలీలు తమ జీవనాధారపు హక్కుల్ని వేగంగా కోల్పోతున్నారు. ఇదివరకు చెప్పినట్లు అవసరానికి మించి రైతుల నుండి భూముల్ని లాక్కుంటున్నాడు.

ఇక్కడ రెండు ఉదాహరణల్ని ప్రస్తావిస్తున్నాను. ఒకటి భోగాపురం ఎయిర్‌పోర్టు విశాఖపట్టణం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం 60 కిలో మీటర్ల దూరంలో ఉన్న భోగాపురంలో ఎయిర్‌పోర్టు నిర్మించ పూనుకొని, అందుకోసం దాదాపు 22 వేల ఎకరాల భూమిని సమీకరించాలనుకున్నాడు. అక్కడ కూడా తీవ్ర వ్యతిరేకత ఎదురైనందువల్ల భూ సమీకరణ ప్రస్తుతానికి 6 వేల ఎకరాలకు పరిమితం చేసుకున్నాడు. రెండవది, కుప్పం విమానాశ్రయం. కుప్పం చంద్రబాబును గెలిపిస్తూ వస్తున్న నియోజకవర్గం. ఇది బెంగళూరుకు సమీపంలో ఉన్న చిన్న పట్టణం. అక్కడ విమానాశ్రయమే అవసరం లేదు. కేవలం తన నియోజక వర్గంలో విమానాశ్రయం ఉండాలనే మొండితనం తప్ప మరేమీ కాదు. అక్కడ కూడా వేలాది ఎకరాల పంట భూముల్ని సేకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్కడ కూడా రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తున్నప్పటికి, దాని బయటి ప్రపంచానికి తెలియనీయకుండా అనేక రూపాల్లో అణచి వేస్తున్నాడు.

చివరగా, చంద్రబాబు కీర్తి కండూతి కూడా ప్రజల ప్రాణాలను బలిగొంటున్న పరిస్థితిని మనం చూసాం. లౌకిక దేశంలో ప్రభుత్వాలు ప్రజల విశ్వాసాల్లో గాని, మతపరమైన కార్యక్రమాల్లో గాని తలదూర్చ రాదనే ప్రాథమిక రాజ్యాంగ విలువలకు, సూత్రాలకు తిలోదకాలు ఇస్తూ, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంతగా, పెద్ద ఎత్తున వందల కోట్లు ఖర్చుపెట్టి పుష్కర స్నానాలను, వాటి ప్రాశస్త్యాన్ని గురించి పుంఖాను పుంఖాలుగా ఊదరగొట్టింది. కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వం చేసిన ప్రచార ఆర్భాటాలకు ప్రభావితమై జనం తండోప తండాలుగా గోదావరి నదిఒడ్డుకు చేరిన వారిని షూటింగ్ పేరుతో పోలీసులు నిలువరించడం మూలంగా, చంద్రబాబు రంగ ప్రవేశంతో ఒక్కసారిగా వచ్చిన కదలిక వల్ల జరిగిన తొక్కిసలాటలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సంఘటనకు చంద్రబాబు నాయుడు పరోక్షంగా కారకుడే. ప్రజాస్వామ్యం సక్రమంగా నడుస్తున్న దేశాల్లో అయితే, చంద్రబాబుకు శిక్ష పడేది. నైతిక విలువలు వుంటే, చంద్రబాబు రాజీనామా చేసి ఉండేవారు. ఈ సంఘటనపై రాజ్యం మతాన్ని ప్రేరేపించే ప్రయత్నం చేసిందని, రాజ్యం ఆ పని చేయాల్సింది కాదని, ప్రజల ప్రాణాలు కోల్పోయే విధంగా ముఖ్యమంత్రి (చంద్రబాబు) వ్యవహరించారని, పౌరహక్కుల సంఘం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. పుష్కర స్నానం చేసి వచ్చిన న్యాయమూర్తి మరుసటి రోజు ఆ కేసును సున్నితంగా తిరస్కరించాడు.

చాలా సందర్భాల్లో న్యాయస్థానాలు ప్రజల వైపున కాకుండా, ప్రభుత్వాల వైపునే నిలబడుతున్నాయి. ప్రజలు అందరిని, అన్ని వ్యవస్థల్ని గమనిస్తూనే ఉన్నారు. చంద్రబాబు నాలుగు సంవత్సరాల పాలనను, అతను తీసుకున్న విధాన నిర్ణయాలను, యూటర్న్‌లను అన్నింటిని గమనిస్తూనే ఉన్నారు. జనబాహుళ్యం అభీష్టాలకు, అభిమతాలకు అనుగుణంగా పాలకులు మనల్ని పరిపాలించే రోజుల కోసం ఎదురు చూడడమే కాకుండా, ఇప్పటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్య పరచడం మన ముందున్న కర్తవ్యంగా భావిద్దాం.

(రచయిత పౌరహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు) వీ

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా పరిరక్షణ ఉద్యమం-2

విద్యా వ్యవస్థ పూర్తిగా ప్రైవేటు రంగం అధీనంలోకి వెళ్లిపోయిందనీ, విద్యా వ్యాపారాన్ని పెంపొందించడానికే పాలకులు ఎక్కువగా శ్రద్ధ చూపిస్తున్నారనీ అంటున్నారు **రమేష్ పట్నాయక్**

అందరికీ విద్య – పాఠశాలల మూసివేత

నిజానికి అందరికీ విద్య పాలకవర్గాల నినాదమే. అందరికీ ప్రమాణాలుగల విద్య గురించి కూడా పాలకవర్గాలు మాట్లాడుతున్నాయి. అయితే ప్రమాణాలు గల విద్య అంటే వారి ఉద్దేశ్యంలో ఆంగ్లమాధ్యమ విద్య అని అర్థం. పైసా అదనం ఖర్చులేకుండా ఆంగ్లమాధ్యమ విద్య ప్రవేశపెడుతున్నారు. ఇక అందరికీ సమాన విద్య విషయానికి వస్తే పాలకవర్గాలు ఈ విషయంపై ఈ రోజులలో మాట్లాడడం కూడా లేదు. 1986 నాటి పాలసీ సమాన విద్యకు గోరీకట్టింది. ఇప్పుడు 2016 ముసాయిదా ద్వారా కేంద్ర ప్రభుత్వం అందరికీ సమాన పాఠ్యప్రణాళికను కూడా వ్యతిరేకిస్తోంది.

అందరికీ పాఠశాల విద్యకు పరిమితం అయి మనం పరిశీలిస్తే కూడా వరుస ప్రభుత్వాల వైఫల్యం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10వ తరగతి లోపున బాలలు బడిమానివేయడం 21 శాతంగా ఉంది. 100 శాతం నమోదు, 100 శాతం నిలుపుదలకై ప్రభుత్వాలు వస్తుపరమైన మద్దతు, ఉపాధ్యాయులు నైతిక మద్దతు ఇవ్వాలి. అయితే ప్రభుత్వం అవసరమైన మద్దతు చర్యలు చేపట్టకుండా డ్రాప్ ఔట్ నేరాన్ని పూర్తిగా ఉపాధ్యాయుల మీదికి నెట్టివేస్తోంది. ఆ పైన విద్యార్థులు లేరని పాఠశాలలు మూసివేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తరువాత మొదటి సంవత్సరం క్లస్టరైజేషన్ పేరుతో 80శాతం పాఠశాలలు మూసి వేయడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. విద్యార్థి, ఉపాధ్యాయ, విద్యారంగ ఉద్యమాల వలన సదరు క్లస్టరైజేషన్ కార్యక్రమాన్ని రద్దు చేసుకోవలసి వచ్చింది. తరువాత రేషనలైజేషన్ పేరుతో 50 శాతం పాఠశాలలు మూసివేయాలనే ప్రయత్నం జరిగింది. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలల దొంతరను మొత్తంగా రద్దు చేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే, విద్యా పరిరక్షణ ఉద్యమం వలన ఈ ప్రయత్నాలన్నీ ప్రభుత్వం మానుకోవలసి వచ్చింది.

పాఠశాలల మూసివేతలకు 2017లో చేసిన ప్రయత్నాన్ని విద్యాపరిరక్షణ ఉద్యమం విజయవంతంగా ఎదుర్కొంది. అంతేకాదు తెలుగుదేశం ప్రభుత్వం పాఠశాలలను మూసి వేస్తూందని ఒక ప్రచారం ప్రజలలో రావడానికి విద్యాపరిక్షణ ఉద్యమమే కారణం. ఉద్యమ క్రమంలోనే ఈ దశ వచ్చింది. దానితో క్యాబినెట్‌లో ఆందోళన వ్యక్తమయ్యింది. ప్రభుత్వం వెనక్కి తగ్గింది. గత నాలుగు సంవత్సరాల కాలంలో మూసివేతలు మొత్తంగా చూసుకుంటే 5శాతం లోపునే ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలల మూసివేసే ప్రయత్నాలకు ప్రభుత్వం ధైర్యం చేయలేకపోయింది. అయితే, ఉపాధ్యాయుల పోస్టులను క్రమంగా రద్దు చేయడం ప్రస్తుత ప్రయత్నంగా ఉంది.

ప్రమాణాలు గల విద్య – ఉపాధ్యాయ పోస్టుల రద్దు

ప్రమాణాలు గల విద్య అన్న విషయం చాలా పెద్ద విషయం. విద్యా వ్యాపారం రద్దు చేయకుండా ఉమ్మడి పాఠశాల విధానం ఏర్పడకుండా నిజమైన ప్రమాణాలుగల విద్య గురించి మాట్లాడడం సాధ్యం కాదు. ఇక్కడ ప్రమాణాలుగల విద్య అన్నదానిని మనం చాలా సంకుచిత అర్థంలో మాట్లాడుతున్నాం. పాఠ్య ప్రణాళికల, బోధనా పద్ధతుల శాస్త్రీయత గురించి ఇక్కడ మాట్లాడడం లేదు. కనీస వసతులు, అవసరమైనంతమంది అర్హతగల ఉపాధ్యాయుల నియామకం గురించి మాత్రమే మాట్లాడుతున్నాం. అవి కూడా ప్రభుత్వాలు కల్పించని పరిస్థితి. అయితే ప్రాథమిక పాఠశాలలలో బాలల నమోదు 41 వద్ద 3వ, 61 వద్ద 4వ పోస్టు ఇవ్వమంటే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదు. మోడల్ ప్రాథమిక పాఠశాలలకు 5 పోస్టులిచ్చినా వాటికి చట్టపరమైన రక్షణ లేదు. మరొక జి.ఒ ఇచ్చి ఎప్పుడైనా వాటిని సాధారణ పాఠశాలలుగా మార్చివేయవచ్చు. 2017 మే నెలలో ఇచ్చిన పాఠశాల విద్యాశాఖ (ఎస్.ఇ) 29 జి.ఒ లో విద్యార్థి, ఉపాధ్యాయ, విద్యారంగ పోరాటాల వలన ఉన్నత పాఠశాలలకు గతం కంటే మెరుగైన స్టాఫ్ ప్యాటర్న్ ఇచ్చారు. కాని ఇది కూడా తాత్కాలికమే. ఈ స్టాఫ్ ప్యాటర్న్‌కు కూడా చట్టపరమైన రక్షణ లేదు.

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య 60 వరకు ఇద్దరు ఉపాధ్యాయులను ఇవ్వాలి. అయితే ఉమ్మడి రాష్ట్ర కాలం నుంచి విద్యార్థుల నమోదు 20 లోపున ఉన్న ప్రాథమిక పాఠశాలలకు ఒక ఉపాధ్యాయుడిని, 20 నుంచి 60 వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులను ఇవ్వడం అనే పద్ధతి ఉంది. విద్యార్థుల సంఖ్య 20 లోపున ఉన్నాకూడా ఇద్దరు ఉపాధ్యాయులను ఇవ్వాలని, ఆమేరకు ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని వచ్చిన పబ్లిక్ లిటిగేషన్‌పై ఉమ్మడి హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో అదే విధానం కొనసాగుతూంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ ప్రభుత్వం మరింత దిగజారి, విద్యార్థి నమోదు 30 లోపున ఉన్న ప్రాథమిక పాఠశాలలన్నింటినీ ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చాలని ప్రయత్నిస్తూంది. ఈ మేరకు కమీషనర్ కార్యాలయం నుండి సెక్రటేరియట్‌కు ప్రతిపాదనలు వెళ్లాయి. విద్యార్థి నమోదు 21 నుంచి 30 వరకు 8,315 ప్రాథమిక పాఠశాలలున్నాయని, వాటికి రెండు ఉపాధ్యాయ పోస్టులు చెప్పున 16,630 పోస్టులున్నాయని, వాటిని ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చివేస్తే 8,315 పోస్టులు మిగులుతాయని కమీషనర్ కార్యాలయం విద్యాశాఖ కార్యదర్శికి ఒక లేఖ పంపింది. విద్యాశాఖ కార్యదర్శి అడిగిన మీదటనే ఈ లేఖ పంపి ఉండవచ్చు.

ఆలోచన ఎక్కడ ప్రారంభమైనా ప్రభుత్వం చాలా పెద్ద దురాలోచన చేస్తూంది. ఇది ఇలా ఉండగా, ప్రాథమిక పాఠశాలలలో కొన్ని ద్వంద్వ నమోదులు బయటపడడం, అధికాధికంగా బాలలు ప్రైవేటు పాఠశాలలకు తరలడం, కుటుంబాల వలస పెరగడం, పట్టణ అంతర భాగాల నుంచి పేద కుటుంబాలు శివారులకు నెట్టివేయబడడం వంటి కారణాల వలన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నమోదు కొంత తగ్గింది. దీనిని ఆసరా చేసుకుని ఉపాధ్యాయ పోస్టులను తగ్గించడానిక ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆ విధంగా 5,671 పోస్టులు మిగులు చూపించడం జరుగుతుంది. ముందుగా వివరించిన 8,315 పోస్టులను కలిపి మొత్తం 13,986 పోస్టులను అదనంగా చూపించి రద్దుచేయదానికి ప్రయత్నిస్తున్నారు.

నిజానికి విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం పోస్టులు అదనంగా లేవు, కొరతగా ఉన్నాయి. ప్రభుత్వ, పంచాయితీరాజ్ శాఖలలో ప్రాథమిక పాఠశాలల సంఖ్య 30,120. వీటికి మంజూరైన పోస్టులు 75,060. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం వీటికి 76,262 పోస్టులు కావాలి. అంటే ఇంకా 1,202 ఎస్‌జిటి పోస్టులు కొరత అన్న మాట. మిగులు పోస్టులకు ఆస్కారమే లేదు. ఇక ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి ఇచ్చిన వెసులుబాటు ప్రకారం 20లోపున నమోదు ఉన్న పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నిర్వహించి 21 నుంచి 60 వరకు నమోదు ఉన్న పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు ఆపై నమోదు ఉన్న పాఠశాలలకు కూడా విద్యాహక్కు చట్టం 2009 అమలు చేస్తే 69,389 ఎస్‌జిటి పోస్టులు అవసరం అవుతాయి. దీని ప్రకారం 5,671 మిగులు పోస్టులు ఉంటాయి. విద్యా ప్రమాణాల మెరుగుదలకు విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని 20:1 గా అభివృద్ధి చేస్తే ఈ మిగులు ఉండదు. అయితే ప్రభుత్వం అందుకు వ్యతిరేక దిశలో వెళుతూంది. నమోదు 21-30 ఉన్న పాఠశాలలను కూడా ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చివేయాలని చూస్తోంది. ఇదంతా ఎందుకంటే విద్యా ప్రమాణాల పెరుగుదల కొరకు వనరుల సక్రమ ఉపయోగం అంటుంది. ఈ మాటను ప్రపంచబ్యాంకు జెర్గ్ నుంచే తీసుకున్నారు.

గత పది సంవత్సరాలలో ఉన్నత పాఠశాలలలో నమోదు పెరిగింది. పాఠశాల విద్యాశాఖ జి.ఒ 29/2017 ప్రకారం స్టాఫ్ ప్యాటర్న్ అమలు చేయాలంటే 3,626 ఉన్నత పాఠశాల పోస్టులు కొత్తగా కావాలి. వీటిని కొత్తగా మంజూరు చేయడానికి బదులు 4,553 ఎస్‌జిటి పోస్టులను సరెండర్ చేసి వాటి స్థానంలో 3,626 ఉన్నత పాఠశాల పోస్టులను సృష్టిస్తున్నారు. (ఈ ప్రక్రియ కూడా పూర్తికాలేదు). దీనిని మనం ఎలా అర్థం చేసుకోవాలి?

వసతుల కల్పన - కేంద్రీకృత అవినీతి

రాష్ట్రంలో మొత్తం 44,591 ప్రభుత్వ అన్ని శాఖల పాఠశాలలలో సుమారు 13 శాతం పాఠశాలలకు పనిచేస్తున్న మరుగుదొడ్లు లేవు. మూడు వేల పాఠశాలలకు తాగునీరు లేదు. 2,600 పాఠశాలలకు విద్యుత్ లేదు. విద్యుత్ ఉన్న వాటిలో చాలా వాటికి విద్యుత్ కనెక్షన్ లేదు. 19,646 పాఠశాలలకు మాత్రమే తగినంత ఆట స్థలం ఉంది, ఇవన్నీ ప్రభుత్వ గణాంకాలే. వాస్తవ సర్వే చేయగలిగితే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తుంది. ఇక ప్రహరీ గోడలు లేనివి, తగినన్ని తరగతి గదులు లేనివి, ఫ్యాన్‌లు, లైట్లు లేనివి, ప్రయోగశాలలు లేనివి పదులవేల సంఖ్యలో ఉన్నాయి.

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగిన నాటి నుండి ప్రభుత్వం పాఠశాలల మౌలిక వసతుల కల్పన గురించి మాట్లాడుతూనే ఉంది. అయితే ఒక్క ఇటుక బెడ్డ పడలేదు. సింగపూరు వంటి రాజధాని మీద ఉన్న శ్రద్ధ పేద, దళిత బాలలు చదువుకునే పాఠశాలల మీద లేదు. పాఠశాలలలో కనీస వసతులు కల్పనకు రు. 4,848 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో ప్రతి సంవత్సరం ఒక వెయ్యి కోట్లు మంజూరు చేస్తే పని అయిపోయేది. ఆంధ్రప్రదేశ బడ్జెట్‌లో వెయ్యి కోట్లు అంటే ఒక శాతం కూడా కాదు. కాని ప్రభుత్వం ప్రాధాన్యతలు వేరుగా ఉన్నాయి. గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం ఒక కొత్త పల్లవి ఎత్తుకుంది. హైబ్రిడ్ ఏన్యూయిటీ మోడ్‌లో నిర్మాణం చేస్తామంటుంది. మార్క్‌ట్వేన్ నవలలో హకల్ బెరిఫీన్ ఆధ్యాత్మిక వరాలు గురించి విని ఆందోళన పడినట్లు ఈ హైబ్రిడ్ యాన్యూయిటీ అంటే ఏమిటో అని మనకు ఆందోళన కలుగుతుంది. దీనర్థం ఏమంటే ప్రభుత్వం 40 శాతం నిధులిస్తుంది. మిగిలిన నిధులను కాంట్రాక్టర్ సమకూర్చుకోవాలి. వాటిని వడ్డీతో సహా ప్రభుత్వం పది సంవత్సరాలలో తీర్చివేస్తూంది. ఇందులో జరగగల అవినీతి గురించి నేను రాయగలిగే దాని కంటే పాఠకులకు ఎక్కువ తెలుసు. ఇంకా బేరసారాలు పూర్తికాలేదు. ఇంతవరకూ ఈ యాన్యూయిటీ పద్ధతిలో రూపొందించబడిన కాంట్రాక్టు ఉనికిలోనికి రాలేదు. ఈ కాంట్రాక్టు ఎన్నికల వనరుల సమీకరణకు పనికిరావచ్చు.

విశృంఖలం కానున్న ప్రైవేటు

ఒక్కమాటలో చెప్పాలంటే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రకటనలకు మాత్రమే పరిమితం. అందరికీ విద్యకు బదులు పాఠశాలల మూసివేతలు, ప్రమాణాలు గల విద్యకు బదులు ఉపాధ్యాయ పోస్టుల రద్దు, వసతుల కల్పనకు బదులు ఎన్నికల వనరుల సమీకరణ జరుగుతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం చేయగల ప్రైవేటు పాఠశాలల నియంత్రణకు సంబంధించి పరిశీలిస్తే ప్రభుత్వ విధానాలు తద్వ్యతిరేక దిశలో ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు ప్రోధిత సంస్కరణలు వ్యాపారాన్ని డీరెగ్యులేట్ చేయమంటు న్నాయి, ప్రపంచబ్యాంకు ప్రస్తుతం అమలులో ఉన్న నామమాత్రపు నియంత్రణలను కూడా ఎత్తివేయమంటోంది. దీనికే పశ్చిమ దేశాలలో ఉన్న ఉద్యమకారులు జెర్మ్ అని పేరుపెట్టిన విషయం మనం గమనించాం. భారత దేశం విషయానికి వస్తే ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రి (ఫిక్కీ) పాఠశాల విద్యలో వ్యాపారాన్ని డీరెగ్యులేట్ చేయడానికి ఒక ముసాయిదా బిల్లును రూపొందించింది. దీనిని 'స్వయం పోషిత స్వతంత్ర పాఠశాలల (స్థాపన, నియంత్రణ) బిల్లు-2017' అంటున్నారు. రాజ్యసభలో మెజారిటీ లేనందున పార్లమెంటులో ఈ బిల్లును పాస్ చేయడం సాధ్యం కాదని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల వారీగా చట్టంచేసే అవకాశాలను ఉపయోగించు కోమని ఫిక్కీకి చెప్పి, వారిని ఎంగేజ్ చేయమని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఫిక్కి తన టీమ్‌లను అన్ని రాష్ట్రాలకు పంపినట్లు ఉంది. మహారాష్ట్రలో అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టారని తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ బిల్లుపై పాఠశాల కమీషనర్ ఒక సెమినార్ నిర్వహించారు. ఆ సెమినార్‌కు విద్యార్థి సంఘాలను పిలవలేదు. ఉపాధ్యాయ సంఘాలను, ఉపాధ్యాయ ఎంఎల్‌సిలను, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను మాత్రమే ఆహ్వానించారు. నారాయణ, చైతన్య ప్రతినిధులు తప్ప మిగిలిన

వారందరూ దానిని వ్యతిరేకించారు. ప్రస్తుతానికి ఈ బిల్లును ప్రభుత్వం ప్రక్కకు పెట్టినట్లు ఉంది. ఎన్నికల తరువాత అధికారంలోనికి ఎవరు వచ్చినా ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది లేదా చివరి సెషన్‌లో ఇదే ప్రభుత్వం అసెంబ్లీలో పెట్టి పాస్ చేయవచ్చు.

ఈ బిల్లులో సూచించిన విధివిధానాలు వివరంగా చెప్పడం ఇక్కడ సాధ్యం కాదు. అయితే క్లుప్తంగా ప్రస్తావిద్దాం. ఈ మధ్య ఒక సినిమా డైరెక్టర్ కలిసారు. కథను ఒక్క మాటలో చెప్పగలిగితేనే సినిమా రక్తి రక్తికడుతుందని చెప్పారు. అది నిజమే కావచ్చు. ఆ ప్రాతిపదికన ఈ బిల్లు ఒక డీ రెగ్యులేషన్ బిల్లు అని చెపితే సరిపోతుంది. మరి కాస్తా వివరంగా చెప్పాలంటే ఈ బిల్లులో విద్యార్థుల ఫీజులకు గరిష్ట పరిమితి లేదు. ఉపాధ్యాయల జీతాలకు కనిష్ట పరిమితి లేదు. లాభాలు చేసుకోవడానికి ఎటువంటి పరిమితి కూడా లేదు. లాభాలను తరలించుకు పోవడానికి ఎటువంటి ఆటంకం లేదు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి హక్కులు ఉండవు. పేరెంట్స్‌కు ఎటువంటి ఉపయోగకరమైన ప్రాతినిధ్యం ఉండదు. ప్లే గ్రౌండు ఉండాలన్న నిబంధన గాని, ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్య పుస్తకాలనే ఉపయోగించాలనిగాని నిబంధనలు లేవు. దేశంలో గుర్తింపు ఉన్న ఏ బోర్డు పాఠ్య పుస్తకాలనైనా ఉపయోగించవచ్చు. పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, బట్టలు అన్నింటినీ యాజమాన్యాలు అధికారికంగా తమతమ ఆవరణలలో అమ్ముకోవచ్చు, ఇలా సాగింది బిల్లు. ఈ డిరెగ్యులేషన్‌ను ఎదుర్కోవడం విద్యా పరిరక్షణ ఉద్యమాలకు ఒక ప్రధాన అంశంగా ముందుకు వస్తుంది.

అటకెక్కిన మాతృభాష

ఈ నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించినది ఏమైనా ఉందంటే అది తెలుగు, ఉర్దూలను అటకెక్కించడం అని చెప్పవచ్చు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అనంతరం ఒక సంవత్సర కాలంలోనే ప్రభుత్వ పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమం దాడి ప్రారంభమయ్యింది. 2015 ఆగస్టు నెలలో పాఠశాల విద్యాశాఖ జి.ఒ నెంబరు 53ని తీసుకు వచ్చింది. దీని ప్రకారం రాష్ట్రంలో ఉన్న 3,428 సక్సెస్ పాఠశాలలో తెలుగు మాధ్యమాన్ని ఎత్తివేసి ఆంగ్ల మాధ్యమాన్ని మాత్రమే ఉంచుతారు. తెలుగు మాధ్యమంలో 69 శాతం బాలలు చదువుతున్నారు. అది వారి ఎంపిక. ఇక ఆంగ్ల మాధ్యమంలో 31 శాతం బాలలు చదువుతున్నారు. తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా ఎత్తివేయడం వలన తెలుగు మాధ్యమం బాలలు బలవంతంగా ఆంగ్ల మాధ్యమంలోనికి మారవలసి ఉంటుంది. సదరు జిఒలో మరొక చక్కని మాట కూడా ఉంది. అదేమంటే, ఆంగ్ల మాధ్యమానికి మారడానికి ఇష్టంలేని బాలలు సక్సెస్ పాఠశాలల నుండి బయటకు వెళ్ళిపోవాలి, ఆ విద్యార్థులు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న ఇతర ఉన్నత పాఠశాలలకు వెళ్లవచ్చు. అవి అందుబాటులో లేకుంటే తమకు దగ్గరలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో చేరితే, అ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్చడానికి ప్రయత్నిస్తాం అన్నారు. 9 లక్షల 19వేల పైచిలుకు పిల్లలను అమాంతంగా సక్సెస్ పాఠశాలల నుంచి తరిమి వేయడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ఉద్యమాల ఫలితంగా తాత్కాలికంగా అడుగు వెనక్కి వేసింది. అయితే మరల 2016 మార్చిలో ఇదే జిఒను అమలు చేయడానికి ప్రయత్నించింది. తిరిగి ఉద్యమాల వలన ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇలా లాభం లేదని అనుకుని ప్రభుత్వం తన రూటు మార్చింది. విద్యాశాఖ ద్వారా కాకుండా మున్సిపల్ శాఖ ద్వారా తన అడ్డగోలు ప్రయత్నాలు ప్రారంభించింది. బిల్డింగుల నిర్వహణకు, ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలకు మాత్రమే పరిమితమవ్వవలసిన మున్సిపల్ శాఖ మున్సిపల్ పాఠశాలలన్నింటిలో ఆంగ్ల మాధ్యమాన్ని తప్పనిసరి చేస్తూ 2016 అక్టోబర్‌లో ఒక జీ.ఒను తీసుకువచ్చింది. అయితే విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్య, మౌలిక వనరుల అందుబాటు వంటి విషయాలలో కొన్ని కనీస పరిస్థితులున్న పాఠశాలలలో మాత్రమే ఆంగ్ల మాధ్యమానికి పూర్తిగా మారాలని (ఫుల్ కన్వర్షన్) కొన్ని నిబంధనలు పెట్టింది. అయితే, అక్కడితో ఆగలేదు. మరొక అడుగు ముందుకువేసి పరిస్థితులతో నిమిత్తం లేకుండా మున్సిపల్ పాఠశాలలన్నింటిలో ఆంగ్ల మాధ్యమాన్ని తప్పనిసరి చేస్తూ 2017 జనవరి 2వతేదీన జీ.ఒ నెం.14 తీసుకువచ్చింది. ఈ జి.ఒ మీద చాలా వ్యతిరేకత వచ్చింది. దీనిపై విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, విద్యాపరిరక్షణ ఉద్యమాలే కాక మాతృభాషా పరిరక్షణ ఉద్యమాలు కూడా గళమెత్తాయి. విధాన పరిషత్తులో కూడా ఉపాధ్యాయ ఎంఎల్‌సిలు ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం చివరికి కొంత దిగి వచ్చింది. జి.ఒ 14ను పూర్తిగా రద్దుచేయలేదు. విద్యార్థులు కోరుకుంటే తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా నిర్వహించవచ్చని జిఒ ఇచ్చింది. ఆచరణలో ఆంగ్ల మాధ్యమమే అమలు జరుపుతోంది. విద్యాపరిరక్షణ ఉద్యమంలో ఉన్న ఉపాధ్యాయ సంఘాలకు పట్టణాలలో బలం లేకపోవడం వలన జి.ఒ 14 విషయంలో గ్రౌండు లెవెల్ ఉద్యమం సాధ్యం కాలేదు. అందుకే ప్రభుత్వం ముందుకు వెళ్లగలిగింది.

మున్సిపల్ శాఖ నుంచి ప్రేరణపొంది, పాఠశాల విద్యాశాఖ తిరిగి తన దాడిని ప్రారంభించింది. ఉన్నత సక్సెస్ పాఠశాలలలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తూనే ప్రాథమిక పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమాన్ని సమాంతరంగా ప్రారంభించింది. 2018-19 విద్యాసంవత్సరంలో 1వ తరగతిలో ప్రారంభించింది. 2022-23 విద్యాసంవత్సరం నాటికి అన్ని గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమం సమాంతరంగా వస్తుంది. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయకపోవడం వలన వ్యతిరేకత రాలేదు. జిఒలో సమాంతరం అని చెప్పారు గాని నిజానికి సమాంతరం కాదు. ఎందుకంటే సుమారు ముప్పయివేల ప్రాథమిక పాఠశాలలలో రెండు సెక్షన్లు నిర్వహించగలందులకు అవసరమైన నమోదు వెయ్యి పాఠశాలలలో కూడా లేదు. అంటే 2023-24 విద్యాసంవత్సరంలో ఉన్నత పాఠశాలలలో తెలుగు మాధ్యమాన్ని తీసుకోవడానికి ఎవరూ ఉండరన్న మాట. ప్రభుత్వం తెలుగు మాధ్యమానికి చరమగీతం పాడింది. తెలుగు మాధ్యమం గల్లంతైన చరిత్ర ఇది. అయితే అంతకు ముందే తెలుగు ఒక బోధనా విషయంగా అనేక దాడులకు గురయ్యింది. ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రైవేటు పాఠశాలలలో తెలుగు స్థానంలో కాంపోజిట్ తెలుగు పెట్టారు. 100 మార్కుల పేపరుకు 70 మార్కులు తెలుగు, 30 మార్కులు సంస్కృతం. అలాగే ప్రైవేటు ఇంటర్ కళాశాలలలో తెలుగు పేపరు స్థానంలో మొత్తం సంస్కృతం పెట్టారు. ఈ రోజులలో తెలుగు భాషపై విపరీతమైన అభిమానం ప్రకటిస్తున్న పాలక పార్టీలు, వ్యక్తులు మాతృభాషా మాధ్యమం గురించి మాట్లాడడం లేదు. మాతృభాషను గురించి మాత్రమే మాట్లాడుతున్నారు. మాతృభాష గురించి కూడా మాట్లాడడం లేదు. తెలుగు గురించి మాత్రమే మాట్లాడుతున్నారు. ఉర్దూ

మాట్లాడే వారికి ఉర్దూ దూరం చేస్తున్నారు. ఇతర భాషా మైనారిటీల పరిస్థితి మరింత ఘోరం. నిజానికి వీరి అజెండాలో తమిళ ప్రభుత్వం తమిళాన్ని ఇతర భాషల ప్రజలపై రుద్దుతున్నట్లు, తెలుగును తెలుగు రాష్ట్రాలలో ఇతర భాషల ప్రజలపై ప్రధానంగా ఉర్దూ మాట్లాడేవారిపై రుద్దే కుట్ర ఉంది.

తెలుగు రాష్ట్రాలలో తెలుగు మాధ్యమాన్ని ఎందుకు కాపాడుకోలేక పోయాం అన్నది పెద్ద చర్చనీయాంశం. ఆ చర్చ వివరంగా ఈ వ్యాసంలో సాధ్యం కాదు. అయితే ముక్తసరిగా మూడు మాటలు చెప్పుకుందాం. విద్యారంగంలో ప్రైవేటీకరణే ఆంగ్ల మాధ్యమానికి బలమైన పునాది అన్నది తెలిసిందే. 70ల వరకు ప్రైవేటు పాఠశాలలు అంటే ప్రధానంగా ఉచితంగా చదువు చెప్పే మిషనరీ పాఠశాలలు మాత్రమే. మిషనరీ పాఠశాలలలో అన్-ఎయిడెడ్ పాఠశాలలు బ్రిటిష్‌కాలం నుండి నేటి వరకూ ఆంగ్ల మాధ్యమంలో నడుస్తున్నాయి. అయితే ఇవి చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. వ్యాపార మాధ్యమంలో ప్రైవేటు వచ్చిన తరువాతనే అంటే 80లలో ఆంగ్ల మాధ్యమం పెచ్చుపెరిగింది. విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాలు, విద్యారంగ ఉద్యమాలు ప్రైవేటు రంగాన్ని, ఆంగ్ల మాధ్యమాన్ని వ్యతిరేకించాయిగాని, అయితే, నిలువరించే ఉద్యమాలు చేపట్టలేదు. మరొక విషయం, ఆంగ్ల మాధ్యమం వలననే ప్రైవేటు పెరగలేదు. ప్రభుత్వం ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న పాఠశాలలను నిర్లక్ష్యం చేయడం వలన, కనీస వసతులు కల్పించకపోవడం, అవసరమైనంత మంది ఉపాధ్యాయులను నియమించకపోవడం వలన, నిర్వహణ అలసత్వం వలన, ప్రభుత్వ పాఠశాలలు రెగ్యులర్‌గా నడవవు అనే అభిప్రాయం వచ్చింది. ప్రైవేటు పాఠశాలలకు సమాజం పొరలు పొరలుగా మారడం ప్రారంభించింది. విద్యార్థి, ఉపాధ్యాయ, విద్యారంగ ఉద్యమాలు డిమాండు చేయడం వలన 2001లో ఉన్నత పాఠశాలలలో ఆంగ్ల భాషా బోధనకు ఒక ఉపాధ్యాయ పోస్టు మంజూరు అయ్యింది. అయితే, ఇది ఎస్‌జిటిల పదోన్నతులకే పనికి వచ్చింది. రాత్రికి రాత్రి ఇంగ్లిష్ మెథడాలజి సర్టిఫికేట్లు తెచ్చుకుని ఇంగీషు రానివారు ఇంగ్లిష్ టీచర్ల అయిపోయారు. ఉన్నత పాఠశాలలలో ఇంగ్లిష్ వచ్చిన వారు ఇంగ్లిష్ టీచర్లుగా ఉండి ఉంటే, మాతృభాషా మాధ్యమ విద్యార్థులకు మంచి ఇంగ్లిష్ వచ్చేది. మాతృభాష ద్వారానే పరాయిభాష మెరుగ్గా నేర్చుకోవచ్చు అని మనం చెప్పే సిద్ధాంతం రుజువయ్యేది. చివరికి 2010లో అనుకుంటాను, ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం ఒకటవ తరగతి నుండి ఇంగ్లిష్‌ను ఒక బోధనా విషయంగా పెట్టింది. అయితే అందుకు ప్రత్యేక అర్హతలు గల పోస్టును ఇవ్వలేదు. ఫలితం శూన్యం. ప్రాథమిక స్థాయిలో ఆంగ్లభాషా బోధనకు ప్రత్యేక విద్యార్హతలుగల ఉపాధ్యాయ పోస్టును విద్యాహక్కు చట్టానికి అదనంగా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండు చేస్తూ ఉంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. మొత్తంపైన ప్రభుత్వ పాఠశాలలలో ఇంగ్లిష్ వచ్చే పరిస్థితి లేదు. ప్రైవేటులో ఉందా అంటే ప్రైవేటులో కూడా ఇంగీషు వచ్చే పరిస్థితి లేదు. కాని అక్కడ చాలా పరిమితంగా కొన్ని కమ్యూనికేషన్ స్కిల్స్ వస్తాయి. కొన్ని సాంకేతిక పదాలు పరిచయం (అర్థం కాదు) అవుతాయి. అదే ఇంగ్లిష్ రావడంగా ప్రచారం అయింది. ఈ విధంగా గత నాలుగు దశాబ్దాలుగా జరిగిన ప్రభుత్వ పాఠశాలల ఎడల ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రభుత్వ పాఠశాలలలో ఆంగ్ల భాషను ఒక బోధనా విషయంగా సమర్థవంతంగా బోధించడంలో జరుగుతున్న నిర్లక్ష్యం కలగలసి ప్రైవేటు పాఠశాలల విస్తరణకు, ప్రభుత్వ పాఠశాలల కుదింపునకు దారితీసింది.

మౌలికంగా ఇది ప్రభుత్వ విధానం. సుమారు 50 శాతం కుటుంబాలు ప్రైవేటు పాఠశాలలకు తరలిపోయిన తరువాత ఆంగ్ల విద్య ఒక మోజుగా మారిపోయింది. కాదు అలా చెప్పడం తప్పు. ప్రభుత్వాలే ఆంగ్ల విద్యను ఒక మోజుగా మార్చివేశాయి. ప్రభుత్వ పాఠశాలలలో కార్పొరేట్ విద్య అని ప్రచారం చేసాయి. కార్పొరేట్ విద్య ప్రమాణాలు గలది అని చెప్పడం ఒక అపసవ్యం. ప్రమాణాలు గల విద్య అంటే ఆంగ్ల మాధ్యమం అని చెప్పడం మరొక దురన్వాయం. ఈ విధంగా పైసా ఖర్చు లేకుండా, ఊరకే బోధనా మాధ్యమాన్ని మార్చే ప్రకటన ద్వారా పాలకవర్గాలు ప్రజాసేవ చేయడం ప్రారంభించాయి.

కొత్తగా తరగతి గది కట్టనవసరం లేదు, కొత్తగా ఉపాధ్యాయ పోస్టు ఇవ్వనవసరం లేదు. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి గొప్పపేరు సంపాదించుకోవచ్చు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. మనం క్లుప్తంగా చెప్పుకోవాలంటే ప్రభుత్వంలో మాతృభాషా మాధ్యమం, ప్రైవేటులో ఆంగ్ల మాధ్యమం ఈ వైరుధ్యం చిరకాలం కొనసాగజాలదు. ప్రైవేటులో కూడా మాతృభాషా మాధ్యమాన్ని ప్రజాతంత్ర ఉద్యమాలు సాధించలేక పోయినందువలన పాలకులు ప్రభుత్వంలో కూడా ఆంగ్ల మాధ్యమాన్ని పెట్టగలుగుతున్నారు. విద్యారంగ ఉద్యమాలు ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన వసతులను, అవసరమైనంతమంది ఉపాధ్యాయులను ఉపాధ్యాయులలో తగినంత నిబద్ధతను సాధించుకోలేకపోతే ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు అనే ద్వంద్వం కూడా మిగలదు. మిల్టన్ ఫ్రైడ్‌మన్ చెప్పిన రీయంబర్స్‌మెంటు విధానం సర్వవ్యాప్త మవుతుంది. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ నిధులు కూడా ప్రైవేటు యాజమాన్యాల చేతిలోనికి వెళతాయి.

గత నాలుగు సంవత్సరాల కాలంలో విద్యారంగంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం, ప్రజా ఉద్యమాలు గురించి మనం కొంత పరిశీలించాం. చివరగా క్రోడీకరించి చూస్తే కేంద్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు విధానాలను (జెర్క్స్) అమలు చేయడనికి, అలాగే కాషాయీకరణను అమలు చేయడానికి ప్రయత్నించింది. విద్యా వ్యాపారీకరణలో భాగంగా పాఠశాలలను మూసివేయడం, ఉపాధ్యాయ పోస్టులను రద్దుచేయడం ఒక వైపు, ప్రైవేటు విద్యను మరింత విశృంఖలం చేయడం, రెండవ వైపు అలాగే తెలుగు, ఉర్దూ వంటి మాతృభాషలను విద్యారంగం నుంచి తొలగించడం రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంగా కనిపిస్తుంది.

ఇక విద్యాపరిరక్షణ ఉద్యమం విషయానికి వస్తే, రాష్ట్రంలో పాఠశాలల మూసివేతలను సుమారు విజయవంతంగా నిలువరించింది, స్వయం పోషిత పాఠశాలల బిల్లును తాత్కాలికంగా వెనక్కినెట్టింది, ప్రాథమిక పాఠశాలలలో నమోదు 80వద్ద 5 ఉపాధ్యాయ పోస్టులను, ఉన్నత పాఠశాలలలో మెరుగైన స్టాఫ్ ప్యాటర్న్‌ను సాధించింది. మాతృభాషా మాధ్యమాన్ని కాపాడడంలో చాలా వరకు విఫలమైంది. కాగా ఉపాధ్యాయ పోస్టుల రద్దును నిలువరించడానికి ప్రయత్నిస్తూంది. విద్యావ్యాపార నిషేధం, ఉమ్మడి పాఠశాల విధాన స్థాపన కొరకు జరిగే దీర్ఘకాలిక పోరాటంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ప్రైవేటు పాఠశాలల నియంత్రణకై ఉద్యమాలను మరింత బలంగా నిర్మించడమే ఏకైక మార్గం.

(కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ) వీ

ఆదివాసి పోరాటాలలో కొత్త అల

సహజ వనరుల దోపిడీ కోసం ఆదివాసులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించిన పథల్‌ఘుడి పోరాటం అనేక తిరుగుబాట్లకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అంటున్నారు అర్విణి రాజేంద్రబాబు

జార్ఖండ్ రాష్ట్రంలో మొదలయిన పథల్‌ఘుడి ఉద్యమం భారత దేశంలో 21వ శతాబ్దంలో ఇంతవరకు జరిగిన గిరిజన. పోరాటాలన్నింటిలో అతి పెద్దదిగా రూపు సంతరించుకుంటూ ఉన్నది. 5వ షెడ్యూల్‌లో నిర్దేశించిన ప్రాంతాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలని భారత రాజ్యాంగంలో పేర్కొన్న నిబంధనను గుర్తించాలన్న డిమాండ్‌తో ప్రారంభమైన ఈ పోరాటం ఇప్పుడు నరేంద్ర మోడీ నాయకత్వంలోని హిందూ ఫాసిస్టు రాజ్యం, రఘువరదాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న జార్ఖండ్ ప్రభుత్వం ఒక వైపు, వారికి వ్యతిరేకంగా జార్ఖండ్, ఇతర రాష్ట్రాలలో నివశిస్తున్నా ఆదివాసులకు మధ్య మహా యుద్ధంగా పరిణమిస్తూ ఉన్నది.

ఒక శిలాఫలకంపై ముఖ్యమైన సమాచారమొకటి చెక్కి ఉంచడాన్ని జార్ఖండ్ వారి భాషలో 'పథల్‌ఘుడి' అంటారు. చనిపోయిన తమ తోటి వారి సమాధులపై ఓ శిలాఫలకాన్ని ఉంచడం గిరిజన సాంప్రదాయం. 'సాసం దరి' సాంప్రదాయంలో శిలాఫలకాన్ని 'పథల్‌ఘుడి' అంటారు. 1990వ దశాబ్దపు అర్థభాగంలో బి.డి. శర్మ, బండి వొర్నవ్ అన్న ఇరువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ పథల్‌ఘుడి ఉద్యమాన్ని ప్రారంభించారు. వారు ప్రభుత్వాధికారులు మాత్రమే కాదు ఆదివాసి హక్కుల ఉద్యమకారులు కూడా. 1996లో వచ్చిన 'పెసా చట్టం' (షెడ్యూల్డ్ ప్రాంతాలకు వర్తింప చేయబడ్డ పంచాయతీ చట్టం) లో పొందుపరచబడిన నిబంధనలు, ఏర్పాట్లను విశదీకరిస్తూ ఒక శిలాఫలకంపై చెక్కి ప్రతి గిరిజన గ్రామం మొదట్లో ఉంచే పద్ధతిని ఆ ఇద్దరు ప్రభుత్వాధికారులు ఆచరించారు. ఆ కాలంలో ఉమ్మడి బీహార్ రాష్ట్రంలో ఈ గిరిజన గ్రామాలు ఉండేవి.

20 ఏళ్ల తర్వాత జార్ఖండ్ రాష్ట్రంలోని కుంతి జిల్లా ఆదివాసులు ఆ ఉద్యమాన్ని తిరిగి ప్రారంభించారు. అయితే, ఈ ఎజెండా వేరు. రాజ్యాంగం లోని అయిదవ షెడ్యూల్‌లో పేర్కొనబడిన ప్రాంతాలలో నివశించే ప్రజలకు వర్తించే నియమాలు. నిబంధనల ప్రకారం స్వతంత్ర ప్రజలుగా వారు తమ హక్కులను నిర్ధారించుకొనే ఉద్యమాన్ని వారు చేపట్టారు. కుంతి, గుమ్లా, సింగ్ భూమ్ జిల్లాలలోని గ్రామాలలో ఉండే ప్రజలకు రాజ్యాంగం తమకు ఇచ్చిన వెసులుబాటు ఏర్పాట్లను తెలియ చెప్పడం ప్రారంభమైంది. దాంతో ఇంతకాలం చాలా సంవత్సరాలుగా ముదిరిపోయిన బ్రాహ్మణ భావజాలంతో హిందుత్వ ఫాసిజం అమలుకు తమ సమ్మతిని తెలియపరుస్తు వస్తున్న భారత ప్రభుత్వం, గిరిజనేతర పాలకవర్గాలు కలిసి తమను ఎట్లా వెర్రి వెంగళప్పలను చేసి ఆడుకున్నాయో ఆదివాసులు అర్థం చేసుకోవడం మొదలయింది.

గ్రామసభ ద్వారా స్వయం పరిపాలనా హక్కుతోపాటు, వారు నివసిస్తున్న ప్రాంతాలకు ప్రత్యేక హోదాను, మరికొన్ని ఇతర విశిష్టమయిన హక్కులను ఆదివాసులకు భారత రాజ్యాంగం కల్పించింది. భారతదేశం గణతంత్ర రాజ్యం కాబట్టి, ప్రజల సేవ కోసం వేతనం పై నియమింపబడిన ప్రభుత్వయంత్రాంగంలోని ఉద్యోగాలేవైనా, ఉద్దేశ్యం ఏదైనా అయిదవ షెడ్యూల్‌లోని గ్రామాలలోకి ప్రవేశించాలంటే గ్రామసభ అనుమతి తప్పనిసరి. ఆదివాసులు ప్రత్యేకమైన సంస్కృతి, భాష, ఆచార వ్యవహారాలు కలిగి ఉంటారు. ఈ విషయాలకు సంబంధించి రాజ్యం తన ఇష్టాయిష్టాలను వారిపై రుద్దే వీలు లేదు.

ఏది ఎలా ఉన్నా బ్రాహ్మణ భావజాలంతో నిండిపోయిన భారత రాజ్యం ఈ నిబంధనలను ఎల్లప్పుడూ ఉల్లంఘిస్తూ, గిరిజనులను అగ్రవార్ణాల చెప్పుచేతల్లో ఉండే బానిసలుగానే పరిగణించింది. వారి ప్రయోజనాలకు భిన్నంగా విపరీతమైన తలంపులతో ప్రభుత్వం వారి గ్రామాల నుండి వారిని ఖాళీ చేయించింది. అడవులపై వారికి సహజ సిద్ధంగా ఉన్న హక్కులను కాలరాచింది. విస్థాపనను ప్రతిఘటిస్తే ప్రభుత్వం వారిని భీతావహులను చేసింది. 'అభివృద్ధి' అనే దేవాలయం లోని ఎత్తైన బలిపీఠంపై వారిని బలిపశువును చేసింది. ఆ దేవాలయంలో ప్రతిష్ఠితమై ఉన్న దేవత అన్ని రాజకీయ పార్టీల వారికి ఆరాధ్యదైవమే!

ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలోని బిజెపి ప్రభుత్వాలు, ఒడిస్సాలోని బిజు జనతాదళ్ ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్, ఇతర రాష్ట్రాలలోని ప్రభుత్వాలు ఏకస్వామ్య, ద్రవ్య వినిమయ పెట్టుబడిదారులైన విదేశీ మైనింగ్, పారిశ్రామిక సంస్థల యజమానులు, వారి తొత్తులైన స్వదేశీ దళారీలతో బహుళ సంఖ్యలో అవగాహనా పత్రాలపై సంతకాలు చేశాయి. ఈ అవగాహనా పత్రాల కారణంగా ఆ రాష్ట్రాలలో ఉన్న భూమిని లాక్కునే అవకాశాన్ని ఆ కార్పొరేషన్లు చేజిక్కించుకున్నాయి.

2017 ఫిబ్రవరిలో జార్ఖండ్‌లోని బిజెపి ప్రభుత్వం గనుల తవ్వకంలో సంబంధంలేని ఇతర పరిశ్రమల కోసం కూడా 3 లక్షల కోట్ల రూపాయల మేరకు అవగాహనా పత్రాలపై సంతకాలు చేసింది. తమిళనాడులోని చెన్నైలో రాగిలోహాన్ని కరిగించి శుద్ధిచేసే స్టెరలైట్ కార్మాగారానికి వ్యతిరేకంగా ప్రతిఘటన కార్యక్రమాన్ని చేపట్టిన ప్రదర్శనకారులలో 13 మంది మృతికి కారణమైన బ్రిటిష్ మైనింగ్ రాక్షసి వేదాంత కార్పొరేషన్‌తో రఘువరదాస్ ప్రభుత్వం 2017 నవంబర్‌లో ఒక అవగాహనా పత్రంపై సంతకం చేసింది. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వెలువడిన ప్రకటన ప్రకారం వేదాంత గ్రూప్ రాష్ట్రంలో ఒక ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పుతున్నది.

నరేంద్ర మోడీ రాజకీయ కార్యకలాపాల కోసం నిధులు సమకూర్చే ప్రధాన వనరు గౌతమ్ ఆదాని. ఆయన, ఆయనకు చెందిన ఆదాని గ్రూప్ కూడా వివిధ మైనింగ్ పరిశ్రమల కోసం దాదాపు 20 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టింది. ఆదాని గ్రూప్ కూడా పర్యవరణానికి

హానికరమైన గని తవ్వకాలు, చేపట్టే, పరిసరాలకు ప్రకృతికి తీవ్రంనష్టం కలిగేలా, ప్రజల జీవనాధారానికి తూట్లు పడేలా చివరికి వారి ప్రాణాలు హరించేలా వారి పని విధానం ఉంటుందని, అలాంటి విషయాలలో వారు ఉద్దండులని పేరు ఉందన్న సంగతి అందరికీ తెలిసిందే. రాజకీయ నాయకులతో, ప్రభుత్వాధికారులతో సఖ్యం నెరపి తన వ్యాపార పబ్బం గడుపుకుంటాడని పేరున్న ఈ క్రోనీ పెట్టుబడిదారుడు ఆస్ట్రేలియా దేశంలో ఒక మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించబోతే, ఆయనకు, ఆయన సంస్థకు వ్యతిరేకంగా పెద్దఎత్తున అక్కడి ప్రజల ఉద్యమించారు.

అందువల్ల, తన ఆదాని, వేదాంత, ఇతర స్వదేశీ విదేశీ కార్పొరేట్ యజమానుల కోసం బిజెపి పెద్ద పెట్టున భూమిని సంసిద్ధం చేసిపెట్టాలను కోవడంలో ఆశ్చర్యం లేదు. భారీ కార్పొరేట్ సంస్థల కోసం ఆగమేఘల మీద భూసేకరణ చేయాలన్న పట్టుదలతో జార్ఖండ్ ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని సవరించే ప్రయత్నం ప్రారంభించింది.

'న్యాయబద్ధమైన నష్టపరిహారం, భూసేకరణలో పారదర్శకత, పునరావాసం, పున: పరిష్కార చట్టం– 2013' కేంద్ర ప్రభుత్వ శాసనంగా జనవరి 1, 2014 నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం భూసేకరణ కంటే ముందు, ఆ సేకరణ సామాజిక ప్రభావం ఎలా ఉంటుందో అంచనా వేయడం, ఆహార భద్రతా ఏర్పాట్ల విషయంలో జాగ్రత్త పడడం పరిగణనలోకి తీసుకోవాల్సిన ముఖ్యమైన అంశాలు.

విదేశీ పెట్టుబడికి, కార్పొరేట్ పెత్తందారులకు సంతృప్తి చేకూర్చాలన్న తొందరలో, రఘువరదాస్ నాయకత్వంలోని ప్రభుత్వం జనవరి 1, 2014 నుండి అమలులో ఉన్న 2013 భూసేకరణ చట్టాన్ని సవరించడానికి పూనుకుంది. ఈ సవరణల ప్రకారం సామాజిక ప్రభావాన్ని అంచనా వేయడం, ఆహార భద్రత కల్పించడం లాంటి ముఖ్యమైన చర్యల అవసరం లేకుండా చేశారు. ఫలితంగా, గిరిజనులను బలవంతంగా వారి భూముల నుండి తొలగించి, వారిని నిరాశ్రయులను చేసి, ఆ భూమిని బడా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి బిజెపి ప్రభుత్వం సిద్ధం చేసింది. బిజెపి, రఘువరదాస్ ప్రభుత్వం ఇంతటితో ఊరుకోలేదు. ఛోటా నాగపూర్ కౌల్దారి చట్టాన్ని, సంతాల్ పరగణా కౌల్దారి చట్టాన్ని కూడా సవరించి ఆ ప్రాంతంలో భూయాజమాన్య స్థితిగతులను మార్చి గిరిజన భూములను స్వాధీనం చేసుకొనే ప్రయత్నం కూడా చేశారు.

ఈ సవరణలన్నీ, ప్రజల ఇబ్బందుల పట్ల ఏ మాత్రం స్పందన లేని రఘువరదాస్ ప్రభుత్వం అవినీతిమయమైన కార్పొరేట్ సంస్థలతో, గనుల యాజమాన్యాలతో అవగాహన కుదుర్చుకొన్న 2017లోనే ప్రారంభ మయ్యాయి. రాష్ట్ర జనాభాలో 26 శాతం ఉన్న జార్ఖండ్ గిరిజనులకు ప్రభుత్వ దురుద్దేశ్యం ఏమిటో అర్థంచేసుకోవడానికి ఎక్కువ సమయంపట్ట లేదు. ఏదో ఒక కుతంత్రంతో ఆదివాసుల వద్ద నుండె భూమిపై అడవులపై, నదులపై వారి యాజమాన్యాన్ని లాగేసుకోవాలన్న బిజెపివారి దుర్మార్గపు ఆలోచనకు వ్యతిరేకంగా గిరిజనులు ప్రతిఘటనకు పూనారు.

తమ భూమి నుండి, తమ అడవుల నుండి తమను బలవంతంగా తొలగించడాన్ని ప్రతిఘటించిన ప్రతిసారి ఆదివాసులపై 'మావోయిస్టు' ముద్ర వేసి ప్రభుత్వం వారిని పోలీసు దమనకాండకు గురి చేసింది. భారీ మైనింగ్ కార్పొరేషన్లకు ఎర్రతివాచీ పరిచే ఉద్దేశంతో ఆదివాసులను వారి భూముల నుండి తొలగించి, వారిని నాశనం చేసే లక్ష్యంతో అర్ధసైనిక బలగాలతో ప్రభుత్వం ఒక పెద్ద సైనిక శక్తిని ఏర్పాటు చేసింది. భారత ప్రభుత్వం 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో దేశ పౌరులపైనే తీవ్ర స్థాయిలో యుద్ధం ప్రకటించింది. ఆ యుద్ధంలో, పోలీసులు బూటకపు ఎదురు కాల్పుల్లో వందలాది గిరిజన యువకులను కాల్చిచంపారు.

యథేచ్ఛగా కొనసాగిన రాజ్యహింస, మావోయిస్టు ఉద్యమాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తూ గిరిజన పురుషులను, స్త్రీలను, చిన్న పిల్లలను కూడా ముందు వెనుక ఆలోచించకుండా అరెస్టు చేయడాలు జార్ఖండ్ రాష్ట్రంలోని గుమ్లు, కుంతి, పశ్చిమ సింగ్‌భూమ్, లటేహార్, ఇతర జిల్లాల గిరిజనులలో ఆగ్రహావేశాలు తెప్పించాయి. వారు భీతావహ స్థితిలోంచి బయటకు వచ్చి పోలీసులను, అధికార గణాన్ని ప్రశ్నించడం ప్రారంభించారు. ఈ పరిణామం పోలీసు వారిని అసహనానికి గురిచేసింది.

రాజ్యాంగాన్ని ఉదహరిస్తూ, పోలీసు సిబ్బంది ప్రజాసేవకుల లాగా ఉండాలి గాని ప్రజలకు యజమానుల లాగా ఉండకూడదు అని డిమాండ్ చేశారు. ఇలా అడగడం పోలీసులకు, అధికార వర్గాలకు కోపం తెప్పించింది. అయిదవ షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఉన్న గ్రామాలలోకి పోలీసులు గాని, అధికారులు గాని గ్రామ సభ అనుమతి లేనిదే ప్రవేశించకూడదు. గ్రామ సభ అనుమతి లేకుండా గ్రామాలలోకి రాకూడదని పోలీసులను నిరోధించిన గ్రామ ప్రజలను అరెస్టు చేయడం ప్రారంభించారు. పోలీసులు, అధికార గణము ప్రజలకు సేవకుల లా ఉండడానికి, గిరిజనుల కోసమే తాము వేతనాలు పొందుతున్నామని, ఆ వేతనాలమీద తాము బ్రతుకు వెళ్లదీస్తున్నామని అంగీకరించని ప్రభుత్వ యంత్రాంగం మీద నమ్మకం పోయి, ఈ యంత్రాంగం గిరిజనులకు వ్యతిరేకమని, వారు ఎప్పుడు తమ స్వంత అస్థిత్వాన్ని అంగీకరించరని వారు నిర్ధారించుకున్నారు.

పథల్‌ఘడి ఉద్యమం కుంతి జిల్లాలోని కొంతమంది గ్రామస్థులతో 2016లో ప్రారభమై 2018 కల్లా అధిక సంఖ్యలో గిరిజనులను తనలో భాగం చేసుకుంటూ పలుగ్రామాలలో స్థిరపడి వారి గ్రామాలు, అడవి వారి సొత్తని ప్రకటించు కొని, గ్రామసభ అనుమతి లేకుండా బయటి వ్యక్తులను వారి ప్రాంతాలలోకి అనుమతించని స్థితికి వెళ్లిపోయింది. గనుల తవ్వకానికి బడా కార్పొరేషన్లకు భూమిని, అడవులను దఖలు పరచడం కోసం గిరజనులను విస్థాపనకు సరిచేయడం ఆ ఉద్యమం ఇంకా రగులు కోవడానికి దోహద పడింది. ఉద్యమం వ్యాప్తిచెందిన 80 గ్రామాలలో ఇదివరకే 40 గ్రామాలలో పథల్‌ఘడి శిలాఫలకాన్ని ప్రతిష్ఠించారని వార్తలు వెలువడ్డాయి.

ఈ ఉద్యమాన్ని వ్యాప్తి చేస్తున్నది దానికి నాయకత్వం వహిస్తున్నది గిరిజన సంఘుల నాయకులు, కార్యకర్తలే. వారు స్వభావ రీత్యా సంస్కరణ వాదులే కాని, వామపక్ష ధోరణి వారికి లేదు. మావోయిస్టు ఉద్యమ కారుల లాగా సమూల మార్పును తెచ్చే ఉద్యేశంతో విప్లవోద్యమం ప్రారంభించాలన్న కార్యక్రమం ఏదీ వారికి లేదు. అయినా, బిజెపి, ఆపార్టీ నడుపుతున్నా ప్రభుత్వం మావోయిస్టులు వారి వెనుక ఉన్నారని, వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు గిరిజనులను ప్రోత్సహిస్తున్నారని నిందమోపుతున్నారు.

పక్కా అవినీతిపరుడైన ఆ ప్రాంతపు పార్లమెంటు సభ్యుని ఇంటి నుంచి ఆయన భద్రత కోసం నియమించిన రక్షక భట్టులను బలవంతంగా ఎత్తుకుపోయిన సంఘటనను సాకుగా చూపి గిరిజనులను మావోయిస్టుల

పదాతిదళంగా బిజెపి అభివర్ధించింది. రఘువరదాస్ ప్రభుత్వం ఆదివాసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున సైనిక దాడి జరపడానికి సిద్ధపడుతున్నది.

పథల్‌ఘడి ఉద్యమానికి మూలకారణం మావోయిస్టులని, ఆర్ఎస్ఎస్ నాయకత్వం అసత్యాలు ప్రచారం చేయడం ప్రారంభించినప్పటి నుండి, హిందుత్వ ఫాసిస్టు గుంపుక ఎల్లప్పుడు కాకాపడుతూ తరించిపోయే మీడియా సంస్థలు వారికి వంతపాడుతూ గిరిజనులను అపకీర్తిపాలు చేస్తూ కార్యకర్తల మీద, ఆ ఉద్యమంలో పాల్గొంటున్న వారి మీద జరుగుతున్న కఠిన మిలిటరీ చర్యలను సమర్థించే పనికి పూనుకుంటున్నాయి.

ఫథల్‌ఘడి ఉద్యమంలో పాల్గొన్నవారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని రఘువరదాస్ హెచ్చరికలు జారీచేసిన కొద్ది కాలంలోనే, మహిళల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా గిరిజనులలో ప్రచారం చేస్తున్న ఒక స్వచ్ఛంద సంస్థకు చెందిన అయిదుగురు మహిళలను కుంతిలోని ఒక రోమన్ కాథలిక్ చర్చి నుండి సాయుధ రౌడీమూక ఒకటి ఎత్తుకుని పోయి తుపాకులతో బెదిరించి మానభంగం చేశారు. ఆ వెంటనే బిజెపి తానా అంటే తందానా అనే ప్రచార మాధ్యమాలు ఆ సామూహిక అత్యాచారకాండకు పథల్‌ఘడి ఉద్యమమే బాధ్యత వహించాలని ప్రచారం చేశాయి. ఆ సంఘటనకు మతం రంగు పులిమాయి. ఈ సంఘటనకు బాధ్యులను చేస్తూ కొంత మంది పథల్‌ఘడి ఉద్యమకారులను, చర్చి పూజారిని పోలీసులు అరెస్టు చేశారు.

దేశ వ్యాప్తంగా కార్పొరేట్ సంస్థలకు చెందిన మీడియా, సామూహిక అత్యాచార ఉదంతాన్ని గిరిజన కార్యకర్తలు, మావోయిస్టులు, చర్చి నిర్వాహకులు కలిసి చేసిన నిర్వాకమని కోడై కూసింది. హిందూత్వానికి అనుకూలంగా ఉన్న ప్రధాన స్రవంతి ప్రసార మాధ్యమాలు అబద్దాలు, అపవాదులు ప్రచారం చేసి గిరిజన కార్యకర్తలను, వారి ఉద్యమాన్ని అపఖ్యాతిపాలు చేసే ప్రయత్నం చేసింది. మోడీ రాజ్యానికి దాసోహమన్న మీడియా సంస్థలు గిరిజనుల గురించి అబద్దాలు ప్రచారం చేసి ఆదివాసులలో చీలికలు సృష్టించి, బిజెపికి అనుకూల వాతావరణం కల్పించే ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

స్వచ్ఛంద కార్యకర్తలపై జరిగిన సామూహిక అత్యాచారాన్ని గిరిజనులు తీవ్రంగా ఖండించారు. అక్కడి స్థానికులు చెపుతున్న దాన్ని బట్టి గిరిజన కార్యకర్తలను, మావోయిస్టు ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్న ఆర్ఎస్ఎస్ యుద్ధ పటాలాలు పోలీసులతో కుమ్మక్కయి ఈ అత్యాచారం చేశారని, వారిని కఠినంగా శిక్షించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. అయితే, పోలీసులు, ప్రభుత్వాలు నిజమయిన నిందితులను రక్షిస్తూ, చర్చి పూజారిని, గిరిజన సంఘ కార్యకర్తలను జరిగిన దుర్ఘటనకు బాధ్యులను చేస్తూ వాంగ్మూలం ఇమ్మని అత్యాచారానికి గురైన స్త్రీలని బలవంత పెట్టారు. దీంతో పథల్‌ఘడి ఉద్యమ నిర్వాహకులు, అందులో పాల్గొన్న ప్రజలు అసహనానికి గురై, ప్రభుత్వం ఎక్కుపెట్టిన దాడికి వ్యతిరేకంగా గొప్ప ప్రతిఘటనను రూపొందించే ప్రయత్నం ప్రారంభించారు.

అనైతికమైన దుష్ప్రచారం, నిందారోపణలతో నిమిత్తం లేకుండా పథల్‌ఘడి ఉద్యమం కుంతి జిల్లాలోని వివిధ గ్రామాలలో ప్రాచుర్యం పొందింది. గిరిజనులు తమ హక్కుల గురించి తెలుసుకొని, అన్యాయానికి అక్రమ దాడులకు వ్యతిరేకంగా తాము చేసిన ఉద్యమాలను గుర్తు తెచ్చుకొని, తమ పోరాట సాంప్రదాయంతో ఉత్తేజితులయి, స్వయం పాలనా ఉద్యమానికి వారు సంసిద్ధులయ్యారు. తద్వారా అనాది నుండి తాము హృదయంలో ఉంచుకొని ఆరాధించిన అడవులు, నదులు, భూమిని ప్రభుత్వం వారు తమ నుండి లాక్కోవడానికి చేసే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని భావించారు.

ఆది భౌతిక భావజాలం, రాజ్యాంగంపై అధిక విశ్వాసంతో నిమిత్తం లేకుండా పాలక వర్గాలు ఉలిక్కిపడి గుర్తించేంత ముఖ్యమైన శక్తిగా పథల్‌ఘడి ఉద్యమం ముందుకు సాగిపోతున్నది. ఎక్కువ సంఖ్యలో గ్రామాలకు ఉద్యమం పాకుతున్నదని వార్తలు వెల్లువెత్తుతున్నాయి. బి.జె.పి శ్రేణులు, ఆర్ఎస్ఎస్ గిరిజన విభాగం కుంతి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి మరోమార్గం లేక మెల్లమెల్లగా తిరోగమిస్తున్నాయి.

స్వపరిపాలన ఉద్యమంలో భాగంగా దేశంలోనే మొట్టమొదటి గిరిజన బ్యాంక్‌ను ప్రారంభించబోతున్నారు. గిరిజన పాఠశాలలు తెరవబోతున్నారు. వాటిల్లో గిరిజన భాషలోనే, గిరిజన సమస్యలు, గిరిజన సంస్కృతి ఆధారంగా తయారుచేసిన పాఠ్య ప్రణాళికను బోధించబోతున్నారు. ఓటర్ కార్డు, ఆధార్ కార్డు లాంటి భారతదేశ గుర్తింపు పత్రాలను సామూహికంగా బహిష్కరిస్తున్నారు. వాటిని గిరిజన వ్యతిరేక గుర్తింపు పత్రాలని తిరస్కరిస్తూ బిజెపి, ఆర్ఎస్ఎస్‌లకు చరమగీతం పాడేందుకు సిద్ధమవుతున్నారు. కుంతి జిల్లాలో హింది–హిందూత్వ– హిందుస్థాన్ భావప్రేరిత సిద్ధాంతం అస్థిత్వ సవాల్‌ను ఎదుర్కొంటుంది. కాషాయ దళం కలవరంతో కంపించిపోతోంది. ఆశాభంగంతో కుంగిపోతున్నది.

పథల్‌ఘడి ఉద్యమాన్ని వేర్పాటువాద ఉద్యమంగా భారత రాజ్యం నిందవేసినప్పటికీ, ఎన్నో దశాబ్దాల బానిసత్వాన్ని తిరస్కరిస్తూ ఉవ్వెత్తున ఎగిసిన గిరిజన ఉద్యమాన్ని తమ సైనిక బలంతో అణిచివేయాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, జార్ఖండ్ రాష్ట్రంలోని 32, 640 గ్రామాల్లో అత్యధిక భాగం పథల్‌ఘడి ఉద్యమానికి ప్రభావితమయ్యాయన్నది వాస్తవం. న్యాయబద్ధంగా తమదైన వాటిపై హక్కు తమదేనని, అది ఆదానిదో, ఏ అగర్‌వాల్‌దో కాదని ఆ ఉద్యమం ఎలుగెత్తి చాటుతున్నది. ఒక్క అంగుళం మేర కూడా గిరిజన ప్రాంతాన్ని బిజెపికి ధారాదత్తం చేయబోమని, ఆదివాసు గూడాలను హిందుత్వమయం, హిందీత్వమయం చేయడానికి ససేమిరా అంగీకరించబోమని ఢంకా బజాయించి మరీ చెపుతున్నది.

జార్ఖండ్‌లోని లోతట్టు ప్రాంతాలలో సిద్ధు, కన్హ, చాంద్, భైరవ్, ఫ్యూలో, ఝానో, బిర్సాముండా లాంటి సాహస అమర వీరుల వారసులు ఆధునిక భారతదేశం రూపు దిద్దుకోవడానికి సరికొత్త వ్యూహాలు రచిస్తున్నారు. అజేయమయిన వారి ప్రకృతి, వ్యక్తిత్వాలు, లొంగిపోవడానికి ససేమిరా ఒప్పుకోని వారి వారసత్వం వలన ఆంగ్లేయుల వలస పాలన ఉచ్ఛస్థితిలో కూడా వారు అపజయం పొందకుండా నిలిచే ఉన్నారు.

ప్రస్థుత పరిస్థితులలో అల్లరిమూకలతో మూకుమ్మడి దాడులు చేసి నిర్దోషులను మట్టుబెట్టే పద్ధతులను అవలంభించినా, దుర్మార్గమైన రాజ్యహింసను విచ్చలవిడిగా అమలుపరిచే ప్రయత్నం చేసినా, రఘువరదాస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమవడం ఖాయం. అధర్మపు బండి చక్రాలను ఆపకుండా గిరిజన శక్తిని ఎవరూ నిరోధించలేరు. ఘనమైన పథల్‌ఘడి ఉద్యమం పాలకవర్గాలలో భయాందోళనలు సృష్టించి, వారిని జార్ఖండ్ లోతట్టు ప్రాంతాల నుండి తిరోగమింపజేయడం ఖాయం.

(పీపుల్స్ రివ్యు పోర్టల్‌లో తన్మయ ఇబ్రహిం వ్యాసానికి అనుసరణ)

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

జన్మనివ్వడం కూడా చావు లాంటిదే

ప్రైవేట్ ఆసుపత్రుల వ్యాపార, నిర్లక్ష్య ధోరణులతో ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలో మిగిలిపోతున్నాయని అంటూ, అసహజ మరణానికి గురైన హరిత గాథను ఇందుకు నిదర్శనంగా వివరిస్తున్నారు **డా. గడ్డం లక్ష్మణ్**

శిశువులకు జన్మనివ్వడం మహిళలకే పరిమితమైన విశిష్టత అనుకుంటే దానివల్ల మృతిచెందడం కూడా వారికే పరిమితం. మహిళల మరణాలకు మార్గాలెన్నో! స్త్రీల అకాల మరణాలకు రాజ్యం, సమాజం, మాతృత్వం, భర్తలే కాక డాక్టర్లు కూడా కారణమవుతున్నారు. వారి మరణమృదంగాన్ని డాక్టర్లు కూడా మీటుతున్నారు. అత్యాధునికమైన సాంకేతికతతో వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చిన మాట నిజమే అయినా వైద్యుల మానసిక ప్రవృత్తి, కార్యదక్షతలో మార్పులు రానంతవరకు ఫలితాలను సంపూర్ణంగా ఆశించలేం.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని విజయా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మృత్యు కూపంగా మారింది. అక్కడ జరుగుతున్న వివిధ రకాల శస్త్ర చికిత్సల్లో డాక్టర్ల నిర్లక్ష్యం వలన ఎంతో మంది పేషెంట్లు ప్రాణాలు కోల్పోతున్నారు. చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు ఊపిరిలూది కాపాడాల్సిన డాక్టర్లు నిర్లక్ష్యంగా ప్రవర్తించడం వలన రోగుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం అప్పారెడ్డిగూడకు చెందిన గర్భవతి గూడెపు హరిత (25) 2017 అక్టోబర్ 3న తొలి కాన్పు నిమిత్తం షాద్‌నగర్‌లోని విజయా హాస్పిటల్‌లో చేరింది. అక్టోబర్ 5న డాక్టర్లు చందులాల్ రాథోడ్; విజయలక్ష్మి రాథోడ్‌లు సిజేరియన్ శస్త్ర చికిత్స నిర్వహించగా పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అయితే ఈ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. సదరు డాక్టర్లు బ్యాండేజ్ చుట్టను ఇతర వస్తువులను కడుపులోనే ఉంచి కుట్లు వేయడంతో ఆరోగ్యం క్షీణించి తొమ్మిది నెలలు గోసదీసి శరీరమంతా విషపూరితమై 2018 జూన్ 16న మృతి చెందింది. జన్మనివ్వడం చావుకొచ్చింది. హరిత కూతురు అనాథగా మిగిలింది.

షాబాద్ మండలం బొబ్బిలిగాంకు చెందిన హరితకు అదే మండలం అప్పారెడ్డిగూడకు చెందిన గూడెపు రాజు (30) తో 2016లో వివాహమైంది. భార్య భర్తలిరువురు హైదరాబాద్‌లో అడ్డా మీద కూలీలుగా బతుకులీడుస్తున్నారు. కొద్ది నెలలకే గర్భం దాల్చిన హరిత దంపతుల ఆనందానికి అవధులు లేవు. ప్రతి నెలా గవర్నమెంట్ జాజిఖానాలో డాక్టర్లను సంప్రదించి చికిత్స పొందారు. కడుపులో పాప ఆరోగ్యంగా ఎదుగుతుందని డాక్టర్లు చెబుతా ఉంటే జీవితంలో అవధులు లేని ఆనందాన్ని పొందేవారు. హరిత మాతృత్వమే మహాభాగ్యంగా భావించింది. కడుపులో పెరిగే పాప సర్వస్వం అనుకున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకోవాలని పెద్ద పెద్ద చదువులు నేర్పించి ఉన్నతంగా తీర్చి దిద్దాలని మనలాంటి కూలీ బతుకులు మన బిడ్డలకు రానివ్వకూడదని కలలుగన్నారు. నెలలు నిండడంతో నిండు గర్భిణి అయిన హరితను తల్లి బొబ్బిలిగాంకు తీసుకొచ్చింది. తన కూతురు తల్లి కాబోతుందని, బంగారు బిడ్డను చేతిలో పెడుతుందని మురిసి పోయారు హరిత తల్లిదండ్రులు. ప్రభుత్వ ఆసుపత్రిలో నిండైన వసతులుండవని, సరైన వైద్యం అందదని, సరైన సమయంలో గైనకలాజిస్టులుండరని, ఆయాలే డాక్టర్ల అవతారమెత్తుతారని, పరిశుభ్రత లోపబూయిష్టంగా ఉంటుందని కుటుంబీకులు చర్చించుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో కెసిఆర్ కిట్టు వట్టి బూటకమని కూడా నిర్ధారణకు వచ్చారు. నా బిడ్డ, బిడ్డకు పుట్టే బిడ్డ పరిశుభ్రమైన ప్రదేశంలో క్షేమంగా పుట్టాలంటే ప్రైవేట్ ఆసుపత్రికే తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కెసిఆర్ కిట్టు గ్రామీణ ప్రాంతంలోని సాధారణ ప్రజలపైన ఎంత ప్రభావాన్ని కలిగి ఉందో అంచనావేయొచ్చు.

2017 అక్టోబర్ 3న పురుటి నొప్పులు మొదలవ్వడంతో షాద్‌నగర్‌లోని విజయా హాస్పిటల్‌లో కోటి ఆశలతో చేర్పించారు. హరితను పరీక్షించిన వైద్యులు సిజేరియన్ చేయాలని కుటుంబీకులకు సూచించారు. కడుపులో ఉన్న పాప, మోస్తున్న తల్లి ఆరోగ్యంగా ఉండగా ఆపరేషన్ మర్మం తెలియని కుటుంబ సభ్యులు బిత్తరపోయారు. నా బిడ్డ సహజంగానే ప్రసవిస్తుందని గట్టిగా పెదవి విప్పి చెప్పలేని నిస్సాహయతకు లోనయ్యారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ – ఈ కారణాల విషపుకోరల్లో చిక్కుకున్నామనే స్పృహ కలిగించే యంత్రాంగం ఎక్కడ ఉందో ఈ అమాయకపు జీవులకేం తెలుసు. బతుకుకు భరోసానిస్తామని ఓట్లేసి ఎన్నుకున్న ప్రభుత్వాలు నట్టేట ముంచితే ప్రైవేటీకరణ మొలకెత్తిందని, అది మొత్తంగా జీవితాలను ఆవరించి అంతమొందిస్తుందనే అవగాహన లేదు కదా! సరే! నన్నారు. సరే అని అననైతే అన్నారు కాని ఎంత డబ్బు ఖర్చవుతుందోనన్న భయం లోపల వెంటాడుతూనే ఉంది. ఆధునిక దోపిడీ ప్రపంచంలో జన్మనివ్వడం కూడా ఆర్థిక విషవలయం అని తెలియదు. చిక్కుకున్నామని మాత్రం గ్రహించారు. ఈ విషయాలన్నీ చేదించి ప్రజలను బయట పడేయగలిగే స్పష్టమైన మార్గ నిర్దేషన కావాలిప్పుడు. నాయకులు మాత్రం భేటీ భచావో అంటారు. భేటీ పఢావో అంటారు. మొదలు భేటీని పుట్టనిద్దామని ఎవరనాలి?

2017 అక్టోబర్ 5న ఆపరేషన్ చేయడంతో హరిత తొలి కాన్పులో ముద్దులొలికే ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆ! ఆడపిల్లనా! అని ఎవరూ ముఖాలు చాటేసుకోలేదు. పాపను చూసి కుటుంబీకులంతా మురిసిపోయారు. ఈ సంతోషం ఎంతకాలముంటుందో తెలియని అమాయకత్వంతో మురిపెం శాశ్వతం అనుకున్నారు. ఎందుకంటే డాక్టర్లంటే నడయాడే దేవుళ్లని కదా వారికి తెలిసింది. దేశం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందింది. రోదసీలో ఎన్నో ప్రయోగాలు చేస్తూ ఫలితాల మీద స్వారీ చేస్తున్నాం. వైద్య రంగం పురోగాభివృద్ధి వైపు పరుగులు

తీస్తుందని కదా వారు నిత్యం మాధ్యమాల ద్వారా వింటున్నది, కంటున్నది. నిజమే కాబోలు అని భ్రమించారు. కాని డాక్టర్లలో పేరుకుపోయిన నిర్లక్ష్యం ప్రాణాలను బలిపెడుతుందని అప్పటికి తెలియదు. పెట్టుబడిదారీ వర్గాలకు వంగి వంగి సేవలందించే ఈ డాక్టర్లు పేద వర్గాల ప్రజల ఎడల అలసత్వం ప్రదర్శించారు. హరితకు ఆ ఆపరేషన్ ముగిశాక బ్యాండేజి బట్టముద్ద, ఇతర వస్తువులు కడుపులోనే ఉంచి కుట్లు వేసేశారు. ఈ విషయం ఎవరూ గమనించలేదు. ఏడు రోజుల అనంతరం హరితను హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేశారు.

ఇల్లు చేరుకున్న తర్వాత 11వ రోజు పాపకు పురుడుపోశారు. కాని ఇదే రోజు నుంచి హరితకు కడుపులో మెలికలుపెట్టే నొప్పి మొదలైంది. కుట్లు తెగిపోయి రక్తస్రావం జరిగింది. మరుసటి రోజు అదే హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్షించి మందులు రాసిచ్చారు. మందులు వాడుతున్న క్రమంలోనే పాపకు 21వ రోజుల తొట్టెల కార్యక్రమం నిర్వహించారు. మళ్లీ ఈ రోజు హరితకు కడుపునొప్పి తీవ్రతరమవ్వడమే కాకుండా ఆరోగ్యం పూర్తిగా క్షీణించడం మొదలైంది. సుడులు తిరిగే కనబడని నొప్పి భరించలేక పోవడంతో మళ్లీ అదే హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చేర్చుకుని, 5 రోజులు చికిత్స చేసి మందులు రాసి ఇంటికి పంపించారు. ఇంటికి చేరుకున్న తర్వాత ఎన్ని మందులు వాడినా బాధతీవ్రత పెరుగుతుందే కాని తగ్గడం లేదు.

చక్కటి ఆరోగ్యంతో హాస్పిటల్‌లో చేరి అనారోగ్యం పాలైంది. శరీరమంతా నిస్సత్తుగా తయారైంది. తీవ్ర కడుపునొప్పితో పాటు, కడుపులో వికారం, వాంతులు, పేగులో మెలికలు, అజీర్తి, రక్తహీనత, జ్వరం, ఆకలి మందగించడం, రక్తస్రావం మొదలగు వ్యాధులు సోకినాయి. మళ్లీ అదే హాస్పిటల్‌కు తీసుకెళితే మళ్లీ చేర్చుకుని ఈ సారి దాదాపు ఏడు నెలల చికిత్స అందించారు. కాని సమగ్రంగా పరీక్షలు నిర్వహించకుండానే ఎక్స్‌రే కాని స్కానింగ్ కాని చేయకుండానే అసలైన కారణం కనుక్కోకుండానే పై పైన మందులు, ఇంజక్షన్లు ఇచ్చారు. అందుకే హాస్పిటల్‌లో ఉండి ఆరోగ్యం కోల్పోయింది.

ఈ క్రమంలోనే షాద్‌నగర్‌లోని మరో హాస్పిటల్‌కు ఓ ప్రముఖ మహిళా డాక్టర్ మెరుగైన చికిత్స చేస్తుందని తెలిస్తే కుటుంబీకులు తీసుకెళ్లి చూయించారు. ఈ మహిళా డాక్టర్ పరీక్షించి పరిస్థితి విషమించిందని, వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లమని సూచించింది. ఈ డాక్టరుగారి సలహా మేరకు ఉస్మానియా ఆసుప్రతిలో 2018 మే 27న చేర్పించారు. ఇక్కడి వైద్యులు స్కానింగ్ చేసి ఆమె కడుపులో దూది ఉన్న విషయాన్ని గుర్తించారు. తీవ్రతను అంచనా వేసి వెంటనే ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న కాటన్, ఇతర వస్తువులను వెలికి తీశారు.

అయితే అప్పటికే ఆమె పేగులకు ఇన్‌ఫెక్షన్ సోకి విషపూరితం కావడం వలన శరీరమంతా వ్యాపించి జూన్ 16 ఉస్మానియా ఆసుపత్రిలోనే మృతి చెందింది. విజయా హాస్పిటల్ ఖర్చుల కోసం అర్ధ ఎకరం పొలం, రెండు ఎద్దులు, బంగారం అమ్ముకోవాల్సి వచ్చింది. అయినా హరిత దక్కలేదు.

హరిత చనిపోయిన బాధతో తీవ్ర ఆవేదనకు గురైన గ్రామస్థులు, మృతిరాలి కుటుంబీకులు డాక్టర్ల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ విజయా ఆసుపత్రి ఎదుట ధర్నా చేపట్టారు. హరిత శవాన్ని ఉస్మానియా ఆసుపత్రి నుంచి నేరుగా ధర్నా స్థలికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అయితే షాద్‌నగర్ సిఐ అశోక్ కుమార్ ఆందోళనకారులను తీవ్ర పదజాలంతో బెదిరించి ధర్నాను భగ్నం చేశాడు. అంతటితో ఆగకుండా హరిత శవాన్ని తరలిస్తున్న అంబులెన్స్ డ్రైవర్‌ను ఫోనులో బెదిరించి బలవంతాన ఉస్మానియా ఆసుపత్రి నుంచి నేరుగా అప్పారెడ్డిగూడకు చేర్చారు.

మరోవైపు కుటుంబీకులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి చర్చలు జరిపి రు. 3 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరింపచేశాడు. హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకునేంత వరకు హరిత శవాన్ని అంబులెన్స్ నుండి దించడానికి గ్రామస్థులు నిరాకరించి నిరసన ప్రకటిస్తే అత్యుత్సాహం ప్రదర్శించిన సిఐ అశోక్ కుమార్ రాత్రి 2.30 గంటల సమయంలో తమ సిబ్బందితో ఊరు చేరుకుని పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఒప్పందాన్ని బలవంతంగా గ్రామస్థులచే అంగీకరింపచేశాడు. శవాన్ని బలవంతంగా కిందికి దింపి అంబులెన్స్‌ను హైదరాబాద్‌కు పంపించాడు.

గ్రామస్థులను, కుటుంబీకులను వేదనా భరితమైన ఆగ్రహాన్ని ప్రదర్శించే అవకాశం కూడా ఇవ్వలేదు. నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించింది. పోలీసులకు రాజ్యాంగం పైన విశ్వాసముంటుందనే ఆశ అడియాసవుతుంది. పోలీసులు పూర్తిగా ఆసుపత్రి యాజమాన్యం కొమ్ముకాశారు.

విజయా హాస్పిటల్ డాక్టర్లు చందులాల్ రాథోడ్, విజయలక్ష్మి రాథోడ్‌లు సిజేరియన్ చేసినప్పుడు బ్యాండేజి, బట్ట, ఇతర వస్తువులు కడుపులో వదిలి కుట్లు వేయడం వలన హరిత చనిపోయిందని షాద్‌నగర్ పట్టణ పోలీసులకు హరిత తమ్ముడు ఫిర్యాదు చేశాడు. అయినా కాని సిఐ ఆసుపత్రి యాజమాన్యం పైన, డాక్టర్ల పైన ఎలాంటి చర్యలు చేపట్టలేదు. చట్టబద్ధంగా నడవాల్సిన పోలీసులు పెత్తందార్ల విషయంలో అనుకూల ప్రాతిపదికను అనుసరిస్తారు.

హరితకు పుట్టిన పాపకు ఇప్పుడు తొమ్మిది నెలల ప్రాయం. అమాయకంగా గుక్కతిప్పుకోకుండా ఏడుస్తోంది. పురిటిలోనే తల్లిని కోల్పోయి అనాథగా మారింది. పాప ఆలనా పాలనా కష్టంగా ఉంది. తల్లి పాలకు నోచుకోలేక తరచూ తీవ్ర అనారోగ్యానికి గురవుతుంది. ప్రస్తుతం ఎడతెరపిలేని దగ్గు, జ్వరంతో బాధపడుతోంది.

తల్లిలేని పాపకు సరైన పోషణ, సంరక్షణ కల్పించాలని, మృతిరాలి కుటుంబీకులకు నష్టపరిహారం చెల్లించాలని, హరిత మరణానికి కారణమైన డాక్టర్ల పైన, ఆసుపత్రి యాజమాన్యం పైన కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు. సిబిఐ చేత విచారణ జరిపించాలని గట్టిగా ఆకాంక్షిస్తున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడమే కాక పోలీస్ స్టేషన్‌లో బలవంతంగా సెటిల్‌మెంట్ చేయించిన పోలీసుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకుల డిమాండ్‌ను మేధావులు సపోర్టు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విజయా ఆసుపత్రి డాక్టర్లు నిర్లక్ష్యంతో హరిత ప్రాణం బలిపెట్టడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఆర్టికల్ 21 జీవించే హక్కుకు గ్యారంటీ పడుతుంది. జీవించే హక్కులో ప్రత్యేకించి ప్రసూతి సమయాన అర్థవంతమైన ఆరోగ్య భద్రత పొందే హక్కు ఇమిడి ఉంది. చికిత్స అందించాల్సిన అవసరంలో ఉన్న వ్యక్తికి సరైన చికిత్స అందించడంలో డాక్టర్లు విఫలమవడమంటే రాజ్యాంగాన్ని ఉల్లంఘించి జీవించే హక్కుకు విఘాతం కల్పించడమే అవుతుంది. నిర్లక్ష్య వైద్యుల చెరనుండి బతుకునిచ్చే తల్లులను బతికించుకుందాం. 'ఆయుష్మాన్ భారత్' మాటల గారడిని ఎండగడదాం.

(రచయిత అధ్యక్షుడు, పౌరహక్కుల సంఘం) వీ

దేశ ప్రజలపై కాషాయ దాడులు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేశంలో దళిత, ముస్లిం, మైనారిటీ, స్త్రీలు, పాత్రికేయులు, రచయితలు, హేతువాదులు, ఇలా అన్ని సామాజికవర్గాల ప్రజలపై కాషాయ దాడులు పెచ్చరిల్లి పోయాయని అంటున్నారు షేక్ కరిముల్లా

కేంద్రంలో బిజెపి సర్కారు అధికారంలోకి వచ్చింది మొదలు గత నాలుగేళ్లుగా సంఘ్ పరివార్ 'అపర దేశభక్తులు' దేశభక్తి, గోరక్షణ పేరిట ముస్లింలు, దళితులపై పాశవిక దాడులకు పాల్పడి కొట్టి చంపుతున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కల్బుర్గి లాంటి హేతువాదులైన మేధావులను, గౌరీలంకేశ్ లాంటి పాత్రికేయులను చంపారు. భావ ప్రకటన స్వేచ్ఛపై దాడులకు తెగబడ్డారు. ఈ మూకలకు రాజ్యం అండదండలు పుష్కలంగా ఉండడం వలన వీరంతా క్షేమంగా బయటపడి మరిన్ని దాడులకు తెగబడుతున్నారు.

గోరక్షణ పేరిట గత ఏడాది ఒక వ్యక్తిని బలితీసుకున్న ఎనిమిది మందిని కేంద్రమంత్రి జయంత్ సిన్హా ఆత్మీయంగా సత్కరించి, నిందితులందరికి వరుసపెట్టి వీరతిలకం దిద్ది, నోరు తీపి కూడా చేశారు. ఒక వ్యక్తిని కొట్టి చంపడం తప్పుకాదని ఆయన చెప్పదలచారా? లేక ఇటువంటి దాడులు మరిన్ని చేయండి మీకు మా అండదండలు ఉంటాయని చెప్పదలచారా?

బీదర్‌లో హైదరాబాదీలను పిల్లల్ని ఎత్తుకెళ్లే వారంటూ నెపం మోపి హత్య చేశారు. బిజెపి ఏలుబడిలోని రాష్ట్రాలలోనే మతోన్మాద దురాగతాలు అత్యధికంగా చోటు చేసుకుంటున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాలలో తరచూ ఇలాంటి ఘటనలు విద్వేషపూరిత కుట్రలో భాగంగా జరుగుతున్నాయి. ఈ నేరస్తులపై కనీసం కేసులు కూడా నమోదు చేయడం లేదు. ప్రజల ఆందోళనల నేపథ్యంలో ఒకవేళ నమోదు చేసిన తదుపరి దర్యాప్తులో వీగిపోతున్నాయి. హంతకులు ఎంచక్కా స్వేచ్ఛగా కాలరెగరేసుకు తిరుగుతున్నారు. మొత్తంగా దేశంలో మతోన్మాద బిజెపి పాలన ఒక భీతావహ వాతావరణాన్ని సృష్టించింది. ప్రైవేటు మూకలు సమాజంలోని కొన్ని వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకొని సాగిస్తున్న మూక హింస, మూక హత్యలకు కేంద్రంలోని మోడీ సర్కారు, బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంలో ఈ మూక హత్యలను తుదముట్టించాలని సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు హర్షనీయం.

ఈ వరుస సంఘటనలపై సామాజిక కార్యకర్తలు తెహసీన్ పూనావాలా, మహాత్మగాంధీ మునిమనుమడు తుషార్ గాంధీ మరికొందరు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ధర్మాసనం మధ్యంతర తీర్పునిచ్చింది. ఈ ఘటనలపై భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా న్యాయమూర్తులు ఎ.ఎం. ఖన్విల్కర్, డి.వి. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ప్రజలను కొట్టి చంపే ఈ ఘటనలు భారత ప్రజాస్వామ్యాన్ని 'గూండాస్వామ్యం'గా మారుస్తున్నాయని వ్యాఖ్యానించింది. కొందరు వ్యక్తులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ఎదుటి వారిని కొట్టి చంపడం ద్వారా మనం ఎటుపోతున్నాం...?' అంటూ ప్రధాన న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనల నివారణకు కేంద్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. సామాన్య ప్రజలెవ్వరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి వీలులేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల మాన ప్రాణాలను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనన్న సుప్రీంకోర్టు ఈ మూకదాడులు, కొట్టి చంపే సంఘటనలు ఆపేందుకు కొత్త చట్టాన్ని రూపొందించాలని పార్లమెంటుకు సూచించింది. గూండాస్వామ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని, దానిని ఉక్కుపాదంతో అణచి వేయాలని, రాష్ట్రాలు కూడా ఇటువంటి సంఘటనలపై మౌనం వహించడానికి వీలు లేదని స్పష్టం చేసింది.

సర్వోన్నత న్యాయస్థానం పార్లమెంటుకు సూచనలు చేసిన కొన్ని గంటల్లోనే జార్ఖండ్ రాష్ట్రంలో సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేష్ (80)పై బిజెపి అనుబంధ సంస్థ యువమోర్చ కార్యకర్తలమని చెప్పుకున్నవారు మూకదాడికి పాల్పడి ఆయనను తీవ్రంగా గాయపరిచారు. అగ్నివేష్‌ను అడ్డుకొని... చేతులతో కొడుతూ, కాళ్లతో తన్నుతూ, దూషిస్తూ దాడికి దిగారు. ఈ దేశంలో ఉండాలంటే 'వందేమాతరం' అనాల్సిందే అంటూ దాడిచేశారు. ఈ అపర దేశభక్తులు, కొత్త చట్టాలు సరే వాటి అమలు సంగతేంటి? ఉన్న చట్టాలకే దిక్కులేదు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి చట్టాన్ని నీరుగార్చారు. రాజ్యాంగం మీద గౌరవంలేని వారు గద్దెనెక్కారు.

దేశంలో ఈ పరిణామాలు ఎందుకు జరుగుతున్నాయి. దీని వెనుక ఉన్న వాస్తవాలు ఏమిటో పరిశీలిద్దాం. భారతదేశపు చరిత్ర చూస్తే ఆర్యులు మొదలుకొని పారశీకులు, మంగోలులు, తురుష్కులు ఇలా చాలా జాతుల వారు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. అనేక జాతులు, భాషల మతాల సంగమం మనదేశం. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతి వారసత్వం. మన గత చరిత్ర, సంస్కృతి సాధించిన విజయాలు మనకే కాక ప్రపంచానికి తెలుసు. మనది ఎంతో సుసంపన్న దేశం. స్వయం సంపూర్ణమైన వనరులున్న దేశం. కాబట్టి ఎన్ని సంక్షోభాలు వచ్చిన అవి మనల్ని ఏమీ చేయలేక పోయాయి. మనం గతంలో ఎంతో గొప్పగా ఉన్నాం. మరి ఇప్పుడు మనల్ని మనం రక్షించుకోలేని స్థితి, ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు, దేశవిదేశీ బహుళజాతి కంపెనీలకు దాసోహం అయ్యాం. రచయితగా మరణించాను అని ఒక రచయిత ప్రకటించాడు. ఈ దేశ మూలవాసులైన దళితులు, ముస్లింలు అభద్రతతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారు. ఒక జంతువు (గోవు)కు ఉన్న విలువ కూడా మనిషికి లేని రోజులు దాపురించాయి. ఎందుకు? సుసంపన్న భారతీయ సంస్కృతికి ఇవాళ పెను ప్రమాదం ప్రపంచీకరణ నుండి, దానిలో భాగస్వామి అయ్యి పూర్తిగా సహకరిస్తున్న హిందూత్వ

సంఘ్‌పరివార్ శక్తుల నుండి ఏర్పడింది. 1857 సిపాయిల తిరుగుబాటు అనంతరం బ్రిటిష్ ప్రభుత్వం ఇంకా ఈ దేశాన్ని ఎక్కువ కాలం పరిపాలించలేమని గ్రహించి, ప్రజలను మతపరంగా విభజించి అనైక్యతను సృష్టించి విభజించి పాలించే విధానం అనుసరించింది. ఇక్కడి నుండి మతాన్ని రాజకీయ అధికారం కోసం వాడుకోవడం మొదలైంది.

1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం అనంతరం దేశంలో మతతత్వ రాజకీయాలు (హిందూ–ముస్లిం) ఆవిర్భవించాయి. దీని ఫలితమే పరస్పర వ్యతిరేకమైన రెండు మతతత్వ సంస్థలు ఆవిర్భవించాయి. ఒకటి ఇస్లాం మతం ప్రాతిపదికగా ముస్లిం లీగ్ (1907) మరొకటి హిందూమతం పునాదిపై ఏర్పడిన హిందూ మహాసభ (1923) ఆర్‌ఎస్‌ఎస్‌ల నిర్మాణం.

ముస్లిం లీగ్‌లోని ముఖ్యులందరు పాకిస్తాన్‌కు వెళ్లగా లౌకికవాదులైన ముస్లింలు ఇక్కడే ఉండిపోయారు. ఉదాహరణకు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, అబుల్ కలాం ఆజాద్‌లు హిందూ రాజ్య స్థాపన లక్ష్యంగా ఏర్పడిన సంఘ్ పరివార్ నేడు భారత ప్రజాస్వామ్యానికి, లౌకిక విలువలకు ప్రమాదకరంగా తయారైంది. నిజానికి ఈ రెండు మతతత్వ సంస్థలు ఆనాడు బ్రిటిష్ వలసవాద దోపిడీ విధానాలను వ్యతిరేకించలేదు. పూర్తి విధేయతను చాటుకున్నాయి.

1925లో ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడినప్పటి నుండి జాతీయోద్యమంలో పాల్గొనలేదు. పైపెచ్చు ప్రజల్లో వదంతులు వ్యాపింపచేసి, మత కలహాలు సృష్టించిన చరిత్రే దానిది. దీని మద్దతుదారులందరూ భూస్వాములు, బ్రాహ్మణులు, వ్యాపారవేత్తలు, బనియా (వైశ్య) వర్గాలే. ఇప్పుడు ఆదానీ, అంబానీలు, దేశవిదేశీ కార్పొరేట్లకు సేవలు, అప్పుడు బ్రిటిష్ వారికి సేవలు చేయడం ఈ సంస్థ ఆశయాలు. ఈ దోపిడీ విధానాలు ప్రజలకు అర్థం కాకుండా దేశభక్తి, జాతీయవాదాన్ని రెచ్చగొట్టి మూకదాడులు చేసి అమాయక ప్రజలను కొట్టి చంపి, ప్రజల ఆలోచనా విధానాలను పక్కదారి పట్టించే స్థాయికి ఈ సంస్థ దిగజారింది. ఈ ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగమే బిజెపి.

ఆర్‌ఎస్‌ఎస్ రూపమాత్రంగానే మతోన్మాద సంస్థ. సారాంశంలో ఫాసిజం దాని తత్వం. ఫాసిస్ట్ ముస్సోలినీ, నాజీ హిట్లర్‌ల నుండి ప్రేరణ పొందిన సంస్థ. ఆర్‌ఎస్‌ఎస్ నరరూప రాక్షసులైన ఈ ఇద్దరు సామ్రాజ్యవాదులకు నూతన వలసలు సంపాదించి ఇచ్చి వారి దోపిడికై ప్రపంచ ప్రజలపై యుద్ధం తెచ్చి రక్తం ఏరులై పారించిన వారు. ఇప్పుడు ఈ నయా హిందూ ఫాసిస్ట్‌లు ఇక్కడ సామ్రాజ్యవాదులకు కార్పొరేట్లకు దోచిపెట్టడానికి దేశంలో మతం పేరుతో మారణహోమం సృష్టిస్తున్నారు. ఈ సంఘ్‌పరివార్ మూకలకు నేటి ప్రధాని మోడీ నాయకుడు.

దురహంకార పూరిత వ్యాఖ్యలు చేయడంలో వారిని మించిన వారు లేరు. 2013లో దేశ ప్రధాని పీఠం ఎక్కే ముందు నాటి మాట '2002 గుజరాత్ అల్లర్లలో రెండు వేల మంది ముస్లింలు చనిపోయినప్పుడు మీకు బాధనిపించలేదా?' అని మోడీని ప్రశ్నించారు ఓ విలేకరి. దానికి బదులిస్తూ 'బాధెందుకు కలుగదు, తప్పకుండా కలుగుతుంది. మనమో కారు నడుపుతున్నామనుకోండి... ఓ కుక్క పిల్ల కారుకెదురుగా వచ్చి... కారుకింద పడి చనిపోతే... మనకు బాధకలగదా...? ఇదీఅంతే!' అంటూ తనదైన తరహాలో అహంకారంగా సమాధానమిచ్చాడు. ఓ ముఖ్యమంత్రిగా రెండువేల మంది రాష్ట్ర ప్రజల నిండు ప్రాణాలకిచ్చిన విలువ అది. ఇది ఈ దేశ ప్రజాస్వామ్యం ప్రజల ప్రాణాలకు ఇస్తున్న విలువ.

చదువు (కనీసం డిగ్రీ కూడా చదవనీ) సంధ్యలేని వారు, కనీస జ్ఞానం లేని వారు ఈ దేశ ప్రధానులు, మానవ వనరుల శాఖామాత్యులు అవుతుంటే రోహిత్ వేముల వంటి స్కాలర్లు అట్టడుగు స్థాయి నుంచి ఎదిగి విశ్వవిద్యాలయాలకు వచ్చి చదువుకుంటుంటే అంటరాని వారు మీకు చదువులెందుకు? మీరు చదువుకొని జ్ఞానవంతులు కాకూడదంటూ ఈ రాజ్యం చంపివేసింది. ఇలాంటి దురాగతాలు నేడు నిత్యకృత్యాలైనాయి. ఇంకా లోతుగా పరిశీలిస్తే ప్రజలను నిలువున దోచుకోవడానికి పుట్టిన సామ్రాజ్యవాదం (ప్రపంచీకరణ) మానవాళి చరిత్రపై సృష్టించిన విధ్వంసం అంతాఇంతాకాదు. దీని ఆధారంగా ఏర్పడిన రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు సహజంగానే మానవాళిని చాలా కష్టాలపాలు చేస్తాయి.

పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థలు ఈ కోవకు చెందినవే. కాబట్టి ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించలేని ఈ వ్యవస్థలు ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ సోషలిస్టు వ్యవస్థల వైపు ఉద్యమించకుండా సున్నిత అంశాలైన కులం, మతం వాడుకొని ప్రజల్ని విభజించి తన దోపిడీని కొనసాగించుకోవటం చరిత్రకు కొత్త కాదు. అందుకే మార్క్స్ 'మతం ప్రజల పాలిట మత్తు మందు' అంటాడు.

సామ్రాజ్యవాద దోపిడీ ఆధిపత్యాలను రక్షించటంలో భాగమే నేటి ఈ దుష్పరిణామాలు. 1980ల నుంచి మొదలైన హిందూత్వం 1990 నాటికి బాగా విస్తరించింది. ఇదే కాలంలో దేశంలో మొదలైన నూతన ఆర్థిక విధానాలకు గల సంబంధాన్ని మనం చూడాలి. 1991 పి.వి. నరసింహారావు మన దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌లకు దాసోహం చేశారు. ఐఎంఎఫ్ వద్ద 5 వేల కోట్ల రూపాయలు ఋణం పొందడంతో, రూపాయి మారకపు విలువ తగ్గింపు చర్యలు ప్రారంభమయ్యాయి. ఐఎంఎఫ్ షరతులకు లోబడి ఆర్థిక నిర్ణయాలు చేయడం ప్రారంభమైంది. దీంతో ప్రజలకు కష్టాలు ఎక్కువైనాయి. ఈ ఆర్థిక సంక్షోభాలపై ప్రజలు కన్నెర్ర చేయకుండా వారి ఆలోచనలను ప్రక్కదారి పట్టించడానికి మతాన్ని పావుగా వాడుకోవడం మొదలైంది. డిసెంబర్ 6, 1992 బాబ్రీ మసీదు కూల్చివేతతో ఇది పరాకాష్టకు చేరుకుంది.

లౌకికవాద ముసుగు కప్పుకున్న కాంగ్రెస్ పార్టీ హిందూ మతోన్మాదాన్ని ప్రోత్సహించింది. ఐతే ఈ అంశంను పూర్తిగా వాడుకొని హిందూ భావోద్రేకాలను రెచ్చగొట్టి రాజకీయశక్తిగా ఎదిగింది బిజెపి. 1984 పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి కేవలం 2 సీట్లు, 7.4 శాతం ఓట్లతో ఎక్కడో ఉన్న ఈ పార్టీ, 1991 నాటికి 117 సీట్లు తెచ్చుకొని, 2014 నాటికి 29 శాతం ఓట్లతో పూర్తి మెజారిటీ సాధించింది. వచ్చిరాగానే తన విశ్వరూపం చూపించింది.

నల్లధనం తెచ్చి ప్రతి భారతీయుని ఖాతాలో రు. 15 లక్షలు జమ చేస్తామంటూ ఉత్తరకుమార ప్రగల్భాలు పలికారు. మోడీ నోట్ల రద్దుతో ప్రజల నడ్డి విరిచాడు. జిఎస్‌టి మూలంగా చిన్న మధ్య తరహా పరిశ్రమలు దివాలా తీశాయి. దేశ ఆర్థిక వ్యవస్థ కుంటుపడింది. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. రైతుల ఆందోళనలు పెరిగాయి. మాల్యాలు, నీరవ్ మోడీల కారణంగా బ్యాంకుల దివాళా, ఆర్థిక కుంభకోణాలు మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలోకి కూరుకుపోయింది. ఈ అంశాలపై ప్రజలు ఉద్యమించకుండా వారి ఆలోచనలను ప్రక్కదారి పట్టించడానికి ఈ మతోన్మాదులు ప్రజలపై సాగిస్తున్నవే ఈ దాడులు, వరుస సంఘటనలు. కాబట్టి ప్రగతిశీల శక్తులు ఏకమై ప్రజలను ఎడ్యుకేట్ చేసి దీనికి గల మూలాలను వివరించి ప్రత్యామ్నాయ రాజకీయాలవైపు నడిపించాలి. ఉద్యమించాలి.

(రచయిత సామాజిక విశ్లేషకులు) వీ

కశ్మీర్‌లో కల్లోలానికి అంతం లేదా?

జమ్మూ కశ్మీర్‌లో బిజెపి రాజకీయంగా దెబ్బతిన్నా, అక్కడి పరిస్థితి దిగజారినా, అమాయక ప్రజలు చనిపోయినా, సాధారణ ఎన్నికల్లో హిందుత్వ పేరుతో ప్రజాభిప్రాయాన్ని అనుకూలంగా మార్చుకోవడమే అసలు ఉద్దేశ్యమని అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

జమ్మూ కశ్మీర్‌లో అనూహ్య రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) - భారతీయ జనతాపార్టీ (బిజెపి) సంకీర్ణ కూటమి పాలన నుంచి భారతీయ జనతా పార్టీ జూన్ 19న ఆకస్మికంగా మద్దతు ఉప సంహరించడంతో జమ్మూ కశ్మీర్‌లో ప్రభుత్వం కుప్పకూలింది. దీంతో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ నేత, ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ రాజీనామా చేశారు. కశ్మీర్‌లో రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. ప్రభుత్వ ఏర్పాటుకు ఏ పార్టీ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో గవర్నర్ ఎన్.ఎన్. వోహ్రా పాలన అనివార్యం అయింది. దీంతో జమ్మూ కశ్మీర్‌లో 2018 జూన్ 20 నుంచి పాలన గవర్నర్ చేతుల్లోకి పోయింది.

జమ్మూ కశ్మీర్‌లో ప్రభుత్వం నుంచి బిజెపి వైదొలగడం ద్వారా మరోసారి జాతీయవాద రాజకీయాస్త్రాన్ని 2019లో రానున్న ఎన్నికలకు సిద్ధం చేసుకున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో పాటు 2019 సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే బిజెపి ఈ నిర్ణయం తీసుకుంది. పిడిపి-బిజెపి మధ్య విభేదాలు అధికారం చేపట్టినప్పటి నుంచే ఉన్నాయి. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి హిందూ జమ్మూ, ముస్లిం కశ్మీర్ అనే భావన పెరిగిపోయింది. కథువా మైనరు ముస్లిం బాలిక దారుణ మానభంగానికి గురై చంపబడిన సందర్భంలో ఓ ఉగ్రవాద బాంబు పేలకుండా నిర్వీర్యమయ్యిందని ఓ బిజెపి రాష్ట్ర మంత్రి అనడం వల్ల బిజెపి, పిడిపిల మధ్య అఖాతం పెరిగిపోయింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసులను ఎన్‌కౌంటర్ చేయడంలో దుర్మార్గుడిగా పేరొందిన ఆ రాష్ట్ర హోం సెక్రటరీ బివిఆర్ సుబ్రహ్మణ్యాన్ని కేంద్రం డిప్యుటేషన్ మీద కశ్మీర్‌కు పంపింది. ఆయనలాగా పౌర ప్రజాతంత్ర హక్కులను కాలరాసి ప్రజల గొంతు నొక్కే మరికొందరు అధికారులు అజిత్ దోవల్ సలహామేరకు జమ్మూ కశ్మీర్‌లో కాలూనారు. బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్‌తో రగిలిన కశ్మీర్‌ను శాంతింపచేసే ప్రయత్నాల్లో భాగంగా మెహబూబా ముఫ్తీ ఒత్తిడి తెచ్చి కేంద్రానికి పంపివేసిన ఎన్.ఎం. సహాయ్ అనే ఐపిఎస్ అధికారి కూడా వీరిలో ఒకరు. ఇకపై కశ్మీర్‌లో ఊగిసలాటలేని దూకుడు విధానాన్ని అమలు చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్టు కనిపిస్తున్నది. దీంతో కేంద్రం రాబోయే రోజుల్లో ఏ విధంగా వ్యవహరించబోతున్నదో ఇప్పటికే చూచాయగా తెలిసింది. ఎందుకంటే 9 నెలల్లో రానున్న సాధారణ ఎన్నికలపై దృష్టి పెట్టిన బిజెపికి ప్రజలకు చెప్పుకోవడానికి, ఓట్లు అడగడానికి నాలుగేళ్లలో నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి ఏమి లేదు. అందుకే 2019 ఎన్నికల్లో గెలుపునకు కశ్మీర్‌ను ప్రయోగశాల చేయబోతున్నారు.

చరిత్రలో కశ్మీర్

భారత స్వాతంత్ర్య చట్టం 1947 ప్రకారం ఆగస్ట్ 15 నుంచి మత ప్రాతిపదికన భారత్ పాకిస్థాన్‌లు రెండు స్వతంత్ర దేశాలుగా అవతరించాయి. కానీ అప్పటికే బ్రిటిష్ వారి పాలనలో పరిమిత అధికారాలతో స్వతంత్ర రాజ్యాలుగా ఉన్న కశ్మీర్, హైదరాబాద్ లాంటి పెద్ద సంస్థానాలతో బాటు, అనేక చిన్న సంస్థానాలు తమ ఇష్టం వచ్చిన దేశంలో కలవచ్చు లేదా స్వతంత్రంగా ఉండవచ్చునని ఆ చట్టం పేర్కొంది. హైద్రాబాద్, జునాగఢ్, కశ్మీర్ తప్ప మిగతా సంస్థానాలను అనేక మార్గాలలో దారికి తెచ్చి దేశంలో అంతర్భాగం చేశారు. వ్యూహాత్మక ప్రాంతంలో ఒక ప్రత్యేక రాజ్యంగా ఉన్న జమ్మూ కశ్మీర్ రాజు హరిసింగ్, కశ్మీర్‌ను స్వతంత్ర్య రాజ్యంగా కొనసాగిస్తానని, భారత్-పాకిస్థాన్‌లలో దేనిలోనూ కలపనని ప్రకటించాడు. హరిసింగ్ పాలనపై కశ్మీర్ ప్రజలలో తీవ్ర అసంతృప్తి ఉండేది. ఈ రాజ్యంలో అత్యధికులు ముస్లింలు కాగా, పరిపాలించేది హిందువు. కశ్మీర్ లోయలో ముస్లింల జనాభా ఎక్కువ కాగా, జమ్మూ ప్రాంతంలో హిందువుల జనాభా ఎక్కువ.

దేశ విభజనకు ముందే కశ్మీర్ రాజు నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ 1939లో షేక్ అబ్దుల్లా నాయకత్వంలో జమ్మూ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ ఏర్పడింది. ఈ సంస్థ చేసే పోరాటాలకి మతం రంగు పులిమి హిందూ వ్యతిరేకమైనవిగా కొన్ని హిందూ మత శక్తులు చిత్రీకరించాయి. షేక్ అబ్దుల్లా సంస్థానాలను రద్దు చేయాలని, దున్నేవారికి భూమి పంచాలని పోరాటాలు చేస్తున్న ప్రజా నాయకుడు. ఎర్రజెండా మీద నాగలి గుర్తు నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ జెండా. 1947 అక్టోబర్ 2న షేక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ కశ్మీర్, భారత్‌లో విలీనం కావాలని కోరుకొంటున్నట్లు తీర్మానం చేసింది. షేక్ అబ్దుల్లా నాయకత్వంలో అత్యవసర ప్రభుత్వం 1948 అక్టోబర్ 30న ఏర్పడింది. నెహ్రూ సహకరించారు. షేక్ అబ్దుల్లా భూసంస్కరణల చట్టం తెచ్చారు. అప్పటి వరకు ఒకే విధానం ఒకే జెండా ఒకే ప్రధాని నినాదంలో అబ్దుల్లా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న హిందూ మతతత్వ సంస్థలకు, శక్తులకు భూసంస్కరణ అమలు వల్ల భూములు పోతాయన్న భయం పట్టుకుంది.

1947 అక్టోబర్ 22న కశ్మీర్, పాకిస్థాన్ సరిహద్దుల్లోని పష్తూన్ గిరిజన తెగలు కశ్మీర్‌లోకి చొరబడడం ప్రారంభించాయి. ఆ దశలో గత్యంతరం లేక తాము భారత్‌లో కలుస్తామని 1947 అక్టోబర్ 26న కశ్మీర్ రాజు భారత ప్రధాని నెహ్రూతో ఒప్పందం చేసుకోగానే భారత్ దళాలు ఇప్పుడు మన దేశంలో భాగంగా ఉన్న కశ్మీర్‌ను స్వాధీనం చేసుకొన్నాయి. కశ్మీర్ కొరకు భారత్-పాకిస్థాన్ సైన్యాలు ముఖాముఖి

పోరాడాయి. చివరకు కశ్మీర్ సమస్య 1948 జనవరి 1న ఐక్యరాజ్యసమితి వరకు వెళ్లిన నేపథ్యంలో ప్లెబిసైట్ నిర్వహించి ఆ ఓటింగ్‌లో తేలిన ప్రజాభిప్రాయం ప్రకారం కశ్మీర్ సమస్యను పరిష్కరించుకోవాలని ఐరాస 1948 ఆగస్టు 13న తీర్మానం చేసింది. ఏడు దశాబ్దాలు గడిచినా జమ్మూ కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరుగలేదు.

పాకిస్థాన్ తాను ఆక్రమించుకొన్న కశ్మీర్ ప్రాంతాన్ని తనలో విలీనం చేసుకోవడం లేదని, దాన్ని స్వతంత్ర ప్రాంతంగా ప్రకటించడమే కాక దానికి ప్రత్యేక ప్రతిపత్తిని కలిగించింది. ఈ నేపథ్యంలో మొత్తం కశ్మీరీల విశ్వాసం పొంది భారత్‌లో అంతర్భాగంగా కొనసాగేందుకు ఆ ప్రాంతానికి ప్రత్యేక రక్షణలు, ప్రతిపత్తి కల్పించాలని నెహ్రూ ప్రభుత్వం నిర్ణయించి మన రాజ్యాంగంలో ఆర్టికల్ 370ని పొందుపరిచారు. ఇప్పటికీ పాక్ ఆక్రమిత కశ్మీర్‌కి ఒక ప్రత్యేక ప్రభుత్వం కొనసాగుతోంది. ఆ ప్రాంతాన్ని 'ఆజాద్' (స్వతంత్ర) కశ్మీర్ అని పాకిస్థాన్ పిలిస్తే 'ఆక్రమిత కశ్మీర్' అని భారత్ పిలుస్తోంది. తరుచుగా భారత్, పాకిస్థాన్‌లు సియాచిన్ గ్లేసియర్‌పై పట్టుకోసం ఘర్షణ పడుతున్నాయి. భారత్, జమ్మూ కశ్మీర్ మొత్తంపై తన హక్కు ప్రకటిస్తుండగా, పాకిస్థాన్ దాదాపు 37 శాతం కశ్మీర్‌ను, ఆజాద్ కశ్మీర్, గిల్గిత్ బాలిస్తాన్‌ల పేరుతో నియంత్రిస్తోంది. భారత్, జమ్మూ కశ్మీర్ లోయ, లడాఖ్, సియాచిన్ గ్లేసియర్ ప్రాంతాలను పరిపాలిస్తోంది. 1948 నుంచి భూతల స్వర్గంగా పిలువబడే కశ్మీర్ నెత్తురోడుతోంది. కశ్మీర్ ప్రజానీకం తమ జాతి అస్తిత్వ నిర్దిష్ట స్వరూపాన్ని కోల్పోయి అటు పాకిస్తాన్, ఇటు భారత్ మధ్య అగ్నిలో సమిధలవుతున్నామని భావించడంలో ఆశ్చర్యం లేదు. కనుక కశ్మీర్ వ్యవహారం ఇండియా, పాకిస్థాన్‌ల మధ్య ప్రాదేశిక వ్యవహారంగానో, హిందూ ముస్లిం సమస్యగానో మాత్రమే పరిగణించడం సరైనది కాదు.

కశ్మీర్‌ను, భారత్‌లో అంతర్భాగం చేయటానికి నెహ్రూ, పటేల్ ఇరువురు తీవ్రంగా కృషి చేసారు. కశ్మీర్ ప్రజా నాయకుడు షేక్ అబ్దుల్లా, యువరాజు కరణ్ సింగ్‌లతో చర్చించి వారి అభ్యంతరాలను పరిగణన లోకి తీసుకున్నారు. వారిని అంగీకరింపజేశారు. ప్రత్యేక నిబంధనలతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని జమ్మూ కశ్మీర్‌కు వర్తింపజేయాలని 1950 జనవరి 26న భారత రాష్ట్రపతి ఆమోదముద్ర వేసి అమలుకు ఆదేశాలిచ్చారు. ఆ విధంగా జమ్మూ కశ్మీర్‌ను నెహ్రూ ఢిల్లీకి చేరువ చేశారు. 1952 జూలైలో ఢిల్లీలో విలీన ఒప్పందంలో ప్రస్తావించిన అంశాలు మినహా మిగిలిన అన్ని అంశాలలోనూ రాష్ట్రానికే సార్వభౌ మాధికారం ఉంటుంది అనే అంగీకారం కుదిరింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి జమ్మూ కశ్మీర్‌కు వచ్చేవారిని పూర్తిస్థాయి పౌరులుగా గుర్తిస్తామని, భారతదేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి కశ్మీర్‌లో స్థిరాస్తులు సంపాదించే వీలులేదని ఈ ఒప్పందం నిర్దేశించింది.

ఆర్ఎస్ఎస్ ఒకే దేశంలో ఇద్దరు ప్రధానులు, రెండు రాజ్యాంగాలు, రెండు పతకాలు చెల్లవని, కశ్మీర్‌ను భారతదేశంలో పూర్తిగా భాగం చేయాలని ఉద్యమం చేపట్టింది. ఈ నేపథ్యంలో 1953 ఆగస్టు 9న షేక్ అబ్దుల్లాని నెహ్రూ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. బక్షీ గులాం మహమద్ ప్రధానిగా కొత్త ప్రభుత్వం ఏర్పాటయింది. నెహ్రూ కనుసన్నల్లో మెలిగే గులాం మహమద్ ప్రభుత్వం శాసన సభలో విలీన ఒప్పందాన్ని ఏకగ్రీవంగా అంగీకరించింది. ఈలోగా 1957 నవంబర్ 17న కశ్మీర్ శాసన సభ తన స్వంత రాజ్యాంగాన్ని ఆమోదించుకుంది. స్వాతంత్ర్యానికి ముందు జమ్మూ కశ్మీర్ బ్రిటిష్ సామ్రాజ్య రాచరిక రాజ్యం. కశ్మీరీలు రాష్ట్ర ప్రజలే. ఇండియా పౌరులు కారు. 1947, అక్టోబర్ 26న భారత్‌లో చేరాలని, కలవాలని కాదు, నిర్ణయించింది. రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్స్ నియంత్రణను మాత్రమే వదులుకుంది. జమ్మూ కశ్మీర్ రాజు హరిసింగ్ చేరిక అమలు పత్రంపై సంతకం చేశారు. దీని ప్రకారం చేరిక నియమాలు మార్చరాదు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించనక్కరలేదు. జమ్మూ కశ్మీర్ పాలకుని విచక్షణాధికారం కొనసాగుతుంది. ఏ చట్టమూ దాని సార్వభౌమత్వాన్ని ప్రశ్నించదు.

రాజ్యాంగంలో కశ్మీర్

భారత రాజ్యాంగంలోని 1వ అధికరణ ప్రకారం జమ్మూ రాష్ట్రం కూడా భారత యూనియన్‌లో రాష్ట్రమే. అయితే రాజ్యాంగంలో 21వ భాగంలో గల 370వ అధికరణ జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించింది. ఈ అధికరణ ప్రకారం రాజ్యాంగంలోని అన్ని అదికరణలు ఈ రాష్ట్రానికి వర్తించవు. దేశ సరిహద్దు భద్రత, విదేశీ వ్యవహారాలు, వాణిజ్యం తప్ప. అంతేగాక భారతదేశంలో ప్రత్యేక రాజ్యాంగం గల ఏకైక రాష్ట్రం జమ్మూ కశ్మీర్ మాత్రమే. 1947 జమ్మూ కశ్మీర్ పాలకుడు అయిన మహరాజా హరిసింగ్, నెహ్రూల మధ్య జరిగిన విలీన ఒప్పందం ప్రకారం రాజ్యాంగంలో 370 అధికరణను చేర్చడం జరిగింది. ఈ అధికరణ 1952 నవంబర్ 17న అమలులోకి వచ్చింది.

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హైకోర్టు, ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉన్నాయి. రాష్ట్ర అనుమతి లేనిదే జమ్మూ కశ్మీర్ రాష్ట్ర భూభాగాలను పునర్వ్యవస్థీకరించే అధికారం పార్లమెంట్‌కు లేదు. కేంద్రం జారీ చేసే ఆదేశాలను రాష్ట్రం పాటించలేదు అనే కారణంపై ప్రకరణ 365 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసే అధికారం కేంద్రానికి లేదు.

భారత రాజ్యాంగంలో 370, 35ఎ అధికరణలు ఏర్పాటయ్యాయి. జనసంఘ్ నేత శ్యాంప్రసాద్ ముఖర్జీ వీటిని అంగీకరించారు. 370 జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తుంది. రాష్ట్ర శాశ్వత నివాసితులను నిర్వచించి వారికి ప్రత్యేక హక్కులు అధికారాలిచ్చే హోదా 35ఎ ఇస్తుంది. జమ్మూ కశ్మీర్ రాజ్యాంగ సభకు భారత రాజ్యాంగ అధికరణల సిఫారసు, 370 రద్దు హక్కులున్నాయి. రాజ్యాంగం అమలైన తర్వాత ఈ సభ 370ని రద్దు చేయకుండానే తనను రద్దు చేసుకుంది. ఫలితంగా 370 భారత రాజ్యాంగంలో శాశ్వత భాగమైంది. కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని భారత ప్రభుత్వం హరిస్తుందన్నదే ప్రధాన వివాదం. 1987 నాటికి వివాదస్పద రాష్ట్ర ఎన్నికల అనంతరం ఉద్యమం తీవ్రత సంతరించుకుంది. 1988 జూలై నుంచి వరుసగా భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మెలు, ప్రదర్శనలు, దాడులలో కశ్మీర్ కల్లోలం ప్రారంభమైంది.

మూడు దశాబ్దాల సైనిక పాలన

గత 28 సంవత్సరాలలో ఒక కోటి 25 లక్షల జనాభా గల జమ్మూ కశ్మీర్‌లో శాంతి భద్రతల నిమిత్తం 700 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టింది. రాష్ట్ర పోలీసు, సరిహద్దు భద్రతా దళాలు, కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు, ఇండో టిబెట్ బెటాలియన్ పోలీసు,

కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ప్రత్యేక భద్రతా బలగాలు మొత్తంగా 6 లక్షలు. ఆరు విభాగాలు సరిహద్దుతో పాటు వీధి వీధి, గల్లీ గల్లీ మోహరింప జేశారు. ప్రపంచంలోనే అత్యధిక మిలిటరీ నియమించబడి పాలించబడుతున్న రాష్ట్రంగా కశ్మీర్ ప్రసిద్ధికెక్కింది. 1989 నుండి కశ్మీర్‌లో భారతసైన్యం సుమారు లక్ష మంది పౌరులను చంపివేసింది. పాము పడగ నీడలో బతికే కప్ప చందంగా కశ్మీరీ ముస్లిం ప్రజానీకం బిక్కు బిక్కు మంటూ బతుకు వెళ్లదీస్తున్నది. 2016 జూలై 6న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కశ్మీర్ కల్లోళం మరోసారి పతాక స్థాయికి చేరింది. అది ఇప్పటికీ కొనసాగుతుంది. రెండు సంవత్సరాలు గడచినా ప్రజల ఆగ్రహం అణగిపోలేదు. ఇది కశ్మీర్ ప్రజల పెరిగిపోతున్న తిరస్కారాన్ని, నిశ్చయాత్మకతను వెల్లడిస్తోంది.

జమ్మూ కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదని, అంతర్జాతీయ విచారణ చేయాలని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల ముఖ్యాధికారి ఈ మధ్య 2018 జూన్ 14న ఐక్యరాజ్య సమితి మానవహక్కుల సంస్థ వెలువరించిన 49 పేజీల నివేదిక లోయలో సైన్యం పాత్రను పెద్ద ఎత్తున తప్పుబట్టింది. భారత ఆధీనంలోని కశ్మీర్‌లో మానవ హక్కులపై ఐరాస ప్రత్యేకంగా ఒక నివేదిక వెలువరించడం ఇదే ప్రథమం. "కశ్మీర్ వివాదంలో చాలా కాలంగా భారత్-పాకిస్థాన్ రాజకీయ వ్యవహారాలే ప్రధాన చర్చనీయాంశాలుగా ఉంటున్నాయి. గానీ, వాస్తవానికీ ఈ సంఘర్షణ లక్షలాది మంది కనీస మానవ హక్కులను మంటగలుపుతోంది" అని నివేదిక వ్యాఖ్యానిస్తే "భారత ప్రభుత్వం సైనిక బలాన్ని అతిగా వినియోగించకుండా ఉండడం తక్షణావసరం" అని ఐరాస మానవ హక్కుల హై కమీషనర్ అల్ హుస్సేన్ కరకు వ్యాఖ్యాలు చేశారు.

జమ్ము కశ్మీర్‌లో సైనిక బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఎప్పుడో రద్దు చేయవలసిన చట్టంగా నివేదిక పేర్కొంది. కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా జరిగిపోతోందని, అక్కడ జరుగుతున్న దారుణాలు వార్ క్రైంతో, జెనోసైడ్‌తో పోల్చారు. కశ్మీర్లో భారత పాలకవర్గాలచే నియమించబడ్డ సాయుధ దళాల చేతిలో ప్రజల హక్కులు ధ్వంసమై పోవడాన్ని, మనుషులను ఏ సమాచారం లేకుండా మాయం చేయడాన్ని, కస్టోడియల్ కిల్లింగ్స్‌ను తప్పుపట్టింది. జమ్ము కశ్మీర్‌లో సైనిక బలగాల ప్రత్యేకాధికారాల చట్టం వల్ల లోయలో అత్యాచారాలు, దురాగతాలు పెచ్చుమీరి తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన చోటుచేసుకుంటోందని దీన్ని తక్షణమే రద్దు చేయాలని ఐరాస నివేదిక వ్యాఖ్యానించింది.

కశ్మీర్‌లో సైనిక బలగాలు విపరీత బలప్రయోగానికి పాల్పడుతున్నా యని గత 2 సంవత్సరాల కాలంలో 145 మంది అమాయక పౌరులను కాల్చివేశారని పేర్కొన్నారు. కశ్మీర్ లోయలోని దాదాపు 60 శాతం మంది 30 ఏళ్లలోపు యువత. వీరికి భారత్ పట్ల ఏ మాత్రం ప్రేమాభిమానాలు లేకపోగా.. ఆగ్రహంగానూ, అయోమయంలోనూ ఉన్నారు. భారత ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని, అనుమానించిందని, ఏకాకులమయ్యామనే భావన వారిలో విస్తృతంగా ప్రబలి ఉంది. వారు స్వాతంత్ర్య కాంక్షలో రగిలిపోతున్నారు. భారత అణచివేతకు వ్యతిరేకంగా చావుకైనా సిద్ధపడతామని యువత బాహాటంగానే చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదంతో మిలిటెన్సీని అణిచివేయాలని భావిస్తుంటే 2016 తర్వాతి నుంచి యువత మిలిటెన్సీ పెరిగిందే తప్ప తగ్గలేదు.

గత 30 ఏళ్లుగా సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం అమలులో ఉన్న జమ్మూ కశ్మీర్‌లో సైనికులచే మానభంగానికి గురైన కూనన్ పోష్పోరా 23 మంది మహిళల కేసులలో ఒక్కటి కూడా విచారించబడలేదని, సైనికులు నిర్భయంగా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని పొందు పర్చింది. రెండు సంవత్సరాల క్రితం సైనికులు పట్టుకొని చంపిన సాయుధ తీవ్రవాద నాయకుడి అంత్యక్రియలకు భారీగా హాజరైన ప్రజా సమూహం ప్రదర్శనల గురించి కూడా నివేదిక ప్రస్తావించింది. ఇదంతా మన గుండెల్ని చెరువు చేస్తున్నది. ఇక కశ్మీరీల గుండెలు దాల్ సరస్సుగా మారి ఉంటాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. జమ్మూ కశ్మీర్‌లో జరుగుతున్న పరిణామాలు, ఘటనలు, సంఘటనలు ఢిల్లీ నుండి కశ్మీర్‌ను వేరు పర్చేలా ఉన్నాయి.

భారత్‌కు వ్యతిరేకంగా కశ్మీర్ యువత

జమ్మూ-కశ్మీర్‌లో 1990 నుంచి చెలరేగుతున్న హింసాత్మక పరిణామాల్లో ప్రతి ఏటా వేలాది మంది మరణిస్తున్నారు. కశ్మీర్ సమస్యకు ఎన్‌కౌంటర్లు పరిష్కారం కాదు. కశ్మీర్ ఉద్యమం వ్యక్తుల ఇష్టాయిష్టాలతో ఉనికిలోకి వచ్చింది కాదు, అది పాలకుల విధానాల పర్యవసానంగా ఒక సంక్లిష్టమైన ప్రాణాంతక ప్రత్యామ్నాయంగా ముందుకొచ్చింది. కశ్మీర్ ప్రాంత అభివృద్ధి పునాదిగా అక్కడి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేందుకు ప్రభుత్వాలు ప్రయత్నించకుండా, బలప్రయోగం ద్వారా వారిని లొంగదీసుకునే ప్రయత్నాల వల్ల అక్కడ దుర్భర పరిస్థితులు తలెత్తాయి. భయంతో ప్రజలను గెలుచుకోవడం, వారిపై ఆధిపత్యం కొనసాగించడం ఎవ్వరూ ఎల్లకాలం సాగించలేరు. కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను విదేశీ కుట్రలుగా పరిగణించకుండా రాజకీయ పరిష్కారం కోసం ప్రయత్నించాలి. తీవ్రవాదాన్ని కొత్తపుంతలు తొక్కిస్తున్న కశ్మీర్ యువతకు కావల్సింది భయం పునాదిగా సాగే లొంగుబాటు పథకాలు కాదు, ఉపాధి, మౌలిక సామాజిక మార్పుకు దోహదం చేసే విధానాలని పాలకులకు అర్థమవుతుందని ఆశించడం అత్యాశే అవుతుంది.

దాదాపు 6 లక్షల మంది సైనికుల మోహరింపు వల్ల కశ్మీర్ భారత బలగాల చేతుల్లో భద్రంగానే ఉంది. కానీ అక్కడి ప్రజలు ముఖ్యంగా యువత భారత్‌కు నానాటికీ దూరమవుతున్నారు. ప్రపంచంలోనే అత్యధిక మిలిటరీ నియమించబడి పాలించబడుతున్న రాష్ట్రంగా కశ్మీర్ ప్రసిద్ధికెక్కింది. 1989 నుండి కశ్మీర్‌లో భారతసైన్యం సుమారు లక్ష మంది పౌరులను చంపివేసింది. గత ఏడాది శ్రీనగర్‌లో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో కేవలం 7 శాతం ఓట్లు పోల్‌కావడం అక్కడి ప్రజల మనోగతాన్ని తెలియజేస్తోంది. భారత భద్రతాదళాలు ఘోరంగా అణచివేతలకు పాల్పడుతున్నాయంటూ కశ్మీరీ యువత పెద్దఎత్తున తిరగబడుతోంది. యువత రాళ్లదాడులు, భద్రతాసిబ్బంది భాష్పవాయు గోళాల ప్రయోగం, తీవ్రవాదుల ఆకస్మిక దాడులతో కశ్మీర్‌లోయ నాలుగేళ్లుగా అట్టుడుకుతోంది. ప్రముఖ జర్నలిస్టు శేఖర్ గుప్తా "ప్రాదేశికంగా చూస్తే కశ్మీర్ భద్రంగానే ఉంది. కానీ భావోద్వేగాల పరంగా, మానసికంగా మనం కశ్మీర్‌ను వేగంగా కోల్పోతున్నాం" అని వ్యాఖ్యానించాడు. గత నాలుగేళ్లుగా అక్కడ చోటుచేసుకుంటున్న పరిణామాల్ని చూస్తుంటే ఈ వ్యాఖ్యలు నిజమేననిపిస్తుంది.

బిజెపి ఎన్నికల ప్రణాళిక

2018 లోనే 15 రాష్ట్రాలతో పాటు కశ్మీర్‌లోనూ ఎన్నికలు జరపాల్సి ఉంది. లడఖ్‌ను కేంద్రపాలితం చేస్తామన్న పాతపాటతో జమ్మూ లడఖ్‌లు వేదికగా ఫలితాలు సాధించాలని, 370,35ఎ తిరస్కరణ కశ్మీరేతరంలోనూ లబ్ధి చేకూర్చగలదని బిజెపి భావిస్తుంది. మంత్రులు, యోగులు, స్వాములు మందిర నినాదమిస్తారు. గవర్నర్ ఆధ్వర్యంలో తీవ్రవాదంపై పోరు పేరుతో సంఘ్ పరివార సంఘాలు మానవ, ప్రజాతంత్ర హక్కులు హరిస్తాయి. తీవ్రవాదంపై చర్యకు రాజకీయాలతో పనిలేదన్న జైట్లీ ముక్తాయింపు రాజ్యాంగేతర, ప్రభుత్వేతర శక్తుల ప్రోత్సాహానికేనన్నది స్పష్టం. సంకీర్ణంలో నరేంద్ర మోడీ ముష్టిని పనిచేయనీయలేదు. గవర్నర్ పాలనంటే అంతా మోడీయమే.

గవర్నర్ పాలన ప్రారంభమైన మూడోరోజున అనంతనాగ్ జిల్లా ఎదురుదాడిలో ఆరుగురు చనిపోయారు. 13మంది తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయినవారిలో ముగ్గురు పౌరులు, ఒకరు పోలీసు. గాయపడినవారంతా పౌరులే. "ఇక సంఘ్ పరివార్ రెచ్చిపోతుంది. హింస పెరుగుతుంది" అని మానవతావాదుల విశ్లేషణ. మా ఎన్నికల ఎత్తుగడ "భద్రతాదళాలకు పిడిపి ఇవ్వని స్వేచ్ఛనివ్వడం" అని బిజెపి యువత ఉపాధ్యక్షుడు కరణ్ శర్మ వివరించారు. "దేశవ్యాపిత హిందుత్వవాదుల ఓట్లు పొందడానికే ఈ పథకం.

ఇక ప్రజల ప్రతి కదలికలో తీవ్రవాదం, పాక్ హస్తం కనిపిస్తాయి. ప్రతి పిచ్చిపని దేశభక్తి చర్యగా ప్రశంసించబడుతుంది. సంఘ్ పరివార్ తాత్విక కీలుబొమ్మను గవర్నర్‌గా తెస్తారు. తీవ్రవాదులు, పాక్ చొరబాటుదారులు, సానుభూతిపరుల ముద్రతో తమ తాత్వికతను అంగీకరించనివారిని, మతేతరులను భద్రతాదళాలతో హత్య చేయిస్తారు. ఎవరిని చంపినా తప్పుకాదు.

నూతన 'ఆల్ ఔట్' ఆపరేషన్ హిందూ ముస్లింల మధ్య చిచ్చు రేపుతుంది. కశ్మీరీల ఊచకోతకు దారి తీస్తుందని వరిష్ట పాత్రికేయులు ప్రేంశంకర్ ఝా వ్యాఖ్యానించారు.

సంఘ్ పరివార్ సిద్ధాంతం

హిందూస్థాన్, మనుస్మృతి, హైందవ సంస్కృతి, హిందూత్వం, సంస్కృతం సంఘ్ పరివార్ సిద్ధాంతాలు. సంఘ్ పరివార్ భారత రాజ్యాంగాన్ని ఆమోదించదు. మనుస్మృతి విశ్వాంగీకారమంటుంది. అందుకే నిశ్శబ్దంగా రాజ్యాంగాన్ని తిరస్కరిస్తోంది. సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకం. ప్రజాస్వామ్యం పడదు. ఏకస్వామ్య నిరంకుశత్వాన్ని ప్రేమిస్తుంది. జాతీయ జెండారంగుల్లో మూడు అరిష్టం. కాషాయ పతాకం కావాలన్నారు. జెండా చతుర్వర్ణమని నీలి అశోక చక్రం నాల్గవ రంగని మోడీ వివరించారు. చతుర్వర్ణ సంకేతమని అంతర్గతం. అయినా కశ్మీర్‌లో జాతీయ జెండాతో జనాలను రెచ్చగొట్టి కశ్మీరేతరుల మెప్పు పొందే యత్నం చేశారు. 2014 ఎన్నికల ప్రణాళికలో బిజెపి ఆర్టికల్ 370ని రద్దు చేస్తానంది. ఫలితంగా జమ్మూ ప్రాంతంలో 22 లో 18 స్థానాలు గెలుచుకుంది. కశ్మీర్ ప్రాంత ప్రచారంలో నరేంద్ర మోడీ మాట మార్చి 370పై చర్చ జరగాలన్నారు. ఈ తీరు కశ్మీర్ ప్రాంతీయులను బుజ్జగించడానికే. పిడిపితో అధికారం పంచుకుంటూ ఆర్టికల్ 370 కొనసాగుతుందన్నారు. ఇప్పుడు 370, 35ఎ రద్దు చేయాలంటున్నారు. ఎంత విచిత్రం?

కశ్మీరు పరిస్థితి రానున్న ఎన్నికల్లో ప్రచారాయుధంగా మార్చుకునే ఆలోచన బిజెపికి ఉంది. కశ్మీరు విషయంలో జాతీయభావాలను రెచ్చగొట్టి ప్రజలను ఆకర్షించడానికి అవకాశం ఉంది. ఇంతకు ముందు కూడా బిజెపి చాలా సార్లు కశ్మీరు సమస్యను ఎన్నికల రాజకీయాలకు ఉపయోగించుకుంది. తాను అధికారంలో లేని కాలంలో కశ్మీర్ పండిట్ల సమస్యను అడ్డం పెట్టుకొని, హిందూ-ముస్లిం విద్వేషాన్ని రగిల్చింది. అక్కడ అధికారంలో భాగం పంచుకున్నాక 'తీవ్రవాదం' సమస్యను వాడుకుంటోంది. జమ్ము కశ్మీరులో రాజకీయంగా దెబ్బతిన్నా పర్వాలేదు. జమ్ము కశ్మీరులో పరిస్థితి దిగజారినా పర్వాలేదు. అమాయక ప్రజలు ఎంత మంది చచ్చిన పర్వాలేదు. సాధారణ ఎన్నికల్లో ప్రజాభిప్రాయాన్ని బిజెపికి అనుకూలంగా మార్చడమే ముఖ్యం అని స్వార్థ రాజకీయాలతో వేసిన ఎత్తుగడ ఇది. కశ్మీరు సమస్య పరిష్కరించడానికి తాము ప్రయత్నించినా పిడిపి అడ్డుతగలడం వల్ల సాధ్యం కాలేదని ఇప్పుడు దేశ ప్రజలకు బిజెపి చెబుతుంది.

ముగింపు

గత నాలుగేళ్లుగా మోడీ ప్రభుత్వం కశ్మీర్ ప్రజల విశ్వాసాన్ని పొందడానికి బదులుగా వారందరిని తీవ్రవాదులుగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. సైన్యానికి సర్వాధికారాలు దఖలు పరిచి వినోదం చూసింది. స్థానిక ప్రజలను మానవ కవచాలుగా చేసుకుని కవాతు చేసినా మోడీ సర్కారు స్పందించకపోవడం యాదృచ్ఛికమేమి కాదు. పెచ్చరిల్లిన హింస, నిర్బంధ కాండపై స్థానికులు ఆగ్రహిస్తే తీవ్రవాదానికి ఊతమిస్తున్నారంటూ గగ్గోలు పెట్టింది. సమస్యను పరిష్కరించే తీరు ఇది కాదని ప్రతిపక్షాలు, మానవ హక్కుల సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు చేసిన హెచ్చరికలను బేఖాతరు చేసింది. కశ్మీరాన్ని కల్లోల సీమగా మార్చి వేసింది. కశ్మీర్ ప్రజల ప్రజాస్వామిక హక్కులకు పాతరేసింది.

ఎన్నికలలో గెలవడమే లక్ష్యం తప్ప కశ్మీర్ ప్రజల శాంతియుత, పురోగామి భవితవ్యం లెక్కలోలేని మోడీ, షాల నిరంకుశ విధానం గమనిస్తే రానున్న సాధారణ ఎన్నికలకు ముందు సైనిక పరిష్కారం పేరుతో కశ్మీర్‌లో యుద్ధ వాతావరణం ఏర్పడినా ఆశ్చర్యం లేదు. వారికి కావలసింది ఏకశిలా సదృశమైన హిందూ రాజ్యం. నిజానికి కశ్మీరి సమస్యకు చర్చల ద్వారా పరిష్కారం సాధించడం తప్ప మరో మార్గం లేదు. ప్రజల్లో విశ్వాసం కల్పించే ప్రక్రియను ప్రారంభించకుండా, మరింత పెద్ద సంఖ్యలో ప్రజలు తీవ్రవాదంతో చేతులు కలపడాన్ని నిరోధించకుండా, పాకిస్థాన్‌ను తటస్థం చేయకుండా, శాంతియుత వాతావరణం ఏర్పర్చకుండా కశ్మీరీ సమస్య పరిష్కారం కాదు.

భారతీయ జనతాపార్టీ గానీ, దానిని వెనుక నుండి నడిపించే సంఘ్ పరివారానికి గానీ కశ్మీర్ సమస్య పరిష్కారం పట్ల ఏనాడూ చిత్తశుద్ధి లేదు. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న అమానవీయ పరిస్థితుల పట్ల ఎటువంటి సానుభూతి లేదు. కశ్మీరీల సమస్యల పరిష్కారానికి, వారి స్థానిక స్వయంపాలన ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు చొరవ చూపకుండా

కశ్మీర్ లోయలో కేంద్ర బలగాల హింస

***అఖిల భారత ప్రజా న్యాయవాదుల సంఘం జాతీయ కార్యదర్శి సురేంద్ర గాడ్లింగ్‌ను ఊపా చట్టం కింద అరెస్ట్ చేసి కశ్మీర్ ప్రజలపై జరుగుతున్న హింసను బయటికి వెల్లడించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్బంధించిందని అంటున్నారు* పిచ్చుక శ్రీనివాస్**

కశ్మీర్ లోయలో రంజాన్ పండుగ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించడం, అందుకు ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తి హర్షం ప్రకటించడం, హురియత్ నాయకులు, జమ్ము కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జెకెఎల్ఎఫ్) నాయకులు ఈ సందర్భంగా కశ్మీరులో శాంతియుత పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని పత్రికా ప్రకటనలు వెలువడుతున్న నేపథ్యంలో జాతీయ ప్రజా న్యాయవాదుల సంఘం (ఐఏపిఎల్) కశ్మీరులో రాష్ట్ర సామాన్య ప్రజలపై, ప్రజా న్యాయవాదులపైన జరుగుతున్న హింస, అత్యాచారాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై నిజనిర్ధారణ ఓరిఫ్ వాస్తవాలను తెలుసుకోవడానికి మే 22 నుంచి 28 వరకు కశ్మీర్ లోయలో పర్యటించింది.

భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పంజాబ్, హర్యాన, చండీఘడ్, ఢిల్లీ, బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 15 మంది న్యాయవాదుల బృందం వారం రోజుల పాటు బారాముల్లా, హింద్వారా, కుప్వారా, గందర్‌బాల్, బుద్‌గామ్, ఐపియానా, ఇస్లామాబాద్ (అనంత్‌నాగ్), పుల్వామా ప్రాంతాలలో పర్యటించి అక్కడి పౌర సమాజ సమాఖ్య సభ్యులతో, బాధితులతో, మానవ హక్కుల కార్యకర్తలతో, మానవ హక్కుల కోసం కోర్టులలో శ్రమిస్తున్న బార్ అసోసియేషన్‌కు సంబంధించిన న్యాయవాదులతో కలసి హ్యూమన్ రైట్స్ కమిషన్ ఛైర్మన్‌ను కలసి వివరాలను సేకరించింది. కశ్మీర్ ప్రజలు గాని, బాధితులు గాని నిజ నిర్ధారణ బృందం ముందు వాస్తవాలను వెల్లడించడానికి, తమ బాధలను చెప్పుకోవడానికి మొదట నిరాకరించారు.

దానికి వారు చెప్పిన కారణం ఇండియా మీడియా, పత్రికలు కశ్మీర్ లోయలోని వాస్తవ పరిస్థితులను వక్రీకరించి కేంద్ర ప్రభుత్వ అసత్య ప్రచారాలకు వత్తాసు పలుకుతున్నాయని వాపోయారు. కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తి సమస్యను పాకిస్తాన్ మిలిటెంటు, టెర్రరిస్టు సమస్యగా చిత్రీకరిస్తున్నారని, కశ్మీర్ పత్రికలు కోరుకుంటున్న శాంతియుత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వారు చెప్పారు. కశ్మీర్ ప్రజల హక్కుల కోసం ఉద్యమిస్తున్న జమ్ము కశ్మీర్ పౌర సమాజ సమాఖ్యకు చెందిన న్యాయవాది పెర్వజ్ ఇమామ్, హక్కుల ఉద్యమకారుడు, మిలటరీ బలగాల చేత గాయపడి కాలు పోగొట్టుకున్న కర్రం పెర్వజ్‌కు భారతదేశంలో ప్రజా న్యాయవాదుల సంఘానికి ఉన్న నిబద్ధత గురించి, నిజాయితీ గురించి వివరించగా ప్రజా న్యాయవాదుల సంఘంపై నమ్మకం కలిగి, భారతదేశ ప్రజల ముందు కశ్మీర్ లోయలోని వాస్తవ పరిస్థితులను వెల్లడిస్తారనే నమ్మకం కలిగిన తరువాతే తమ బాధలు, వెతలు చెప్పడానికి ముందుకు వచ్చారు.

2016లో కశ్మీర్‌లో అత్యంత ప్రభావిత నాయకుడు అబ్దుల్ గనీని మిలటరీ బలగాలు కాల్చి చంపిన తరువాత కశ్మీర్ ప్రజలలో చాలా మార్పు వచ్చినట్లు కనబడుతోంది. మిలటరీ బలగాలు ఎవరినైనా మిలిటెంట్ అని ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపితే గంట, రెండు గంటలలోపు ఐదు నుంచి పది వేల మంది వరకు ఎన్‌కౌంటర్ ప్రదేశానికి చేరుకొని చనిపోయిన వ్యక్తికి నీరజనాలు పలుకుతూ స్మశానానికి తీసుకు వెళుతున్నారు. ఇంతకు ముందులాగా తుపాకీ చప్పుళ్లకు భయపడి పారిపోవడం లేదు. అందుకు కారణం తమ ఇంటి ముందు క్రికెట్ ఆడుకుంటూ, కాలేజీకి వెళ్లి చదువుకుంటున్న యువకులను వాళ్ల కళ్ల ముందే నిర్దాక్షిణ్యంగా కాల్చి వేస్తున్నారు. వాళ్లకు నిత్యం బారెల్‌గన్‌లు, తుపాకీలతో తమ వీధిలో తిరుగుతున్న మిలటరీ వ్యాన్లు, మిలటరీ బలగాలను చూసి, చూసి వారికి భయం పోయింది. తమ పక్కన ఉన్న అన్నదమ్ములు, తండ్రులు తుపాకీ గుళ్లకు బలవుతున్నారు. రోడ్డు మీద రక్తం ఏరులై పారుతోంది. ఆ యువకులకు తుపాకీ మోతలు కొత్తేమీ కాదు. అటువంటి యువకులకు పాకిస్తాన్ ఉగ్రవాదులు శిక్షణ ఇవ్వవలసిన అవసరం లేదు. వాళ్లకి టెర్రరిస్టు గ్రూపులతో సంబంధాలు ఉండవలసిన అవసరం లేదు. కశ్మీర్‌లో వాళ్ల కళ్ల ముందు జరుగుతున్న మారణకాండ, హింస వాళ్లను అందుకు ప్రేరేపిస్తున్నది.

2018 నాటికి సాయుధ మిలటరీ బలగాలను ఎనిమిది లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం పెంచి వేసింది. కశ్మీర్ లోయ మొత్తం జనాభా ఒక కోటీ నాలుగు లక్షల మంది. దీనిని బట్టి చూస్తే కశ్మీర్ సమస్యకు పరిష్కారం మిలటరీ బలగాల ద్వారా, అణచివేత ద్వారా కేంద్రం పరిష్కరించాలని అనుకుంటున్నదని స్పష్టమవుతున్నది. 2010లో 15

మోడీ ప్రభుత్వం ఎన్నికల ప్రయోజనాలు, మూస, పిడివాద ధోరణులతో ఆధిపత్య కేంద్రీకృత రాజకీయాలు చేయడం వైఫల్యానికి ప్రధాన కారణం. ఇక్కడ గమనించాల్సింది జమ్మూ కశ్మీర్ ప్రజలు స్వయంప్రతిపత్తి కోరడం అంటే వేర్పాటును కోరినట్లు కాదు. ఇప్పటికయినా పాలకులు రాజకీయ, మత కోణాలలో ఈ సమస్యను చూడకుండా ప్రజాభీష్టానికి అనుగుణంగా ఆలోచించి, కశ్మీర్ ప్రజల మనోభావాలను గౌరవించి వారికి స్వయం ప్రతిపత్తి కల్పించాలి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

నుంచి 19 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న 12 మంది ముస్లిం యువకులను మిలటరీ బలగాలు కాల్చి చంపాయి. వారిలో మిట్టుబాయి కొడుకు తాఫీర్ 17 సంవత్సరాల యువకుడు. కాలేజీకి వెళుతున్నానని ఇంటి నుంచి బయలుదేరి, గన్‌బాగ్ సెంటర్‌లో బస్సు కోసం నిలబడి ఉండగా మిలటరీ బలగాలు జరిపిన కాల్పుల్లో అతని తల్లోంచి బుల్లెట్ దూసుకుపోయింది. మెదడు బయటకు వచ్చి చెల్లా చెదురయింది. ఆ రోజు నుండి ఈ రోజు వరకు అతని తండ్రి మిట్టుబాయి న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నాడు. ఎఫ్.ఐ.ఆర్. రిజిస్ట్రేషన్ కోసం అనేక నెలలు కోర్టుల చుట్టూ తిరిగాడు. చివరకు కోర్టు ఆదేశాలతో ఎఫ్.ఐ.ఆర్. రిజిస్టర్ చేశారు. అప్పటి నుండి తన కుమారుడి హత్యపై విచారణ కోసం డిమాండ్ చేయగా ప్రభుత్వం స్పందించలేదు. చివరకు హైకోర్టు ఉత్తర్వులతో సిబిఐ విచారణకు ఆదేశించగా రెండు సంవత్సరాలు విచారించి నిందితులను గుర్తు పట్టలేదని కేసు మూసివేశారు.

సిబిఐ జరిపిన విచారణలో జరిగిన లొసుగులను వెలికితీసి హైకోర్టు ముందు ఉంచగా దానిని అంగీకరించిన హైకోర్టు ఎస్ఐటి సంస్థతో దర్యాప్తు చేయమని ఆదేశించింది. కాని కొన్ని నెలలు విచారణ జరిపిన ఎస్ఐటి దర్యాప్తు సంస్థ సిబిఐ ఏ రిపోర్టు ఇచ్చిందో దానిపై తమ సీలు వేసి క్లోజ్ చేశారు. ప్రజాస్వామ్యంపై నమ్మకంతో మిట్టూబాయి న్యాయం జరుగు తుందని, తన కుమారుని చంపిన వారికి శిక్ష పడుతుందని ఆశించాడు. తనతో పాటు తమ కుమారులను పోగొట్టుకొని ఎటువంటి పోరాటం చేయని తల్లిదండ్రులు కోర్టుల చుట్టూ ఇన్ని సంవత్సరాలు తిరిగి నీవు ఏమి సాధించావు అని అంటుంటే, మీరే కరెక్టు అని, ప్రజాస్వామ్యంలో న్యాయం జరుగుతుందని అపోహ పడడం తనదే తప్పని అంగీకరించాడు. ఇటువంటి సంఘటనలు కశ్మీర్‌లో అనేకం ఉన్నాయి.

కశ్మీర్ లోయలో ప్రజలు వాళ్లపై జరిగిన హింస, మారణకాండపై చాలా సంవత్సరాల నుంచి ప్రతిఘటిస్తున్నారు. సంవత్సరాల క్రితం తమ ఇళ్ల నుండి అదృశ్యమైన పిల్లల కోసం, భర్తల కోసం ఇప్పటికీ వెతుకుతూనే ఉన్నారు. వాళ్లు బతికి ఉన్నారో, చనిపోయారో ఏ విషయం ప్రకటించమని వారు అడుగుతున్నారు. అసోసియేషన్ ఆఫ్ పర్సన్ పేరెంట్స్ ఫర్ డిజప్పియరడ్ పర్సన్ (ఆర్‌పిఒపి) అనే సంస్థను ఏర్పాటు చేసుకొని న్యాయ పోరాటం చేస్తున్నారు. హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్లు వేశారు. అదృశ్యమైన తమ భర్తలు, పిల్లలను మిలటరీ బలగాలు మూకుమ్మడిగా కాల్చిచంపి గుంటలలో పూడ్చివేశారేమోననే అనుమానంతో సమాధుల నుంచి బయటకు తీసి డిఎన్ఏ టెస్టు జరిపించమని మొత్తం 3,844 సమాధులు (పూంచ్ జిల్లాలో 12,717, రాజోరి జిల్లాలో 11,274) పై హ్యూమన్ రైట్స్ కమిషన్ ముందు పిటీషన్ వేశారు. కమిషన్ ముందు హోం డిపార్ట్‌మెంట్ 2012 జూన్ 30న దాఖలు చేసిన అఫిడవిట్‌లో పూడ్చిపెట్టిన సమాధులు 2080గా నిర్ధారించగా దాని ఆధారంగా వాటిపై విచారణ చేయించాలని ప్రభుత్వానికి సిఫారసు చేయగా, కశ్మీర్ ప్రభుత్వం కమిషన్ ఉత్తర్వులను అమలు పరచడానికి నిరాకరించింది.

జూన్ 2017న ఆపరేషన్ ఆల్ అవుట్ పేరుతో ఇండియన్ ఆర్మీ చేసిన మారణకాండ వలన 2017 మంది మిలిటెంట్లు చనిపోయారు. గత 8 సంవత్సరాలలో ఈ సంఖ్య చాలా పెద్దది. మిలటరీ బలగాలు ఎన్‌కౌంటర్ పేరుతో మిలిటెంట్లపై కాల్పులు జరిపినప్పుడు ఎన్‌కౌంటర్ ప్రదేశంలో దాదాపు 19 మంది సాధారణ పౌరులు ఆర్మీ తుపాకీ గుళ్లకు బలయ్యారు. ప్రజా ఆందోళనతో ఎన్‌కౌంటర్‌లలో సాధారణ పౌరులు చనిపోవడంపై కేల్ కమిషన్ వేసి చేతులు దులుపుకుంది. కేల్ కమిషన్ రిపోర్టును ఇంతవరకు బహిరంగ పరచలేదు కశ్మీర్ ప్రభుత్వం.

కశ్మీర్ స్వయం ప్రతిపత్తి గురించి ఎన్నికలలో వాగ్దానం చేసి గద్దెనెక్కుతున్నారు. కానీ పదవిలోకి వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వానికి అడుగులకు మడుగులొత్తి కశ్మీర్ సమస్యను మిలటరీ బలగాలకు అప్పగిస్తున్నారు. పాకిస్తాన్ టెర్రరిజాన్ని చూపించి భారత ప్రభుత్వం ఆర్మీ బలగాలను పెంచుకుంటూ పోతున్నది. చట్టం అక్కడ పనిచేయడం లేదు. మిలటరీ బలగాల నేరాలను విచారించడానికి మామూలు కోర్టులకు అధికారం లేదు. ప్రత్యేక బలగాల చట్టం వారిని శిక్షల నుండి మినహాయిస్తుంది. తమకున్న ప్రత్యేక అధికారాలతో కశ్మీర్ లోయలో ఎప్పుడైనా అర్ధరాత్రి అపరాత్రయినా ఎవరి ఇంటిలోకి అయినా వెళ్లి సోదా చేయడం, మగవారిని, ఆడవారిని పిల్లల ముందే బట్టలు విప్పించి అవమానించడం వంటి చర్యలు కశ్మీర్ ప్రజల అసంతృప్తికి ఆద్యం పోస్తున్నది. ఒక మిలిటెంటును చంపితే ఆర్మీ అధికారికి 15 లక్షలు ప్రభుత్వం ఇస్తుంది. ఎక్కువమంది మిలిటెంట్లను చంపితే రివార్డులు ప్రకటించి ప్రమోషన్లు ఇస్తుంది. అలాంటప్పుడు ఇవి ప్రభుత్వ హత్యలు కాక మరేమిటి? ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం హత్యలు చేస్తున్నారు. ప్రత్యేక బలగాల చట్టాల కింద ఇమ్యూనిటీ పొందుతున్నారు. జడ్జీలు, న్యాయ వాదులు, ప్రభుత్వ అధికారులు ఎవరైనా సరే మిలటరీ వాహనాలు వెళుతుంటే గంటల తరబడి ఆగిపోవలసిందే. రోడ్డు మీద నిలబెట్టి న్యాయమూర్తులను మీ చట్టమిక్కడ పనిచేయదు అని బాహాటంగా ప్రకటిస్తున్నారు అని కుప్వారా జిల్లా జడ్జి కమిటీ సభ్యులకు తెలిపారు.

కశ్మీర్ ప్రజలకు న్యాయం కోసం, రక్షణ కోసం చట్టం నిర్దేశించిన అన్ని మార్గాలు మూత పడ్డాయి. ఇప్పుడు ఏమి చేయాలి అనే ప్రశ్న పౌర సమాజం ముందు ఉంది. దానికి కశ్మీర్ ప్రజలు కోరుకునేది ఒక్కటే అని అది ఇండియా, పాకిస్తాన్ కశ్మీర్ ప్రజలు కలసి ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని అనేక రోజులుగా అక్కడి ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. కశ్మీర్ ప్రజలకు కళ్ల ముందు హింస తప్ప ఏమి కనబడడం లేదు. రోజూ వారు హింసను అనుభవిస్తున్నారు. కళ్ల ముందు కాల్పులు, చావులతో బతుకుతున్నారు. కశ్మీర్ రెవెన్యూకు ముఖ్య ఆధారమైన పర్యాటకం దెబ్బతింటే ఆదాయం తగ్గుతుందని, బడ్జెట్ తగ్గుతుందని, ఆ వాస్తవాలను బయటకు తెలియడానికి ఇష్టపడడం లేదు. అందుకే ఇప్పటివరకు ఎటువంటి టెర్రరిస్టుల దాడులు జరగలేదని, పర్యాటకులకు రక్షణ కల్పిస్తామని నమ్మించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఓపెన్ ఎఫ్ఐఆర్‌లు తెరుస్తున్నారు. ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ చేసి అలా ఉంచుతున్నారు. తరువాత ఆర్మీ బిడ్డలు, భర్తల శవాలతో ఊరేగించడాన్ని, రాళ్లు రువ్వుతున్నారని, రాష్ట్ర శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని వారి పేర్లను ఓపెన్ ఎఫ్ఐఆర్‌లలో ఇరికిస్తున్నారు. పబ్లిక్ సెక్యూరిటీ యాక్టు (పిఎస్ఏ) ప్రయోగిస్తున్నారు. పాకిస్తాన్ మిలిటెంట్లతో సంబంధాలు ఉన్నాయని, బలగాలపై రాళ్లు రువ్వుతున్నారని, ఊపా పబ్లిక్ సెక్యూరిటీ లాంటి 17 చట్టాలు ప్రయోగిస్తున్నారు. ఇవి అన్ని

ప్రత్యేకమైన చట్టాలు. ప్రజల హక్కులను కాలరాయడానికి ప్రభుత్వాలు కవచంగా వాడుతున్నాయి. సైనిక చట్టాలు మిలటరీ బలగాలకు కవచంగా ఉంటున్నాయి. బలగాల మీద ప్రజలు తిరగబడకుండా మిలటరీ వ్యానుకు ముందు భాగంలో యువకులను కట్టి మానవ కవచంగా (హ్యూమన్ షీల్డ్) గా వాడుతున్నారు. నేరం రుజువు కాకుండా నిందితులను మీడియా ముందు బహిర్గత పరచవద్దని చట్టాలు చెబుతుంటే మనిషిని కవచంగా ఉపయోగించుకొని తమను కాపాడుకోవడం అనాగరికం. ఊపా, పిఎస్ఏ వంటి నల్ల చట్టాలను ఉపయోగిస్తున్నారు. బెయిల్స్ రాకుండా చేస్తారు. బెయిల్ మంజూరై విడుదలయితే మళ్లీ కోర్టు బయట నుండి తీసుకువెళ్లి ఓపెన్ ఎఫ్ఐఆర్‌లో పెడతారు. 2016లో అరెస్టు అయిన 17 సంవత్సరాల యువకుడు న్యాయం కోసం కోర్టులో రెండు సంవత్సరాలు పోరాడాడు. మిలటరీ 17 కేసులు పెడితే 16 కేసులలో నిర్దోషి అని కోర్టు తీర్పు ఇచ్చింది. మళ్లీ కేసులు పెడుతూనే ఉన్నారు. చివరికి ఇతను బయటి ప్రపంచంలోకి వచ్చేది లేదు అని నిర్ధారించుకొని జైలు నుంచి తప్పించుకొని తుపాకీ పట్టుకున్నాడు. సరిగ్గా మూడు నెలలకు మిలటరీ బలగాల చేతిలో బలయిపోయాడు. ఇలాంటి యువకులు కశ్మీర్ లోయలో ఎందరో ఉన్నారు. అందరి కథలు, హత్యలు ఒక్కటే. వాళ్లు పాకిస్తాన్‌లో శిక్షణ పొందడం లేదు. పాకిస్తాన్ టెర్రరిస్టు గ్రూపులతో సంబంధాలు పెట్టుకోలేదు. ప్రజాస్వామ్యం, న్యాయ స్థానాలపై నమ్మకం పోయి కశ్మీర్ యువకులు మిలటరీ బలగాలపై రాళ్లతో ఎదురుదాడి చేసి, తుపాకీ గుళ్లతో ధీటుగా సమాధానం చెబుతున్నారు.

మిలటరీ బలగాలకు కశ్మీర్ ముస్లిం యువకులు ప్రశ్నార్థకంగా మారారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపిన కొద్ది వాళ్ల ఫ్యునరల్ (దహన సంస్కారాలు) చాలా మంది యువకులను టెర్రరిస్టు గ్రూపుల వైపునకు మళ్లిస్తున్నది. పోలీసు రికార్డుల ప్రకారం 2016లో 88 మంది టెర్రరిస్టు గ్రూపులో చేరితే 2017లో అది 126కు పెరిగింది. ఈ సంవత్సరం ఏప్రిల్ నాటికి ఆ సంఖ్య 40కి చేరింది. ఇంతకు ముందు తల్లిదండ్రులు వాళ్ల పిల్లలు తుపాకి పట్టుకోవడానికి వ్యతిరేకించి, వారు సివిల్ సొసైటీలో మమేకవడానికి ప్రయత్నించేవారు. కాని కార్పొరేట్ తల్లిదండ్రులు తమ పిల్లలు ఎన్‌కౌంటర్‌లో చనిపోతారని భయపడడం లేదు. చావు ఎప్పటికైనా తప్పదు. కశ్మీర్‌లో మిలటప్లరీ బలగాల అకృత్యాలను ఎదిరించి చనిపోతే అమరులవుతారు. అల్లా మతాన్ని విశ్వసించే వారు దేవుని ఆట ప్రకారం వాళ్ల జీవితాలను ప్రజల కోసం త్యాగం చేస్తే అంతకంటే గౌరవప్రదమైన చావులేదని అంటున్నారు. ఎన్‌కౌంటర్ కాల్పులు జరిగినప్పుడు ప్రజలు సాధారణంగా భీతిల్లి పారిపోతారు. కాని కశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితులలో తుపాకి శబ్దం వినిపిస్తే రోడ్డు మీదకు వచ్చి మిలటరీ బలగాలను ఎదుర్కొంటున్నారు.

2017 అక్టోబర్‌లో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ జమ్మూ ప్రాంతంలోని పూంచ్, రాజోరి జిల్లాలలోని 2080 గుర్తు తెలియని మూకుమ్మడి శవ పూడ్చివేతలపై దర్యాప్తు జరపమని అక్టోబర్ ప్రభుత్వానికి సిఫారసు చేయగా ప్రభుత్వం అందుకు నిరాకరించింది. అక్టోబర్‌లో జరుగుతున్న హింస, మానవ హక్కుల ఉల్లంఘన నిర్వహణకు మానవ హక్కుల యు.ఎన్. హై కమిషన్ ప్రతినిధులు పర్యటించడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. రెడ్‌క్రాస్ ఇంటర్నేషనల్ కమిటీ సభ్యులకు, మానవ హక్కుల కార్యకర్తలకు అక్టోబర్‌లో నిజ నిర్ధారణ జరపడానికి వీసాలు నిరాకరించింది. ఎడవర్డుపాల్ కమిటీ ఫ్రెంచి జర్నలిస్టు అక్టోబర్‌ను బిడిసిసి వీసా మీద రాగా అయనను అరెస్టు చేయగా కోర్టు ఉత్తర్వుల ద్వారా బయటకు వచ్చారు. అక్టోబర్‌లోని హక్కుల ఉల్లంఘన గురించి, వాస్తవాలను బయట ప్రపంచానికి తెలియజేయడానికి భారత ప్రభుత్వం భయపడుతుంది. కాల్పుల విరమణ షరతులు ఉల్లంఘించిన లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్ఓసి) దగ్గర కాల్పులు జరపడం వలన 13 మంది సివిలియన్స్ చనిపోయారు. జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారమే అంతకు ముందు సంవత్సరాల కంటే 2017లో ఎన్‌కౌంటర్స్ గ్రాఫ్ పెరిగింది. జమ్మూ కశ్మీర్ పౌర సమాజ సమాఖ్య (జెకెసిసి) వెల్లడించిన వివరాల ప్రకారం 2017లో 108 మంది సివిలియన్లు, ఒక ఇక్వాన్ వివాదంలో చనిపోయారు. కశ్మీర్ లోయలో అంతులేని, అదుపులేని హింస, చావులు, ఎగ్‌స్ట్రా జ్యూడిషియల్ ఎన్‌కౌంటర్ ప్రజలను కనబడకుండా చేయుట, పత్రికా స్వేచ్ఛను అణగదొక్కి అక్రమ అరెస్టులు, నిఘా, మిలటరీ బలగాల పెంపు ఇవన్నీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్న శాంతి పరిష్కారానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇప్పటికీ కశ్మీర్ లోయలో 8,000 మందికి పైగా అదృశ్యమైన కేసులు ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ సంఖ్య తగ్గుతూ వచ్చినా సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ఎస్.పి.వైడ్ మానవ హక్కుల కమిషన్ ఏర్పాటు చేసిన సెమినార్‌లో 2015లో అటువంటి సంఘటనలు జరగలేదనడం పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వం మొదటి నుంచీ కూడా ఇటువంటి ప్లానులే అమలు చేస్తూ అదృశ్య కేసులపై విచారణకు ఎంక్వయిరీ కమీషన్‌ను వేయడానికి నిరాకరిస్తున్నది. ఐక్యరాజ్య సమితి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంవత్సరం రివ్యూ (యూనివర్సల్ పీరియాడికల్ రివ్యూ), ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలు రికమెండ్ చేసినప్పటికీ భారత ప్రభుత్వం ప్రపంచ దేశాల కన్నింగ్స్ పకడ్బందీ అదృశ్యాలకు సంబంధించిన అగ్రిమెంట్ మీద సంతకం చేయడానికి నిరాకరించింది.

భారత ప్రభుత్వం కశ్మీర్ సమస్య పరిష్కరించలేదని నిర్ణయానికి కశ్మీర్ పౌర సమాజం వచ్చి కశ్మీర్ లోయలో హింసకు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థల దగ్గర పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నారు.

ప్రజా న్యాయవాదుల బృందం కశ్మీర్ నుండి ఇండియాకు తిరిగి వచ్చేటప్పటికీ రంజాన్ మాసం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కాల్పుల విరమణను ఉల్లంఘించి మిలటరీ బలగాలు అనంత్‌నాగ్, కుప్వారా జిల్లాలలో సివిలియన్స్‌ను కాల్చివేసినట్టు వార్తలు వస్తున్నాయి. మిలటరీ అధికారులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు కశ్మీర్ ప్రజలు నిరాకరించారనే నెపంతో వారిపై దాడి చేసి కాల్పులు జరిపారు. ప్రజా న్యాయవాదుల బృందంలో సభ్యుడు, ఆ సంస్థకు జాతీయ కార్యదర్శి, భీమా – కొరెగాం దళితుల పోరాటానికి మద్దతు పలికి, దళిత, ఆదివాసుల హక్కుల కోసం, మానవ హక్కుల ఉల్లంఘనపై పోరాడుతున్న న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్‌ను కేంద్ర ప్రభుత్వం జూన్ 9న నాగ్‌పూర్‌లో అక్రమంగా నిర్బంధించి, దేశ ద్రోహం, ఊపా చట్టం కింద కేసు బనాయించింది.

కశ్మీర్‌లో జరుగుతున్న హింసపై ఐక్యరాజ్య సమితీకి, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థకు ఐఎపిఎల్ ఇచ్చే నివేదికను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నింది.

(రచయిత ఐఎపిఎల్ జాతీయ కార్యవర్గ సభ్యుడు) వీ

సుప్రీంకోర్టు పనితీరులో కేంద్ర ప్రభుత్వ జోక్యం

***భారత న్యాయవ్యవస్థలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందనీ, ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంలో అది అందరికీ ఇంకా స్పష్టంగా అవగతమైందనీ అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 3 కోట్ల 30 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అనేక సందర్భాల్లో ఉద్ఘాటిస్తూ ఉన్నారు. అందులో మరీ ముఖ్యంగా 46 శాతం కేసులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినవే అనగా కేంద్ర ప్రభుత్వమే కక్షిదారునిగా ఉన్న కేసులు ఎక్కువ. మరి కేంద్ర ప్రభుత్వం వాటి పరిష్కారం కోసం ప్రయత్నం చేయకపోగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తులను సైతం ఏదో ఒక విధంగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలనే ధోరణితో వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే అరకోటి (50 లక్షల రూపాయలు) కన్నా తక్కువ ఆర్థిక ప్రభావం ఉన్న కేసులను సుప్రీంకోర్టులో అప్పీలు చేయరాదని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

విధాన పరమైన నిర్ణయాలతో ముడిపడి ఉన్న అంశాలను తప్ప, ఆర్థిక ప్రభావంతో నిమిత్తం లేకుండా, అప్పీలుకు వెళ్లాలనే దృఢ నిశ్చయంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టమవుతున్నది.

దేశ వ్యాప్తంగా దిగువ కోర్టులలో రెండు కోట్ల 65 లక్షలు, ఉన్నత న్యాయ స్థానాలలో 64 లక్షలు, సుప్రీంకోర్టులో 54 వేలకు పైగా పెండింగ్ కేసులున్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమబంగా, బీహార్, గుజరాత్ రాష్ట్రాలలో తేలని వ్యాజ్యాల తంటా అత్యధికంగా ఉన్నదని గణాంకాలు చాటుతున్నాయి. రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్ పౌరుల ప్రాథమిక హక్కులలో ప్రధానమైన 'జీవించే హక్కు'కు సంబంధించినది. అంతే కాకుండా 'సత్వర న్యాయం' ప్రజలకు అందాలనే భరోసా ఇస్తున్నా, సామాన్య ప్రజలకు సరియైన సమయంలో న్యాయం అందడం లేదు. ఇది ఈ దేశంలోని న్యాయ వ్యవస్థ పనితీరుకు నిదర్శనం.

ప్రభుత్వాలలోని వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సరియైన సమన్వయం లేకపోవడం చేత కూడా చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి ఇంతవరకూ సరియైన, స్పష్టమైన విధానం అంటూ లేకుండా పోయింది.

ఎన్నో సంవత్సరాల క్రితమే కేంద్ర న్యాయ కమిషన్ (లా కమిషన్ ఆఫ్ ఇండియా) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నో సూచనలు, సలహాలు ఇచ్చినప్పటికీ, ప్రజల వ్యాజ్యాలకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతే కాకుండా కమిషన్ సిఫారసులను పాటించడం లేదు. గౌరవిందం లేదు. అంతే కాకుండా కొద్దిపాటి ఆలన, మానవీయ స్పందన, రాజ్యాంగ స్ఫూర్తి పట్ల స్పృహ, వ్యాజ్యాలతో సాధించేది ఏమీ లేదనే భావనతోనే గుణాత్మక పరివర్తన సాధ్యమని వెల్లడించింది. పౌరులతో ప్రభుత్వాల వ్యవహారశైలి సహకార ధోరణిలో ఉండాలి కాని, సంఘర్షణాత్మకంగా కాదని, గతంలోనే సుప్రీంకోర్టు కూడా వ్యాఖ్యానించింది. ఇవన్నీ కూడా బధిర శంఖారావం కాబట్టి, కేసుల కత్తిగట్టిన కోడిపుంజుల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులనే తప్పుదోవ పట్టించే రీతిలో పౌరులతో యుద్ధం ప్రకటిస్తున్నాయి.

దేశంలో కేసుల సగటు పెండింగ్ కాల వ్యవధిని 15 సంవత్సరాల నుండి 3 ఏళ్లకు తగ్గించడమే లక్ష్యంగా 2010లో యుపిఎ ప్రభుత్వం తెచ్చిన వ్యాజ్య విధానం (సంస్కరణలు) సరిగా అమలుకు నోచుకోవడం లేదు. వాస్తవానికి నరేంద్రమోడీ ప్రధాన మంత్రి అయిన తర్వాత కేంద్ర ప్రభుత్వంను బాధ్యులుగా చేస్తూ దాఖలు చేసే వ్యాజ్యాల సంఖ్య పెరుగుతూ ఉన్నది. దీనిని బట్టి కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల మధ్య పౌరుల వివాదాల పట్ల సరియైన స్పందన లేదనేది సుస్పష్టం. అంతర్గతంగా కేంద్ర ప్రభుత్వం పౌరుల సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం చెందడం కారణం చేత పౌరులు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నారు.

కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఇకనైనా అనవసర వివాదాలకు పోకుండా, తన ఆధీనంలోని మంత్రిత్వ శాఖలను నియంత్రించి, రాజ్యాంగ స్ఫూర్తికి, మౌలిక సూత్రాలకు భంగం వాటిల్లకుండా, వాటిని పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలి.

అంతే కాకుండా విచక్షణాధికారాన్ని ప్రజోపయోగకరంగా పారదర్శకత, జవాబుదారీ తనాలతో, బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన కార్యనిర్వాహక వర్గం, చిన్న చితకా వివాదాలన్నింటిని న్యాయ స్థానాలకు బదిలీ చేసి చేతులు దులుపుకోకుండా, ప్రాథమిక స్థాయిలోనే ప్రజలకు న్యాయం అందే విధంగా చూస్తే వారు న్యాయ స్థానాలను ఆశ్రయించకుండా ఉంటారు. సమయం, శ్రమ, ధనం వృథా కాకుండా కూడా ఉంటుంది.

సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టులు, కింది స్థాయి న్యాయ స్థానాలలో సంవత్సరానికి కనీసం 225 రోజులు పనిదినాలు ఉండే విధంగా 'స్వీయ నిబంధనావళి' ఉన్నప్పటికీ దానిని అమలుచేయలేక పోవడం విచారకరం. గతంలో జస్టిస్ లోధా గారు భారత ప్రధాన న్యాయ మూర్తిగా సుప్రంకోర్టు – సంవత్సరం పొడవునా అనగా 365 రోజులూ పని చేయాలని సూచించారు. అంతే కాకుండా కోర్టులకు సెలవులు 15 రోజులు మించి ఉండరాదని కూడా గతంలో 'లా' కమిషన్ చేసిన సూచనలు కూడా పాటించాలని లోధా గారు సూచించారు. అప్పుడు న్యాయవాద వర్గాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. కోట్లాది మంది ప్రజలకు మేలు జరగాలనే తాపత్రాయంతో లా కమిషన్ సిఫారసులను ఇప్పటికైనా పాటించాలి. న్యాయ వ్యవస్థలో గుణాత్మక మార్పు ద్వారానే కేంద్ర,

రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను కొద్దివరకైనా సరిదిద్దే ప్రయత్నం జరుగుతుంది. ఆ దిశగా న్యాయ వ్యవస్థ పనితీరు రూపొందించబడాలి.

ఇటీవల హైకోర్టులకు, సుప్రీంకోర్టులకు జడ్జీల నియామకంలోనూ పెద్ద వివాదం చెలరేగింది. 1993లో సెకండ్ జడ్జెస్ కేసులో సుప్రీంకోర్టు తొమ్మిది మంది జడ్జీలతో కూడిన ధర్మాసనం, కార్యనిర్వాహక విభాగం, న్యాయ విభాగం ఉమ్మడిగా జడ్జీల నియామకాన్ని చేపట్టాలని తీర్పునిచ్చింది. అందువల్ల జడ్జీలను ప్రతిపాదించిన వారిలోని నిశిత దృష్టిని, న్యాయ విభాగంలోని వారు పరిశీలిస్తే వారి పూర్వాపరాలను కార్య నిర్వాహక విభాగం పరిశీలిస్తుందని ఆశించడం జరిగింది. తద్వారా ప్రజాతంత్ర వ్యవస్థలకు, మూల స్థంబాల వంటి ఈ రెండు విభాగాలు కలిసి దేశంలోని అత్యున్నత న్యాయ స్థానానికి తగిన వ్యక్తులను సూచిస్తారని భావన ఉండేది.

2018 జనవరి 10న ఐదుగురు సీనియర్ జడ్జీలతో కూడిన కొలీజియం ఉత్తరాఖండ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ కె.ఎల్. జోసఫ్‌ని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించడానికి చేసిన సూచనలను మోడీ ప్రభుత్వం నిరాకరించింది. అందుకు కారణం ఆయన 2016లో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడానికి అంగీకరించకపోవడం. ఆయనకు అన్ని అర్హతలు ఉన్నాయని కేంద్రంలోని కార్య నిర్వాహక వ్యవస్థ ఒప్పుకున్నప్పటికీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ జోసఫ్ కేవలం క్రైస్తవుడనే కారణం చేత, ఆర్ఎస్ఎస్ కనుసన్నలలో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. అంతే కాకుండా ఆయనకు బదులుగా ఇందూ మల్హోత్రా అనే మహిళా న్యాయవాదిని ఏకా ఏకిన సుప్రంకోర్టు న్యాయమూర్తిగా ప్రతిపాదించి, ఆమోదింపజేసింది. ఈ విషయం దేశ వ్యాప్తంగా న్యాయవాద వర్గాలలోను, పౌర సమాజంలోను కొంత బాధను, విస్మయాన్ని కలిగించిన మాట వాస్తవం.

ఏప్రిల్ 27న ఇందూ మల్హోత్రా చేత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ప్రమాణ స్వీకారం చేయించడానికి ఒక రోజు ముందు అనగా ఏప్రిల్ 26న 100 మంది సుప్రీంకోర్టు న్యాయవాదులు ఇందూ మల్హోత్రా నియామకాన్ని వ్యతిరేకిస్తూ నిలిపివేయాలని పిటిషన్ వేశారు. కాని సాంకేతిక కారణాలను చూపించి ఆ పిటిషన్‌ను వాయిదా వేస్తూ, ఇందూ మల్హోత్రా నియామకాన్ని, ఖాళీల భర్తీ (సుప్రీంకోర్టు జడ్జీలు 6 ఖాళీలుగా ఉన్నాయి) కింద పరిగణించి, 1 నియామకం జరిగితే మిగిలిన 5 తర్వాత కాలక్రమంలో భర్తీ అవుతాయనే దానితో ఇందూ మల్హోత్రా చేత చీఫ్ జస్టిస్ ప్రమాణం చేయించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ జోక్యం స్పష్టంగా కనబడుతున్నది. చివరకు రాష్ట్రపతి కార్యాలయాన్ని కూడా ఆర్ఎస్ఎస్ అనుబంధ కార్యాలయంగా మార్చే ప్రయత్నం ప్రారంభమైంది; జరుగుతూ ఉన్నది. ఇది తీవ్ర అభ్యంతరకరం, అప్రజాస్వామికం. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కడం!

జస్టిస్ జోసఫ్ పేరును అఖిల భారత స్థాయిలో 42వ వ్యక్తిగా ఉండాలని, వివిధ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు 11 మంది ఆయన కన్నా సీనియర్లుగా ఉన్నారని కేంద్రం అంటున్నది. సంబంధిత హైకోర్టుల నుండి సుప్రీంకోర్టుకు ప్రాతినిధ్యం తగినంతా ఉండడం, హైకోర్టులలో ప్రధాన న్యాయమూర్తిని నియమించడంలో ఆయా రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అందువలన అఖిల భారత స్థాయి సీనియర్ జడ్జీలకు ఈ ఎంపిక ప్రక్రియ నష్టం కలిగించే విధంగా ఉండకూడదు అనేది కేంద్ర ప్రభుత్వ వాదన. మూడవ జడ్జెస్ కేస్ – 1998లో భారత రాష్ట్రపతి సుప్రీంకోర్టుని సంప్రదించిన విషయంలో సుప్రీంకోర్టు ఆర్టికల్ 143ని ఉటంకిస్తూ ఇచ్చిన సమాధానాన్ని కేంద్రం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. వాస్తవానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు సుప్రీంకోర్టుకు ఎంపిక కావడం అతి సహజం. దీనిని భారతదేశ అత్యున్నత న్యాయ నియామకాల సంస్థ (కొలీజియం) ను దృష్టిలో ఉంచుకోవాలి. జస్టిస్ జోసెఫ్ మిగిలిన అందరు హైకోర్టు జడ్జీలకన్నా అన్ని రకాలుగానూ సుప్రీంకోర్టుకు నియమించబడడానికి అర్హుడని కొలీజియం అభిప్రాయపడింది. అందుకు కొలీజియం మూడవ జడ్జెస్ కేసును (ఉదాహరణగా) ప్రాతిపదికగా ఉటంకించింది.

ఎంతో అభివృద్ధి చెందిన అమెరికా, ఇంగ్లాండ్ దేశాలలో కూడా ప్రాంతం, సామాజిక తరగతి, జాతి మొదలైన అంశాల ఆధారంగా జడ్జీల నియామకం జరుగుతుంది. అదే సమయంలో ప్రతిభకు కూడా విలువ తగ్గకుండా ఉంటుంది. అటువంటప్పుడు వివిధ మతాలు, కులాలు, అత్యంత వెనుకబాటు తనం, నిరక్షరాస్యత, సాంఘిక, ఆర్థిక అసమానతలు ఉన్న భారతదేశంలోని సుప్రీంకోర్టు జడ్జీల నియామకం మరింత విశాలమైన దృక్పథంతో జరగవలసి ఉన్నది. జస్టిస్ కృష్ణయ్యార్ మాటల్లో సమస్య అతి చిన్నదిగా కనిపించి, దాని ప్రభావం ప్రజల జీవితాలపై, స్వేచ్ఛపై అత్యధికంగా ఉన్నట్లయితే చట్టాలకన్నా ఉన్నతంగా మానవత్వాన్ని పరిగణించవలసి వస్తుంది. భారతదేశ సుప్రీంకోర్టులో ఇటీవల డాక్టర్ సుభాష్ కాశీనాథ్ మహాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో ఇద్దరు జడ్జీలు మార్చ్ 20న ఇచ్చిన తీర్పులో ఎస్‌సి/ఎస్‌టి (పిఒఎ) యాక్ట్ 1989ని (ఎస్‌సి/ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం 1989) నీరుగార్చడం తప్పని అనిపించలేదు. కోర్టులలో అన్ని సామాజిక తరగతులకు తగినంత ప్రాధాన్యత ఉండిఉంటే ఈ రకమైన తీర్పు వచ్చి ఉండేది కాదు.

ఎస్‌సి/ఎస్‌టిలకు సుప్రీంకోర్టులో చాలా కాలం నుండి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. (మాజీ చీఫ్ జస్టిస్ కె.జి. బాలకృష్ణన్, జస్టిస్ రామస్వామి లాంటివారు మినహాయింపు) ప్రస్తుతం ఉన్న 24 హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులలో గాని, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తులలో గాని, ఒక్కరు కూడా ఎస్‌సి/ఎస్‌టిలకు చెందినవారు లేరు. ప్రస్తుత భారతదేశ జనాభాలో 25 శాతం ప్రజలు ఎస్‌సి/ఎస్‌టిలకు చెందినవారు ఉన్నారు. వారు ఉన్నత పదవులు అనుభవించరాదనే కుట్ర బలంగా ఉన్నది. కంటి తుడుపుగా తమ భావజాలానికి చెందిన వ్యక్తిని రాష్ట్రపతిగా నియమించడంలో ఆర్ఎస్ఎస్ సఫలం చెందింది. రామనాథ్ కోవింద్ గతంలో ఆర్ఎస్ఎస్ ముఖ్య కార్యకర్తగా విధులు నిర్వహించాడు. చట్టం, న్యాయం అమలు న్యాయ స్థానం సామాజిక తాత్వికతపై ఆధారపడి ఉంటుంది. సామాజిక తాత్వికతను న్యాయ నిర్ణేతల సామాజిక మూలాల నుండి చూడాలి. దానిని పూర్తిగా వేరు చేయలేం. సుప్రీంకోర్టులో ఉండవలసిన 31 మంది జడ్జీలకు గాను ప్రధాన న్యాయమూర్తితో సహా 24 మంది మాత్రమే ఉన్నారు. దీనిని ఎప్పుడు భర్తీ చేస్తారో, ఎలా భర్తీ చేస్తారో వేచి చూడాలి.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

మెక్సికోలో పాలనాధికార మార్పు

మెక్సికోలో ప్రభుత్వం అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాల వల్లే పాలకులు ఓడారు తప్ప, ఒబ్రదార్ చెపుతున్న సంస్కరణలకు ప్రజల మద్దతు ఉండి కాదని, కార్మిక-కర్షక పోరాటాలే మౌలిక మార్పుకు దారి చూపుతాయని అంటున్నారు సంతోష్

మెక్సికోలో అవినీతి, హింస, నిరుద్యోగం, దిగజారిన శాంతి భద్రతలు, ఆర్థిక అరాచకాలు పెరిగిపోయాయి. ఈ కారణంగా ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతిని తీవ్ర సామాజిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ క్రమంలో జరిగిన అధ్యక్ష ఎన్నికల ఫలితాలు జూలై 1న వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో 2014లో స్థాపించిన నేషనల్ రీజనరేషన్ మూవ్‌మెంట్ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి ఆండ్రీజ్ మాన్యుయేల్ లోపెజ్ ఒబ్రదార్ (ఆమ్లో) 53 శాతం ఓట్లతో తన సమీప అభ్యర్థి అనయాపై భారీ విజయం సాధించారు. అనయాకు 26.7 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. పాలక పార్టీ ఇనిస్టిట్యూషనల్ రివల్యూషనరీ పార్టీ (పిఆర్ఐ) అభ్యర్థి జోస్ అంటోనియా మీడ్ 15.3 శాతం ఓట్లతో తృతీయ స్థానంలో నిలిచారు. రెండు దశాబ్దాలుగా దేశంలోని రెండు ప్రధాన పార్టీల్లో ఏదో ఒకదాన్ని ఎన్నుకోవడానికి అలవాటుపడిన మెక్సికో పౌరులు ఈసారి మూడో పార్టీకి చెందిన ఆమ్లోను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం విశేషం. అమెరికా పౌరుగునే మరో ట్రంప్ అంటూ సోషల్ డెమోక్రాట్ ఆమ్లోను పాశ్చాత్య మీడియా అభివర్ణిస్తున్నది.

ప్రస్తుత అధ్యక్షుడు ఎన్‌రిక్ పెనీ నీటో సారథ్యంలోని పిఆర్ఐ ప్రభుత్వం మీద ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. ప్రత్యేకించి ఆర్థిక విధానాలు దేశంలో అసమానతలను తీవ్రంగా పెంచాయి, శాంతి భద్రతలు దిగజారాయి. ఆర్థిక పరిస్థితి మందగమనంలో ఉండడం.. అవినీతి పెరిగిపోతుండడం దీనికి కారణం. గత పాతికేళ్లుగా మధ్యేవాద పాలన, ప్రపంచీకరణ అమలు తమకేమీ ఒరగబెట్టలేదనే భావానికి గురైన మెక్సికన్లు దేశంలోని యథాతథ స్థితిని స్పష్టంగా తిరస్కరించినట్లు ఫలితం సూచిస్తున్నది. అమెరికా మీద ఆధారపడకుండా మెక్సికో ఆర్థిక స్వాతంత్ర్య సాధనకు తద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తాననే జాతీయవాద భావాన్ని లోపెజ్ ఒబ్రదార్ ప్రచారం చేశారు. 2014లో 43 మంది విద్యార్థుల అదృశ్యం, హత్యకు ఎవరు కారకులో ఇప్పటికీ అధికారికంగా ప్రభుత్వం నిర్ధారించ లేదు. స్కాలర్‌షిప్ పొందే విద్యార్థులు కావాలి తప్ప కాంట్రాక్టు హంతకులు మనకు వద్దని ఇచ్చిన లోపెజ్ నినాదం బహుళ ఆదరణ పొందింది.

అమెరికాలో నివసిస్తున్న వేలాదిమంది మెక్సికన్లు గంటల తరబడి వాహనాల్లో ప్రయాణించి, సరిహద్దులు దాటి పోలింగ్ బూతులముందు వరుసలు కట్టి మరీ ఓటు వేశారు. ట్రంప్‌కు ధీటుగా నిలబడతామని ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థులంతా హామీలు ఇచ్చినప్పటికీ, లోపెజ్ ఒబ్రదార్ మాత్రమే వారిలో ఈ విశ్వాసాన్ని కలిగించగలిగారు. అమెరికాలో ఉంటున్న లక్షలాది మంది మెక్సికన్లపై ట్రంప్ వివక్ష కత్తులు దూస్తున్న నేపథ్యంలో తమను కాపాడగలిగేది లోపెజ్ ఒబ్రదార్ ఒక్కరేనని వారు నమ్మారు. అవినీతిని అదుపుచేయడం ద్వారా దాదాపు 2 వేల కోట్ల డాలర్లను ఆదా చేసి పేదలు, సామాన్య ప్రజలకు నిధులను పెంచడం తన ప్రధాన కర్తవ్యమని ఒబ్రదార్ హామీ ఇచ్చారు. వృద్ధులకు పెన్షన్లు పెంచడం, మెక్సికో యువతకు విద్యాపరమైన గ్రాంట్లు, రైతులకు అదనపు మద్దతుతో సహా అతి తక్కువగా చెల్లించబడుతున్న కార్మికుల వేతనాలను పెంచేందుకు ఒబ్రదార్ నిబద్ధతను వ్యక్తం చేశారు. అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తామని, అమెరికాతో దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తానని, నియంతృత్వరహిత పాలనే ధ్యేయమని, పౌరహక్కుల సాధన కోసం కృషి చేస్తానని లోపెజ్ గెలుపొందిన అనంతరం మాట్లాడారు. మెక్సికోలో యథాతథ స్థితిని వ్యతిరేకించిన వామపక్షాలు, కన్జర్వేటివ్‌లతో సహా అనేక గ్రూపులు, పార్టీలతోకూడిన 'మోర్నా' (ఎంఓఆర్ఇఎన్ఎ) సంకీర్ణ ప్రభుత్వానికి నూతన అధ్యక్షుడు ఒబ్రదార్ నాయకత్వం వహిస్తారు.

అధ్యక్ష స్థానానికి మొత్తం ఐదుగురు అభ్యర్థులలో ముగ్గురు మూడు కూటముల తరపున పోటీ చేయగా ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. పార్లమెంట్ ఉభయ సభలలో కూడా లోపెజ్ నాయకత్వంలో 'కలసి కట్టుగా మేము చరిత్రను సృష్టిస్తాము అని పిలుపిచ్చినా మొరేనా కూటమి ఐదువందల స్థానాలున్న ఛాంబర్ డిప్యూటీస్ (మన లోక్‌సభ మాదిరి)లో 312, 128 సీట్లున్న సెనెట్ (రాజ్యసభ మాదిరి)లో 69 స్థానాలతో సంపూర్ణ మెజారిటీ సాధించింది. అధ్యక్ష ఎన్నికలు, పార్లమెంట్, మున్సిపల్ ఎన్నికలు అన్నీ ఒకేసారి జరిగాయి. అన్నింటా ఈ కూటమి ఘనవిజయం సాధించింది. అయితే అమెరికా కమ్యూనిస్టు పార్టీ వెబ్‌సైట్‌లో ఆమ్లోను 'సంస్కరణవాది' అని పేర్కొంది. మెక్సికో కమ్యూనిస్టు పార్టీ కూడా లోపెజ్ ఒబ్రదార్‌ను సంస్కరణవాదిగా పేర్కొంది.

మెక్సికోలో 1929 నుంచి 2000 వరకు ఎలాంటి విరామం లేకుండా అధికారంలో ఉన్న పిఆర్ఐ పార్టీ కార్యకర్తగా 1976లో లోపెజ్ ఒబ్రదార్ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆ పార్టీ పోకడలు నచ్చక దాన్నుంచి విడివడిన వారు 1986లో డెమోక్రటిక్ రివల్యూషన్ పార్టీ(పిఆర్‌డి)గా ఏర్పడ్డారు. లోపెజ్ ఒబ్రదార్ 1989లో దానిలో చేరి 1994లో ఒక రాష్ట్ర గవర్నర్‌గా పోటీ చేశారు. 2000లో మెక్సికో నగర మేయర్‌గా ఎన్నికయ్యారు. 2005లో మేయర్ పదవికి రాజీనామా చేసి ఆ పార్టీ తరపున పిఆర్‌డి, పౌర ఉద్యమం, లేబర్ పార్టీ కూటమి తరపున 2006 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. స్వల్పతేడాతో ఓడిపోయారు. 2012 అధ్యక్ష ఎన్నికల్లో కూడా అదే కూటమి తరపున పోటీచేసి రెండవ స్థానం తెచ్చుకున్నారు. ఆ సందర్భంగా తనకు మద్దతు కూడగట్టేందుకు జాతీయ పునరుజ్జీవన ఉద్యమం(మొరేనా) పేరుతో ఒక సంస్థ ఏర్పాటు చేశారు. రెండవసారి ఓటమి తరువాత పిఆర్‌డి నుంచి విడిపోయి, అంతకు ముందు ఏర్పాటు చేసిన మొరేనా సంస్థను 2014లో రాజకీయ పార్టీగా నమోదు చేశారు. ఇప్పుడు దాని నాయకత్వాన ఏర్పడిన కూటమి తరపున పోటీ చేసి ఘన విజయం సాధించారు.

లోపెజ్ ఒబ్రడార్ జాతీయ పునరుజ్జీవన పార్టీ (మొరెనా), వర్కర్స్ పార్టీ, క్రైస్తవ మితవాదులతో నిండిన సోషల్ ఎన్‌కౌంటర్ పార్టీ (పిఇఎస్) ఒక కూటమిగా ఏర్పడ్డాయి. లోపెజ్ ఒబ్రడార్ (64) సాధించిన విజయం సామాన్యమైనది కాదు. అమెరికా అనుకూల ప్రభుత్వం ఏర్పాటుకు నిత్యం కుట్రలు సాగుతుండడం మెక్సికోలో సర్వసాధారణం. వాణిజ్యం, వలసల విషయంలో మెక్సికో మీద ట్రంప్ నిరంతరం గుప్పిస్తున్న విమర్శల కారణంగానే అమెరికా వ్యతిరేకత అక్కడి ప్రజల్లో చోటు చేసుకుంది. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (నాఫ్టా) సమీక్షిస్తానని, అమెరికా–మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణం. సరిహద్దుల్లో అక్రమంగా వలస వస్తున్న మెక్సికన్ కుటుంబాలను విడదీయడం (దాదాపు రెండు వేలమంది చిన్నారులు తమ తల్లిదండ్రులకు దూరమవడం) వంటి ట్రంప్ చర్యల మూలంగా ఆయన మీద ఉన్న ఆగ్రహమే అమెరికా అనుకూల ప్రధాన పక్షాలను మెక్సికన్ ఓటర్లు తిరస్కరించి లోపెజ్ ఒబ్రడార్‌కు పట్టంగట్టారు. అయితే ఒబ్రడార్‌ను కూలదోసేందుకు అమెరికా కుట్రలు పన్నడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అప్పుడే భావిస్తున్నారు.

ప్రపంచంలోని 15 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మెక్సికో ఒకటి. లాటిన్ అమెరికాలో రెండవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ. అయితే ఆదేశం ఎక్కువగా అమెరికాపై ఆధారపడుతుంది. 80 శాతం ఎగుమతులకు అమెరికాయే దాని గమ్యంగా ఉంది. అమెరికాతో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ట్రంప్ చర్యలను లోపెజ్ ఒబ్రడార్ తీవ్రంగా ఖండిస్తున్నారు. అంతేగాక అమెరికా, కెనడాతో పాటుగా ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎన్ఎఫ్‌టిఎ)లో మెక్సికో ఒక భాగస్వామి అయినప్పటికీ, లాటిన్ అమెరికా దేశాల్లో ప్రబలంగా ఉన్న సమస్యలపై మెక్సికో ఉమ్మడిగా పోరాడుతోంది. అమెరికాతో సంబంధాల కారణంగా దెబ్బతిన్న చిన్నతరహా వాణిజ్యవేత్తలు, మధ్య తరగతి మేధావులు, కొందరు బడా వాణిజ్యవేత్తల మద్దతును కూడగట్టటం కూడా లోపెజ్ ఒబ్రడార్ విజయానికి దోహదపడింది. దేశ జనాభాలో 46 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. 60 శాతం కార్మికులు అసంఘటిత రంగంలో అతితక్కువ వేతనాలతో పని చేస్తున్నారు. వీరికి సామాజిక భద్రత లేదు.

అధ్యక్ష భవనంలో లోపెజ్ ఒబ్రడార్ ప్రవేశం అమెరికాకు మింగుడుపడనిది. మెక్సికో పౌరులు దాదాపు మూడున్నర కోట్ల మంది అమెరికాలో ఉన్నారు. అందువల్ల అమెరికాకు చట్టవిరుద్ధ వలసలు మెక్సికో నుంచే అధికంగా ఉంటాయన్నది నిజమే అయినా, వారంత పొట్టకూటి కోసమే వస్తున్నారు. చిన్నా చితకా పనులు చేసుకుని బతకడమే వారి ధ్యేయం. మెక్సికోలో పెట్టుబడులు పెట్టి ఏటా భారీఎత్తున లాభాలు గడిస్తున్న అమెరికా పెట్టుబడిదారుల్లా వారేమీ నిలువుదోపిడీకి దిగలేదు. మెక్సికో నుంచి మాదకద్రవ్యాలు వచ్చిపడుతుండడం అమెరికాకు సమస్య అయితే... నిజానికి మెక్సికోలో విదేశీ ప్రత్యక్ష మదుపులు (ఎఫ్‌డిఐ) పెట్టి ఆ దేశాన్ని పెద్ద ఎత్తున కొల్లగొడుతోంది అమెరికానే అనేది జగమెరిగిన సత్యం.

మెక్సికో నుంచి వస్తున్న మత్తు మందులు అమెరికా సమాజంలో సమస్యలు తెచ్చిపెడుతుండడం పైకి కన్పించే వాస్తవమే అయినప్పటికీ, ఆ దేశంలోని స్మగ్లర్లకు ఆయుధాలు, డబ్బు సరఫరా చేస్తూ సూత్రదారులుగా వ్యవహరిస్తున్నది అమెరికన్ అక్రమవ్యాపారులే. వారి సహాయంతోనే మాదకద్రవ్య ముఠాలు విచ్చలవిడిగా కిడ్నాప్‌లకూ, హత్యలకూ పాల్పడుతున్నాయి. గత పది సంవత్సరాలలో మాదక ద్రవ్య మాఫియా చేతుల్లో రెండు లక్షల మంది హతులు కావటం మరో 30 వేల మంది అదృశ్యమవ్వడం ఎన్నికలను ప్రభావితం చేసింది. సెనేట్‌కూ, దిగువ సభకూ ఎన్నికలు ప్రకటించాక 50 మంది అభ్యర్థులతోసహా 130 మంది నేతల్ని చంపేశారు. బెదిరింపుల పర్యవసానంగా 600 మంది పోటీ నుంచి తప్పుకున్నారు. ట్రంప్ అధ్యక్షుడు కాకముందు అత్యధికులకు అమెరికా అంటే వల్లమాలిన అభిమానం. కానీ ట్రంప్ నిత్య దూషణలతో అది కాస్తా ఆవిరైంది.

ఇవాళ మెక్సికో అనేక సమస్యలతో అట్టుడుకుతోంది. అక్కడ పౌరులను మాయం చేయడం నిత్యకృత్యం. ఈ 'అదృశ్యాలకు' అటు భద్రతా బలగాలు ఇటు మాదకద్రవ్య ముఠాలు కారణం. గత దశాబ్దకాలంలో అపహరణలపై కేసులు, అరెస్టులు రివాజు కానీ ఏళ్లు గడుస్తున్నా ఆ కేసుల అతీగతీ ఉండదు. అప్పుడప్పుడు శవాల దిబ్బలు బయటపడుతుంటాయి. వాటిని తవ్వి డిఎన్ఎ పరీక్షలు జరిపి అదృశ్యమైన వ్యక్తులు చనిపోయారని ధ్రువీకరించడం తప్ప ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదు. వీటికితోడు మెక్సికోతో 1994లో కుదిరిన ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (నాఫ్టా)ను తిరగదోడతానని ట్రంప్ ప్రకటించడంతో ఆర్థిక అనిశ్చితి ఏర్పడింది. అనేక అమెరికా సంస్థలు ట్రంప్ విధానాల పర్యవసానంగా అయోమయంలో పడ్డాయి. ఒబ్రడార్ కూడా నాఫ్టాకు తొలినుంచీ వ్యతిరేకి. అది దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిందని ఆయన భావన.

అమల్లో ఉన్న నాఫ్టా ఒప్పందం వల్ల అమెరికాకు అన్యాయం జరిగిందని వాపోయే ట్రంప్ ఒకపక్కా... దీనివల్ల మెక్సికో ప్రజలు నష్టపోయారని వాదించే లోపెజ్ ఒబ్రడార్ మరోపక్కా ఉంటే ఇరు దేశాల మధ్య అసలు ఎలాంటి ఒప్పందమైనా సాధ్యమేనా అని చాలా మంది సందేహం. ఒబ్రడార్ విజయం ఇప్పుడు అమెరికా పెట్టుబడిదారులను, మెక్సికో వాణిజ్యవేత్తలను కూడా భయపెడుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ క్షీణ దశలో ఉండగా, అవినీతి, నేరాలు అడ్డూ ఆపూ లేకుండా విస్తరించిన దశలో, సంక్షేమ పథకాలకు, పింఛన్లకు కోతపడిన సమయంలో ఒబ్రడార్ దేశాధ్యక్షుడు అయ్యారు. ఆయన డిసెంబర్‌లో పదవి బాధ్యతలు స్వీకరిస్తారు. లులా పాలనలో పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి బ్రెజిల్‌కు దోహదపడిన కార్యక్రమాలను ప్రవేశపెట్టాలని కూడా ఒబ్రడార్ కోరుకొంటున్నారు. మెక్సికోలో అమెరికా పరిశ్రమలు, పెట్టుబడులు అధికంగా ఉన్నాయి. మెక్సికోలో నిర్వహించబడుతున్న విదేశీ కంపెనీలు ప్రత్యేకించి, అమెరికా కంపెనీల వ్యవహారాల అంశంపైనే ఆయన పోరాడవల్సి ఉంటుంది.

అంతర్జాతీయ సంస్థలకు ఇచ్చిన చమురు అన్వేషణ కాంట్రాక్టులను పునః సమీక్షించేందుకు ఆయన వాగ్దానం చేశారు. స్వచ్ఛంగా ఉన్న కాంట్రాక్టులను కొనసాగించేందుకు, అలా లేని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు కూడా లోపెజ్ ఒబ్రడార్ ప్రకటించారు. విదేశీ చమురు కంపెనీలు అవినీతికి పాల్పడుతున్న దృష్ట్యా చమురు కంపెనీలను జాతీయం చేయాలని ఆయనపై వామపక్షవాదులు ఒత్తిడి చేస్తున్నారు. మెక్సికో ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పెమెక్స్' చమురు కంపెనీ మెక్సికో ప్రయోజనాలను కాపాడే విధంగా చమురు అన్వేషణ విధానాన్ని లోపెజ్ ఒబ్రడార్ రూపొందించాల్సివుంది. మెక్సికో ఆదాయానికి అత్యధికంగా చమురు ఉత్పత్తి దోహదం చేస్తున్నందున చమురు రంగం నుండి ప్రభుత్వ వాటా పెంపుదల లోపెజ్ ఒబ్రడార్ కర్తవ్యంగా ఉండబోతుందా? లాటిన్ అమెరికా వామపక్ష పార్టీల ఆశలకు అనుగుణంగా లోపెజ్ ఒబ్రడార్ ప్రభుత్వ పాలన ఉంటుందా? పేద ప్రజల అభ్యున్నతికి ఆయన ప్రాధాన్యత ఇస్తారా? వేచి చూడాలి. మొరెనా కూటమి ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థకు

సరుకుగా మారింది శ్రమశక్తే గాని శ్రమ కాదు

సరుకుకు, మారకానికి మధ్య సంబంధాన్ని వివరిస్తూ, పారిశ్రామిక ఉత్పత్తులకు గిట్టుబాటు ఉంది గాని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, ఇది కార్పొరేట్ శక్తుల కుట్రేనని అంటున్నారు **కె.జి. రాంచందర్**

మార్క్సిజం మూడు ముఖ్యమైన అంశాలతో లేదా సిద్ధాంతాలతో కూడి ఉన్నది. ఒకటి తత్త్వశాస్త్రం, రెండు అర్థశాస్త్రం మూడు వర్గ పోరాట సిద్ధాంతం. హెగెల్ గతితర్కం, ఫ్యూయర్‌భా భౌతికవాదంతో గతితార్కిక భౌతికవాద తత్వశాస్త్రం. ఆడమ్ స్మిత్, రికార్డోల ఆర్థిక సిద్ధాంతం వారసత్వంగా అదనపు విలువ సిద్ధాంతం. సెయింట్ సైమన్, ఫోరియర్, రాబర్ట్ ఓవెన్‌ల ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంతాలను పరిశీలించడం ద్వారా వర్గ పోరాట సిద్ధాంతం పునాదిగా శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతం ఈ మూడు ఉనికిలోనికి వచ్చాయి. ఈ మూడింటితో కూడినదే మార్క్సిజం. పైన తెలియజేసినట్లుగా మార్క్సిజం శూన్యం నుండి రాలేదు. గత సమాజాలలోని వివిధ రంగాల శాస్త్రవేత్తల కృషికి కొనసాగింపుగానే మార్క్సిజం వచ్చింది. అది కూడా గతితార్కిక పద్ధతిలోనే ఉనికిలోకి వచ్చింది. గింజ నుండి మొలక వచ్చినట్లుగా, నిర్జీవ పదార్థం నుండి సజీవ పదార్థం ఏర్పడినట్లుగా, మార్క్సిజం ఉనికిలోకి వచ్చింది. పాత దాని నుండి వచ్చినప్పటికి వచ్చిన కొత్తది ఎలా మౌలికంగా పాత వాటికి భిన్నంగా ఉంటాయా అలాగే మార్క్సిజం కూడా పాత సిద్ధాంతం కంటే మౌలికంగా భిన్నమైనది.

గత శాస్త్రవేత్తల కృషికి కొనసాగింపుగానే మార్క్సిజం వచ్చిందని మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ ఈ విధంగా తెలియజేశాడు. "తత్వశాస్త్ర చరిత్ర, సామాజిక శాస్త్ర చరిత్ర అత్యంత స్పష్టంగా తెలుపుతున్నది ఏమిటంటే, ప్రపంచ నాగరికతాభివృద్ధి రాజ మార్గానికి దూరంగా ఎక్కడో ఉత్పన్నమైన ఏదో ఒక సంకుచితము, శిలీభూతం అయిన సిద్ధాంతం అనే అర్థంలో మార్క్సిజంలో ఒంటెత్తు వాదాన్ని పోలిన లక్షణం కించిత్తు కూడా లేదు. తద్భిన్నంగా మానవజాతిలో అగ్రశ్రేణికి చెందిన భావుకులు ఇది వరకే లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలోనే మార్క్స్ ప్రతిభ ఉంది. తత్త్వశాస్త్రంలోనూ, అర్థశాస్త్రంలోనూ, సోషలిజంలోనూ మహాపండితులైన వారి బోధనలకు సూటి అయిన తక్షణమైన కొనసాగింపుగానే మార్క్సిస్టు సిద్ధాంతం ఉద్భవించింది". మార్క్సిజంలోని ప్రధాన భాగాలుగా ఉన్న తత్త్వశాస్త్రం, అర్థశాస్త్రం, శాస్త్రీయ సోషలిజంలలో సర్వసంపదలకు మూలం శ్రామికుల శ్రమేనని, పెట్టుబడిదారీ ఆస్తికి, కార్మికుల అదనపు శ్రమ అదనపు విలువగా మారడమే కారణమని మార్క్స్ రుజువు చేసింది అర్థశాస్త్రం ద్వారానే పెట్టుబడి గ్రంథం ద్వారానే అనే విషయాన్ని బట్టి అర్థశాస్త్రం చాలా ప్రధానమైనదిగా చెప్పాలి. ఈ మార్క్సిస్టు అర్థశాస్త్రం గత కాలపు ఆర్థిక శాస్త్రవేత్తల కొనసాగింపుగానే వచ్చిందనే వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అంతేకాదు. ఆయా కాలాల అర్థశాస్త్ర వేత్తల కృషి గురించి తెలుసుకోవాలి. వారి కృషి ఎక్కడ ఆగిపోయింది? దాన్ని మార్క్స్ ఎలా కొనసాగించాడు?

ప్రత్యామ్నాయం కాగలదా? అంటే అనుమానమే గ్రీసులోని సిరిజా, స్పెయిన్‌లోని పొడెమాస్ లక్షణాలు మొరేనాలో ఉన్నాయి.

గుత్తాధిపతులకు ఇష్టమైన వారిలో ఒకరిగా లోపెజ్ ఉన్నారు, అదే సమయంలో ఆకలి, దారిద్ర్యాలతో అలమటిస్తూ విసిగిపోయిన వారిలో ఆశను కూడా కలిగిస్తున్నాడు. మెక్సికో పెట్టుబడిదారీ విధానాన్ని మార్చేందుకు లోపెజ్ ఒబ్రడార్ ఎలాంటి ప్రతిపాదనలు చేయకపోగా దానిని బలపరచాలని కోరుకుంటున్నాడు.

ప్రగతి వాదులమని చెప్పుకొనే మొరేనా మితవాదులతో కలవడానికి అధికార వాంఛ తప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఏమిలేదు. సోషల్ డెమోక్రాట్లు తమను వామపక్షవాదులుగా పిలుచుకోవటం, మీడియా కూడా అదే ప్రచారం చేస్తున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థలో నెలకొన్న సంక్షోభ పరిష్కారం గురించి కొన్ని తేడాలు ఉండవచ్చు కాని ప్రజల మౌలిక సమస్యలను అవి పరిష్కరించలేవు. ఫ్రాన్స్‌లో సోషలిస్టు పార్టీ, బ్రిటన్‌లో లేబర్ పార్టీ, అమెరికాలో డెమోక్రటిక్ పార్టీ వంటి వన్నీ ఈ కోవకే వస్తాయి. వాటిలో కొంతమంది సంస్కరణవాదులు, కొందరు వామపక్ష వాదులు ఉండవచ్చు తప్ప మౌలికంగా అవి పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడేవే తప్ప వ్యతిరేకించేవి కాదని ఇప్పటికే రుజువు చేసుకున్నాయి. బూర్జువా వర్గంలో అధికారం కోసం జరిగే పెనుగులాటలో ఇలాంటి పార్టీలు అనేకం పుట్టుకు వస్తాయి, అంతరించిపోతాయి. తిరిగి కొత్త రూపాలలో పుట్టుకు రావటం తప్ప స్వభావంలో మౌలిక మార్పు ఉండదు. మెక్సికో మొరేనా పార్టీ నాయకత్వంలోని కూటమి కూడా అలాంటిదే. దాని మీద భ్రమలు పెట్టుకోనవసరం లేదు.

ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో వివిధ దేశాల్లో మితవాద, మతవాద, జాత్యహంకార ఫాసిస్టు, అర్ధ ఫాసిస్టు పార్టీలు అధికారంలోకి వస్తున్న ధోరణిని పూర్వపక్షం చేస్తూ మెక్సికో చరిత్రలో మూడో కూటమి తొలిసారి విజయం సాధించడం విశేషమే. అమెరికా కుట్రల నేపథ్యంలో మెక్సికోను లోపెజ్ ఒబ్రడార్ ఎలా చక్కదిద్దగలరో, ఎలా పాలన కొనసాగించగలరో వేచి చూడాలి. అరకొర సంస్కరణలతో, జనాకర్షణ విధానాలతో వ్యవస్థలో మౌలిక మార్పురాదు. పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రత్యామ్నాయం సోషలిస్టు విప్లవం మాత్రమే. అందువల్ల కమ్యూనిస్టు పార్టీ సారథ్యంలో జరిగే కార్మిక-కర్షక ఐక్యపోరాటం మాత్రమే పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి దోపిడీ పీడనలేని సామాజిక వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. అందుకు వర్గపోరాటం తప్ప మరోమార్గం లేదని మెక్సికోతో పాటు ప్రపంచ దేశాల కార్మికులు-కర్షకులు గుర్తించాల్సి ఉంది.

(రచయిత ఉపాధ్యాయులు)

వీ

అనే వాటిని మనం చూడాలి. వాటిని మనం అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. మార్క్స్ జన్మించి రెండు వందల సంవత్సరాలు నిండిన సందర్భంలో, మరీ ముఖ్యంగా లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ తీవ్రంగా అమలు చేస్తున్న కాలంలో మార్క్స్ సిద్ధాంతాలు అదనపు విలువ సిద్ధాంతాలు అన్ని కాలాల్లో, దేశాల్లో వర్తింపజేయడానికి సరిపోతాయా అనే సందేహాలు లేవనెత్తబడుతున్నప్పుడు వాటిని మనం తప్పనిసరిగా తెలుసుకోవాల్సి ఉంటుంది.

గత ఆర్థిక శాస్త్రవేత్తల కృషి తెలుసుకోవాలంటే మనం చరిత్రలోకి వెళ్లాలి. మానవులు జంతువుల మాదిరిగా ప్రకృతిని ఉన్నదున్నట్లుగా స్వీకరించి జీవించడం గాకుండా తమకు అనుకూలంగా మార్చుకోవడం ద్వారా మనుగడ సాగించారు. మానవులు కుటుంబాలుగా, సమూహాలుగా ఏర్పడే క్రమంలో మొదట్లో తమకు కావాల్సిన వాటిని వారే ఉత్పత్తి చేసుకొనేవారు. తరువాత పని విభజన ఏర్పడింది. తమకు కావాల్సిన వస్తువులు అన్నింటిని తామే ఉత్పత్తి చేసుకోలేక పోవడం, వేరే వాళ్లు ఉత్పత్తి చేసినది తమకు అవసరం కావడం, తాము ఉత్పత్తి చేసినది వేరే వారికి అవసరం కావడం జరిగింది. ఈ క్రమంలో మానవులు తమలో తాము వస్తువులు పరస్పరం అవసరాలనుగుణ్యంగా మార్చుకోవడం జరిగింది. ఈ విధంగా వస్తు మారకం ప్రారంభమైంది. పలాన వస్తువుకు పలాన వస్తువు మారకం చేసుకోవచ్చని, పలాన వస్తువులకు పలాన వస్తువులు మారకం అవుతాయని, చివరికి పలాన వస్తువుకు ఏ వస్తువు అయినా మారకం అవుతుందనే స్థితికి మారకాలు అభివృద్ధి చెందాయి. అయితే ఈ మారకాలు ఏ ప్రమాణాల బట్టి మారకం జరుగుతున్నాయి అనే సందేహాలు ప్రశ్నలు వచ్చాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలుగా ఏ వస్తువు మారకానికి తయారైందో వాటినే సరుకులు అన్నారు. ఏ సరుకులు మారకానికి గురౌతున్నాయో ఆ సరుకుల్లో ఏదో సమానత్వ విలువ ఉండబట్టి అవి మారకానికి గురౌతున్నాయని మొదటిసారిగా గ్రీకు ఆర్థికవేత్త, ప్రకృతి శాస్త్రవేత్త అరిస్టాటిల్ చెప్పాడు.

మారకానికి గురైన వస్తువుల్లో ఏదో సమాన విలువ ఉంటుంది కాబట్టి అవి మారకానికి గురౌతున్నాయని చెప్పడమే ఆ రోజుల్లో గొప్ప విషయంగా, కొత్త విషయంగా భావించి అందరు దాన్నే ఆమోదించారు. ఆ విధంగా మారకాల్లో సమాన విలువలు ఉంటాయని, అలా సమాన విలువలుంటేనే మారకానికి గురౌతాయనే సూత్రం లేదా సిద్ధాంతం ఆర్థిక శాస్త్రంలో వచ్చింది. సరుకులు సమాన విలువలతోనే మారకడం జరుగుతాయనే సూత్రం వచ్చింది. కాని ఆ విలువ అంటే ఏమిటి? ఆ విలువ ఎలా వచ్చింది? అనే ప్రశ్న వారికి ఆ రోజుల్లో రాలేదు. దానికి సమాధానం కోసం కృషి కూడా జరగలేదు. క్రీ.పూ. 3వ శతాబ్దం తరువాత మధ్యయుగాల్లో శాస్త్ర విజ్ఞానంలో ఏ రకమైన కృషి జరగలేదు.

15,16 శతాబ్దాలలో ప్రకృతి శాస్త్రాల్లో వచ్చిన మార్పులు, ఉత్పత్తి శక్తుల్లో వచ్చిన మార్పులు సమాజంలో పెద్ద ఎత్తున ఆర్థిక, రాజకీయ, సామాజిక మార్పులకు కారణమైంది. ఆ తరువాత సామాజిక శాస్త్రాల పరిశోధన ప్రారంభమైంది. పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు తిరిగి మారకాల గురించి పరిశోధనలు ప్రారంభించి అరిస్టాటిల్ చెప్పినట్లుగానే సమాన విలువల్లోనే మారకాలు జరుగుతాయనే సిద్ధాంతాన్ని ఆమోదించి తమ అర్థశాస్త్ర పరిశోధన కొనసాగించారు. సరుకుల్లో ఉండే విలువకు కారణమేమిటో పరిశీలించారు. శ్రమతో సంబంధం లేని వాటికి విలువ లేకపోవడం, ఉదాహరణకు, నదిలోని నీళ్లకు, అడవిలోని పండ్లకు, అంతేగాకుండా తక్కువ శ్రమతో తయారు చేసిన వాటికి విలువ తక్కువగా ఉండడం, వస్తు తయారీలోని శ్రమ కాలాన్ని బట్టి వాటి విలువ ఉండడాన్ని గ్రహించారు. వీటన్నింటిని పరిశీలించి శ్రమ వల్లనే సరుకులకు విలువ వస్తుందని గుర్తించారు.

సరుకులైన వస్తువుల్లో ఉండే శ్రమను బట్టి వాటి విలువలు ఉంటాయి. వాటితో సమాన విలువ లున్నప్పుడే పరస్పరం మారకం చేసుకుంటాయి. ఈ సూత్రాన్ని బట్టి శ్రామికుడు తన శ్రమను పెట్టుబడిదారునికి ఇచ్చి అంతే విలువను పుచ్చుకుంటాడన్న మాట. సరుకులాగ ఉన్న వస్తు, సేవలన్ని సమాన విలువ ప్రాతిపదికగా మారకం జరిగితే మరి మిగిలేదేమిటి. ఏమి మిగలదన్నమాట.

కాని వాస్తవ ప్రపంచంలో ఏమి జరుగుతున్నది. పెట్టుబడిదారుడు తాను మొదట పెట్టిన పెట్టుబడికంటే తాను వస్తువులు తయారు చేసిన వాటిని సరుకులుగా అమ్మిన తరువాత మొదట పెట్టిన పెట్టుబడి కంటే ఎక్కువ సంపదను సమకూర్చుకున్నట్లు కనపడుతుంది. కార్మికుని శ్రమతోపాటు అన్ని సరుకులు సమాన విలువలకే మారకం జరిగితే, పెట్టుబడిదారుని దగ్గర సమకూరిన ఆస్తి ఎలా వచ్చినట్లు. దీనితో పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు అసమాన మారకాల వల్ల సంపద సమకూరినట్లు నిర్ధారించారు. ఒకవైపు సరుకులు సమాన విలువలకే మారకం జరుగుతాయనే నియమాన్ని ఆమోదిస్తూనే, మరొకవైపు అసమాన మారకం జరుగుతుందని చెప్పడం పరస్పర విరుద్ధమైన విషయాలు చెప్పడం కాదా. ఈ విధంగా పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు వైరుధ్యంలో చిక్కుకుపోయారు. శ్రమే విలువగా ఉంటుందని, సరుకుల చలామణిలో ఎలాంటి విలువ ఏర్పడదని ఆమోదించినప్పటికి పెట్టుబడిదారులకు ఏదైనా విలువలు మిగిలాయంటే అది శ్రమ ద్వారానే ఉంటుందనే విషయం బూర్జువా ఆర్థికవేత్తలు చెప్పలేక పోయారు. మార్కెట్టులో డిమాండ్ – సప్లై మూలంగా సరుకుల (విలువల్లో) ధరల్లో ఎగుడు, దిగుడులు ఉంటాయని, వీటి ద్వారానే పెట్టుబడిదారులకు సగటు లాభాలు వస్తాయని ఈ సందర్భంగా కూడా సమాన విలువలు మారకపు నియమానికి భంగం కలుగుతుందని కూడా బూర్జువా ఆర్థికవేత్తలు భావించారు.

సరుకుల చలామణిలో మారకంలో కొత్త విలువలు ఏమి చేరవు. సమాన విలువలకే మారకాలు జరుగుతాయి. ఈ నియమానికి ఏమి భంగం కలుగకుండానే పెట్టుబడిదారులకు లాభాలు వస్తాయని అందుకు కారణం ఉత్పత్తి క్రమంలోనే శ్రమ దోపిడి మూలంగా లాభాలు వస్తాయని మార్క్స్ రుజువు చేశాడు. బూర్జువా ఆర్థిక వేత్తలు శ్రామికుడు తన శ్రమను పెట్టుబడిదారునికి మారకం చేసి అంతే విలువను (సమాన విలువల మారకం సూత్రం ప్రకారం) పొందుతాడు. కాబట్టి పెట్టుబడిదారునికి ఉత్పత్తి క్రమంలో శ్రామికుని శ్రమ మారకం నుండి ఏమి మిగలదనే నిర్ణయానికి వచ్చాడు.

అయితే వాస్తవంగా పెట్టుబడిదారునికి సంపదలు పెరుగుతూనే ఉంటాయి. దీనికి కారణమేమిటంటే శ్రామికుడు పెట్టుబడిదారునికి మారకం చేసింది శ్రమను కాదు శ్రమ శక్తిని అనే విషయాన్ని మార్క్స్ కనిపెట్టాడు. సరుకుగా మారింది శ్రామికుని శ్రమ కాదు, శ్రమ శక్తి. ఈ శ్రమ శక్తి అనే సరుకును దాని యజమానైన శ్రామికుడు పెట్టుబడిదారునితో సమాన విలువలతోనే మారకం చేసుకున్నాడు. ఇక్కడ సమాన విలువల మారకం సూత్రం ఏమి భంగపడలేదు. అతిక్రమణకు గురికాలేదు. శ్రమశక్తి అనే సరుకు విలువ అన్ని సరుకుల విలువలు ఎలా నిర్ణయించబడుతాయో అలాగే నిర్ణయించబడుతాయి. అన్ని సరుకుల

విలువలు ఆయా సరుకులు ఎంత సామాజికంగా అవసరమైన సగటు శ్రమపరిమాణంతో తయారు చేయపడుతాయో, అంతే శ్రమ పరిమాణం తో తయారు చేయబడిన సరుకులతో మారకం చేయబడుతాయి. అంటే సమాన విలువలతో మారకం చేయబడుతాయి. శ్రమశక్తి అనే సరుకు కూడా తాను తిరిగి తాను కోల్పోయిన శ్రమ శక్తిని సమకూర్చుకోవడానికి ఎంత శ్రమ పరిమాణంతో చేయబడిన సరుకులు కావాలో ఆ సరుకులతో మారకం చేయబడుతుంది. అంటే సమాన విలువతో శ్రమ శక్తి అనే సరుకు మిగతా సరుకులతో పోల్చితే భిన్నమైన, ప్రత్యేకమైన లక్షణం కలిగి ఉంటుంది. సరుకులకు రెండు విలువలు ఉంటాయి. ఒకటి ఉపయోగపు విలువ రెండు మారకపు విలువ. ఇంకా చెప్పాలంటే ఏ సరుకుకైన ఉపయోగపు విలువ ఉంటేనే దానికి మారకపు విలువ కలిగి ఉండే అర్హత ఉంటుంది.

శ్రమశక్తి అనే సరుకు కాకుండా మిగతా సరుకులన్ని, తమ విలువలకు మించి ఎక్కువ విలువలను సృష్టించలేవు. సరుకులను ప్రత్యక్షంగా మనుషుల వినియోగం కోసము వాడుకోవచ్చు లేదా కొత్త సరుకులను తయారు చేయడం కోసం ముడి సరుకుగానైన వినియోగించుకోవచ్చు. ముడి సరుకులుగా వినియోగించినవి తమ విలువకంటే ఎక్కువ విలువను కొత్త సరుకులో చేర్చలేవు. తమ మారకపు విలువ ఎంత ఉంటుందో అంతే విలువను కొత్త వస్తువులోకి చేర్చుతాయి. శ్రమ శక్తి అనే సరుకు మాత్రమే తమ విలువకు మించి ఎక్కువ విలువను కొత్త వస్తువుల్లో చేర్చుతుంది. ఎలాగంటే శ్రమశక్తి అనే సరుకు పెట్టుబడిదారునికి ఒక్క రోజంతా అంటే 8 గంటలు శ్రమ శక్తి అనే సరుకును వాడుకోవచ్చనే ఒప్పందం చేసుకుంటే, ఎంత మారకపు విలువ పొందుందంటే తిరిగి తన శ్రమ శక్తి సమకూరేటంత మారకపు విలువనే పొందుతుంది. అయితే 4 గంటలు శ్రమ శక్తి ఉపయోగిస్తే తన శ్రమ శక్తి సమకూరే విలువలు సృష్టించబడుతాయి. మరో నాలుగు గంటలు ఉపయోగంచుకునే అవకాశం పెట్టుబడిదారునికి ఉంటుంది. ఆ నాలుగు గంటల శ్రమశక్తి ఉపయోగించుకున్నందుకు పెట్టుబడిదారుడైన యజమాని ఏమి విలువ చెల్లించడు. అంటే ఉచితంగానే పొందుతాడన్న మాట. అందుకని మొదటి నాలుగు గంటలు అవసర శ్రమ అవుతుంది. తరువాతి నాలుగు గంటలు అదనపు శ్రమ అవుతుంది.

ఈ అదనపు శ్రమ నుండే అదనపు విలువ వస్తుంది. ఈ అదనపు విలువల నుండే పెట్టుబడిదారుని ఆస్తి జమ అవుతుంది. ఇక్కడ నాలుగు గంటలు అవసర శ్రమ మరో నాలుగు గంటలు అదనపు శ్రమ అంటే సరిగ్గా అలాగే ఆ నిష్పత్తిలోనే విభజన ఉంటుందని అర్థం కాదు. అవసర శ్రమ 2 గంటలు కావచ్చు 6 గంటలు కావచ్చు. అదనపు శ్రమ 2 గంటలు లేదా 6 గంటలు కావచ్చు. అంటే నిర్దిష్ట పరిస్థితులను బట్టి ఆ నిష్పత్తి ఉంటుంది. ఎప్పుడైన అదనపు శ్రమ కనీసం కూడా లేకపోతే పెట్టుబడిదారుడు శ్రమ శక్తితో మారకపు ఒప్పందమే చేసుకోడు. అదనపు శ్రమ కోసమే, అదనపు విలువ కోసమే పెట్టుబడిదారుడు శ్రమ శక్తిని కొంటాడు. శ్రమశక్తి అనే సరుకు ప్రత్యేకతే అదనపు శ్రమను ఉత్పత్తి చేయడం. ఈ అదనపు శ్రమ, అదనపు విలువల వల్లనే పెట్టుబడిదార్ల సంపదలు పెరుగుతాయి.

సరుకులు వాస్తవ ప్రపంచంలో మార్కెట్టులో సమాన విలువలతో మారకం జరగుతున్నట్టు కన్పించదు. ఒకరోజు ఒక ధరకు అమ్మకం జరిగితే మరోరోజు మరో ధరకు అమ్మకం, కొనుగోళ్లు జరిగినట్లు మనం చూస్తాం కదా ఇది నిజం కాదా. సరుకులు సమాన విలువల మారకం జరగనట్లే కదా. ఇది సమాన విలువల మారకపు నియమానికి భంగం కదా. సరుకుల అమ్మకం కొనుగోళ్ల రంగంలో అంటే సరుకుల చలామణి రంగంలో పెట్టుబడిదారులు లాభనష్టాలు పొందుతుంటారనేది నిజమే కదా. మార్క్సిజం ప్రకారం చలామణి రంగంలో సరుకులకు కొత్త విలువలు చేరవు కాబట్టి లాభమనేది అక్కడ కాదు సృష్టించబడేది. ఉత్పత్తి క్రమంలోనే శ్రమ దోపిడి ద్వారానే లాభం వస్తుంది.

దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? నిజమే మార్కెట్టులో సరుకులు తమ విలువలకే అమ్మకం, కొనుగోళ్లు జరగవు, ఎక్కువ సార్లు అవి తమ విలువలకు తక్కువగానో, ఎక్కువగానో అమ్మకం కొనుగోళ్లు జరుగుతాయి. అయితే అక్కడ ఏ కొత్త విలువలు ఏర్పడవు. తక్కువ విలువలు గల సరుకులు ఎక్కువ ధరకు అమ్మకం గాని కొనుగోళ్లుగానీ జరగవచ్చు. అలాగే ఎక్కువ విలువగల సరుకులు తక్కువ ధరకు అమ్మకం, కొనుగోళ్లు జరగవచ్చు. మొత్తం మీద పరిశీలిస్తే శ్రమ ద్వారా సృష్టించబడ్డ మొత్తం విలువలకు మొత్తం ధరలు సమానంగానే ఉంటాయి.

సరుకుల చలామణి రంగంలో అంటే వర్తక రంగంలో జరిగేదంతా, వివిధ రంగాల ఉత్పత్తిదారుల మధ్య కార్మిక వర్గం సృష్టించిన విలువల పంపిణి సమస్యనే కాని కొత్త విలువల సృష్టి సమస్య కాదు. వ్యవయోత్పత్తుల సరుకులు ఎక్కువ విలువ కలిగి ఉన్నప్పటికి మార్కెట్టులో అవి తక్కువ విలువలకు (ధరలకు) అమ్ముడు పోతుంటాయి. అదే వాణిజ్యలో పారిశ్రామిక ఉత్పత్తులు తక్కువ విలువలు కలిగి ఉన్నప్పటికి ఎక్కువ విలువలకు (ధరలకు) అమ్ముడు పోతుంటాయి. ఇదేమి తెలియజేస్తుందంటే వ్యవసాయ ఉత్పత్తుల్లో సృష్టించబడ్డ విలువలను పారిశ్రామిక రంగం సొంతం చేసుకుంటుంది. అదే కదా రైతాంగం ఆందోళన చేసేది. తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేదనీ, అదే విధంగా తాము వాడుకుంటున్న పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు పెరిగిపో తున్నాయనీ, ఇది ఏమి తెలియజేస్తుంది.

ఒక రంగంలోని ఉత్పత్తిదారులు మరో రంగం ఉత్పత్తిదారుల మధ్య జరిగే లాభాల పంపిణి సమస్యనే కదా. అదే విధంగా పారిశ్రామిక సేవా రంగంలో పెద్ద, పెద్ద సంస్థలు తమ లాభాలను కాజేస్తున్నాయని ఆ రంగానికే సంబంధించిన చిన్న, చిన్న సంస్థలు ఆందోళనలు చేస్తున్నాయి. ఇదంతా లాభాల పంపిణి సమస్యే తప్ప కొత్త విలువల సృష్టి సమస్య కాదనేది మనం చెప్పాలి.

కొత్త విలువలు, సంపదలు సమస్తం కార్మికుల శ్రమ ద్వారానే సృష్టించబడుతాయనే సత్యాన్ని మార్క్సిజం చెప్పింది. ఆ సత్యాన్ని మనం ఎలుగెత్తి చాటాలి. పాలక వర్గాల తొత్తులు, పెట్టుబడిదారీ వర్గాల చెంచాలు మార్క్సిజానికి కాలం చెల్లిందని కారు కూతలు కూస్తున్నారు. వాటికి కమ్యూనిస్టులం, కార్మిక వర్గ ప్రతినిధులం భయపడాల్సిన పనిలేదు. ఆత్మ విశ్వాసం కోల్పోవలసిన అవసరం లేదు. మార్క్సిజం సత్యమైనది. అజేయమైనది. శ్రమ దోపిడీ ఉన్నంతవరకు, అది అంతమయ్యే వరకు వర్తమాన చరిత్రలో అప్రతిహతంగా ముందుకు పోతుంది. శ్రమ దోపిడీ అంతమైన తర్వాత కూడా మానవజాతి చరిత్రలో మార్క్సిజం శాశ్వతంగా నిలుస్తుంది.

ఈ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొని పోవడానికి మన మందరం త్రికరణశుద్ధిగా కృషి చేయడమే ఈ ద్విశత జయంతి సందర్భంగా మార్క్స్‌కు మనం అర్పించే నివాళి అవుతుంది. మార్క్సిజం వర్ధిల్లాలి, సోషలిజం వర్ధిల్లాలి. కమ్యూనిజం జిందాబాద్, క్యాపిటలిజం ముర్దాబాద్.

(రచయిత ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు) వీ

బస్తర్‌లో భూ సంబంధాలు - 4

ఆదివాసులు జీవిక కోసం అటవీ ఉత్పత్తులపై, వ్యవసాయంపై ఏ విధంగా ఆధారపడుతున్నారో చెపుతూ, అటవీ ఉత్పత్తులను స్థానిక షావుకారులు, ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలు ఎలా దోపిడీ చేస్తున్నారో తెలియచేస్తున్నారు **విశ్వం**

జీవన ప్రమాణాలు - సంప్రదాయాలు

సమాజంలో నిరంతరం మార్పులు జరుగుతూ ఉంటాయనే విషయం అందరికి తెలిసిందే. సమాజంలో జరిగే ప్రతి మార్పుకు ఆనాటి సమాజంలోని ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబం ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ప్రభావితం కాక తప్పదు. మార్పులనేవి శాంతి దశలో క్రమానుగతంగా సాగితే, విప్లవ దశలో అవి గెంతు రూపంలో సంభవిస్తాయి. అంటే ఒకటికి ఐదు పది రేట్లు అధికంగా ఆ మార్పులు జరుగుతాయి. క్రమానుగత మార్పులనేవి విప్లవ పోరాటాలతో సంబంధం లేకుండానే వాటికవే జరిగిపోతూ ఉంటాయి. అందుకు ఆనాటి సమాజంలోని అంతర్గత పరిస్థితులు, సంబంధాలు, ఘర్షణలు కారణ భూతమవుతాయి. ఎటువంటి మౌలికమైన మార్పులు లేకుండానే, ఆ మార్పులను విప్లవ మార్పులతో పోల్చరాదు. అలా పోల్చడం ద్వారా విప్లవాలంటే అసలు అర్థమే లేకుండా పోతుంది. మార్క్సిస్టు పరిభాషలో విప్లవాలంటే ఉత్పత్తి విధానంలో మార్పు, ఉత్పత్తి సంబంధాలలో మార్పు, సామాజిక, రాజకీయ సంబంధాలలో మార్పు.

బస్తర్‌లో మావోయిస్టు ఉద్యమ ప్రభావంతో భూములు లేని స్థితి నుండి కొంత భూములు దొరకడం, సంతల్లో, షావుకార్ల, ఫారెస్టు అధికారుల విచ్చలవిడి దోపిడీ, జులుంను అరికట్టడంతో పాటు కొంత ఊరట లభించిన మాట వాస్తవం. నిట్ట నిలువు దోపిడీ నుండి బయటపడ్డ ఆదివాసీ రైతాంగం అర్ధాకలి నుండి ఏదో రకంగా కడుపు నింపుకోవడమే గాక, దొరికిన ఆర్థిక వెసులుబాటుతో తిరిగి సరిపడ జీవితపు అలవాట్లను కూడా అలవర్చుకోవడం జరిగింది. ప్యాంటు, కుర్తా, చీరలు లాంటి నీలామీ బట్టలతో ఒళ్లు కప్పుకోవడంతో మొదలై వారి వేష భాషల్లో, అలవాట్లలో కూడా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా యువతలో సబ్బులు, షాంపులు, అత్తర్, పౌడర్లు, తల నూనె, చెప్పులు లాంటివి అలవాటయినాయి. ఒకప్పుడు ఉప్పుకు, నూకలకు, పొగాకు అవసరాల కోసం అటవి ఉత్పత్తులను మారకం చేసిన ఆదివాసులు అటవి ఉత్పత్తులను డబ్బుల్లోకి మార్చుకోవడంతో, డబ్బుల చలామణి పెరిగి సంతలతో మార్కెట్ సంబంధాలు కూడా బలపడుతున్నాయి.

ఆదివాసులైనా, ఆదివాసేతరులైనా తమకు లభిస్తున్న మొత్తం ఆదాయంలో ఎక్కువ శాతాన్ని తమ తిండి కోసమే ఖర్చుపెడుతున్నారు. కార్డులపై బియ్యం దొరకకపోతే వారు పండించిన ధాన్యం వారు తినడానికే సరిపోయేట్టుగా లేదు. కార్డుపై దొరికే 35 కిలోల బియ్యం అయిపోగానే తాము పండించిన ధాన్యాన్ని వండుక తింటున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడిసిన్ అనే సంస్థ ప్రతి మనిషికి నెలకు 14 కిలోలు, పిల్లలకు 7 కిలోల చొప్పున బియ్యం అవసరం పడతాయని పేర్కొంది. అలా చూసినప్పుడు ప్రతి మనిషికి రోజుకు 466 గ్రాముల బియ్యం అవసరం. సర్వేలో భాగంగా మూడు గ్రామాలలోని 103 కుటుంబాలను పరిశీలించగా ప్రతి ఒక్కరూ రోజుకు సగటున 463 గ్రాములు (బియ్యం) తింటున్నట్లు తేలింది. పిల్లలకు 463 గ్రాములే లెక్కించాలని చెప్పుకొచ్చారు. ఎందుకంటే ఇక్కడ బిస్కట్లు, చాక్‌లెట్లు, చక్కెర గోళీలు లేని కారణంగా, పిల్లలేడ్చిన ప్రతిసారి దొప్పల్లో ఇంత అన్నం పెట్టి ఇవ్వడం ఇక్కడి తల్లుల రివాజు. యువతీ యువకులకైతే 463 గ్రాములు ఏమాత్రం సరిపోదు. వారికి కనీసంగా 500 - 600 గ్రాములు అవసరం పడుతున్నది. ఒరిస్సాలోని కందమాల్ జిల్లాలో లాగ ఇక్కడ ఆకలి చావులనేవి లేకపోయినప్పటికి, వారి తిండిలో కార్బోహైడ్రైట్స్ తప్ప మిగతా ప్రొటీన్స్, కొవ్వులు, విటమిన్ల లోపం స్పష్టంగా కనిపిస్తున్నది. పౌష్టికాహార లోపం కారణంగా ఫ్లిలల ఎదుగుదలలో, తల్లుల ఆరోగ్యాల మీద తీవ్ర ప్రభావం చూపుతున్నది. స్థానికంగా కుటుంబాలు పండించిన అయిదు పదికిలోల పప్పులు, ఇంకా రేషన్‌కార్డుపై నెల నెల దొరికే రెండు కిలోల శనగలు వారికేమూలకు సరిపోవడంలేదు.

తూర్పు బస్తర్‌లో పప్పు దినుసుల లభ్యత మనిషికి రోజుకి సగటున 18 గ్రాములు మాత్రమే. అంత్యోదయ పథకం కింద ప్రభుత్వం బియ్యంతో

ఆహార పదార్థాల లభ్యత

ప్రతి మనిషి సగటున	దేశంలో	స్థానికంగా	
		ఆదివాసులు	ఆదివాసేతరులు
బియ్యం (రోజుకు)	429 గ్రా	463 గ్రా	463 గ్రా
పప్పులు (రోజుకు)	37 గ్రా	18 గ్రా	18 గ్రా
నూనే (ఏడాదికి)	8 కి	2 కి	3.2 కి
చక్కెర (ఏడాదికి)	13 కి	500 గ్రా	10 కి
పాలు (ఏడాదికి)	63.3 లీ	0	20 లీ
వనస్పతి (ఏడాదికి)	1 కి	0	500 గ్రా
చాయ్‌పత్తి (ఏడాదికి)	612 గ్రా	0	400 గ్రా
చేపలు (ఏడాదికి)	4.5 కి	1.3 కి	2.5 కి
ఆలుగడ్డలు (ఏడాదికి)	24.7 కి	3.5 కి	5.5 కి
అరటి, బొప్పాయి ఏడాదికి	6.3 కి	6.5 కి	6.5 కి

గ్రా - గ్రాములు; కి - కిలోలు; లీ- లీటర్లు

పాటు ప్రతి కుటుంబానికి రెండేసి కిలోల శనగలు ఇస్తున్నది. వీటిని కలిపినా పప్పుల సగటు వినియోగం 18 గ్రాములు మాత్రమే. మెజారిటీ ఆదివాసులలో నేటికీ చాయి అలవాటు కాలేదు. చక్కెర వాడకం లేదు. కుటుంబం మొత్తానికి ఏడాదికి ఏదో రూపంలో తిన్నా కూడా, బెల్లంతో కలిపి 2-3 కిలోలకు మించదు. ఇక పాల వాడకం అనేది ఆదివాసులలో దాదాపుగా నిషేధం లాంటిదే. (పిల్లలు (ఆవు దూడ) తాగే పాలు మనిషి తాగడం పాపం అంటారు. ప్రకృతి ధర్మాన్ని పాటించాలంటారు) ఎక్కడో, ఎవరో ఒకరు పాలతో చాయి తాగినా అది మినహాయింపే. ఇక్కడి గ్రామాలలోని ఆదివాసేతరులలో కొంత చాయి అలవాటు ఉన్నందున పాలు, చక్కెర వాడకం కొంతవరకుంది. చేపలను కుంటలలో, నదుల్లో పట్టుకు తినడమే తప్ప కొనడం నామమాత్రం. ఇంద్రావతి ఒడ్డున గల హడ్డేర్, పిచ్‌కొడ్డేర్, మంగనారు లాంటి గ్రామాలలో ప్రతి ఇంటికి వలలుండడంతో మనిషికి చేపలు ఏడాదికి సగటున 4-5 కిలోలకు కూడా మించవచ్చు. సంతలలో ఆలుగడ్డలు కొనడం గతంలో కంటే కొంత పెరిగింది. అయితే ఎంత పెరిగినప్పటికీ ఒక్కో కుటుంబం ఏడాదికి 5-6 కిలోలకు మించి కొనడం లేదు. వారు పండించిన చామగడ్డలు, అడవిలో దొరికే దుంపలను కూడా కలిపితే వారి సగటు లభ్యత మనిషికి ఏడాదికి 3.5 కిలోలుగా ఉంది. ఆదివాసేతరులలో కూడా గడ్డల (దుంపల) వినియోగం, దేశంతో పోల్చితే సగం మాత్రమే ఉంది. అరటి, బొప్పాయి చెట్టయితే దాదాపుగా అన్ని ఇళ్లల్లో ఉన్నందునా వాటి లోటు లేదనే చెప్పుకోవాలి. అడవిలో మామిడి చెట్లు విస్తృతంగా ఉన్నందున వాటి లభ్యత ప్రతి మనిషికి సగటున 10-15 కిలోల వరకుంటుంది.

పదేండ్లకి ఇప్పటికి ప్రతి ఇంట్లో నూనె వాడకం మొదలయింది. ఒక్కో కుటుంబం నెలకు సుమారు కిలో చొప్పున సంవత్సరానికి పది పన్నెండు కిలోల వరకు వాడుతున్నారు. గతంలో కొన్ని కుటుంబాలు మాత్రమే ఇప్ప నూనెను వాడేవారు. సంతలలో నుండి కొనుక్కుని తెస్తున్న నూనెను కొద్ది కొద్దిగా కూరలలోనే వాడుతున్నారు తప్ప, నూనెతో చేసే పిండి వంటలు మాత్రం మొదలు కాలేదు. ఏడాదికోమారు బియ్యం పిండిలో చిటికెడు చక్కెర కలిపి అట్లు పోయడం తప్ప పిండి వంటల, తీపి వంటల (స్వీట్స్) మాటే ఎరుగరు. శారీరక శ్రమలో పాల్గొనే ఆదివాసులలో నూనె వాడకం ఇంకా పెరగాల్సి ఉంది. భారతదేశంలో ప్రతి మనిషికి సంవత్సరానికి సగటున నూనె వాడకం 8 కిలోలు ఉండగా, అదే అమెరికాలో సగటున మనిషికి 70 కిలోల వరకు ఉంది. గతంలో కంటే ఈ దశాబ్ద కాలంలో ఉల్లి, వెల్లుల్లి, మిరపకాయలతో పాటు ఆలుగడ్డలు, టమాటాలు, వంకాయలు లాంటి కొన్ని కూరగాయలను అడపా దడపా కొంటున్నప్పటికీ అడవిలో, పొలాల్లో, నదుల్లో దొరికే ఆకు కూరలు, కాయలు, పూలు, పండ్లతో సహా దుంపలు, చేపలు, పుట్టగొడుగులు, లేత వెదురు మొలకలు (కర్కు), ఎర్ర చీమలు, మొదలగునవి 60-70 వరకు కూరలుగా తింటున్నామని, కొని తినేవి చాలా తక్కువేనని చెప్పుకొచ్చారు. నేటికి అడవిలో తినడానికి పనికొచ్చేవి 130 రకాల కూరలు, కాయలు దొరుకుతున్నాయని ఇక్కడి పెద్దలు చెబుతున్నారు. కూరల విషయంలో తినడమే తప్ప వాటి గురించి పురుషులకు ఏనాడు పట్టింపు లేదు. (వేట, వలలతో చేపలు పట్టడం మినహా) సంవత్సరం పొడుగుతా అన్నంలోకి కూరలను సేకరించడం, సమకూర్చడం మహిళల పని. ఎండైనా, వానైనా రేపటి కూర కోసం సంవత్సరం పొడుగుతా అడవికి వెళ్లడం మహిళలకో పెద్ద పని. వెలకట్టలేని వీటిని కూడా వారి కుటుంబ ఆదాయాలలో కలపాలి. అయితే రోజు రోజుకు అడవి నాశనమవుతూ ఉండడం, మార్కెట్ ఆధారిత జీవన శైలి అలవాటవుతూ ఉండడం అనే ప్రక్రియ మొదలవడంతో ఆదివాసుల ఆహార భద్రతకు పెను ముప్పు ముంచుకు వస్తున్నదనే చెప్పుకోవాలి.

ఆదివాసులు మాంస ప్రియులు అనేది ఒకనాటి మాట. ఈ గ్రామాల్లో పశు సంపద పుష్కలంగా ఉన్నా, అడపా దడపా కోళ్లను కోసుకుతినడమే తప్ప, మాంసం తినడం అనేది బాగా తగ్గిపోయింది. అడవిలో మనుషుల సంచారం బాగా పెరిగిపోవడం, అడవిలోని జంతువులు కూడా బాగా తగ్గిపోవడంతో వేట పడడం కూడా బాగా తగ్గిపోయింది. ఎప్పుడో ఏడాదికోమారు ఎవరింట్లోనో కర్మకాండకు గొడ్డును, పందిని కోయడం తప్ప రెగ్యులర్‌గా తినడమైతే లేదు. సర్వే చేసిన 20 గ్రామాలలోని మొత్తం 490 కుటుంబాలకు 2501 పశువులు, 1067 మేకలు (ఇందులో కొన్ని పందులు) ఉన్నాయి. మేకలు అమ్మడానికే తప్ప వారు కోసుకుని తిన్నది ఎక్కడ కన్పించలేదు. (ఈ సంవత్సరం మొత్తం 20 గ్రామాలలో 500 మేకలను అమ్మినట్లు చెప్పుకొచ్చారు. వారు తిన్నవి కేవలం 11 మాత్రమే. వీరి ఆదాయపు వనరులలో పశు సంపద కూడా ఒక వనరు) గొడ్డు మాంసం తినని ఆదివాసేతరులలో మేకలు కోసుకు తినడం కొంత ఉంది. మేకలకు పోషకులు ఆదివాసులే అయినా, అది వారి నోటి రుచికి ఏనాడో దూరమయింది. జనతన సర్కార్లు ఏర్పడి దశాబ్దాలు గడిచినా సంతల్లో మాంసం (నెలకోసారి గొడ్డును కోసి) అమ్మే ఏర్పాటు మాత్రం జరగలేదు. ఆదివాసి ప్రాంతాల్లో పండగలంటే అర్థం పొద్దస్తమానం తాగిందే తాగుడు తప్ప తినేదేమీ ఉండదు. పిల్లలకైనా, తల్లులకైనా పైసా ఖర్చు లేకుండా పౌష్టికాహారాన్ని సమకూర్చే దాంట్లో పాడి (పాలు, పెరుగు, నెయ్యి) ముఖ్యమైనది. పాడిగల ఇల్లు ఆరోగ్యంగా ఉంటుందంటారు. విశాలమైన బస్తర్ గ్రామీణ ప్రాంతాలలో లక్షల సంఖ్యలో పాడి పశువులున్నా, పాడి అనేది కొరవడడం విచారకరం. ముప్పయ్యేళ్ల తరువాత కూడా ఇందులో ఏమాత్రం మార్పు లేదు.

ఆదివాసులలో తిండి తరువాత బట్టలు, చెప్పులు, సబ్బులు లాంటి నిత్యావసర వస్తువులకు మిగతా డబ్బులను ఖర్చు చేస్తున్నారు. సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు తమ సరకులను అమ్ముకోవడానికి గాను లోతట్టు ప్రాంతాలలోని సంతలకు సైతం చొరబడి, వినియోగ సంస్కృతిని పెంచి పోషిస్తూ ఆదివాసులు మిగిల్చుకున్న కొంత డబ్బు మొత్తాన్ని కూడా వినియోగ సరుకులనమ్మి కొల్లగొట్టుక పోతున్నాయి. బహుళజాతి సంస్థలు మైక్రో మార్కెట్ రూపధారణతో ఆదివాసుల జేబుల్లోని డబ్బులను కాజేయడానికి 'హరేక్ మాల్ పాంచ్ రూపాయ్‌మే' (ఏదైనా ఐదు రూపాయలకే) అంటూ సబ్బులు, పేస్టులు, బ్రష్‌లు, పౌడర్లు, అత్తర్లు, షాంపులు, చాయ్‌పత్తి, పాలపొడి, నేల్ పాలిష్, తల నూనెలు లాంటి వాటిని సంతల్లో కుమ్మరించాయి. పూసల దండలతో పాటు టార్చిలైట్లు, వాచీలు, రేడియోలు, టేపులు, బాక్స్‌లు, మొబైల్స్ లాంటివి కూడా పెద్ద ఎత్తున వచ్చిపడ్డాయి. ఆదివాసి సంస్కృతిలో పెనవేసుకు పోయిన ఆట (ఎందనా = నృత్యం) పాట, అలంకరణలకు ఉన్న విశిష్టతల రీత్యా యువతీ యువకులు వాటివైపు ఆకర్షితులవడం అసహజమైన విషయమేమీ కాదు.

స్థానికంగా మరీ ముఖ్యంగా ఆదివాసి యువతీ యువకుల వేషధారణలో అనేక మార్పులు వచ్చాయి. దశాబ్దం క్రితం వరకు నీలామీ (పాత బట్టలు) బట్టలను కొనుక్కున్నవారే ఈనాడు వందో రెండొందలో పెట్టి కొత్తవి సైతం కొంటున్నారు. ఆదివాసి మహిళల సాంప్రదాయిక వేషధారణ అయిన లుంగీని చుట్టుకొని పైటగా టవల్‌ని వాడడానికి బదులుగా పొడవాటి చీరలు, యువకులలో ప్యాంట్, షర్ట్, ఆఫ్ ప్యాంట్‌ల ఆధునికత సంతరించుకుంది. యువతులు కూడా అటవి ఉత్పత్తుల ద్వారా వచ్చిన డబ్బులతో వాచీలు కూడా కొని ధరిస్తున్నారు. ఒకప్పుడు వింతగా తోచిన

సబ్బులు, షాంపులు, లైట్లు వంటివి నేడు నిత్యావసర వస్తువులై పోయాయి. అలంకరణలో మాత్రం ఎంతగా ఆధునికతను అనుసరిస్తున్నప్పటికీ కూడా సాంప్రదాయిక వేషధారణయే ఆధిపత్యంలో ఉంది. అది ఏమాత్రం తగ్గలేదు సరికదా వేడుకలలో, జాతరలలో సాంప్రదాయిక సంస్కృతియే కనిపిస్తుంది. మెడలో వందల కొద్ది రూపాయల విలువగల పూసలదండలు కనుమరుగవలేదు. సంతలలో సాంప్రదాయికమైన అలంకరణ వస్తువులకి ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ అమ్మకాలలో వాటిదే పైచేయిగా ఉంది. యువతలో ఆధునికత, ఫ్యాషన్ వెర్రితలలు వేయడమనేది అనాదిగా కొనసాగుతున్నదే. పది సంవత్సరాల క్రితం ఫ్యాషన్ పేరుతో ఉరకలు వేసిన యువకులంతా (యువతులు కూడా) నేడు పెళ్ళిళ్లయి కుటుంబ బాధ్యతలు, తీరికలేని పనులు మీదపడి సంసారిక జీవనంలో కొట్టుమిట్టాడుతూ సాంప్రదాయిక వ్యవస్థలో సంలీనం చెందారు. వ్యవస్థ పునాదిలో మార్పు రాకుండా సంస్కృతిలో, సామాజిక జీవనంలో మార్పులు రావడం, అవి నిలదొక్కుకోవడం కుదరని పని.

ఆదివాసుల జీవన విధానం, వారి ఆదాయ వ్యయాలను బట్టి మొబైల్స్‌ను విలాస వస్తువుగానే పరిగణించక తప్పదు. అయితే వాటి వినియోగం ఈ ప్రాంతంలో చాలా తక్కువ. పిచ్‌హద్దేర్ లాంటి ఇంద్రావతి నది ఒడ్డున గల గ్రామాలలో వీటి వాడకం కొంతమేరకు ఉంది. ఈ గ్రామాలలో చప్రాసీలు, గురూజీలు, మేస్త్రీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండడంతో వారు వీటిని నేటి అవసరంగానే భావిస్తున్నారు. ఏ బాధ్యతలు లేని యువకులు వీటిని మల్టీ మీడియాగా ఉపయోగించుకుంటున్నారు. లోతట్టు గ్రామాలలో ఇవి రెండు మూడుకు మించవు. కొంత మంది యువకులు వినోదం కోసమని మొబైల్స్‌ను కొంటున్నప్పటికీ అవి కుటుంబ బడ్జెట్‌లో నుండి కొనుగోలు చేస్తున్నవి మాత్రం కావు. అటవీ ఉత్పత్తులను అమ్మి లేక చిన్నపాటి (పార్ట్ టైమ్) కూలీ పనులు చేయగా వచ్చిన డబ్బులతో కొనడం జరుగుతున్నది. వీటి ప్రభావం కుటుంబ బడ్జెట్‌పై లేదనే చెప్పుకోవాలి. అయితే సామ్రాజ్యవాద సరుకుల మాటున కుళ్లిపోయిన విషసంస్కృతి, అశ్లీలం చాపకింద నీరులా మెల్లగా ప్రవహిస్తున్నది.

జీవన ప్రమాణాలను కేవలం తిండి, బట్ట, కట్టుబొట్టు లాంటి వాటితోనే కొలువలేం. జీవన ప్రమాణాలను పరిశీలించేటప్పుడు తిండి, బట్టతో పాటు కుటుంబ సంక్షేమం, విద్య, వైద్యం, వసతి, ఉపాధి లాంటి విషయాలను గమనంలోకి తీసుకోవాల్సి ఉంటుంది. సోషల్ ప్రోగ్రెసివ్ ఇంపరేటివ్ అనే ఒక అమెరికన్ సామాజిక సంస్థ, సామాజిక ప్రగతిని అంచనా కట్టేందుకు, ఆయా దేశాల జాతీయోత్పత్తిని (జిడిపి) లేదా వ్యక్తి సగటు ఆదాయాన్ని కాక తిండి, విద్య, ఆరోగ్యం, వైద్యం, ఇల్లు, ఉల్లాసంతో పాటు ఆర్థిక వెసులుబాటు, వ్యక్తిగత భద్రత, వ్యక్తిగత స్వాతంత్ర్యం, సమానత, స్వేచ్ఛ, ఉపాధిలాంటి 52 అంశాలను పేర్కొంది.

వైద్యం: ఈ మొత్తం గ్రామాలలోని కుటుంబాలు తినే తిండిలో ఎక్కువ శాతం అన్నం – జావ తప్ప అందులో ఇతరేతర ఆహార పదార్థాల సమతుల్యత లేకపోవడంతో తల్లి, పిల్లల్లో పౌష్టికాహార లోపం స్పష్టంగా కనిపిస్తున్నది. చిన్నప్పుడు సరైన పోషకాహారం దొరకక పిల్లల్లో బరువు, ఎత్తు పెరగక ఎదుగుదల అనేది లేకుండా పోయింది. ఎంతో మంది తల్లులు రక్తహీనతతో బాధపడుతున్నారు. గర్భం దాల్చిన సమయంలో సరైన పోషకాహారం అందకపోవడంతో ప్రసవ సమయంలోనే ఎంతో మంది పిల్లలు, తల్లులు మరణాల పాలవుతున్నారు. ఈ గ్రామాలలో శిశు మరణాల రేటు కూడా అధికంగా ఉంది. 234 జనాభా గల ఆదేవేడ, ఇర్పనారు అనే రెండు గ్రామాలలోని మొత్తం 44 కుటుంబాలలో ఈ పదేళ్ల కాలంలో 58 మంది పిల్లలు చనిపోయారు. అందులో 48 శిశు మరణాలు కాగా, 10 మంది ఐదేళ్లలోపు పిల్లలున్నారు. గత సంవత్సరం ఆదేవేడ అనే గ్రామంలో ఏ వైద్య సౌకర్యం, రవాణా సౌకర్యం లేకపోవడంతో తల్లి గర్భంలోనే శిశువు మరణించింది. మూడు రోజులు గడిచినా చేసేదేమి లేకపోవడంతో నాలుగో రోజున తల్లి కూడా మరణించింది. ఇటువంటి మరణాలు చాలా సహజమే అనే స్థాయిలో వీరి మానసిక స్థితి ఉందంటే, ఇక్కడి జీవన ప్రమాణాలను కొలిచేందుకు ఏ కొలతబద్దనుపయోగించాలో అర్థం కావడం లేదు. ఇంట్లో ఎంత మంది పిల్లలను కన్నా చివరికి మిగిలేది ఇద్దరు, ముగ్గురే. దీనితో గ్రామాలలో జనాభా పెరుగుదల రేటు లేకుండా పోయింది. ఇది ఈ రెండు గ్రామాల పరిస్థితే కాదు, మొత్తంగా బస్తర్‌లోని ఆదివాసి ప్రజానీకపు పరిస్థితి ఇదే. 2011లో జరిగిన జనాభా లెక్కల సందర్భంగా బస్తర్‌లో ఆదివాసి జనాభా పెరుగుదల రేటు పడిపోతూ ఉండడంపై ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలో చర్చ ఎంత జరిగినా, దాని పురోగతిలో మాత్రం ఏ మార్పు లేదు.

వర్షాకాలం వచ్చిందంటే చాలు మలేరియాతో పాటు కలరా, డయేరియా పెద్ద ఎత్తున వ్యాపిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరో ఇద్దరో రోగాలతో ఎప్పుడూ మూలుగుతూ కనిపిస్తారు. గత సంవత్సరం గత్తరొచ్చి ఒకే కుటుంబంలోని ముగ్గురన్నదమ్ములు వారం రోజుల్లో ఒకరి తర్వాత ఒకరు మరణించారు. అదే సంవత్సరం బస్తర్ మొత్తంగా కలరాతో వందలాది మంది మరణించారు. ఆదేవేడ, ఇర్పనారు, గోబెల్, మొగోడ్, బొదిలి, తొడమ, పావుల్ లాంటి లోతట్టు గ్రామాలలోని ప్రజలు తమకు ఏ చిన్న రోగమొచ్చినా లెస్కె (గ్రామ భూత వైద్యుడు) దగ్గరికి పోక వేరే దారేలేదు. సాధారణ రోగాలకే చికిత్స కష్టమైపోతుంటే దీర్ఘకాలిక రోగాలకు ప్రాణాలు విడువక తప్పడం లేదు. స్థానిక ఆదివాసులలో 95 శాతం మంది ఇప్పటి వరకు డాక్టరు ముఖమే చూడలేదంటున్నారు. హద్దేర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుర్వేద చికిత్సాలయం, అంగన్‌వాడి కేంద్రాలు ఉండడంతో అక్కడి పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా, లోతట్టు గ్రామాలలో ఒక్క ప్రాథమిక వైద్య కేంద్రం కూడా లేదు. ఇతమెట్ట, ఆదేవేడలో అంగన్‌వాడిలు మంజూరై మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు ఏర్పాటు మాత్రం జరగలేదు. మిథానీల సంగతి అంతే. మాతా శిశు సంక్షేమంపై ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారమంతా ఉత్తదే.

ప్రజలు కూడా పరిశుభ్రతకు, పారిశుధ్యానికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దశాబ్దాలు గడుస్తున్నా మంచినీటి చెలమలు (సువ్వలు) కూడా పాకురు పట్టి ఏ మార్పు లేకుండా ఉంటున్నాయి. ప్రభుత్వాల మాట అటుంచి జనతన సర్కార్లు పనిగట్టుకుని పిల్లల సంక్షేమాన్ని పట్టించుకునేలా కుటుంబాలను చైతన్యపరచాల్సి ఉంది.

విద్య: జీవన ప్రమాణాలు మెరుగయ్యాయనడానికి విద్యను ప్రామాణికంగా చూస్తారు. విద్య సైతం జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా ప్రభావితం చేస్తుంది. ఈ దశాబ్ద కాలంలో లోతట్టు గ్రామాలైన ఆదేవేడ, పావుల్, ఇర్పనారు లాంటి గ్రామాల్లో అక్షరాస్యత 1–2 శాతానికి మించలేదు. హద్దేర్, పిచ్‌కొద్దేర్ గ్రామాలలో రెండు ఆశ్రమ పాఠశాలలు ఉండడం, అలాగే ఆదివాసేతరులలో పిల్లలను చదివించాలనే సామాజిక స్పృహ కలిగి ఉన్నందున అక్షరాస్యత అనేది ఈ రెండు గ్రామాలలో 16–18 నుండి 30 శాతానికి పెరిగింది. హద్దేర్‌లోని ఆదివాసులు, ఆదివాసేతరులతో ఎంతో కాలంగా కలిసి సహవాసం కొనసాగిస్తు న్నప్పటికీ అక్షరాస్యతలో ఏమాత్రం పురోగతి లేదు. ఆదివాసులలోని ఆర్థిక వెసులుబాటు గల కుటుంబాలు కూడా దీనికి మినహాయింపేమీ కాదు. ఒక్క విద్యయే కాదు వైద్యం, మాతా శిశు సంక్షేమం, గృహ వసతి, ఆదాయం, వ్యవసాయం, ఉపాధి అవకాశాలు లాంటి సామాజిక

ప్రగతి సూచికలలో మిగతా వారికన్నా బాగా వెనుకబడి ఉన్నారు. నూటికి 99 శాతం మేర ఆదివాసి పిల్లలు విద్యలో ప్రాథమిక విద్యను దాటి మాధ్యమిక విద్యకు చేరలేకపోతున్నారు. ఈ మొత్తం 20 గ్రామాలలో ఇంటర్ వరకు చదివినవారు (వాస్తవానికి నాలుగు గ్రామాలలోనే) 21 మంది ఉండగా, అందులో సగానికంటే ఎక్కువ మంది ఆదివాసేతరులే. మొత్తానికి పిల్లల్లో చదువుకోవాలనే ఆసక్తి రోజు రోజుకు పెరుగుతున్నా అందుకు అనుకూల వాతావరణం లేకుండా పోయింది. కుటుంబ ఆదాయాలు పెరిగి మిగులుతో వ్యవసాయంలో శ్రమ విభజనలు (పిల్లలు గాక వేరేవాళ్లు గొడ్లు మేపడం) జరగకుండా అక్షరాస్యత పెరగడం అనేది కష్టమైన విషయమే.

తాగుడు: ఆదివాసి సమాజంలో తిండి తరువాత స్థానం తాగుడుదే అనుకోవాలి. పిల్ల, జెల్ల, ఆడ, మగ, ముసలి అనే తేడా లేకుండా అందరు కూడా కల్లు తాగడమనేది చాలా సాధారణమైన విషయం. సారాయి తాగడం, పొగాకు తినడాన్ని ఒక సామాజిక దురాచారంగా ఇక్కడ ఎవరూ అనుకోవడం లేదు. ఆదివాసి పండగలంటే ఇంట్లో పిండి వంటలను చేసుకు తినడమో లేక మాంసాన్ని ఆరగించడమో కాదు, ప్రతి ఇంట్లో లంద (రైస్ బీరు), ఇప్పపూల సారాయి వండుతారు. పునా (కొత్తపంట చేతికి వచ్చినప్పుడు) పండగప్పుడైతే మూడు రోజులు ఇంటింటికి తిరిగి అడుక్కొని ఏకధాటిగా తాగుడే తాగుడు. ఇళ్లల్లో తయారు చేసింది తాగుడే కాక ప్రతి కుటుంబం సంతలలో తాగుడుకని మరో 500 - 1000 రూపాయల వరకు (అంతకంటే ఇంకా ఎక్కువే) ఖర్చు చేస్తున్నది. ఇళ్లల్లో వండిన తాగిన సారా ఖర్చును, సంతలలో తాగిన మొత్తం లెక్కిస్తే ఒక్కో కుటుంబానికి తాగుడు ఖర్చు రు. 5 - 10 వేల వరకు ఉంటుంది. ఈ మొత్తం వారివారి నిజ ఆదాయాలలో 20-25 శాతం ఉంటుంది. అయితే ఇంత పెద్ద మొత్తంలో తాగుడు అలవాటు ఉన్నందున, వీరి జీవన ప్రమాణాలు దిగువ స్థాయిలో ఉన్నాయని, లేదా వీరి పేదరికానికి ఈ తాగుడునే కారణంగానో చూడాల్సిన అవసరం లేదు. ఇతరేతర ఉపాధి అవకాశాలు లేని కారణంగా హద్దేర్, పిచ్‌కొద్దేర్‌లోని 40 కుటుంబాలు సారాయిని వండి అమ్మడాన్ని తమ ఉపాధిగా (పార్ట్ టైమ్) స్వీకరించాయి.

ఆదేవేడ, ఇర్పనారు, పావుల్, ఇతమెట్ట, హర్రెకొద్దేర్, పిచ్‌కొద్దేర్‌లలో నేటికి ఒక వ్యక్తి రోజుకి 9 రూపాయల కంటే తక్కువ ఖర్చు పెట్టేవారు 90 శాతం ఉన్నారు. వీరందరికి సగటున మరో 7 రూపాయల ఆహార సబ్సిడీల, వృద్ధాప్య ఫించన్ల, ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాల మద్దతుంది. వీటిని కూడా కలిపితే ఈ గ్రామాల్లోని ప్రతి వ్యక్తి సగటు ఖర్చు రోజుకు 16 రూపాయలుగా చెప్పుకోవాలి. ఉద్యోగాలు, ఇతరేతర కూలీ పనులు చేసే వారెక్కువగా ఉన్న హద్దేర్, పిచ్‌కొద్దేర్ గ్రామాలలో ప్రతి వ్యక్తి ఖర్చు రోజుకు 14 రూపాయలుండగా, మిగతా గ్రామాలైన పావుల్, ఇతమెట్ట, దుసకొదరాలోని వ్యక్తి సగటు ఖర్చు 4 రూపాయల 50 పైసలు. అందులోనూ రెండు మూడు కుటుంబాలను మినహాయిస్తే మిగతా వారి సగటు ఖర్చు కేవలం 3 రూపాయలు మాత్రమే. మంగనారులోనూ అంతే. మంగనారు మొత్తంగా ప్రతి వ్యక్తి సగటు ఖర్చు 7 రూపాయల 90 పైసలుంది. ఇందులో నుండి గురూజీల ఉద్యోగాలు చేసే రెండు కుటుంబాలు (గురూజీ 1.5/2.5 లక్షల సంవత్సరపు ఆదాయం) మినహాయిస్తే మిగతావారి సగటు ఖర్చు 5 రూపాయలు మాత్రమే.

ఆదేవేడ, ఇర్పనారు గ్రామాల సగటు ఆదాయం ఏడాదికి 17,741 రూపాయలు. మంగనారు 14,453 రూపాయలు. ఇతమెట్ట, పావుల్ 9,213 రూపాయల సగటు కుటుంబ ఆదాయాలతో ఉన్నాయి. పిచ్‌హద్దేర్ కుటుంబాల సగటు ఆదాయం 24,177 రూపాయలు. ఇవి కాక ప్రతి కుటుంబం ఆహార సబ్సిడీలు, ఫించన్‌ల కింద మరో 11 నుంచి 13 వేల రూపాయల మొత్తాన్ని పరోక్షంగా లబ్ది పొందడం జరుగుతున్నది. 20 గ్రామాలలోని మొత్తం 490 కుటుంబాలలో 100-150 కండీల ధాన్యాన్ని పండించే కుటుంబాలు పదకొండున్నాయి. అటవీ ఉత్పత్తులతో సహా వారి ఇతరేతర ఆదాయాలను కూడా కలిపితే వీరి సంవత్సర కుటుంబ ఆదాయాలు సగటున 60 - 70 వేల రూపాయలుంది. వీరిలో చాలా వరకు ఉమ్మడి కుటుంబాలున్నాయి. ఇవిగాక ఉద్యోగాలు చేస్తూ ఏటా 1.5 లక్షల నుండి 2.5 లక్షలు సంపాదించే కుటుంబాలు మరో ఆరున్నాయి. ఆదేవేడలో ఏటా 100-150 కండీల ధాన్యాన్ని (గరిష్ట స్థాయి) పండిస్తూ గ్రామంలోనే 57 వేల రూపాయల అత్యధిక ఆదాయాన్ని (అన్ని ఆదాయాలు) పొందే అయితు కుటుంబం (పదిమంది సభ్యులున్న కుటుంబం) లో కూడా రోజుకి ఒక వ్యక్తి 15 రూపాయలకు మించి ఖర్చు చేయడం లేదు. ఒక వ్యక్తి రోజుకి 27 రూపాయల కంటే తక్కువగా ఖర్చు చేసేవారిని పేద వారిగా గుర్తించాలని గతంలో ప్రణాళిక సంఘం పేర్కొంది. యునెస్కో మాత్రం రోజుకి ఒక డాలరు కంటే తక్కువగా ఖర్చు పెట్టేవారిని పేదవాళ్ల కింద జమకట్టింది. ఈ దశాబ్ద కాలంలో ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే విధంగా వారి ఆదాయాలేమి పెరగలేదు. ఆదాయంలో, డబ్బుల చలామణిలోనూ స్వల్పంగా పెరుగుదల కనిపించినప్పటికీ, పెరిగిన ధరలతో అవి ఏమాత్రం సరితూగలేకపోతున్నాయి. రోజు రోజుకు అడవి దూరమైపోతూ ఉండడం, పురాతనమైన వ్యవసాయ పద్ధతులలో, నిపుణతలేని కూలీలుగా పట్టణాలకు వలసలు పోయి పొట్ట నింపుకోవడానికి ఆదివాసి ప్రజానీకం పడుతున్న తంటాలే తప్ప, మౌలిక సౌకర్యాలంటేనే తెలియని అత్యంత వెనుకబడ్డ ఈ ఆదివాసి గ్రామాలలో జీవన ప్రమాణాలను, సామాజిక ప్రగతిని కొలిచే ప్రమాణాలకు విలువే లేదిక్కడ.

సంప్రదాయాలు - పెళ్లిళ్లు

ప్రపంచంలో ఉన్న అన్ని సమాజాలలోని మాదిరిగానే బస్తర్ ఆదివాసులలో కూడా మనిషి పుట్టుకకు మరణానికి మధ్యలో ఎనిమిది రకాల సంస్కారాలున్నాయి. అందులో జన్మ, పెళ్లి, చావుకి సంబంధించిన మూడు రకాల సంస్కారాలు మాత్రం తప్పనిసరిగా చేయాలని ఉంది. పుట్టినప్పుడు, పెళ్లిళ్లప్పుడు ఏ తంతుని జరపకపోయినా చనిపోయిన తర్వాత పెద్దలలో కలిపే కర్మకాండను మాత్రం తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. ఇది ఎక్కువ ఖర్చుతో కూడినది కావడంతో ఏదాది కర్మకాండను వారి వెసులుబాటును బట్టి రెండు మూడేండ్ల తర్వాతనో లేదా పది ఇరవై ఏండ్ల తర్వాతనో చేస్తున్నారు. మూడు రోజుల పాటు సాగే ఈ తంతులో వచ్చిన బంధువులందరికి తాగుడుతో పాటు గొడ్డునో, పందినో కోయాల్సి ఉంటుంది. ఇవేవి తినని వారి కోసం మేకను, కోడిని కూడా కోసి వడ్డించాల్సి ఉంటుంది. అంతేగాక వచ్చిన బంధువులందరికి చనిపోయిన వాళ్ల గుర్తుగా బట్టలనో, పాత్రలనో ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మొత్తం కార్యానికి పది, ఇరవై వేల దాకా ఖర్చవుతున్నది. అతి తక్కువ ఆదాయాలతో జీవనం గడిపే ఆదివాసి కుటుంబాలకు ఈ తంతు అత్యంత భారంగా తయారయింది. అయినా తప్పడం లేదు. కూడబెట్టిన డబ్బులతోనో, అప్పులు చేసో ఏదోలాగా ఈ కార్యాన్ని ముగిస్తారు. ఒకప్పుడు ఈ తంతు అనేది నాలుగు-ఐదు సంవత్సరాలకు పొడిగించబడితే ఇప్పుడది ఆర్థిక ఇబ్బందులతో పది - ఇరవై సంవత్సరాల దాకా పొడిగించబడుతున్నది.

పెళ్లిళ్ల విషయానికొస్తే అమ్మాయిల తల్లిదండ్రులు కల్లుతాగి ఒప్పందాలు కుదుర్చుకునే పెళ్లిళ్లు కనుమరుగైపోయాయి. రెండు మూడు

గ్రామాలలో ఇలాంటి ఒప్పందాలు జరిగినా, వాటిని యువతులు గట్టిగా తిరస్కరించడంతో అవి అమలు కాలేదు. వీటిని మహిళలలో పెరుగుతున్న చైతన్యంగా చూడాలి. ఇక అమ్మాయిని బలవంతంగా కాళ్లు, చేతులు కట్టిపడేసి లేదా చుట్టూ పది మంది గెదుముతూ తీసుకెళ్లి (రాక్షస పెళ్లి) జరిగే పెళ్లిల్లు, మావోయిస్టు ఉద్యమ ప్రారంభంలో మహిళలు సంఘటితపడి ఎదిరించడంతో దాదాపుగా అటువంటివి కనిపించకుండా పోయినా, తిరిగి ఈ దశాబ్ద కాలంలో మహిళా సంఘాలు నిష్క్రియంగా మారడంతో మళ్లీ అలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గత సంవత్సరం బొదిలి గ్రామం కెఎఎంఎస్ (క్రాంతికారి ఆదివాసి మహిళా సంఘటన్) అధ్యక్షురాలు, జనతన సర్కారు ఉపాధ్యక్షురాలైన లక్మిని యువకులు బలవంతంగా ఎత్తుకెళ్లిపోయారు. తన ఇంటికి పరుగెత్తుకు వస్తే మళ్లీ రెండోసారి కూడా ఎత్తుకుపోయారు. ఈ సంప్రదాయానికి తెగ ఆమోదం కూడా ఉండడం, ఎవరు కూడా ఎదిరించకపోవడంతో, వ్యక్తిత్వం కలదై తానే రెండుసార్లు కూడా ప్రతిఘటించి తిరిగి ఇంటికి పరుగెత్తుకు వచ్చింది. ఇలాంటి ఘటనలు చెదురుమదురుగానే అయినా మళ్లీ మొదలయ్యాయి.

బస్తర్‌లోని ఆదివాసి గ్రామాలలో సాంప్రదాయంగా ఇరు పక్షాలు ఒప్పుకుని లాంఛనాలతో సాగే పెళ్లిళ్లు దశాబ్ద కాలంగా క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ఒకటి రెండు దశాబ్దాల పూర్వం వరకు కూడా ప్రతి గ్రామంలో ప్రతి ఏటా ఒకటో రెండో (చిన్న గ్రామాలు) పెళ్లిళ్లయినా తప్పని సరిగా జరిగేవి. చుట్టుపక్కల గ్రామాల నుండే గాక సుదూర గ్రామాల నుండి సైతం పెళ్లి కబురు అందగానే యువతీ యువకులు ముస్తాబై గుంపులు గుంపులుగా వచ్చి, పెళ్లికి ముందు రాత్రంతా ధాక (నృత్యం) వేసేవాళ్లు. ఊరు ఊరంతా సందడిగా ఉండేది. అంతేకాదు, ఈ సాంప్రదాయికమైన పెళ్లిల్లకి వచ్చే బంధువులు తమవంతు వాటాగా బియ్యం, పప్పులు, కూరగాయలు వెంట తెచ్చి పెళ్లివారికి అప్పగించేవారు. దశాబ్దాల కాలంలో పెళ్లిళ్లలోకి బయటి సమాజపు పోకడలు జొరబడడంతో మితిమీరిన ఆడంబరాలతో తలకు మించిన ఖర్చులు పెరిగిపోవడంతో పాటు బంధువులు కూడా పాలు పంచుకునే బియ్యం, పప్పులు తేవడం కూడా క్రమంగా బంద్ కావడంతో గ్రామంలో ఏటేటా ఉండే పెళ్లిళ్ల సందడి, ఆటా పాటా మందగించిందనే చెప్పుకోవాలి. గ్రామాలలో పేదవాడి పెళ్లి పెదవికి చేటుగా ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పుడు గ్రామాలలో పెళ్లి సందడి అంటే కలిమిగలవారి సొంత విషయంగా తయారయింది. ఒకప్పుడది సమాజం సమష్టి కార్యంగా ఉండేది.

ఇక్కడి ఆదివాసులలో పెళ్లి అనే తంతు లేకుండా దాంపత్యాన్ని నెరపే 'లోన్ ఓడియానా' (ఇల్లు జొరడం) అనే ఒక సాంప్రదాయం ఉంది. పెళ్లీడుకొచ్చిన యువతి వీలు చూసుకొని తనకు నచ్చిన, మెచ్చిన అతని ఇంట్లోకి చెప్పా చెయ్యకుండా కట్టుబట్టలతో వెళ్లి తిష్టవేస్తుంది. మెల్ల మెల్లగా ఇంటి పనుల్లో, పొలం పనుల్లో పాల్గొంటూ, క్రమంగా కుటుంబంలో భాగమైపోతుంది. ఇది పెళ్లి అనే తంతు గాని, ఎటువంటి ఆర్భాటం లేకపోవడమే గాక, ఎలాంటి అదనపు ఖర్చు కూడా లేకుండా ఇద్దరు కలిసి ఉండే (లివ్ ఇన్ పద్ధతిలాగా) పద్ధతి ఒక సంప్రదాయంగా వస్తూ ఉన్నది. ఈ సంప్రదాయానికి తెగ ఆమోదం కూడా ఉండడంతో ఏండ్లకు ఏండ్లు గడిచి వారికి పిల్లలు పుట్టి, వారు పెరిగి పెద్దవారయి తిరిగి వారి పెళ్లిళ్లయిన కూడా పెళ్లి కాని జంట అనేమాట ముందుకు రాదు. ఆదివాసులలో ఈ సంప్రదాయం అనాదిగా కొనసాగుతున్నదే అయినా, పెళ్లి అనే ఏ తంతు లేకుండానే సహజీవనం చేసే (ఇల్లు జొరడం – లివ్ ఇన్ మాదిరి) దంపతుల సంఖ్య ఒకటి రెండు దశాబ్దాల నుండి బాగా పెరిగింది.

సాధారణంగా ఇలాంటి పద్ధతిలో యువకునితో అంతకు ముందే వచ్చిన అవగాహన కారణంగానే యువతీ ఆ ఇంట్లోకెళ్లి తిష్టవేస్తుంది. లేదా కొన్నిసార్లు ఏకపక్షంగా కూడా నచ్చిన యువకుడి ఇంట్లోకి జొరబడుతుంది. అలా వెళ్లిన ఇంట్లో వాళ్లు తనను ఒప్పుక, సహకరించక పోతే తిరిగి కొద్దిరోజుల్లోనే తన ఇంటికి చేరుకుంటుంది. కానీ అలా ఒప్పుకోక తిరస్కరించిన ఘటనలు దాదాపుగా లేవనే చెప్పుకోవాలి. ఒక యువతి నచ్చి మెచ్చి ఒక ఇంట్లో జొరిందంటే, ఆ యువతిని ఆ ఇంట్లో వారు (గ్రామస్థులు సైతం) తిరిగి వాపసు పంపే ప్రసక్తే లేదు. మితిమీరిన లాంఛనాలతో సాగే సాంప్రదాయక పెళ్లిళ్లలో అతి తక్కువ ఖర్చుతో జీవనం సాగించే ఆదివాసి ప్రజానీకం, పెరిగిన ఖర్చులను భరించలేకనే ఇలాంటి పద్ధతికి మొగ్గు చూపుతున్నారనేది స్పష్టంగానే తెలుస్తున్నది. ఒకప్పుడు 20 శాతం వరకు ఉన్న ఈ కలిసి ఉండే (ఇల్లు జొర్రే) పద్ధతి ఈ ఒకటి రెండు దశాబ్దాలలో బాగా పెరిగిపోయి ఇప్పుడు 61 శాతంగా ఉంది. ఈనాడు ఈ 20 గ్రామాలలోని మొత్తం 410 ఆదివాసి కుటుంబాలలో ఉన్న 438 జంటలలో 268 జంటలు ఎలాంటి పెళ్లి అనే తంతు లేకుండానే తమ సహజీవనాన్ని కొనసాగిస్తున్నాయి. అలా అని ఇవి ఊపితే ఊడిపోయే సంబంధాలు కావు. ఒక్కటంటే ఒక్కటే తప్ప ఇలాంటి సంబంధాలను విరమించుకున్న కేసులు ఎక్కడా కనిపించలేదు. గతంలో (దశాబ్దంన్నర క్రితం) 81 శాతంగా ఉన్న లాంఛనాలతో కూడిన పెళ్లిళ్లు ఇప్పుడు 20 శాతానికి తగ్గాయి. ఒకప్పుడు ఇల్లు జొర్రినా, కల్లుతాగి ఒప్పందం కుదిర్చినా, యువతిని బలవంతంగా ఎత్తుకొచ్చినా, ఇల్లరికంగా ఉన్నా కూడా కనీసం రెండు మూడేండ్లు గడిచిన తర్వాతనైనా ఎప్పుడో ఒకప్పుడు వీలు చూసుకుని పెళ్లి అనే తతంగాన్ని నడిపేవారు. ఇప్పుడు ఇల్లరికం పోయి ఏండ్లకు ఏండ్లు గడిచి వారికి పిల్లలు పుట్టి పెద్దవారయిన కూడా పెళ్లి మాటే లేదు.

మహిళల పునర్వివాహాలపై అర్ధ వలస – అర్ధ భూస్వామ్య వ్యవస్థలోని ప్రతిబంధకాలేవి కూడా ప్రకృతి నియమంగా పునరుత్పత్తికి అత్యంత ప్రాధాన్యతనిచ్చే ఆదివాసి తెగ సమాజాన్ని ఏమాత్రం ప్రభావితం చేయకపోవడంతో ఆదివాసి గ్రామాలలో గతంలో లాగానే పునర్వివాహాలనేవి యథేచ్ఛగా సాగుతున్నాయి. చంటి పిల్లలను సైతం చంకలో ఎత్తుకుని పెళ్లి మండపంలో కూర్చున్న ఆదివాసి మహిళల మొఖాలలో ఏ బిడియం కనిపించదు.

ఆదివాసులకున్న తెగ సంప్రదాయాలే వారిని ఇంతకాలం శాసించాయనేది వాస్తవం. గత మూడు నాలుగు దశాబ్దాలుగా ఆదివాసుల సంప్రదాయాలలో, వారి ఆచార వ్యవహారాలలో అనేక మార్పులు క్రమంగా చోటు చేసుకుంటున్నప్పటికీ, మౌలికంగా వారి తెగ సంప్రదాయాలలో మాత్రం పెద్ద మార్పులేమి జరగలేదు. బస్తర్‌లోని ఆదివాసులలో పెళ్లికి ముందు యువతీ – యువకుల మధ్యన శారీరక సంబంధాలుండడాన్ని ఇక్కడి ఆదివాసి సమాజం తప్పుగా ఎంచడం లేదు. ఈ సంబంధాలను సాధారణ విషయంగానే పరిగణిస్తారు. మూడు నాలుగు దశాబ్దాల క్రితం వరకు గోటుల్ సంస్కృతిలో భాగంగా కొనసాగిన ఈ సంప్రదాయం నేడు గోటుల్ సంస్కృతి క్రమంగా అంతరించిపోయినప్పటికీ, (గోటుల్ వ్యవస్థ మాడ్‌లో తప్ప ఎక్కడా లేదు. ఆ గోటుల్ కూడా నేడు ఆట, పాటకే పరిమితమైంది.) నేటికి యువతీ యువకుల మధ్యన వివాహ పూర్వ సంబంధాలు కొనసాగడాన్ని ఇక్కడి సమాజం తప్పుగా భావించడం లేదు. బస్తర్‌లో జరిగే అనేక కర్సడ్, జాతరలలో ఇది ఇంకా కొనసాగుతూనే ఉంది. అలాగే వివాహ పూర్వ సంబంధాలనేవి ఆపై జరిగే పెళ్లిళ్లకు కూడా ప్రతిబంధకంగా ఏమి

లేవు. కర్సడ్, జాతరలలో సామూహికంగా నృత్యం (ఎందనా) చేయడం సాంప్రదాయంగా కొనసాగుతున్నది. రాత్రంతా నృత్యం చేస్తూ, ఏ నడిరాత్రికో నచ్చిన వాళ్లతో వెళ్లిపోతూ ఉంటారు. ఆదివాసులలో వివాహానికి పూర్వం లైంగిక స్వేచ్ఛ ఉన్నప్పటికీ, వివాహ అనంతరం అది పూర్తిగా నిషేధం. కుటుంబ సమేతంగా గాక విడిగా ఎవరైనా వివాహితులు జాతరలో ఎగరడాని (నృత్యం) కనిపోతే వారిని అనుమానంగానే చూస్తారు. వివాహ పూర్వ సంబంధాలను విచ్చలవిడి సంబంధాలుగా (ఫ్రీ సెక్స్) భావించాల్సిన అవసరం లేదు. నచ్చినవాళ్లే జంటలు కడతారు.

ఆదివాసుల (గోండుల) తాత్విక చింతన ప్రకారం, ప్రకృతిలో నున్న అన్ని ప్రాణుల లాగే మనిషి కూడా ఒక ప్రాణియే. ప్రాణులలో చిన్నవి పెద్దవి అనేవి కూడా ఉన్నాయి. ప్రకృతిలోని పంచభూతాలైన నీరు, మట్టి, గాలి, ఎండ, శబ్దం అనే శక్తులు సమ్మేళనం చెందడం ద్వారా ప్రాణి నిర్మితమవుతుంది. దానినే పుట్టుక అంటారు. ఎప్పుడైతే ఈ శక్తులు విఘటన చెందుతాయో అప్పుడు ప్రాణిలోని ప్రకృతి శక్తులన్నీ తిరిగి ప్రకృతిలో కలిసిపోతాయి. దానినే మరణం అంటారని బహుళ ప్రాచుర్యంలో ఉంది. ఆదివాసిల తాత్విక చింతనలో మనిషి దేహానికే తప్ప ఆత్మకు ఏ ప్రాధాన్యత లేదు. కాని, వారి భౌతిక జీవనంలో ప్రేతాత్మ మాత్రం ఎక్కడలేని ప్రాముఖ్యతను సంతరించుకుంది.

ఒకవైపు జనతన సర్కార్లు ఏర్పడి ఉత్పత్తిలో భౌతిక కార్యాచరణే కొనసాగుతున్నప్పటికీ వారి సామాజిక జీవనాన్ని మాత్రం ఇంకా వారి తెగ కట్టుబాట్లు, మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలే శాసిస్తున్నాయి. నరబలుల విషయంలో ఒకప్పుడు ప్రపంచంలోనే ఆఫ్రికా తర్వాత రెండవ స్థానంలో, ఆసియా ఖండంలో మొదటి స్థానంలో ఉన్న బస్తర్‌లో నేడు మావోయిస్టు ఉద్యమ ప్రభావంతో చాలా వరకు తగ్గుముఖం పట్టినా, చెదురు మదురుగానైనా ఇంకా అక్కడక్కడ జరుగుతూనే (పంటలో ఫలసాయం ఎక్కువగా రావాలని) ఉన్నాయి. గ్రామాలలో ఏ అసాధారణ, అకాల మరణానికైనా అనుమానాలనేవి పెరిగి పెరిగి భూత వైద్యుల ప్రేరేపణలతో, చేతబడి చేశారనే దాంతో హత్యల దాకా వెళుతున్నాయి. 2015 ఆఖరి నెలల్లో బీజాపూర్‌లోని జాటలూర్ ఏరియాలో నా పర్యటన సందర్భంగా నెల రోజులలో స్థానిక కార్యకర్తల ముందుకు వచ్చిన మొత్తం 8 కేసులలో 5 కేసులు మంత్రాల పేరుతో హత్యలకు సంబంధించినవే. ఒక కేసులోనైతే ఏకంగా 15 సంవత్సరాలున్న మనుమడే తన తల్లిని మంత్రాలతో చంపేశాడనేదాంతో 60 సంవత్సరాల ముసలి తాతయ్యను గొడ్డలితో నరికి చంపేశాడు. ఒక్కో సారి ఒక హత్యకు ముందు లేదా హత్య జరిగిన తర్వాత గ్రామం మొత్తం ఉన్మాదంతో ఎవరు చెప్పినా వినలేని స్థితిలో, ఆఖరికి స్థానిక కార్యకర్తలకు కూడా చాలా రోజుల వరకు ఈ విషయం తెలియకుండా దాచి ఉంచే పరిస్థితి కొనసాగుతున్నది.

అనేక గ్రామాలలో జనతన సర్కార్లు కొంత మంది పెత్తందార్లనబడే వారి నుండి స్వాధీనం చేసుకున్న భూములను పంపకాలు చేసినా, చాలా కుటుంబాలు కూడా చేతబడి చేస్తారనే భయంతో వాటిని సాగుచేయడానికి పూనుకోవడం లేదు. ఈ విషయాలలో సంఘ నాయకులు కూడా మినహాయింపు కాదు. అలాంటి కారణాలతో అనేక భూములు సంవత్సరాలుగా అలాగే పడావు పడి ఉన్నాయి. అవికాస్త మెరుగైన భూములే అయినా వాటిని కాదని, శ్రమకోర్చి అయినా అడవిని నరికి భూమిని సాగులోకి తేవడానికే మొదటి ప్రాధాన్యతనిస్తారు.

ఆదివాసులు ఎవరూ కూడా హిందువులు కారు. భారతదేశంలోని మిగతా అన్ని ఆదివాసి సమూహాలలాగే బస్తర్‌లోని ఆదివాసులెవరూ హిందువులు కారనేది స్పష్టం. అయినా జనగణన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులను హిందువులుగానే లెక్కిస్తున్నాయి. ఆదివాసులపై ఎక్కుపెట్టబడిన దాడిలో మత మార్పిడిలు కూడా ఒకటి. ప్రభుత్వాల దన్నుతో ఇవి రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. మాడ్‌లోని రామకృష్ణ మిషన్ సహా ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ప్రార్థన చేయించకుండా పిల్లలకు అన్నం పెట్టడంలేదు. ఎక్కువ శాతం మత మార్పిడిలలో బాహ్యపరమైన ఒత్తిడులు, ప్రలోభాలే ప్రధాన కారణాలై నప్పటికీ, ఆదివాసి సమాజంలో నిరంతరం జరుగుతున్న పరిణామ క్రమ ఘర్షణలను కూడా పరిగణనలోకి తీసుకోక తప్పదు. అతి ప్రాచీన కాలంలో మొదలై ఎటువంటి మార్పులకు గురికాని మూఢ ఆచారాలు, విశ్వాసాలు, తెగ కట్టుబాట్లు ఇప్పుడు తమ పురోగతినే అడ్డుకుంటూ, వెగటు పుట్టించే స్థితిలో ఇక వాటిని ఏమాత్రం భరించలేని కొంత మంది ప్రేమ, దయ, సేవ లాంటి పేర్లతో చేరదీసే (ప్రాణాంతక వ్యాధులకు గురైన అమాయక ఆదివాసులను మిషనరీ హాస్పిటల్స్‌లో ట్రీట్‌మెంట్ చేయించడం – కొన్ని ఆదివాసి పండుగలప్పుడు ఆదివాసులు నల్ల కోడిపిల్లను చంపి వెగటైన కషాయాన్ని వండి తాగిస్తారు) క్రైస్తవ మతంలో చేరుతుంటే, మరికొంత మంది వ్యవసాయంపై కేంద్రీకరిస్తూ సుస్థిర వ్యవసాయంలోకి మారుతున్న క్రమంలో ఉత్పత్తి ప్రక్రియలో అడ్డంకిగా తయారైన తెగ కట్టుబాట్లను, అంధ విశ్వాసాలను ధిక్కరిస్తూ ఇతర ప్రత్యామ్నాయాలేవి లేక హిందూ మతం వైపుగా పరుగెత్తుతున్నారు. మతం మారిన వారిని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆదివాసులుగా గుర్తించడం లేదు. మత మార్పిడిల విషయంలో క్రైస్తవం బుజ్జగింపు వైఖరిని అవలంబిస్తే హిందూ మతమేమో దురుసుగా ప్రవర్తిస్తున్నది.

ఎప్పుడైనా సామాజిక విప్లవాలే అప్పటి వరకు ఉత్పత్తికి, సామాజిక పరివర్తనకు అడ్డంకిగా ఉన్న ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను సమూలంగా మార్చడం ద్వారానే సమాజం ముందుకు వెళుతుందనే దాంట్లో ఎవరికి సందేహం లేదు. అయితే సమాజంలో మారుతున్న పరిస్థితులకనుగుణంగా తెగలలో సంస్కరణోద్యమాలు (భక్తి ఉద్యమాల లాంటివి) జరగకుంటే అన్య మతాల ప్రభావాలకు అమాయకులు లోనుగాక తప్పదు. నేడు బస్తర్‌లో జరుగుతున్నదదే.

బస్తర్‌లోని ఆదివాసి ప్రజానీకం ఒకవైపు ప్రకృతి నియమాలను అర్థం చేసుకుని దాని నుండి తమ అవసరాలనెన్నింటినో తీర్చుకుంటున్నప్పటికీ, జనతన సర్కార్ల నేతృత్వంలో ఉత్పత్తి అనే సామూహిక భౌతిక కార్యాచరణలో పాల్గొంటున్నప్పటికీ, ప్రకృతిని, భౌతిక స్థితిగతులను అర్థం చేసుకోవడంలో శాస్త్రీయ దృక్పథం కొరవడిన కారణంగా సంకుచితత్వానికి లోనవుతూ అజ్ఞానంతో, భయంతో మూఢ నమ్మకాల నుండి, అంధ విశ్వాసాల నుండి, తెగ కట్టుబాట్ల నుండి బయట పడలేకపోతున్నారు. గత మూడు దశాబ్దాలకు పైగా భూమి, భుక్తి, విముక్తి కోసం, జల్ జంగల్ జమీన్‌పై సర్వాధికారాలు మావేనంటూ ఉద్యమిస్తున్న నూతన శక్తులు కాలం చెల్లిన తెగ కట్టుబాట్లను తెంచకుండా, వాటిని సంస్కరించకుండా, తమ ఉనికికే ప్రమాదంగా తయారైన కార్పొరేట్ ఉగ్రవాదాన్ని ఎదిరిస్తూ స్వయం ప్రతిపత్తి దిశగా సాగే సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక నూతన ప్రజాస్వామిక విప్లవంలో పురోగతిని సాధించలేరు.

(అయిపోయింది)

(రచయిత సామాజిక కార్యకర్త)

(బస్తర్‌లో భూసంబంధాల పై వచ్చిన ఈ వ్యాసంలోని 1వ భాగం నవంబర్ 2017లో, 2వ భాగం జనవరి 2018, 3వ భాగం జూన్ 2018లో ప్రచురించాం. 4, 5 భాగాలు రాకుండానే ఈ భాగం 6 భాగంగా మాకు పోస్ట్‌లో అందింది. దీన్నే నాలుగో భాగంగా అచ్చు వేస్తున్నాం. – సం.) వీ

మన్యంలో ఆకుపచ్చ సూర్యోదయం

- ఎం. రత్నమాల


చరిత్ర రచనా విధానంలో రెండు పద్ధతులు. ఒకటి గతంలోని వాస్తవ ఘటనల కూర్పు (ఆబ్జెక్టివ్ హిస్టరీ). రెండోది గత సంఘటనలకు రచయిత తన ఊహాజనితమైన కథనాలు చేర్చి కూర్చడం (సబ్జెక్టివ్ హిస్టరీ). ఇక ఇది చరిత్ర రచన మాత్రమే కాకుండా చారిత్రక నవలయితే ఇక చెప్పనక్కరలే. అత్యధికంగా అది రచయిత ఊహాజనిత కథనంగానే ఉంటుంది. ఇప్పటిదాకా మనకందుబాటులో ఉన్న చరిత్ర పుస్తకాలు అత్యధికం సబ్జెక్టివ్ చరిత్ర రచనలే. ఇటీవలి కాలంలో రొమిల్లా థాపర్ వంటి మార్క్సిస్టు చరిత్రకారులు ఆబ్జెక్టివ్ చరిత్ర రచనా విధానం అనుసరిస్తున్నారు. సబ్జెక్టివ్ చరిత్ర కంటే ఆబ్జెక్టివ్ చరిత్ర రచన శ్రమతో కూడినది. ఎందుకంటే గత సంఘటన వివరాలు అంత సులభంగా లభ్యం కావు. ఎందుకంటే మనకు దేన్నయినా లిఖిత పూర్వకంగా నమోదు చేసుకునే అలవాటు తక్కువ.

ఇక ప్రభుత్వ గెజిట్‌లు వంటి వాటి నుంచి సమాచారం పాలకుల దృష్టికోణం నుంచి నమోదై ఉంటుంది. ప్రజలే చరిత్ర నిర్మాతలు అన్న దానికి పాలకుల దృష్టిలో తావుండదు – అందుకే ఆబ్జెక్టివ్ చరిత్ర రచన ఎంతో శ్రమతో కూడుకున్నది. అల్లూరి సీతారామరాజుగా ప్రచారంలో ఉన్న శ్రీరామరాజు చరిత్రను, బ్రిటిష్ వలస వాదులపై శ్రీరామరాజు ఆదివాసులతో కలిసి చేసిన మన్యం పోరాట చరిత్రను గోపరాజు నారాయణరావు ఎంతో శ్రమించి, ఆయా ప్రాంతాలు పర్యటించి ఆనాడు మన్యం పోరాటంలో పాల్గొన్న వారి నుంచి, ఆ పోరాట కాలంలో జీవించిన వారి నుంచి, ఆనాటి పత్రికల నుంచి ఇంకా అనేక పద్ధతుల ద్వారా వివరాలు సేకరించి రాసిన చరిత్ర (ఆబ్జెక్టివ్ చరిత్ర) చారిత్రక నవల 'ఆకుపచ్చ సూర్యోదయం'. ఆకుపచ్చ పేరు ఈ రచనకు సముచితంగా ఉంది. అడవి రాత్రి చీకట్లో నల్లగా ఉంటుంది. సూర్యోదయంతో అడవి చెట్లపై కిరణాలు ప్రసరించగానే అడివంతా ఆకుపచ్చగా విరాజిల్లుతూ కన్పిస్తుంది.

విభాత సంధ్యలు పుస్తకంలో సి.వి. సుబ్బారావు రాసిన తెలంగాణ గిరిజన పోరాట చరిత్ర వ్యాసంలో (ఈ పుస్తక సంపాదకుడు కూడా సి.వి. సుబ్బారావే) చరిత్ర అంటే ఏమిటి అంటూ చెప్పిన విషయాలు ఆకుపచ్చ సూర్యోదయం రచనకు సరిగ్గా సరిపోతుంది. చరిత్ర అంటే ఏమిటి – ఈ ప్రశ్నకి అందరూ ఆమోదించే సమాధానం దొరకడం కష్టమే. సమాజంలో ఒకవర్గం మరొక వర్గ ఆధిపత్యం కొనసాగుతున్నంత కాలం గడచిన సంఘటన మీద ఎవరి కథనం వారికుంటుంది. ఎవరి చరిత్ర వారికుంటుంది. అయితే అందరూ చరిత్రగా ఆమోదించే కథనం అంటూ కూడా ఒకటుంటుంది.

సాధారణంగా అది గడచిన సంఘర్షణల్లో గెలిచిన వాళ్ల కథనం అవుతుంది. చరిత్ర ఎప్పుడూ గెలుపొందిన వాళ్ల కథనం, వాళ్ల సమాచారం, తెలిసో, తెలియకో అందరి మనసుల మీద పనిచేస్తాయి. చరిత్రకారుల రచనా పద్ధతిని కూడా ప్రభావితం చేస్తాయి. ఈ సమస్యను అధిగమించి చరిత్రను తెలుసుకోవడం కష్టం. ఏ కథనం చరిత్రగా ప్రచారంలో ఉందో ఆ కథనం, ఆ దృక్పథం మన చరిత్రను మనం తెలుసుకోవడానికి అడ్డంకి అవుతుంది. పరిశోధనకు సమాచారం కూడా ఒక సమస్య, అధ్యయనానికి లభించే సమాచారం అంతా సాధారణంగా గతంలో గెలుపొందిన వాళ్లు మిగిల్చిన సమాచారమే దృక్పథం, లభ్యమయ్యే సమాచారం విధించే పరిమితులను అధిగమించి చరిత్ర రచనను సాగించడం కష్టమవుతుంది.

మన చరిత్రకారులు ఇటీవల కాలంలోనే ఈ సమస్యను గుర్తించి, అధిగమించే ప్రయత్నాలు ఆరంభించారు. (విభాత సంధ్యలు సంపాదకుడు సి.వి. సుబ్బారావు పేజీ నెం 56) తెలంగాణ గిరిజన పోరాట చరిత్ర వ్యాసం – రచయిత సి.వి. సుబ్బారావు – ఇటువంటి ప్రయత్నమే గోపరాజు



ఆకుపచ్చ సూర్యోదయం– మన్యం వీరుడు అల్లూరి గాథ – చారిత్రక నవల – డా. గోపరాజు నారాయణరావు, 296 పేజీలు, 1/4 క్రౌన్, రు. 300, ప్రతులకు: డా. జి. నారాయణ రావు, జనప్రియ ఉటోపియా, 3వ బ్లాక్, నాల్గవ ఫ్లోర్, ఫ్లాట్ 34006, అత్తాపూర్, హైదరాబాద్, తెలంగాణ. ఫోన్: 9849325634

నారాయణ రావు రాసిన చారిత్రక నవల ఆకుపచ్చ సూర్యోదయం. మన్యం పోరాటం, శ్రీరామరాజు జీవితం గురించిన కట్టు కథల చరిత్రను సవరించి వాస్తవ ఘటనలను వెలుగులోకి తెచ్చారు 'ఆకుపచ్చ సూర్యోదయంలో' గోపరాజు నారాయణ రావు. ఇప్పటి దాకా శ్రీరామరాజు అల్లూరి సీతారామరాజు. శ్రీరామరాజు స్నేహితుడి చెల్లెలు సీత శ్రీరామరాజును ఇష్టపడింది. ఆమె అన్న ఈ విషయం శ్రీరామరాజుకు చెప్పి తన చెల్లెల్ని పెళ్లి చేసుకొమ్మని కోరాడనీ, దేశమాతకు అంకితమైన తన జీవితంలో పెళ్లికి తావులేదని తిరస్కరించడంతో – సీతకు కుటుంబ సభ్యులు వేరే పెళ్లి నిశ్చయించడంతో ఆ పెళ్లి ఇష్టంలేని సీత చనిపోయిందనీ అందుకే శ్రీరామరాజు తన పేరు సీతారామరాజుగా మార్చుకున్నాడని కొందరు చరిత్ర కారులు తమ పుస్తకాల్లో రాశారు. నిజానికి సీత శ్రీరామరాజు అన్నా చెల్లెలు, ఒక తల్లి కడుపున రక్తం పంచుకు పుట్టిన బిడ్డలు. శ్రీరామరాజు పేరునే కాదు శ్రీరామరాజు ముఖ్య అనుచరుడు గంటన్న పేరును కూడా గంటన అని రాశారు. ఊర్లో పురుటి కందులు వరుసగా చనిపోతూ ఉంటే శిశువు కళ్లకు గంతలు కట్టి శిశువు బతకాలని దేవతలకు మొక్కుకుంటారని అట్లా కళ్లకు గంతలు కట్టిన పిల్లలకి గంటన్న అని పేరు పెడతారని గంటన్న పేరు పెట్టడంలోని ఆదివాసి ఆచారాన్ని తెలుసుకుని వివరించారు ఈ పుస్తక రచయిత. ఇంతకు పూర్వం రచనలో శ్రీరామరాజు పేరేకాదు గంటన్న మొదలైన పేర్లు కొన్ని ప్రాంతాల పేర్లు వావి వరసలు జరిగిన సంఘటనలను ఇట్లా తమ స్వీయాత్మక దృష్టితో శ్రీరామరాజు జీవితం, మన్యం పోరాట చరిత్రలో ఎన్నో మార్పులు చేర్పులు చేసిన చరిత్ర రచనలే మనకు ఇప్పటిదాకా అందుబాటులో ఉన్నాయి. మొదటి సారిగా గోపరాజు నారాయణ రావు విశేష పరిశోధన చేసి 'ఆకుపచ్చ సూర్యోదయాన్ని' మనకందించారు. శ్రీరామరాజు చెల్లెలు సీత ఫొటో, తల్లి సూర్య నారాయణమ్మ ఫొటో, బాల్యంలో శ్రీరామరాజు ఫొటో, సోదరుడు శ్రీరామరాజు స్వంత దస్తూరితో రాసిన లేఖలు – గంటన్న శ్రీరామరాజు సమాధుల ఫొటోలు. శ్రీరామరాజు ఆశ్రయమిచ్చిన చిటికెల బాస్కర నాయుడు ఇంకా రామరాజుతో కలిసి పనిచేసిన అనేక మంది ఫొటోలు కూడా ఈ పుస్తకంలో పొందుపరిచారు.

ప్రజలే చరిత్ర నిర్మాతలు అయితే ఉద్యమాలకు, పోరాటాలకు నాయకుడు అవసరమే. ఆ నాయకుల్ని పోరాటాలు, ఉద్యమాలు, ప్రజలే తయారు చేసుకుంటారు అన్న ఈ పుస్తక రచయిత అనేక సందర్భాల్లో విశదీకరించారు. ఉదాహరణకి గత చరిత్ర పుస్తకాల్లో చెప్పినట్లు శ్రీరామరాజు తనకు తానుగా మన్యం వెళ్లి ఆదివాసుల్ని పోరాటానికి కూడాగట్టలేదు. ఆదివాసులే గతంలో బ్రిటిష్ వలసవాదుల మీద అనేక పితూరీలు చేసిన వాళ్లు గంటన్న పడాలు, మల్లుదొర మొదలైన వాళ్లు కృష్ణదేవిపేట శివార్లలో రామాలయం పక్కన గోదావరి ఒడ్డున కృష్ణదేవిపేట ప్రజలు శ్రీరామరాజుకు నిర్మించి ఇచ్చిన (శ్రీరామ విజయనగరం) ఆశ్రమంలో ఉన్న శ్రీరామరాజు దగ్గరకి వచ్చి తమ సమస్యలు బాస్టియన్ (డిప్యూటి తహసీల్దార్) తమను పెడుతున్న బాధలు చెప్పి తమకు సహాయం చేయాల్సిందిగా కోరుతారు.

'అందరిదీ ఒకే బాధ సామీ! ఓ గూటి పక్షులమే. కానీ మాలాంటోళ్లకి కష్టం సుఖం చెప్పుకోవడానికి మనిషే దొరకడం లేదు సామీ! తమరి దృష్టికి వచ్చే ఉండాలి. మా కొండోళ్లు ఇన్ని కష్టాలు గతంలో ఎన్నడూ పడలేదు. ఎనుక గొయ్యి ముందు నుయ్యి సామీ! తమతో మాట్లాడి సహాయం తీసుకుందామని వచ్చాం దయ చూపాలి' అన్నాడు పడాలు. ఈ సమస్త కష్టాలకి డిప్యూటి తహసీల్దారు బెస్టియన్ కారణం స్వామీ కొండవాళ్లని జంతువుల్లా చూస్తున్నాడు. జంతువుల్లా వేటాడుతున్నాడు స్వామీ! ఎర్రబుట్టలోల్లు అంటే పోలీసులు ఎక్కడైనా ఒక్కటే బేస్టిన్ లాంటి వాడు మరోచోట కనిపించడు. మిగిలిన వాళ్లకి అంతో ఇంతో పాపభీతి ఉంటుంది. కానీ వాళ్లెవరికీ కొండవాడంటే జాలీ దయ లేనేలేవు' చెప్పాడు గంతన్న.

'సామీ! బేస్టిన్ మనిషి కాదు. ఆడు ఒళ్లంతా రక్తాలొచ్చేటట్లు దెబ్బలు కొట్టి నూరిన పచ్చి మిరపకాయల ముద్ద మొగాళ్లయితే ముడ్డీలో కుక్కిస్తాడు. ఆడోళ్లయితే కొంగులూడదీసి గుండెల మీద కూడా రాస్తాడు సామీ! ఒక్క మాట ఇనండి పితూరీ' అంటూ బేస్టిను మీద అంతా బరిసెలు బాణాలు పట్టుకుని తిరుగబడొచ్చు. నాలుగు పోలీసు స్టేషన్లు తగులబెట్టొచ్చు. ఓ నలుగుర్ని చంపొచ్చు. ఓ పది మంది కొండోళ్లు ఉరికంబాలు ఎక్కొచ్చు. ఓ పాతిక మంది రాజమండ్రి జైల్లో జీవితకాలం మగ్గడానికి పోవచ్చు. మా తాతల కాలం నుంచి ఇక్కడ పితూరీలు ఉన్నాయి. జరిగింది అదే. అసలు పితూరీలతో కొండోళ్ల కష్టాలు తీరవని లాగరాయి పితూరీతోనే తేలిపోయింది. అవి తాటాకు మంటలైనా, కొద్దిసేపే మండే ఆ మంటలు మళ్లీ మమ్మల్నే కాల్చేస్తోంది. పితూరీలు ఇక చాలు వాటి ఊసు వద్దు. లాగరాయి పితూరీ రోజులకంటే ఇవాళ పోలీసుల బలం పదిరెట్లు. ఆ సంగతి అర్థం కావాల! ఇప్పుడు ముప్పు కొండోళ్లకే కాదు కొండలకి కూడా. ఈ అడవులకి కూడా. ఈ లోయలకి కూడా. ఇది కూడా ఆలోచించాలి సామీ! రోడ్డతో' ఈ నాశనం మొదలైపోయింది. మల్లుదొర 'పోలీసుల నుంచి మమ్మల్ని కాపాడండి. రోడ్ల నుంచి మన్యాన్ని రక్షించడానికి సాయపడండి' అని మన్యం వాసులు శ్రీరామరాజుని ఆహ్వానించారు. (పేజీలు 72,73) ప్రజలే చరిత్ర నిర్మాతలు అన్న విషయానికి ప్రాధాన్యతనిస్తూ అల్లూరి శ్రీరామరాజు విశిష్టతను తక్కువేమి చేయలేదు. మన్యం పోరాటానికి మన్యం వాసులతో కలిసి పోరాటం చేయడంలో ఆయన కార్యదక్షతా సంయమనం మన్యం పోరాట మైదాన ప్రాంతాల పోరాటాలను అనుసందానించడంలో మెలకువ ఆకుపచ్చ సూర్యోదయంలో గోపరాజు నారాయణ రావు గొప్పగా చిత్రించారు.

అంతేకాదు గాంధీ గురించి జాతీయ పోరాటంపై గ్రామాల్లో మన్యంలో ప్రజల అభిప్రాయాలు కూడా ఈ పుస్తకంలో పొందుపరిచారు. చౌరాచౌరీ ఘటనల పట్ల గాంధీ నిరసన సహాయ నిరాకరణ, భగత్‌సింగ్ ఉరిశిక్షపై రౌండ్ టేబుల్ సమావేశం గాంధీ మౌనం పట్ల రచ్చబండ వద్ద ప్రజలు విమర్శనాత్మకంగా మాట్లాడ్డం శ్రీరామరాజు సిక్కు యువకుని వేశంలో వెళ్లి గాంధీని ప్రశ్నలు వేయబోతే కాంగ్రెస్ నాయకులు అడ్డుకోగా గాంధీ వారిని వారించకపోవడం మొదలైన నిజాలు కూడా ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి.

ఇటువంటి ఎన్నో విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. అన్నీ చెప్పడం అంటే చాలా పెద్దగా అవుతుంది కనుక శ్రీరామరాజు, మన్య పోరాట వాస్తవ చరిత్ర తెలుసుకోవాలంటే ఆకుపచ్చ సూర్యోదయం తప్పక చదవాల్సిన పుస్తకం. అంతేకాదు ఈ పుస్తకంలోని వాస్తవ ఘటనలు పరిశీలించి ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంది. ట్యాంకుబండ్ మీద శ్రీరామరాజు విగ్రహంపై ఉన్న సీతారామరాజు అన్న పేరును మార్చాలి. పాఠ్యాంశంలో కూడా ఈ విధమైన సవరణలు చేయాలి. అసలు ఎప్పటి నుంచి శ్రీరామరాజు సీతారామరాజు అయ్యిండో కూడా కనీసం పుస్తకం ముందు మాటలోనైనా చెప్పాల్సి ఉండే. ఎందుకంటే 1923కి ముందు గెజిట్‌లలో, పత్రికల వార్తలో కూడా శ్రీరామరాజు అని ఉందని, ఆ తర్వాతే వార్తల్లో, పుస్తకాల్లో సీతారామరాజు అని రాయడం మొదలైందని అనంతరం కూడా అంతకు ముందు రాసిన పుస్తకంలో సీతారామరాజనే రాశానని అన్నారు. ఇక మన్యం ప్రజలు మాట్లాడిన భాష తెలుగైనా వాళ్లు వాడుక భాషలో ఉంటే బావుండేది అక్కడ కూడా. కొంత గ్రాంథిక పదాల్ని వాడా. రచయిత ఎంతో శ్రమించి సేకరించి రాసిన ఈ చారిత్రక నవల 'ఆకుపచ్చ సూర్యోదయం' ఎంతో గొప్ప రచన.

(రచయిత విరసం సభ్యురాలు)

వీ

(... 4వ పేజీ తరువాయి)

– చైనా పతనం కాకపోగా, నిలదొక్కుకొని ముందుకు వస్తున్నది. కళ్లముందు కనపడే విషయం ఇదీ: విభేదాలున్నా వియత్నాం, క్యూబా, ఉత్తర కొరియా దేశాలు, ఆయా దేశాల పార్టీలు చైనాలో సోషలిస్టు నిర్మాణం నుంచి, చైనాపార్టీ నుంచి నేర్చుకొని, అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ధిక్కరించి నిలబడ్డాయి. గ్లోబలైజేషన్ పేరిట అమెరికా – ఐఎంఎఫ్ రుద్దుతున్న మూస నమూనాని కాదని, స్వతంత్ర ఆర్థిక వ్యవస్థలను నిర్మించుకుంటున్నాయి. ఆ దేశాలే కాక, చైనా అండతో వెనిజులా వంటి దక్షిణ అమెరికా దేశాలు, ఇరాన్, ఇరాక్, సిరియా వంటివీ అమెరికాను ధిక్కరించి నిలదొక్కుకో గలిగాయి. ఆఫ్రికా ముందుకు సాగుతున్నది. దక్షిణాసియా దేశాలు (ఇండియా తప్ప) చైనాతో చేతులు కలిపి నడుస్తున్నాయి. ఆగ్నేయాసియాలో సైతం అమెరికా, జపాన్‌ల ఆధిపత్యం సడలి పోతున్నది. డాలర్‌ని ఐఎంఎఫ్‌ని కాదని ప్రత్యామ్నాయ ఫైనాన్స్ వ్యవస్థ ఏర్పడింది. ఇవన్నీ కళ్లముందు కనపడుతున్నవే – చూడనిరాకరిస్తే తప్ప. విప్లవాలలో త్యాగం పేరిట, పిడివాదంతో వ్యక్తులు బలైపోతున్నట్టే, పిడివాద మార్క్సిజంతో రష్యా, తూర్పు యూరప్ సోషలిస్టు దేశాలు దెబ్బతిన్నాయి. రష్యా అనుసరించిన సోషల్ సామ్రాజ్యవాద విధానాలు ఆయాదేశాల పతనాన్ని అనివార్యం చేశాయి. కాగా విభిన్నమైన రాజకీయ–ఆర్థిక వ్యూహం–ఎత్తుగడలతో చైనా నిలదొక్కుకున్నది.

మూడవ ప్రపంచ దేశాలకు ఒకప్పుడు ఆశాజ్యోతిగా ఉండిన రష్యా స్వభావం ఆ తర్వాతి దశలో మారిపోయింది. 1980–90 ప్రాంతంలో అనేకసార్లు సుమారు 130–140 దేశాలు ఐక్యరాజ్యసమితిలో నాటి రష్యాను, వారి అగ్రరాజ్య దురాక్రమణ విధానాలను ఖండిస్తూ తీర్మానాలను ఆమోదించాయి. వారి సోషల్ సామ్రాజ్యవాద విధానాలు ఆ విధంగా ప్రపంచ వ్యాప్తంగా ఖండనకు గురైనాయి. నేటి చైనా పరిస్థితి ఆ విధంగా లేదు. దాదాపు అదే స్థాయిలో, చైనా సహాయ సహకారాలు పొందుతూ, హర్షిస్తున్నాయి. అనేక దేశాలు (70) చైనా ప్రతిపాదించిన బోర్డర్–రోడ్ ఇనీషియేటివ్ అనే భారీ ప్రాజెక్టులో పాల్గొని, అమెరికాని కాదనే గ్లోబలైజేషన్‌కి నాంది పలుకుతున్నాయి. అశాస్త్రీయ సిద్ధాంతాలతో, స్వీయ మానసిక దృక్పథంతో చైనాని సోషల్ సామ్రాజ్యవాది అని నిందించడం తప్పు. ఇవాళ అమెరికా అగ్ర రాజ్యాన్ని సవాల్ చేస్తున్న దేశాలకు, శక్తులకు అండదండగా ఉంది చైనా; ఆ దేశంలో లోపాలు లేవని, అక్కడ కమ్యూనిజం ఏర్పడి పోయిందని ఎవ్వరూ అనడం లేదు. చైనాలో సోషలిజం విజయం అంత తేలిక కాదు; దానికోసం సుదీర్ఘ పోరాటం చేయాల్సివస్తుందని, దానికి అనేక దశాబ్దాలు, శతాబ్దాలు కూడా పట్టవచ్చునని మావో చెప్పారు. అనేక ఆర్థిక–రాజకీయ పోరాటాల క్రమంలోనే చైనా పురోగమిస్తున్నది. రష్యాలో సోషలిజం పతనం క్రమంలో అక్కడ ప్రతిఘటనే లేదు; చైనాలో ప్రజలు అలా అచేతనంగా లేరు. చైనా పార్టీ నాయకత్వం కూడా పరిస్థితి లోపరహితంగా ఉందనే అహంకారంతో లేదు. అనేక జాతీయ, అంతర్జాతీయ పరిణామాల, వైరుధ్యాల పూర్వరంగంలో అక్కడ జిన్‌పింగ్ నాయకత్వం ముందుకు వచ్చింది. చర్చా వ్యాసం ముగింపులో ప్రొఫెసర్ అల్కా ఆచార్య ఉటంకింపుని అర్థవంతంగా ప్రస్తావించారు: 'మావో మమ్మల్ని విముక్తి చేశారు. డెంగ్ మమ్మల్ని సంపన్నులుగా మార్చారు. ఇప్పుడు జిన్‌పింగ్, పార్టీ చైనాను శక్తివంతంగా రూపొందిస్తారు.' చైనా స్తబ్దంగా లేదని, పురోగమిస్తున్నదని అర్థం చేసుకోవడానికి అక్కడి ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. స్వీయ మానసిక దృష్టితో ఇక్కడ మనం తీర్పులు చెప్పేస్తే సరిపోదు. రష్యాకీ, చైనాకీ ఉన్న ఈ తేడాని కూడా చూడాలి.

- ఎం. సజయ

హైదరాబాద్

వీ

ఉద్యమకారుడి స్థూపం కూల్చివేత

ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ జనసభ వీణవంక మండల కన్వీనర్ రవీందర్‌రెడ్డి అచ్చంపల్లి స్వగ్రామంలోని 18 అడుగుల స్మారక స్థూపాన్ని తెలంగాణ పోలీసులు జూలై 1న కూల్చివేశారు. రవీందర్‌రెడ్డి నాయకత్వంలో జరిగిన పోరాటం ఫలితంగానే కలవల ప్రాజెక్టు నిర్మాణం పూర్తైంది. ఇప్పుడు నాలుగు గ్రామాల బీడు భూముల్లో పంటలు పండుతున్నాయి. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రవీందర్‌రెడ్డి రైతాంగ ఉద్యమానికి నాయకత్వాన్ని సహించలేక కిరోసిన్‌పోసి నిప్పంటించి మనిషి ఆనవాళ్లు లేకుండా చంపేసింది. ఆయన జ్ఞాపకంగా వీణవంక మండలం కుటుంబ సభ్యులు, మిత్రులు ఎన్నో ఆటంకాల మధ్య స్మారకస్థూపాన్ని నిర్మించారు.

వరంగల్‌లో బాణసంచా ప్రమాదం

వరంగల్ శివారు కోటిలింగాల సమీపంలోని భద్రకాళి ఫైర్‌వర్క్స్ బాణసంచా గోదాములో జూలై 4న పేలుడు సంబవించింది. ఈ ఘటనలో 10 మంది కార్మికులు మృదిచెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో నలుగురు మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు.

కత్తి మహేశ్, పరిపూర్ణానందస్వామిల నగర బహిష్కరణ

కత్తి మహేశ్ టివి చానళ్లలో చేస్తున్న వివాదస్పద చర్చలు ఇతరుల మనోభావాలను గాయపరుస్తున్నాయని అందువల్ల ఆయనను నగర బహిష్కరణ చేస్తున్నట్లు జూలై 9న తెలంగాణ రాష్ట్ర డిజిపి తెలిపారు. ఓ టి.వి. చర్చలో శ్రీరాముడిపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం ద్వారా కత్తి మహేశ్ తమ మత విశ్వాసాలకు విఘాతం కలిగించారంటూ జూబ్లిహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు డిజిపి తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై పరిపూర్ణనంద స్వామిని 6 నెలలు నగర బహిష్కరణ చేస్తున్నట్లు జూలై 11న డిజిపి తెలిపారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం-1980 కింద ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

అమరుల బంధుమిత్రుల సంఘం 4వ మహా సభలు

అమరుల బంధుమిత్రుల సంఘం ఆధ్వర్యంలో నాలుగవ మహా సభలు జూలై 18న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. బిజెపి అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. పౌరహక్కుల కోసం పోరాడుతున్న వారిపై కుట్ర కేసులు పెట్టి అక్రమంగా అరెస్ట్ చేయడంతో పాటు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. దండకారణ్యంలో గ్రామాలను తగులబెట్టడం, పాఠశాలలను కూల్చివేస్తున్నారన్నారు. ఆదివాసీ మహిళలు, బాలికలపై అత్యాచారాలకు లెక్కలేకుండా పోయిందన్నారు. ఈ సభకు బంధుమిత్రుల సంఘం అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షత వహించారు.

సిడాం శంభు మృతి

ఆదివాసీల ఉద్యమ నాయకుడు, తుడుందెబ్బ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సిడాం శంభు(55) జూలై 19న మృతిచెందారు. ఆయన ఆదిలాబాద్‌లోని ఉట్నూర్ మండలం లక్కారం గ్రామ పరిధిలోని మత్తడిగూడలో జన్మించారు. ఆయన 20 ఏళ్ల వయసు నుంచే ఆదివాసీ గిరిజనుల హక్కులు, చట్టాల రక్షణ కోసం ఎంతో కృశిచేశారు. ఆదివాసీల హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) వ్యవస్థాపక అధ్యక్షుడు. ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న 5వ షెడ్యూల్ భూభాగం అంతా తిరిగి ఆదివాసీ హక్కులకోసం ఉద్యమించారు. ఆదివాసులను దేశ వ్యాప్తంగా ఐక్యం చేయాలని, అనేక నిర్భంధాలకు, హింసలకు గురయినా నిర్భయంగా తుది శ్వాస వరకూ ప్రజల పక్షం నిలిచారు.

ఇబ్రాం మైసయ్య మృతి

అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి రాష్ట్ర కమిటీ మాజీ అధ్యక్షుడు, ఇబ్రాం మైసయ్య(59) జూలై 20న మృతిచెందారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా ఆయన 1995 నుంచి 2014 వరకు కొనసాగారు. నక్సలైట్లతో జరిగిన చర్చల్లో మైసయ్య చర్చల ప్రతినిధిగా పాల్గొన్నారు. ప్రస్తుతం గౌలిగూడలో బిఎస్ఎన్ఎల్ ఎస్‌డిఓటిగా పనిచేస్తున్న ఆయన ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ కార్యదర్శిగా కూడ పనిచేశారు.

ఎస్.సి., ఎస్.టి. చట్టానికి భద్రత కల్పించాలి

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ దళిత, గిరిజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 23న ఉస్మానియా యూనివర్సిటీలో సమావేశం నిర్వహించారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ ఎస్‌సి, ఎస్‌టి చట్టాన్ని బలహీన పర్చడానికి కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి చట్టానికి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని దళిత, గిరిజన సంఘాల నాయకులు పేర్కొన్నారు.

నిర్మలానంద మృతి

జన సాహితీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రజాసాహితీ గౌరవ సంపాదకుడు నిర్మలానంద(84) జూలై 24న మృతిచెందారు. 1935 అక్టోబర్ 20న విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జన్మించారు. నిర్మలానంద అసలు పేరు ముప్పన మల్లేశ్వరరావు. ఆయన తెలుగుదాసు, విపుల్, నిర్మలానంద తదితర పేర్లతో అనేక అనువాద, స్వీయ రచనలు చేశారు. ఆయన 18 ఏళ్లు ప్రజాసాహితీ పత్రికకు వర్కింగ్ ఎడిటర్‌గా కొనసాగారు. మహాశ్వేతదేవిపై ప్రత్యేక సంచిక తెచ్చారు. అల్లూరి సీతరామరాజు శత జయంతి సందర్భంగా ప్రతినెలా సంవత్సరం పాటు ప్రచురించిన వ్యాస సంకలనం 'మన్యం వీరుని పోరుదారి'ని మహాశ్వేతదేవితో ఆవిష్కరింపచేశారు.

తెలంగాణలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

విద్యుత్ శాఖలో కాంట్రాక్టు కార్మికులు పే స్కేలు వర్తింపు, విద్యుత్ సంస్థలో విలీనం తదితర డిమాండ్లతో జూన్ 21 చేపట్టిన సమ్మె 26 వరకు కూడా కొనసాగుతూనే ఉంది. కార్మికులకు యాజమాన్యానికి జరిగిన చర్చల్లో కార్మికులు పెట్టిన డిమాండ్లలో రెండింటిని - కాంట్రాక్ట్ కార్మికులు చనిపోతే ఆయా కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగంతో పాటు ఇపిఎఫ్, ఇఎస్ఐ వాటా చెల్లించడానికి - యాజమాన్యం హామీ ఇచ్చింది. కార్మిక సంఘాలు కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ సమయంలో ఇచ్చిన పే స్కేలును ఆమోదించాలని కోరుతున్నాయి. సమ్మెకు అన్ని సంఘాల నుంచి పూర్తి మద్దతు లభిస్తోంది.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా సదస్సు

మహిళలపై జరుగుతున్న హింస-కారణాలు-పరిష్కారాలు అనే అంశంపై ఐద్వా ఆధ్వర్యంలో జూలై 22న విశాఖపట్నంలో సదస్సు జరిగింది. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై అంతర్జాతీయంగా జరిగిన సర్వేలో భారతదేశం మొదటి స్థానంలో ఉందని, ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడానికి మహిళలకు రక్షణ లేకపోవడమేనని ఐద్వా జాతీయ అధ్యక్షురాలు ప్రొ. మాలినీ భట్టాచార్య అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళలపై ఆంక్షలు పెరిగిపోయాయని అన్నారు. ప్రజా ప్రతినిధులే నేరాలకు పాల్పడడం ఇటీవల పెరిగిపోయిందన్నారు. కశ్మీర్‌లో మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, 2012 నుంచి 18 వరకు పరిశీలిస్తే దళిత మహిళలపై హింస, దాడులు 40 శాతం పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీ

దేశంలో పెరిగిపోతున్న మూక హత్యలు

పిల్లలను ఎత్తుకుపోతున్నారనే అనుమానంతో ఐదుగురిని జూలై 1న మహారాష్ట్రలో కొట్టి చంపారు. ధూలే జిల్లా రాయినపద గ్రామంలో సంత జరుగుతున్న దగ్గర ఆర్.టి.సి బస్సు దిగిన ఐదుగురు స్థానికేతరులు బాలికతో మాట్లాడుతున్నప్పుడు, జనం అనుమానించి వారిపై దాడిచేశారు. గత కొన్ని రోజులుగా దేశంలోని పది రాష్ట్రాల్లో జరిగిన ఇదే కారణంతో జరిగిన దాడుల్లో ఇరవై మంది దాకా మరణించారు. దాడులకు గురైన వారెవరూ పిల్లలను ఎత్తుకుపోయే ముఠాలవారు కాదు, కాని కిడ్నాపింగ్ ముఠాలు తిరుగుతున్నాయనే వదంతులతో స్థానికేతరులుగా భావించిన వారిపై దాడులకు దిగుతున్నారు. కొందరు గోరక్షణ బృందాలుగా ఏర్పడి అనుమానం వస్తే కొట్టి చంపుతున్నారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్‌లు

జమ్మూ కశ్మీర్‌లో పుల్వామాకు సమీపంలోని చత్‌పురాలో జూన్ 29న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మిలిటెంట్లు మృతిచెందారు. ఒక ఇంటిలో మిలిటెంట్లు ఆశ్రయం తీసుకున్నారన్న సమాచారంతో దాడి చేశారు. ఈ క్రమంలో స్థానికులు సైన్యం పై రాళ్లురువ్వగా సైనికులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు గాయపడగా ఒకరు మృతిచెందారు. జూలై 7న కుల్గాం జిల్లా హవూరా గ్రామంలో గస్తీ నిర్వహిస్తున్న భద్రతా బలగాలపై స్థానికులు రాళ్లు విసిరారు. వారిని అడ్డుకునేందుకు సైన్యం కాల్పులు జరపగా దీంతో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. పది మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఇదే రోజు ఆసియా ఆంధ్ర బీని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు అదుపులోకి తీసుకోవడంతో వేర్పాటువాదులు బంద్ నిర్వహించారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లో మత మార్పిడి నిరోధక చట్టం రద్దు?

మత మార్పిడి నిరోధక చట్టాన్ని రద్దుచేయాలని హిమాచల్‌ప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ రాష్ట్రాల్లో 1967లో ఒడిశా, 1968లో మధ్యప్రదేశ్, 1978లో అరుణాచల్‌ప్రదేశ్‌లో మత మార్పిడి చట్టాలను తెచ్చారు. నాలుగు దశాబ్దాలుగా అమలవుతున్న చట్టాన్ని రద్దుచేసేందుకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టనున్నట్లు అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ తెలిపారు. ఆయన బెనడిక్టెన్ మిషనరీకి చెందిన రెవరెండ్ బ్రదర్ ప్రేమ్ బాయ్ 10వ వర్ధంతి సందర్భంగా జూన్ 30న జరిగిన కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు.

స్వామి అగ్నివేశ్‌పై దాడి

ప్రముఖ సామాజిక కార్యకర్త 79 ఏళ్ల స్వామి అగ్నివేశ్‌పై ఓ అల్లరిమూక దాడిచేసింది. దాడికి పాల్పడిన వారు 'ఈ దేశంలో జీవించాలనుకుంటే వందేమాతరం అనాల్సిందే' అంటూ నినాదాలు చేశారు. స్వామి అగ్నివేశ్ జార్ఖండ్‌లోని పాకుర్‌లో జూన్ 17న నిర్వహిస్తున్న గిరిజనుల సదస్సులో మాట్లాడడానికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించి బయటికి రాగానే దాడిచేశారు. బిజెపి అనుబంధ బిజెవైఎం, ఎబివిపి కార్యకర్తలే తనపై దాడికి పాల్పడ్డారని స్వామిఅగ్నివేశ్ ఆరోపించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదివాసులను నిరాశ్రయులను చేస్తోందని, వారి భూములను లాక్కొని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని అన్నారు.

ముస్లింల రక్షణ కోసం కత్తులు దూసిన సిక్కులు

పంజాబ్‌లోని పగ్వారా పట్టణంలో ముస్లింల మీద దాడి చేయడానికి ప్రయత్నించిన శివసేన గుంపును సిక్కులు, దళితులు, ముస్లింలు ఐక్యంగా ఎదుర్కొన్నారు. కాశ్మీర్‌కు వ్యతిరేకంగా శివసేన కార్యకర్తలు జూలై 18న ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలను బెదిరించి బలవంతంగా షాపులు మూయించారు. ఈ అంశంపై జూన్ 20న ముస్లింలు అధికారులకు ఫిర్యాదు చేయాలనుకున్నారు. ఆరోజు నమాజు అవుతుండగానే ఓ శివసేన గుంపు మసీదు ముందుకు వచ్చి నినాదాలు చేస్తూ మసీదు ఎదురుగా పార్కింగ్ చేసిన వాహనాలను ధ్వంసం చేశారు. మసీదులోకి రాళ్లు విసరడం ప్రారంభించారు. అప్పటికే శివసేన మూక చేస్తున్న దాడిని గమనిస్తున్న చుట్టుపక్కలున్న సిక్కులు కత్తులు దూస్తూ శివసేన మూకను ఎదుర్కొన్నారు. మద్దతుగా పలువురు దళితులు కూడా వచ్చి చేరారు. నమాజు ముగించుకున్న ముస్లింలు కూడా వారితో చేరి శివసేన గుంపును తరిమి కొట్టారు.

ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో ఎన్‌కౌంటర్ హత్యలు

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ, భీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో జూలై 19న జరిగిన ఎన్‌కౌంటర్లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. నక్సల్స్ ఏరివేత ఆపరేషన్‌లో పాల్గొంటున్న జిల్లా రిజర్వ్ గార్డ్, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బలగాలు మావోయిస్టులు ఉన్న తిమినార్, పుస్నార్ గ్రామాల అటవీ ప్రాంతానికి చేరుకున్నాయని పోలీసు అధికారులు తెలిపారు. ఆ తరువాత ఉదయం నుంచి జరిగిన కాల్పుల్లో మావోయిస్టులు మృతిచెందారని డిఐజి పి. సుందర్‌రాజు తెలిపారు. జార్ఖండ్‌లోని గార్వా జిల్లా చింజో అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలిన ఘటనలో జార్ఖండ్ జగ్వార్ దళానికి చెందిన ఆరుగురు జవాన్లు మృతిచెందారు. మావోయిస్టుల సమాచారంతో చింజో అటవీ ప్రాంతంలో జూన్ 26న కూంబింగ్‌కు వెళ్లాయి. అదే సమయంలో మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఈ తదుపరి ఇరు వర్గాల మధ్య కాల్పులు జరుగడంతో ఆరుగురు జవాన్లు మరణించగా పలువురు గాయపడ్డారు.

మోడీ సర్కార్‌పై అవిశ్వాసం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలు జూలై 20న పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాయి. తీర్మానంపై పార్లమెంట్‌లో చర్చ జరిగిన అనంతరం ఓటింగ్ జరిపారు. ఓటింగ్‌లో తీర్మానానికి అనుకూలంగా 126 ఓట్లు రాగా, ప్రతికూలంగా 325 మంది ఓటు వేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు.

రిజర్వేషన్‌ల కోసం మరాఠాల మహారాష్ట్ర బంద్

మరాఠాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని జూన్ 25న 'మరాఠా క్రాంతి మోర్చ' మహారాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. రాష్ట్రమంతా తీవ్ర విధ్వంసం, హింసాత్మక పరిస్థితులు తలెత్తాయి. రవాణా వాహనాలను పెద్దఎత్తున ధ్వంసం చేశారు. పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. ఈ క్రమంలోనే ఒక యువకుడు గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవడం, మరొకరు పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు పాల్పడడం చేశారు. చివరికి నాయకత్వం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బంద్‌ను విరమిస్తున్నట్లు ప్రకటించాల్సివచ్చింది. ఆగస్టు 9న మరోసారి బంద్ ఆలోచన చేస్తామని మరాఠా క్రాంతి మోర్చా నేత వీరేంద్ర పవార్ మీడియాకు తెలిపారు.

లారీల సమ్మె

డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఎఐఎంటిసి) ఆధ్వర్యంలో జూలై 20 నుంచి జూలై 26 వరకు కూడా కొనసాగుతోంది. రవాణా సంస్థల డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకరించడంలేదు. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమవుతుంది. జూలై 26న కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయెల్, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో ఆ సంఘం ప్రతినిధులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. సమ్మె వల్ల 90 లక్షల ట్రక్కులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. వీ

మెక్సికోలో ఎన్నికలు

మెక్సికో అధ్యక్ష పదవికి జూలై 1న ఎన్నికలు జరిగాయి. అలాగే జాతీయ కాంగ్రెస్‌లోని 628 స్థానాలకు, 9 మంది గవర్నర్లు, మేయర్లను, ఇతర రాష్ట్ర, స్థానిక చట్టసభ సభ్యుల ఎంపికకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నేషనల్ రిజెనరేషన్ మూవ్‌మెంట్ పార్టీ అభ్యర్థి, మెక్సికో మాజీ మేయర్ ఆంద్రేజ్ మాన్యుయెల్ లోపెజ్ ఒబ్రాదర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనకు 54 శాతం ఓట్లు వచ్చాయి. మెక్సికోలో గతంలోని పిఆర్ఐ ప్రభుత్వం హయాంలో విపరీతంగా పెరిగిపోయిన అవినీతి, ఆర్థిక పరిస్థితి మందగమనం, మాఫియా అధికారం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. ఈ ఎన్నికల క్రమంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో 130 మందికి పైగా మరణించారు.

అఫ్ఘనిస్తాన్‌లో దాడులు

అఫ్ఘనిస్తాన్ బాంబు దాడులతో బీభత్సంగా మారిపోతోంది. జూలై 1న జలాలాబాద్‌లో రద్దీగా ఉండే ప్రాంతంలో జరిగిన బాంబు దాడిలో ఇరవై మంది మరణించారు. జూలై 10న నాన్‌గరార్ ప్రావిన్స్‌లోని మిలిటరీ పాయింట్ వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో ఇరవై మంది మరణించారు. సిక్కు మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని ఈ దాడి జరిగింది. ఈ దాడిలో పది మంది సిక్కులు, ఇద్దరు పోలీసులు ఉన్నారు. మరో ఇరవై మంది తీవ్రంగా గాయపడ్డారు. జూలై 22న రాజధాని కాబూల్‌లో జరిగిన మరో ఆత్మాహుతి దాడిలో పది మంది మరణించారు. గత ఆరు నెలల కాలంలో జరిగిన బాంబు దాడుల్లో 1629 మంది సామాన్య పౌరులు మరణించారని ఐక్యరాజ్య సమితి తెలిపింది.

నవాజ్ షరీఫ్‌కు జైలు శిక్ష

పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్‌కు అవినీతి కేసులో జైలు శిక్ష పడింది. పనామా కుంభకోణం వ్యవహారంలో నవాజ్ షరీఫ్‌పై పాకిస్తాన్ నేషనల్ అకౌంటబిలిటి బ్యూరో విచారణ జరిపింది. షరీఫ్‌పై మొత్తం నాలుగు అవినీతి కేసులు నమోదయ్యాయి. ఇందులో ప్రధానంగా లండన్‌లోని అవెన్‌ఫీల్డ్ హౌస్‌లో షరీఫ్ అక్రమంగా నాలుగు ఫ్లాట్‌లను సొంతం చేసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఆయనను దోషిగా తేల్చింది. ఆయనకు పదేండ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. నవాజ్ షరీఫ్‌తో పాటు ఆయన కుమార్తె మరియమ్, అల్లుడు కెప్టెన్ సర్దార్‌లకు కూడా ఏడేండ్ల జైలు శిక్ష విధించింది. జైలు శిక్షతో పాటు పది మిలియన్ డాలర్లు జరిమానా కూడా విధించింది.

అర్జెంటీనాలో నిరసనలు

అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) నుంచి రుణ సాయం వద్దంటూ అర్జెంటీనాలో నిరసనలు వెల్లువెత్తాయి. జూలై 10న అర్జెంటీనా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఐఎంఎఫ్ నుంచి అర్జెంటీనా ప్రభుత్వం 50 బిలియన్ డాలర్ల రుణ సాయం కోరగా దానికి ఐఎంఎఫ్ అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో ఐఎంఎఫ్ నుంచి రుణాలు తీసుకొని ఆ భారాన్ని తమపై మోపేందుకు ప్రభుత్వం చూస్తోందని, అందుకే ఐఎంఎఫ్ రుణం మంజూరు చేయవద్దని నిరసనకారులు డిమాండ్ చేశారు.

ఇరాక్‌లో ఆందోళనలు

ఇరాక్‌లో ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు, నాణ్యమైన సేవలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిరసిస్తూ ప్రజలు భారీ సంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. జూలై 8న బాస్రాలోని జుబెయిల్ ఆయిల్‌ఫీల్డ్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయిల్‌ఫీల్డ్ కార్మికులు నిరసనకారులకు మద్దతు తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమాలను ప్రభుత్వం తీవ్రంగా అణచివేతలో భాగంగా జరిపిన దాడిలో ఏడుగురు మరణించగా, అనేక మంది గాయపడ్డారు.

పాకిస్తాన్ ఎన్నికలు - దాడులు

పాకిస్తాన్‌లో అధ్యక్ష పదవి జూలై 25న ఎన్నికలు జరిగాయి. మొత్తం 272 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. జూలై 27 నాటికి 251 సీట్ల లెక్కింపులు జరుపగా, క్రికెట్ ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్తాన్ తెహరీక్ ఎ ఇన్సాఫ్ పార్టీకి 110 సీట్లు, జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్‌కి చెందిన పాకిస్తాన్ ముస్లీం లీగ్ పార్టీకి 63, బిల్వాయ్ భుట్టోకు చెందిన పాకిస్తాన్ పీపుల్స్ పార్టీకి 42 సీట్లు వచ్చాయి. ఇంకా కొన్ని సీట్లకు లెక్కింపులు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల సందర్భంగా చాలా హింసాత్మక ఘటనలు జరిగాయి. జూలై 11న పెషావర్ నగరంలో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో అవామీ జాతీయ పార్టీ నేత హరూన్ బిలోర్‌తో సహా ఇరవై రెండు మంది మరణించారు. డెబ్బై మందికి పైగా గాయపడ్డారు. జూలై 13న మరో మరో రెండు బాంబు దాడులు జరిగాయి. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో రాజధాని క్వెట్టా నగరం దగ్గరలోని ద్రింగఢ్ ప్రాంతంలో ఎన్నికల ర్యాలీలో అవామీ పార్టీ కార్యకర్తలు లక్ష్యంగా ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో 126 మంది మరణించారు. నూట యాభై మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కొద్దిసేపటికే బన్నులోని హువైద్ ప్రాంతంలో జెయుఐ-ఎఫ్ ర్యాలీ సందర్భంగా మరో దాడి జరిగింది. ఈ దాడిలో నలుగురు మరణించగా, 19 మంది గాయపడ్డారు. జూలై 25 పోలింగ్ రోజున క్వెట్టాలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో ముప్పై మందికి పైగా మరణించారు. నలభై మందికి పైగా గాయపడ్డారు.

నాటో సదస్సు 2018

నాటో మిత్రదేశాల సదస్సు జూలై 11, 12 తేదీలలో బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో జరిగింది. ఈ సదస్సులో 29 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో నాటో దళాల నిర్వహణ కోసం తమ జిడిపి నుంచి 2 శాతం ఇచ్చేందుకు 2014లో తామంతా ఒప్పందం కుదుర్చుకున్నామని, 2024 వరకు అదే తరహాలో ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని నాటో చీఫ్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ వ్యయాన్ని 2 శాతం నుంచి 4 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు.

సావోపాలో ఫోరం డిక్లరేషన్

అమెరికన్ పెట్టుబడిదారీ వ్యవస్థ నేతృత్వంలో మితవాద, కన్సర్వేటివ్, నయా ఉదారవాద దాడికి వ్యతిరేకంగా లాటిన్ అమెరికా సాగిస్తున్న పోరాటం కొనసాగుతుందని సావోపాలో ఫోరం డిక్లరేషన్ ఉద్ఘాటించింది. ఫిడల్ కాస్ట్రో ఆలోచనా విధానం, 24వ సావోపాలో ఫోరం ప్రత్యేక ప్లీనరీ సమావేశం జూలై 16-18 మధ్య హవానాలో జరిగాయి. ఈ ప్లీనరీలో అమెరికా సామ్రాజ్యవాదం లాటిన్ అమెరికాలో సాగిస్తున్న కుట్రలు, ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న సవాళ్లు గురించి చర్చించిన అనంతర సావోపాలో తుది డిక్లరేషన్‌ను విడుదల చేశారు.

ఇజ్రాయిల్-హమాస్ శాంతి పునరుద్ధరణ

గాజా స్ట్రిప్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు ఇజ్రాయిల్, హమాస్ అంగీకరించాయి. ఇరు వర్గాల మధ్య రాజీకుదర్చడానికి ఐక్యరాజ్యసమితి, ఈజిప్ట్ చేసిన ప్రయత్నాలు ఫలితాన్ని ఇచ్చాయి. గత కొంతకాలంగా ఇజ్రాయిల్ బలగాలు జరుపుతున్న దాడుల్లో పెద్ద సంఖ్యలో పాలస్తీనా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వేలాది మంది తీవ్ర గాయాల పాలవుతున్నారు.

సిరియాలో ఆత్మాహుతి దాడి

సిరియాలోని డమాస్కస్‌లో జూలై 25న ఆత్మాహుతి దాడి జరిగింది. నగరంలోని అత్యంత రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్ ప్రాంతంలో మోటర్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు తమను తాము పేల్చుకున్నారు. ఈ పేలుడులో యాభై మంది మృతి చెందారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(జూన్ 1 నుండి జూన్ 30, 2018 వరకు తెలంగాణలోని 9 జిల్లాలు (759), ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాలలో (864) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1623)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	-	3	-	16	18	6	9	4	3	3	2	4	1	2	24	29	-	-	-	3	2
హైదరాబాద్	-	-	-	16	13	4	5	-	1	2	4	8	4	3	21	10	-	-	-	2	-
కరీంనగర్	-	2	1	10	13	2	2	-	1	-	2	4	3	7	26	11	-	-	-	-	2
ఖమ్మం	-	1	-	2	8	1	4	1	-	1	-	1	2	7	22	5	-	-	-	-	6
మహబూబ్‌నగర్	-	-	-	2	7	3	6	7	3	5	6	3	3	11	40	3	-	-	-	-	-
మెదక్	1	22	3	9	4	8	13	4	1	5	6	9	6	22	14	17	-	-	-	3	1
నల్గొండ	-	3	-	7	2	-	3	-	-	-	-	2	2	2	38	12	-	-	-	-	5
నిజామాబాద్	-	1	-	1	4	-	1	1	-	1	1	1	-	7	14	7	-	-	-	-	-
వరంగల్	వివరాలు అందలేదు																				
వికారాబాద్	-	2	-	4	2	-	-	-	-	-	1	-	-	2	12	8	-	-	-	-	-
తెలంగాణ	**1**	**33**	**4**	**67**	**71**	**24**	**43**	**17**	**9**	**17**	**22**	**32**	**21**	**61**	**211**	**102**	**-**	**-**	**-**	**8**	**16**
అనంతపురం	-	6	-	7	29	1	2	-	-	5	4	3	12	6	43	-	-	-	-	-	1
చిత్తూరు	-	1	-	6	4	7	2	-	3	1	3	2	3	-	20	-	-	-	-	-	3
కడప	వివరాలు అందలేదు																				
గుంటూరు	-	1	-	3	6	2	3	1	-	2	4	5	2	6	16	7	-	-	-	-	13
కృష్ణా	-	-	-	4	5	-	1	-	-	2	-	2	2	2	9	14	-	-	-	-	2
కర్నూలు	-	3	-	8	5	1	5	1	-	1	2	4	-	5	27	14	-	-	-	-	-
తూర్పు గోదావరి	-	1	-	2	4	1	3	3	1	6	-	1	1	12	8	21	-	-	-	-	3
ప్రకాశం	-	1	-	4	2	3	2	1	1	5	2	3	1	3	20	13	-	-	-	-	5
శ్రీకాకుళం	-	-	-	1	6	8	7	2	-	1	-	-	3	7	16	15	-	-	-	-	5
పశ్చిమ గోదావరి	-	-	-	5	5	1	-	-	-	2	2	2	4	8	20	15	-	-	-	-	-
నెల్లూరు	-	-	-	1	1	2	2	-	2	6	1	3	-	4	16	12	-	-	-	-	1
విజయనగరం	-	1	-	6	2	-	1	-	-	5	3	3	1	2	16	11	-	-	-	-	7
విశాఖపట్నం	-	-	-	14	17	2	4	2	1	5	-	1	5	6	23	18	-	-	-	10	11
ఆంధ్రప్రదేశ్	**-**	**14**	**-**	**61**	**86**	**28**	**32**	**10**	**8**	**41**	**21**	**29**	**34**	**65**	**234**	**140**	**-**	**-**	**-**	**10**	**51**

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ	హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్	9705055738
వెంకటేశ్వర బుక్ స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్	040-66131071
పస్ట్ లక్కీ పాన్ షాప్	విద్యానగర్ సిగ్నల్స్	9848672831
సుధాకర్ బుక్ స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక	9949337605
వెంకటేశ్వర బుక్ స్టాల్	రామ్‌నగర్ గుండు	9502964995
భవాని బుక్ స్టాల్	శివం రోడ్	9849836996
శ్రీభవాని బుక్ స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర)	9640712555
ఓరియన్ బుక్ స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర)	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా)	8977995537
రెడ్డి బుక్‌స్టాల్	అశోక్‌నగర్, హైదరాబాద్	
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమాండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహిదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలెబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్ప్రెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీలక్షి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
లక్ష్మణ్	చిక్కడపల్లి, హైదరాబాద్	93910 12051
మల్లిఖార్జున్ బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
బాల్‌రెడ్డి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	98660 18829
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
మహాలక్ష్మి బుక్‌స్టాల్	సిటీ బస్‌స్టాండ్, హన్మకొండ చౌరస్తా, వరంగల్	99893 30297
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్ స్టాల్, కూల్ డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్ స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్ స్టాల్	శివాలయం వీథి, ప్రొద్దటూరు	81210 02112
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీథి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్ సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 205 - August 2018 • ISSN 2231-6892
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/7/2018 • Postal Regn. No. HD/1100/2017-19
Date of Posting : 29th, 30th

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao